సాక్షి

సత్యమేవ జయతే

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 292

శుక్రవారం 5-7-2024

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'




క్లీన్‌స్వీప్ లక్ష్యంగా..

నేడు దక్షిణాఫ్రికాతో భారత మహిళల తొలి టీ20 మ్యాచ్ - 13లో



మార్కెట్ల పరుగు తస్మాత్ జాగ్రత్త!

సెబీ, శాట్‌లకు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ సూచన - 13లో



బ్రిటన్‌లో ప్రశాంతంగా ఎన్నికలు

బ్రిటన్ సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ప్రధాని రిషి సునాక్ తదితర ప్రముఖులు ఓటు వేశారు.

వివరాలు 6లో ▸



జార్ఖండ్ సీఎంగా సోరెన్ ప్రమాణం

జేఎంఎం నేత హేమంత్ సోరెన్ గురువారం జార్ఖండ్ ముఖ్యమంత్రిగా మరోసారి ప్రమాణం చేశారు.

వివరాలు 6లో ▸



ఊపిరి ఆపేస్తున్న వాయు కాలుష్యం

పది నగరాల్లో సంభవిస్తున్న రోజువారీ మరణాల్లో సగటున 7.2 శాతానికి వాయు కాలుష్యమే కారణమని లాన్సెట్ తెలిపింది.

వివరాలు 6లో ▸



బిహార్‌లో కూలిన మరో వంతెన

బిహార్‌లో మరో వంతెన కూలింది. సరన్ జిల్లాలో 24 గంటల వ్యవధిలో కూలిన మూడో వంతెన ఇది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

టీడీపీలో ఇసుక దుమారం?



కూటమి ప్రభుత్వం వచ్చీరావడంతో ఆ పార్టీల నేతలు ఇసుక మీద పడ్డారు. రాజమహేంద్రవరంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిల్వ ఉంచిన రూ.5 కోట్ల విలువైన ఇసుకను ఓ జనసేన నేత ఊడ్చేశాడు. ఈ విషయంలో టీడీపీ నేతలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి అప్పారావు మధ్య చిచ్చు రేగింది.

వివరాలు 10లో ▸

లోఫర్ నా కొడకా.. టీచర్‌పై టీడీపీ నేత దాష్టీకం



పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడిని ఓ టీడీపీ నాయకుడు ఇష్టారీతిన బూతులు తిడుతూ బెదిరించాడు. రేషన్ బియ్యం బస్తాలు స్కూల్‌లో పెడుతుండగా ఉపాధ్యాయుడు అడ్డు చెప్పడంతో టీడీపీ నేత బూతులతో చెలరేగిపోయాడు.

వివరాలు 10లో ▸

ఆర్యవైశ్యులపై ప్రతాపం



టీడీపీ కూటమి నేతల దృష్టి ఆర్యవైశ్యుల వ్యాపారాలపై పడింది. అడిగినంత ఇవ్వకుంటే అధికారులతో వ్యాపారాలను సీజ్ చేయిస్తున్నారు. తాజాగా చంద్రగిరి నియోజకవర్గం కుంట్రపాకంలో ఆర్యవైశ్యుల సంఘం నాయకుడు కిశోర్‌కు చెందిన ఎల్.వి.ఎం రైస్ మిల్లును మూసివేయించారు.

వివరాలు 14లో ▸

నాకు భద్రతను పునరుద్ధరించండి



తనకు ప్రాణహాని ఉందని.. భద్రతను పునరుద్ధరించేలా ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని మాజీ మంత్రి అంబటి రాంబాబు హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఇప్పటివరకు తనకున్న 4+4 గన్‌మెన్ల భద్రతను ఉపసంహరించడాన్ని సవాల్ చేస్తూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

వివరాలు 10లో ▸



ముంబై సాగర తీరంలో టీమిండియా విజయయాత్రను చూసేందుకు తరలివచ్చిన అభిమానులు



ప్రధాని మోదీతో టీమిండియా సభ్యులు

జన నీరాజనం

13లో

• 17 ఏళ్ల తర్వాత మళ్లీ టి20 ప్రపంచకప్ టైటిల్ సాధించి బార్బడోస్ నుంచి గురువారం స్వదేశానికి చేరుకున్న భారత క్రికెట్ జట్టుకు అపూర్వ స్వాగతం లభించింది. న్యూఢిల్లీలోని తన నివాసంలో భారత జట్టు సభ్యులతో ప్రధానమంత్రి మోదీ భేటీ అయ్యారు. సాయంత్రం ముంబైలో ఓపెన్ టాప్ బస్‌లో అశేష జనసందోహం నడుమ రోహిత్ శర్మ బృందం వాంఖెడే స్టేడియానికి వచ్చింది. విశ్వవిజేతగా నిలిచిన భారత జట్టుకు బీసీసీఐ రూ.125కోట్లు నజరానాను అందించింది. ఈ కార్యక్రమం ముగిశాక జట్టు సభ్యులందరూ స్టేడియం మొత్తం కలియదిరిగి అభిమానులకు అభివాదం చేశారు.



నెల్లూరులో ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

పద్ధతి మార్చుకో..

చంద్రబాబుకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ హెచ్చరిక

విధ్వంస సంస్కృతికి ఫుల్‌స్టాప్ పెట్టకపోతే రియాక్షన్ తప్పదు

- దాడులు ఆపమని కోరడం లేదు.. హెచ్చరిస్తున్నాం.. ఎల్లకాలం రోజులు మీవి కావు.. పాపాలు పండుతున్నాయి
- ఓ వైపు విధ్వంసం, దాడులు చేస్తూ తిరిగి తప్పుడు కేసులా?.. ఎవరి స్థాయిలో వాళ్లు రెడ్‌బుక్‌లు చూపిస్తూ విధ్వంసాలా?
- ఓటు వేయలేదన్న కారణంతో భౌతిక దాడులు చేస్తారా?.. ఆస్తుల ధ్వంసం, దాడులపై పోలీసులది ప్రేక్షక పాత్రా?
- మా పాలనలో కులం, మతం, ప్రాంతం, రాజకీయాలు చూడలేదు
- ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు డోర్ డెలివరీ చేసిన చరిత్ర వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిది
- బాబు కక్ష పూరిత రాజకీయాలు మానుకోవాలి.. లేదంటే ఈ తప్పుడు సంప్రదాయం ఒక బీజంలా నాటుకుంటుంది
- రేపు అది చెట్టుగా మారి టీడీపీ శ్రేణులు కూడా ఈ పరిస్థితులను చవి చూడాల్సి వస్తుంది.. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు, పరిపాలనపై దృష్టి పెట్టండి
- తల్లికి వందనం, రైతు భరోసా, ఆడబిడ్డలకు రూ.1,500 ఇవ్వడంపై దృష్టి పెట్టండి
- కారంపూడి ఘటనలో సీఐకి పిన్నెల్లి తటస్థ పడలేదు.. ఎలా హత్యాయత్నం కేసు పెడతారు?.. పాల్వాయిగేటు ఘటనలో కూడా తప్పుడు కేసు పెట్టారు

2లో

“ఎల్లకాలం ప్రభుత్వం మీది కాదు.. రోజులు మీవే ఉండవని గుర్తుపెట్టుకో చంద్రబాబూ.. మీ పాపాలు వేగంగా పండుతున్నాయి. ప్రజలు క్షమించని పరిస్థితి వస్తుంది. కచ్చితంగా మీకు బుద్ధి చెప్పే పరిస్థితులు, రోజులు కూడా ఉంటాయి. చేతనైతే ప్రజలకు మంచి చేయండి. ప్రజల మనసులు గెలుచుకుని చిరస్థాయిగా నిలబడేలా పాలన చేయండి. కానీ ఈ తప్పుడు రాజకీయాలు మానండి. ఇదే మాదిరిగా కొనసాగితే రాష్ట్రంలో ఒక తప్పుడు సంప్రదాయానికి నువ్వు నాంది పలికినట్లే. నువ్వు వేసే ఈ బీజం చెట్టు అవుతుంది. నువ్వు ఏదైతే విత్తుతావో అదే పండుతుంది. రేపొద్దున మళ్లీ మీ కార్యకర్తలకు ఇదే పరిస్థితి తప్పదు. అటువంటి తప్పుడు సంప్రదాయాలు ఇప్పటికైనా ఆపండి. ఇలాంటివి ఎవరు చేసినా తప్పు అని చెప్పే కార్యక్రమం నాయకులుగా మనం చేయాలి. కానీ దగ్గరుండి ఇలా ప్రోత్సహించడం దుర్మార్గం. దీనికి ఫుల్ స్టాప్ పెట్టాలని హెచ్చరిస్తున్నాం. ఇదే తీరు కొనసాగితే మాత్రం ఊరుకునేది లేదు. రియాక్షన్ అనేది కచ్చితంగా ఉంటుంది. - మాజీ సీఎం వైఎస్ జగన్

ఆదుకోండి

ప్రధాని మోదీకి సీఎం చంద్రబాబు వినతిపత్రం

విభజన హామీలపై ఏపీ ఇంకా పోరాడుతూనే ఉంది

కేంద్రం చేయూత మినహా మరో మార్గం లేదు

కేంద్ర మంత్రులతో సీఎం వేర్వేరుగా సమావేశం

నేడు నిర్మలా సీతారామన్, రాజ్‌నాథ్‌సింగ్, నడ్డా, నీతి ఆయోగ్ సీఈఓలతో భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రానికి రావాల్సిన విభజన హామీల విషయంలో కేంద్రంతో ఏపీ ఇంకా పోరాడుతూనే ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు సహకారం అందించాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి ఢిల్లీకి వచ్చిన చంద్రబాబు గురువారం ఉదయం 10 గంటల సమయంలో ప్రధానిని కలసి వినతిపత్రం అందచేశారు.

పోలవరం పూర్తికి సహకరించండి

విభజన సమస్యలతోపాటు వైఎస్సార్ సీపీ హయాంలో రాష్ట్రం ఆర్థికంగా వెనుకబడిందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో దోపిడీ జరిగిందని, ఆర్థిక వసూళ్లు తగ్గిపోయాయని, ప్రజల ఆకాంక్షలను పట్టించుకోలేదని చెప్పారు. జీతాలు, పెన్షన్లు, ఖర్చులు భారీగా పెరిగాయన్నారు. ప్రభుత్వ భవనాలను తాకట్టు పెట్టడం, పెద్ద ఎత్తున నిధుల మళ్లింపు, వనరుల కొరత కారణంగా రాష్ట్రం ఎంతో నష్టపోయిందన్నారు. ఇలాంటి పలు సవాళ్లను ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా చేయూత ఇవ్వడం మినహా మరో మార్గం లేదని ప్రధానికి నివేదించారు.



ప్రధాని మోదీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం చంద్రబాబు

కేంద్ర మంత్రులకు వినతిపత్రాలు

కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్, రోడ్లు, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, వ్యవసాయ శాఖ మంత్రి

మిగతా 3వ పేజీలో ▶

కార్యాలయాల కూల్చివేతలపై

సర్కారుకు ముకుతాడు

దుందుడుకు చర్యలను అడ్డుకుంటూ హైకోర్టు కీలక ఆదేశాలు

ప్రజా ప్రయోజనాలు ప్రభావితం అవుతుంటే మినహా కూల్చడానికి వీల్లేదు

అతిక్రమణలు స్వల్పం, సాధారణం, అప్రధానం అయినప్పుడు కూల్చరాదు

విచక్షణ, అధికారాన్ని ఉపయోగించేటప్పుడు నిష్పాక్షికంగా ఉండాలి

ఏ నిర్ణయం తీసుకున్నా చట్ట నిబంధనలకు అనుగుణంగానే ఉండాలి

వివరణలు, అదనపు వివరణలు, డాక్యుమెంట్లు తీసుకుని విచారించండి

అవసరమైనప్పుడల్లా వైఎస్సార్‌సీపీ వాదనలు వినాలి

రికార్డులు, సంబంధిత భవనాలను పరిశీలించండి

మొత్తం ప్రక్రియ ముగిసే వరకు కార్యాలయాలపై ఎలాంటి కఠిన చర్యలొద్దు

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ కార్యాలయాల కూల్చివేతలే లక్ష్యంగా కక్ష సాధింపుతో వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వానికి హైకోర్టు ముకుతాడు వేసింది. అధికారుల దుందుడుకు చర్యలను అడ్డుకునే దిశగా కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రజా ప్రయోజనాలు ప్రభావితం అవుతుంటే మినహా కార్యాలయాలను కూల్చడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. పార్టీ కార్యాలయాల నిర్మాణానికి సంబంధించి అతిక్రమణలు

మిగతా 3వ పేజీలో ▶





బిల్లుపై బాదుడు

సాధారణంగా వాడుకున్న విద్యుత్‌కే బిల్లు.. ఇప్పుడు బిల్లుపైనా చార్జీలు

- థర్డ్ పార్టీ యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించడం ఇక కుదరదు
- పంపిణీ సంస్థల యాప్, వెబ్‌సైట్లలో చెల్లింపులతో అదనపు చార్జీల వాత
- వినియోగదారులపై నెలకు దాదాపు రూ.30 కోట్ల అదనపు భారం

సాక్షి, అమరావతి: ప్రతి నెలా మనం వాడుకున్న విద్యుత్‌కు తగ్గట్టు బిల్లు రావడం సహజం. కానీ ఇప్పుడు బిల్లు పైనే చార్జీలు పడటం వినియోగదారులను షాక్‌కు గురి చేస్తోంది. బిల్లుపై మళ్లీ బిల్లు ఏమిటని ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజమే. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వేళ విద్యుత్తు వినియోగదారులపై ప్రతి నెలా దాదాపు రూ.30 కోట్ల వరకూ ఆర్థిక భారం పడింది! అది కూడా విద్యుత్ చార్జీలపై వేసే చార్జీ కావడం విశేషం. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబో మని ఉమ్మడి మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన చంద్రబాబు మాట నిలబెట్టుకోవాలని

మిగతా 2వ పేజీలో ▶

త్వరలో కార్యకర్తలతో

విస్తృతస్థాయి సమావేశాలు

వారి మనోభావాలు తెలుసుకొంటాం

ఐదేళ్లు ప్రజల పక్షాన పోరాడతాం

మళ్లీ ప్రజాభిమానాన్ని సంపాదించుకుంటాం

8న ఘనంగా వైఎస్సార్ జయంతి ఉత్సవాలు

మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి

10లో

దాల్మియా ఫ్యాక్టరీలో 11 లారీలు ధ్వంసం

వ్యాపారం చేయాలంటే కప్పం కట్టాల్సిందే!

- వైఎస్సార్ జిల్లా మైలవరంలో టీడీపీ నాయకుల రౌడీయిజం
- మామూళ్లు ఇవ్వలేదనే కక్షతో 11 లారీలు ధ్వంసం
- టీడీపీ నేతల తీరుపై ఆందోళన వ్యక్తం చేస్తున్న పారిశ్రామికవేత్తలు

10లో





సార్! ఇక బ్రిడ్జీలు కూలే ప్రసక్తే లేదు.. ఉన్నవన్నీ కూలిపోయాయి!

క్లుప్తంగా...

అల్లూరికి శాసనసభ స్పీకర్ ఘన నివాళి



అల్లూరి సమాధికి నివాళులర్పిస్తున్న స్పీకర్ అయ్యన్న

గొలుగొండ (అనకాపల్లి జిల్లా): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు సమాధికి అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు గురువారం నివాళులర్పించారు. అల్లూరి జయంతి సందర్భంగా ఆయన అంత్యక్రియలు జరిగిన ఏఎల్‌పురం (కృష్ణదేవిపేట)లో నిర్వహించిన కార్యక్రమానికి స్పీకర్ హాజరయ్యారు. అల్లూరి, గంటందొరల సమాధులకు నివాళులు అర్పించి అల్లూరి కాంస్య విగ్రహానికి పూలదండ వేశారు. మ్యూజియం వద్ద అల్లూరి సేవా సంఘం సభ్యులు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం సభలో అయ్యన్న మాట్లాడుతూ అల్లూరి పార్కును అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఎంపీ నిధుల నుంచి రూ.50 లక్షలు మంజూరు చేయమని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌ను కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

అల్లూరి పోరాటాలు, త్యాగాలు మరవలేం

విప్లవవీరుడికి మాజీ సీఎం వైఎస్ జగన్ నివాళులు

సాక్షి, అమరావతి: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా గురువారం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ ఘనంగా నివాళులు అర్పించారు. 'స్వాతంత్య్ర సమర యోధుడు..బ్రిటీష్ పాలకులకు ఎదురొడ్డి నిలబడిన విప్లవ వీరుడు..ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన నాయకుడు మన అల్లూరి సీతారామరాజు గారు. ఆయన పోరాటాలు, ఆయన త్యాగాలు ఎప్పుడూ గుర్తుండిపోయేలా రాష్ట్రంలో ఒక జిల్లాకు ఆయన పేరు పెట్టుకున్నాం. నేడు అల్లూరి సీతారామరాజు గారి జయంతి సందర్భంగా మనస్ఫూర్తిగా నివాళులర్పిస్తున్నా' అని 'ఎక్స్'లో వైఎస్ జగన్ పోస్ట్ చేశారు.

స్ఫూర్తిదాయకం 'అల్లూరి' జీవితం

డీజీపీ సీహెచ్.ద్వారకా తిరుమలరావు

సాక్షి, అమరావతి: బ్రిటీష్ పాలకుల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడి దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అల్లూరి జీవితం స్ఫూర్తిదాయకమని డీజీపీ సీహెచ్.ద్వారకా తిరుమలరావు పేర్కొన్నారు. అల్లూరి 127వ జయంతి సందర్భంగా గుంటూరు జిల్లా మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి డీజీపీ గురువారం నివాళులర్పించారు. అలాగే, అల్లూరి జయంతి వేడుకలను రాష్ట్ర ఆక్టోపస్ ప్రధాన కార్యాలయంలోనూ నిర్వహించారు. ఆక్టోపస్ ఎస్పీలు ఎం.నాగేంద్రరావు, బి.రవిచంద్ర అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు కె.నగేశ్ బాబు, కె.రామచంద్రమూర్తి పాల్గొన్నారు. విజయవాడలోని ఆర్టీసీ భవన్‌లో ఆర్టీసీ ఈడీ కేఎస్ బ్రహ్మానందరెడ్డి అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఘనంగా వైఎస్సార్ 75వ జయంతి

మాజీ మంత్రి పేర్ని నాని వెల్లడి

సాక్షి, అమరావతి: మహానేత, దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి సందర్భంగా జూలై 8న రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ నిర్ణయించిందని మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని) తెలిపారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు.వైఎస్సార్ ఆశయాల సాధనే లక్ష్యంగా వైఎస్ జగన్.. వైఎస్సార్‌సీపీని స్థాపించారని చెప్పారు. అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించామని తెలిపారు. రక్తదానంతో పాటు పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, రహదారులు, కాలనీల్లో చెట్లు నాటడం వంటి సేవా కార్యక్రమాలు భారీ ఎత్తున చేపట్టి మహానేతకు ఘనంగా నివాళులర్పించాలని వైఎస్సార్‌సీపీ కుటుంబసభ్యులందరికీ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ పిలుపునిచ్చారని తెలిపారు. వైఎస్సార్‌పై అభిమానమున్న వారు ఎవరైనా ఆయన జయంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చని ఓ ప్రశ్నకు నాని బదులిచ్చారు.

చక్రధర్‌బాబుకు 'ఏపీసీపీడీసీఎల్' బాధ్యతలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీసీపీడీసీఎల్) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)గా కె.వి.ఎన్.చక్రధర్‌బాబుకు ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. చక్రధర్‌బాబు ప్రస్తుతం ఏపీ జెన్‌కో ఎండీ, ఏపీ ట్రాన్స్‌కో జేఎండీగా ఉన్నారు. ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పోస్టు నుంచి జె.పద్మాజనార్దనరెడ్డి తప్పుకున్న తరువాత ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావును ఇన్‌చార్జ్‌గా నియమించారు. కొన్ని నెలలుగా కొనసాగుతున్న ఆయనను ఆ బాధ్యతల నుంచి తప్పించి ఐఏఎస్ అధికారికి అప్పగిస్తూ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.



నెల్లూరులో వైఎస్ జగన్ కాన్వాయ్‌తో పాటు భారీ జనసందోహం



భారీ ఎత్తున తరలివచ్చిన ప్రజలు, అభిమానులకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

చంద్రబాబూ.. పద్ధతి మార్చుకో

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ హెచ్చరిక

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: రాష్ట్రంలో విధ్వంస రాజకీయాలకు పాల్పడుతూ విష సంస్కృతికి చంద్రబాబు బీజం వేస్తున్నారని, దీనికి ఫుల్ స్టాప్ పెట్టకపోతే భవిష్యత్‌లో రియాక్షన్ కూడా అదే స్థాయిలో ఉంటుందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. దాడులు, విధ్వంసాలు ఆపాలని కోరడం లేదని, హెచ్చరిస్తున్నానని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులపై విచక్షణ రహితంగా దాడులు చేస్తున్నారని, ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని.. పైగా బాధితులపైనే తప్పుడు కేసులు పెట్టి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని నిప్పులు చెరిగారు. ఇది ఏ మాత్రం న్యాయం కాదని, ముఖ్యమంత్రి చంద్రబాబు పాపాలు పండుతున్నాయని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై, మంచి పాలన అందించడంపై చంద్రబాబు దృష్టి పెడితే మంచిదన్నారు. నెల్లూరు సెంట్రల్ జైల్లో ఉన్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని గురువారం వైఎస్ జగన్ ములాఖత్ ద్వారా పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా విధ్వంసక చర్యలు జరుగుతున్నాయి. కేవలం టీడీపీకి ఓటు వేయలేదన్న కారణంతో ఏకంగా ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. దొంగ కేసులు పెడుతున్నారు. వీళ్లే కొడతారు, మళ్లీ వీళ్లే అటు వైపున ఉన్న వారి మీద కేసులు పెడతారు. ఇంతటి దారుణంగా ఈ రోజు రాష్ట్రంలో పరిపాలన సాగిస్తున్నారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పరిపాలనలో కులం చూడలేదు, మతం చూడలేదు. ప్రాంతం చూడలేదు. చివరికి ఏ పార్టీకి ఓటు వేశారన్నది కూడా చూడకుండా ప్రతి పథకం, ప్రతి మంచిని అర్హత ప్రామాణికంగా ప్రతి ఇంటికీ డోర్ డెలివరీ చేశాం. ఈ రోజు చంద్రబాబునాయుడుకు ఓటు వేయలేదనే కారణంతో అన్యాయంగా రాష్ట్రాన్ని రావణకాష్టం చేస్తున్నారు. ఆ దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను విరగ్గొడుతున్నారు.. పగలగొడుతున్నారు. ఇవన్నీ శిశు పాలుని పాపాల మాదిరిగా పండుతాయి. ప్రజాస్వామ్యంలో ఏదైనా ప్రజలకు మంచి చేసి ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకుని, ప్రజల దగ్గరకు వెళ్లి ఫలానా మంచి చేశాం కాబట్టి ఓటు వేయండి అనే పరిస్థితులు ఉండాలి. కానీ ఈ మాదిరిగా దౌర్జన్యాలు చేసి, అన్యాయమైన కేసులు పెట్టి, ఆస్తులు ధ్వంసం చేసి, భయాందోళనలు సృష్టిస్తూ రాజకీయాలు చేస్తే, అలాంటి రాజకీయం ఏ రోజూ నిలబడదు. తాత్కాలిక మేలు ఏదైనా జరుగుతుందేమో కానీ తర్వాత ఓటు వేసేటప్పుడు ప్రజలు ఇవన్నీ కచ్చితంగా గుర్తు పెట్టుకుంటారు. అందుకే చంద్రబాబులో మార్పు రావాలి. లేదంటే ప్రజలు లెక్కా జమా సరిచేసి చంద్రబాబుకు గట్టిగా బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి' అని వైఎస్ జగన్ నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ప్రతి దశలో ఓ రెడ్‌బుక్

- **ప్రతి ఒక్కరూ వాళ్ల వాళ్ల స్థాయిలో రెడ్‌బుక్స్** అని చెప్పి పెట్టుకున్నారు. చంద్రబాబు స్థాయిలో ఒక రెడ్‌బుక్, లోకేశ్ స్థాయిలో ఒక రెడ్‌బుక్, ఎమ్మెల్యే స్థాయిలో, మండల స్థాయిలో, గ్రామ స్థాయిలో ఇలా రెడ్‌బుక్‌లు పెట్టుకుని ఏం చేస్తున్నారు? అతి దారుణంగా, అన్యాయంగా ఆస్తులు ధ్వంసం చేస్తున్నారు.
- మీ విధ్వంసాలు, దాడులను రాష్ట్రం మొత్తం చూస్తోంది. కానీ ఎవరూ మాట్లాడటం లేదు. దొంగ కేసులు పెడుతున్నారు. చీనీ చెట్లు నరికేస్తున్నారు. జేసీబీలు, పొక్లెయిన్ల మీద స్వయంగా ఎమ్మెల్యేలు తిష్ట వేసి బిల్డింగులు పగలగొట్టే కార్యక్రమాలు చేస్తున్నారు. ఊరూరా ఆస్తుల ధ్వంసం, దాడులు, దౌర్జన్యాలపై పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు.

ప్రజలు మీకు ఓటు వేసింది ఎందుకు?

- ప్రజలకు మంచి **చేసి** వైఎస్సార్‌సీపీ ఓడిపోలేదు. చంద్రబాబు నాయుడు చేసిన మోసపూరిత హామీలకు ప్రజలు కాస్తో కూస్తో కొద్దిగా ఆకర్షితులయ్యారు. 10 శాతం ఓట్లు అటు షిఫ్ట్ అయ్యి **చంద్రబాబు నాయుడు అధికారం**లోకి వచ్చారు. మేనిఫెస్టోలో చంద్రబాబు అనేక హామీలు ఇచ్చారు. రైతులకు రైతు భరోసా కింద ఏడాదికి రూ.20 వేలు ఇస్తానన్నారు. ఖరీఫ్‌లో జోరుగా వ్యవసాయం పనులు జరుగుతున్నాయి. రైతన్నలు పంటలు వేగంగా వేస్తున్నారు. ఇంత వరకు రైతు భరోసా రూ.20 వేలు ఇస్తానన్న దానికి అతీగతీ లేదు.
- బడులు మొదలయ్యాయి. అమ్మ ఒడి కింద జగన్ రూ.15 వేలు ఐదేళ్ల పాటు ఇచ్చాడు. చంద్రబాబు నాయుడు ఎంత మంది పిల్లలుంటే అంత మందికీ ఇస్తానని, ప్రతి ఒక్కరికీ రూ.15 వేలు ఇస్తానని చెప్పారు. రాష్ట్రంలో కోటి మందికి పైగా బడి ఈడు పిల్లలున్నారు. తల్లికి వందనం కింద ఆ డబ్బులేమయ్యాయి అని ప్రతి తల్లీ అడుగుతోంది.
- 18 ఏళ్లు పైబడిన ప్రతి అక్క చెల్లెమ్మకు **రూ.1,500** చొప్పున సంవత్సరానికి **రూ**.18 వేలు ఇస్తామని చెప్పారు. రాష్ట్రంలో 4.12 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని మొన్ననే లెక్కలు తేలాయి. అందులో దాదాపుగా 2.10 కోట్ల మంది మహిళా ఓటర్లే. అందరూ 18 **సం**వత్సరాలు నిండిన వారే. ప్రతి **నెలా** రూ.1500 ఇస్తానన్నావు, ఏమైంది? అని వీరందరూ ఈ రోజు అడుగుతున్నారు.
- వీటన్నింటి మీద ధ్యాస పెట్టే కార్యక్రమం చంద్రబాబు నాయుడు చేయాలి. గవర్నెన్స్ మీద కాస్త ధ్యాస పెట్టి ఆ తల్లులకు డబ్బులిచ్చే కార్యక్రమం చూడండి. రైతులకు రూ.20 వేలు ఇచ్చే కార్యక్రమం చూడండి. ప్రజలు ఎందుకు తమకు ఓటు వేశారు అని చంద్రబాబు నాయుడు ఆలోచించాలి. ఇవేవీ కూడా చేయకుండా కేవలం భయాందోళనలు నెలకొల్పాలి.. రాష్ట్రంలో రావణకాష్టం రగిలించాలి.. దొంగ కేసులు పెట్టి ఇరికించాలి.. ఆస్తులను ధ్వంసం చేయాలి.. వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీకి ఓటు వేసిన వారెవరినీ ఉంచకూడదు అన్న దుర్మార్గపు ఆలోచనలతో అడుగులు ముందుకు వేయడం అతి హేయమైన రాజకీయం.

ఎమ్మెల్యే 10 సార్లు ఫోన్ చేసినా ఎస్పీ స్పందించలేదు

- మే 13న ఎన్నికల సమయంలో పాల్వాయి గేట్ అనే పోలింగ్ కేంద్రం దగ్గరకు అప్పటి ఎమ్మెల్యే వెళ్లినప్పుడు జరిగిన ఘటన మీద మరో కేసు పెట్టారు. అసలు ఆ ఘటన ఎందుకు జరిగింది? అక్కడ ఉన్న ఎస్సీ సామాజిక వర్గం వారు పోలింగ్ బూత్‌లోకి వెళ్లి ఓటు వేసే పరిస్థితి లేనప్పుడు ఎమ్మెల్యే ఆ గ్రామానికి వెళ్లారు. ఆ పరిస్థితులను చూసి ఎస్పీకి 10 సార్లు ఫోన్ చేసినా కూడా స్పందించని పక్షంలో కనీసం సీఐని, ఎస్సైని పంపించండనే పరిస్థితుల్లో ఉన్నారు. అలాంటి సెన్సిటివ్ బూత్‌లో కేవలం ఒకే ఒక్క హోంగార్డును పెట్టారు. అటువంటి పరిస్థితుల్లో ఆ ఘటన జరిగింది. ఆ ఈవీఎం పగలగొట్టిన కేసులో తనకు బెయిల్ వచ్చింది. కానీ ఎవరిపైనో హత్యాయత్నం చేశాడని తప్పుడు కేసులు పెట్టి ఇవాళ జైలు పాలు చేశారు.
- ఈ ఘటన జరిగిన 10 రోజుల తర్వాత అంటే మే 23వ తారీఖున కేసులు పెట్టారు. రిగ్గింగ్‌ను అడ్డుకునే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చేస్తే, హత్యాయత్నం చేశాడని తప్పుడు కేసులు పెట్టారు. నిజంగా అటువంటిది జరిగి ఉంటే సిట్ 17వ తారీఖు నుంచి 20వ తారీఖు మధ్యలో ఇచ్చిన రిపోర్టులో చెప్పాలి కదా?

2009 నుంచి వరుసగా నాలుగు సార్లు పిన్నెల్లి గెలిచాడంటే మంచోడు కాబట్టే ప్రజలు ఆశీర్వదిస్తూ వచ్చారు. అటువంటి వ్యక్తిని తీసుకొచ్చి తప్పుడు కేసుల్లో ఇరికించడం ఎంత వరకు ధర్మం? ఈ రోజు ఇది రామకృష్ణారెడ్డి ఒక్కడి పరిస్థితే కాదు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ఇలానే జరుగుతోంది.

- వైఎస్ జగన్ వెంట మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, అంబటి రాంబాబు పిన్నెల్లితో ములాఖత్‌లో పాల్గొన్నారు. మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు తలశిల రఘురామ్, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, బల్లి కల్యాణ చక్రవర్తి తదితరులు ప్రెస్‌మీట్‌లో పాల్గొన్నారు.

పిన్నెల్లిపై ఇంత అన్యాయంగా కక్ష సాధింపా?

- పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మీద ఏకంగా 307 అంటే హత్యాయత్నం కేసు పెట్టారు. ఏ రకంగా అన్యాయంగా అతన్ని జైల్లో నిర్బంధించారో చూస్తున్నాం. కారంపూడి ఘటన జరిగిందెప్పుడు? ఎన్నికలు అయిపోయిన మరుసటి రోజు అంటే మే 14న. కారంపూడిలో టీడీపీ ఆకృత్యాలకు ఒక ఎస్సీ కుటుంబంలోని మహిళలు ఇబ్బంది పడే పరిస్థితి వచ్చినందున వాళ్లను పరామర్శించడానికి డీఎస్పీ అనుమతి తీసుకుని అప్పటి ఎమ్మెల్యే పిన్నెల్లి బయల్దేరాడు.
- కారంపూడికి అటు వైపున ఎస్సీ కుటుంబం ఇల్లు ఉంటే.. ఎమ్మెల్యే ఊర్లోకి ప్రవేశించక ముందే ఇటు వైపు అడ్డగించారు. గొడవ టౌన్‌లో జరుగుతుంటే పిన్నెల్లిని ఊరుబయటే అడ్డగించారు. నారాయణస్వామి అనే సీఐని పిన్నెల్లి చూసిన దాఖలాలు కూడా లేవు. మే 14న గొడవ జరిగితే 9 రోజుల తర్వాత అంటే మే 23న ఆయనకేదో జరిగింది అన్నట్లుగా ఆ సీఐ, రామకృష్ణారెడ్డి మీద హత్యాయత్నం కేసు పెట్టాడు. ఆ సీన్లో లేని వ్యక్తిపై ఈ కేసు బనాయించారు. ఇది అన్యాయం కాదా?
- అసలు ఇన్సిడెంట్ నిజంగా జరిగిందో లేదో కూడా తెలియదు. మే 14న జరిగి ఉంటే మే 15న మెడికో లీగల్ కేసు ఎందుకు పెట్టలేదు? 17వ తేదీన కేంద్ర ఎన్నికల సంఘం సిట్ వేసింది. 17 నుంచి 20వ తేదీ వరకు పల్నాడు ప్రాంతంలో ఆ సిట్ బృందం తిరిగి ఘటనపై రిపోర్టు ఇచ్చింది. ఆ రిపోర్టులో ఎందుకు ఈ అంశం రాలేదు? అలాంటప్పుడు ఈ రకంగా హత్యాయత్నం కేసులో ఒక మనిషిని ఇరికించడం ధర్మమేనా?

వైఎస్ జగన్ పర్యటనలో భద్రతా వైఫల్యం

- హెలిప్యాడ్ వద్దకు దూసుకొచ్చిన వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు
- వారిని కంట్రోల్ చేయలేక చేతులెత్తేసిన పోలీసులు
- వైఎస్ జగన్ హెలికాప్టర్ దిగకముందే చుట్టేసిన అభిమానులు
- తోపులాట మధ్యే వాహనం ఎక్కిన వైఎస్ జగన్
- అభిమానుల ముసుగులో ఎవరైనా హాని తలపెట్టే అవకాశం
- భద్రతా వైఫల్యంపై వైఎస్సార్‌సీపీ నేతల మండిపాటు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో గురువారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలో భద్రతా వైఫల్యం స్పష్టంగా కనిపించింది. తమ అభిమాన నేతను చూసేందుకు వేలాది మంది వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు తరలి రావడంతో వారిని కంట్రోల్ చేయలేక పోలీసులు చేతులెత్తేశారు. హెలిప్యాడ్ వద్దకు వేలాది మంది దూసుకు రావడంతో వైఎస్ జగన్ హెలికాప్టర్ నుంచి దిగేందుకు కొద్ది సేపు సంశయించాల్సి వచ్చిందంటే అక్కడి పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ గురువారం నెల్లూరు సెంట్రల్ జైల్లో ఉన్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డితో ములాఖత్ అయ్యేలా పర్యటన ఖరారైంది. నెల్లూరు రూరల్ పరిధిలోని కనపర్తిపాడు జెడ్పీ హైస్కూల్ ఆవరణలో హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. అక్కడ నుంచి నేరుగా వాహనంలో జాతీయ రహదారి మీదుగా నెల్లూరు సెంట్రల్ జైలు వద్దకు వెళ్లి వచ్చేలా పర్యటన ఏర్పాట్లు చేశారు. అయితే మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత హోదాలో వైఎస్ జగన్ పర్యటనకు జిల్లా పోలీస్ యంత్రాంగం సరైన ప్రాధాన్యత ఇవ్వలేదు. దాదాపు 80 మంది పోలీసు సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేశామని చెబుతున్నప్పటికీ, అంతా హెలికాప్టర్ దిగే ప్రదేశం వద్దకే వేలాది మంది అభిమానులు దూసుకొచ్చి చుట్టు ముట్టేశారు. కనీసం రోప్ పార్టీ కూడా లేని పరిస్థితి. దీంతో తన వ్యక్తిగత సిబ్బంది సాయంతో అభిమానులు తోపులాటల మధ్య వైఎస్ జగన్ హెలికాప్టర్ దిగి, వాహనం వద్దకు చేరుకున్నారు. హైస్కూల్ ఆవరణలో అభిమానుల్ని కంట్రోల్ చేసేందుకు బారికేడ్లు ఏర్పాటు చేశారు కానీ, తగినంత పోలీస్ సిబ్బంది మాత్రం లేరు. దీంతో అభిమానుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు హెలిప్యాడ్ వద్దకు వచ్చేందుకు కూడా అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. చాలా మంది హెలిప్యాడ్ వద్ద జగన్‌ను కలవలేకపోయారు.

వైఎస్సార్‌సీపీ నేతల్లో ఆందోళన

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ పర్యటనలో భద్రతా వైఫల్యం స్పష్టంగా కనిపించిందని ఆ పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీస్ శాఖ అభిమానుల్ని కంట్రోల్ చేయలేక చేతులెత్తేయడంతో అభిమానుల ముసుగులో ఎవరైనా ఆయనకు ఏదైనా ప్రమాదం తలపెట్టే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. వేలాది మంది హెలికాప్టర్‌ను చుట్టేయడంతో జగన్ వ్యక్తిగత సిబ్బంది కూడా ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఆ సమయంలో అభిమానుల ముసుగులో టీడీపీ మూకలు ఆయనపై దాడి చేసే అవకాశం ఉందని, ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలు చూస్తున్న నేపథ్యంలో ఈ సందేహం వస్తోందని ఆ పార్టీ నేత ఒకరు అన్నారు. గతంలో విజయవాడలో ఎన్నికల ప్రచారంలో వైఎస్ జగన్‌పై రాయితో హత్యాయత్నం చేశారని గుర్తు చేశారు.

ఉచిత పంటల బీమా కొనసాగించాల్సిందే

- ప్రీమియం భారం రైతులపై వెయ్యొద్దు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా భరించాలి
- ఏపీ రైతు సంఘం డిమాండ్

సాక్షి, అమరావతి: రైతులపై భారం పడకుండా వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకాన్ని కొనసాగించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. 2019కి ముందు ఉన్న పాత పద్ధతిలోనే పంటల బీమాను అమలుచేస్తామని వ్యవసాయ శాఖపై జరిగిన తొలి సమీక్షలో సీఎం చంద్రబాబు ప్రకటించడాన్ని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి. కృష్ణయ్య, కె. ప్రభాకర్‌రెడ్డి తప్పుబట్టారు. రైతుల భాగస్వామ్యంతో పంటల బీమా అమలుచేయాలని నిర్ణయించడం సరికాదన్నారు. పెరిగిన పెట్టుబడి ఖర్చుల నేపథ్యంలో బీమా ప్రీమియం భారం భరించే స్థితిలో రైతుల్లేరని వారన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం అమలుచేసినట్లుగానే రైతుల బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వమే తీసుకోవాలన్నారు. రైతులపై భారం లేకుండా ఉచిత పంటల బీమా అమలుచేయాలని డిమాండ్ చేశారు. ప్రీమియం భారాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 50శాతం చొప్పున భరించాలన్నారు. ఆహార, వాణిజ్య, ఉద్యాన పంటలకూ ఉచిత పంటల బీమా అమలుచేయాలన్నారు.

ప్రైవేట్, కార్పొరేట్ బీమా సంస్థలొద్దు..

పంటల బీమా అమల్లో ప్రైవేటు, కార్పొరేట్ బీమా సంస్థలను పక్కన పెట్టి ప్రభుత్వ రంగ బీమా సంస్థలను అనుమతించాలన్నారు. ప్రైవేట్ బీమా కంపెనీలు తమ లాభాల కోసం రైతులకు జరిగిన నష్టాన్ని తక్కువచేసి చూపి రైతులకు పంటల బీమా చెల్లించకుండా మోసం చేస్తున్నాయని ఆరోపించారు. గత ప్రభుత్వం కూడా తొలి మూడేళ్లు తానే బాధ్యత తీసుకుని రైతులకు పంటల బీమా అమలుచేసిందని గుర్తుచేశారు. రెండేళ్లుగా కేంద్రం ఒత్తిడితో పంటల బీమాలోకి ప్రైవేట్, కార్పొరేట్ బీమా కంపెనీలను అనుమతించాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఫలితంగా కొన్ని పంటలకు బీమా పరిహారం అందక రైతులు నష్టపోయారన్నారు. కరువు, తుపాను వంటి విపత్తులతోపాటు వాతావరణ ప్రభావంతో పంట దిగుబడి తగ్గిపోయిన పరిస్థితుల్లో రైతులను ఆదుకునేందుకు ఈ పథకం దోహదపడుతుందన్నారు. పంట నష్టం అంచనాలో అధికారుల నివేదికల ఆధారంగా రైతులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. రైతులపై ప్రీమియం భారం పడకుండా ఉచిత పంటల బీమా పథకాన్ని కొనసాగించాలని లేకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

బిల్లుపై బాదుడు

▶ మొదటి పేజీ తరువాయి

వినియోగదారులు కోరుతున్నారు.

ఇదీ సంగతి...!

ఇప్పుడు నెలవారీ విద్యుత్ బిల్లు చెల్లించేందుకు వివిధ రకాల యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. చివరి రోజైనా సరే ఇంటి నుంచే క్షణాల్లో కట్టవచ్చు. ప్రతి నెలా బిల్లు చెల్లించాల్సిన తేదీతో సహా మెసేజ్ రూపంలో యాప్‌లు గుర్తు చేస్తుంటాయి. పని ఒత్తిడిలో మర్చిపోకుండా ఆటో పే ఆప్షన్ కూడా ఉంది. అయితే ఇకపై థర్డ్ పార్టీ యాప్‌లతో విద్యుత్ బిల్లులు చెల్లించడం సాధ్యం కాదు. డిస్కమ్‌ల వెబ్‌సైట్, వాటి మొబైల్ యాప్‌లోనే విద్యుత్తు బిల్లుల చెల్లింపులు చేయాలి. ఆర్‌బీఐ మార్గదర్శకాలను అనుసరించి జూలై 1 నుంచి ఈ నిబంధన అమలులోకి వచ్చిందని ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కమ్స్) వెల్లడించాయి.

చెల్లింపులపై చార్జీలు ఎలా అంటే..

నూతన విధానాల ప్రకారం వినియోగదారులు గూగుల్ ప్లే స్టోర్ నుంచి సంబంధిత డిస్కమ్‌ల యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని విద్యుత్తు బిల్లులు చెల్లించవచ్చు. ఏపీసీపీడీసీఎల్ వినియోగదారులు www.apcpdcl.in ద్వారా, ఈపీడీసీఎల్ వినియోగదారులు www.apeasternpower.com ద్వారా, ఎస్పీడీసీఎల్ వినియోగదారులు www.apspdcl.in వెబ్‌సైట్ ద్వారా కూడా బిల్లులు కట్టవచ్చు. అయితే ఇక్కడే ఓ మెలిక ఉంది. నెట్ బ్యాంకింగ్ ద్వారా కరెంట్ బిల్లు చెల్లిస్తే ప్రతి లావాదేవీకి రూ.2.50 చొప్పున చార్జీ పడుతుంది. భారత్ క్యూఆర్ ద్వారా కడితే బిల్లు మొత్తంపై 0.85 పైసలు చార్జీ పడుతుంది. డెబిట్ కార్డులు ద్వారా కడితే బిల్లు మొత్తం అమౌంట్‌లో 0.90 శాతం అదనంగా చెల్లించాలి. క్రెడిట్ కార్డులు, ఇతర పేమెంట్ పద్ధతుల ద్వారా బిల్లు చెల్లించాలంటే 1 శాతం అదనంగా పడుతుంది. ఉదాహరణకు రూ.5 వేలు విద్యుత్తు బిల్లు కట్టాలంటే రూ.50 అదనంగా సమర్పించుకోవాలి. ఇలా రాష్ట్రంలోని దాదాపు 1.92 కోట్ల మంది విద్యుత్ వినియోగదారులు ప్రతి నెలా చెల్లించే దాదాపు రూ.3 వేల కోట్ల విద్యుత్ బిల్లులపై 1 శాతం అదనంగా వేసుకుంటే రూ.30 కోట్లు భారం పడుతుంది. కాగా ఫోన్‌పే, పేటీఎం లాంటి యూపీఐ యాప్‌ల ద్వారా ఇన్నాళ్లూ ప్లాట్‌ఫామ్ చార్జీ కింద బిల్లుకు కేవలం రూ.1 మాత్రమే వసూలు చేయడం గమనార్హం.

టీడీపీ అంటే షాకులే..

76 యూనిట్లు విద్యుత్ వినియోగానికి 2015–16లో టీడీపీ హయాంలో రూ.140.10 బిల్లు రాగా 2018–19లో రూ.197.60 వచ్చింది. అంటే బిల్లు 41.04 శాతం పెరిగింది. నాడు 78 యూనిట్లకు 39.57 శాతం, 80 యూనిట్లకు 38.21 శాతం పెంచేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఇతర రాష్ట్రాలతో పోల్చితే 100 యూనిట్లలోపు విద్యుత్ వినియోగంపై చార్జీలు ఏపీలోనే తక్కువగా ఉండేవి. ఇతర చోట్ల యూనిట్ రూ.8.26 వరకూ ఉంటే ఏపీలో రూ.3.11 చార్జీ పడేది. 75 యూనిట్ల వరకు వినియోగానికి టారిఫ్ సగటు సరఫరా వ్యయంలో 50 శాతం కంటే తక్కువే విధించారు. వ్యవసాయానికి సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ (సెకీ) ద్వారా 7 వేల మెగావాట్ల సౌర విద్యుత్‌ను సగటు కొనుగోలు ధర యూనిట్ రూ.5.10 చొప్పున ఉన్నప్పటికీ గత ప్రభుత్వం రూ.2.49కే సేకరించేలా చర్యలు తీసుకుంది. దీంతో ఏటా దాదాపు రూ.3,750 కోట్లు ఆదా కానుంది. 2021లో విద్యుత్ కొనుగోళ్లలో రూ.4,925 కోట్లు ఆదా కాగా ఇందులో రూ.3,373 కోట్లను వినియోగదారులకే తిరిగి ఇచ్చేశారు.

నిర్లక్ష్యంగా డిస్కమ్‌లు...

తాజాగా విద్యుత్తు బిల్లుల చెల్లింపులన్నీ భారత్ బిల్ పేమెంట్ సిస్టమ్ (బీబీపీఎస్) ద్వారానే జరగాలని ఆర్‌బీఐ నిర్దేశించింది. అయితే ప్రధాన ప్రైవేట్ బ్యాంకులు ఈ బిల్ పేమెంట్ సిస్టమ్‌ను ఎనేబుల్ చేసుకోలేదు. దీంతో డిస్కమ్‌లు తమ వెబ్‌సైట్, యాప్‌లో చెల్లించమని సూచించడం మినహా అదనపు భారం నుంచి ఊరట కల్పించే నిర్ణయాలు తీసుకోలేదు. కనీసం ప్రజల్లో అవగాహన కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో బిల్లుల చెల్లింపులపై గందరగోళం నెలకొంది. బిల్లు కట్టడం ఆలస్యమైతే విద్యుత్ సర్వీసులను నిలిపివేయడం, లేట్ పేమెంట్ చార్జీలు విధించటం లాంటి చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో విస్తృతంగా ప్రచారం చేపట్టాల్సిన విద్యుత్తు సంస్థలు ఉదాసీనంగా వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వక్ఫ్ ఆస్తుల్లో ఆక్రమణలు తొలగించాలి

సీఎం చంద్రబాబుకు రాష్ట్ర ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నాగుల్ మీరా విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని వక్ఫ్ ఆస్తుల్లో ఉన్న ఆక్రమణలను తొలగించి.. అక్రమ కట్టడాలను వెంటనే కూల్చివేయాలని సీఎం చంద్రబాబుకు ఆంధ్రప్రదేశ్ ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. అధికారంలోకి వచ్చిన టీడీపీ రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయాలను అక్రమ కట్టడాల సాకుతో కూల్చివేస్తున్నదని, మరి వక్ఫ్ బోర్డుకు చెందిన ఆక్రమణలు కనిపించలేదా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని కర్నూలు, కడప, గుంటూరు, వైజాగ్ నగరాల్లో రూ.వేల కోట్ల విలువైన వక్ఫ్ భూములు ఆక్రమణకు గురయ్యాయని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో నారా లోకేశ్ ఇచ్చిన మాట ప్రకారం ఆక్రమణదారులపై చట్టపరమైచర్యలు తీసుకుని, ఆక్రమణలకు గురైన వక్ఫ్ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరారు. వక్ఫ్ చట్ట నిబంధనలకు లోబడి వక్ఫ్ బోర్డు కమిటీని త్వరితగతిన ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఏపీ చాంబర్స్ రోడ్‌మ్యాప్

సాక్షి, అమరావతి: రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి వేగంగా పరుగులు తీయడానికి తీసుకోవాల్సిన తక్షణ చర్యలను సూచిస్తూ ఏపీ చాంబర్స్ రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసింది. కొత్తగా బాధ్యతలు చేపట్టిన పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను ఏపీ చాంబర్స్ ప్రతినిధులు గురువారం కలిసి రోడ్‌మ్యాప్‌ను అందజేశారు. అందులో ప్రస్తుతం పరిశ్రమల పరిస్థితిని వివరిస్తూ రంగాల వారీగా ఉన్న సమస్యలు వాటిని పరిష్కరించడానికి తీసుకోవాల్సిన చర్యలను సూచిస్తూ రోడ్‌మ్యాప్‌ను మంత్రికి అందచేసినట్లు ఏపీ చాంబర్స్ ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ తెలిపారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. రంగాల వారీగా సమస్యలను గుర్తించి, కొత్త పరిశ్రమలను ప్రోత్సహించే విధంగా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఏపీ చాంబర్స్ ప్రతినిధులు తెలిపారు.

ఉపాధి అవకాశాలను మెరుగుపర్చండి

స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులతో మంత్రి నారా లోకేశ్ సమీక్ష



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు పరిశ్రమలతో కలిసి పనిచేయాలని మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి లోకేశ్ గురువారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని ఐటీఐ, పాలిటెక్నిక్ కాలేజీలను పరిశ్రమలతో అనుసంధానం చేసి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. ప్రతి ఐటీఐ, పాలిటెక్నిక్ కాలేజీ స్థానికంగా ఉన్న దేశీయ, విదేశీ కంపెనీలతో కలిసి అభ్యర్థుల నైపుణ్యాలను పెంచేందుకు ప్రణాళికలు తయారుచేయాలని సూచించారు. అమరావతిలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) సెంటర్, మంగళగిరిలో జెమ్స్ అండ్ జ్యూయలరీ ట్రైనింగ్ సెంటర్ నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేందుకు విభాగాల వారీగా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. విదేశాల్లో ఉపాధి కల్పనపై కేరళ అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని చెప్పారు. ఈ సమీక్షలో స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ సెక్రటరీ సౌరభ్ గౌర్, స్కిల్ డెవలప్‌మెంట్ ఎండీ రాజబాబు, ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ డైరెక్టర్ నవ్య, సీడ్‌యాప్ సీఈవో శ్రీనివాసులు, న్యాక్ ఏడీజీ దినేష్, ఓమ్‌క్యాప్ జీఎం క్రాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నియంత్రణకు యాంటీ నార్కోటిక్స్ స్క్వాడ్

హోమ్ మంత్రి వంగలపూడి అనిత



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను నియంత్రించడానికి యాంటి నార్కోటిక్స్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు హోమ్ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. గంజాయి సాగుకు పెట్టుబడి పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీ వెలగపూడిలోని సచివాలయంలో గురువారం సమావేశమైంది. అనంతరం హోమ్ మంత్రి అనిత మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ.. వంద రోజుల్లో ఈ యాంటీ నార్కోటిక్స్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేయడంతోపాటు..ఓ టోల్‌ఫ్రీ నంబరు కూడా అందుబాటులోకి తెస్తామన్నారు. గంజాయి అక్రమ రవాణా కేసుల్లో అరెస్టై జైళ్లలో ఉన్నవారిలో 50శాతం మంది 20ఏళ్ల లోపు యువకులేనని ఆమె చెప్పారు. మత్తు పదార్థాల అలవాటును నియంత్రించేందుకు డీ అడిక్షన్ సెంటర్లు, పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. నిర్మూలన దీర్ఘకాలిక ప్రక్రియ, నియంత్రణ అత్యంత అవసరం అని గిరిజన, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి చెప్పారు. మంత్రులు నారా లోకేశ్, కొల్లు రవీంద్ర, సత్యకుమార్ యాదవ్, డీజీపీ సీహెచ్.ద్వారకా తిరుమలరావు, సీఐడీ అదనపు డీజీ రవిశంకర్ అయ్యన్నార్ పాల్గొన్నారు.

పెట్టుబడులకు ఏపీలో అపారమైన అవకాశాలు

ఎం42 ప్రతినిధులతో మంత్రి సత్యకుమార్



సాక్షి, అమరావతి: ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు అపారమైన అవకాశాలు, వనరులు ఉన్నాయని అబుదాబికి చెందిన ఎం42 సంస్థ ప్రతినిధులకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని వైద్య శాఖ ప్రధాన కార్యాలయంలో ఎం42 ప్రతినిధులతో గురువారం మంత్రి సమావేశమయ్యారు. జినోమిక్స్, పర్యావరణ, మెడ్‌టెక్, బయోటెక్ వంటి విభాగాల్లో పెట్టుబడులపై చర్చించినట్లు మంత్రి చెప్పారు. ఏపీలో బల్క్ డ్రగ్ పార్క్ తొలిస్థానంలో ఉన్న విషయాన్ని, 170 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఏపీ మెడ్‌టెక్ జోన్, కేంద్రం మంజూరు చేసిన 3 ఎకనమిక్ జోన్లలో పెట్టుబడులు పెట్టే విషయమై చర్చించామన్నారు. అమరావతి ప్రాంతంలో హెల్త్ సిటీలో గానీ, ఎంపిక చేసిన 9 మునిసిపాలిటీల్లో హెల్త్ హబ్‌లు పెట్టమని ప్రతిపాదించినట్లు వివరించారు. ఎకనమిక్ కారిడార్లు, మెడ్‌టెక్ జోన్‌లో క్షేత్రస్థాయి పర్యటనల అనంతరం సంబంధిత అధికారులతో చర్చించి తుది నివేదికను అందజేస్తారన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ ఎస్.యువరాజ్, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ లక్ష్మీషా సమావేశంలో పాల్గొన్నారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనమివ్వాల్సిందే

- 'సాక్షి' కథనంతో డీఈవో శైలజ ఆదేశాలు
- గుంటూరులోని కార్పొరేషన్ స్కూళ్లను తనిఖీ చేసిన అధికారులు
- కోడిగుడ్ల సరఫరాదారులకు డీఈవో నోటీసులు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు కోడిగుడ్లు లేకుండా మధ్యాహ్న భోజనం పెడుతున్న విషయమై 'ఎగ్గొట్టారు' శీర్షికతో గురువారం 'సాక్షి' మెయిన్ ఎడిషన్‌లో ప్రచురితమైన కథనంపై జిల్లా విద్యాశాఖాధికారి(డీఈవో) పి.శైలజ స్పందించారు. గురువారం నగరంలోని స్కూళ్లను విద్యాశాఖాధికారులు తనిఖీ చేసి డీఈవోకు నివేదిక అందజేశారు. కోడిగుడ్ల సరఫరాలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సరఫరాదారులకు నోటీసులు జారీ చేశారు. సంబంధిత ఏజెన్సీలకు జరిమానా విధించేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేశారు. పాఠశాలల్లో మెనూ ప్రకారమే మధ్యాహ్న భోజనం(పీఎం పోషణ) అందించాలని ప్రధానోపాధ్యాయులకు డీఈవో శైలజ స్పష్టం చేశారు. విద్యార్థులంతా పాఠశాలలోనే భోజనం చేసేలా పర్యవేక్షించాలని ఆదేశించారు.



గురువారం సాక్షి మెయిన్ ఎడిషన్‌లో ప్రచురితమైన కథనం

కార్యాలయాల కూల్చివేతలపై సర్కారుకు ముకుతాడు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ఇబ్బందికరంగా ఉన్నప్పుడు, ప్రజల భద్రతకు ప్రమాదకారిగా మారినప్పుడు మాత్రమే కూల్చివేతలు చేపట్టవచ్చని, అయితే అతిక్రమణలు స్వల్పం, సాధారణం, అప్రధానం అయినప్పుడు అధికారులు ఎంత మాత్రం భవనాల కూల్చివేతలకు దిగరాదని హైకోర్టు ఆదేశించింది. అధికారులు తమ విచక్షణ, అధికారాన్ని వినియోగించే సమయంలో నిష్పాక్షికంగా, వాస్తవ దృక్పథంతో చట్ట నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని సూచించింది. పార్టీ కార్యాలయాల విషయంలో ఏ నిర్ణయం తీసుకున్నా అది చట్టానికి లోబడే ఉండాలని స్పష్టం చేసింది. చట్ట ప్రకారం తమకున్న ప్రత్యామ్నాయాలన్నింటినీ వైఎస్సార్‌సీపీ వర్గాలు సంబంధిత అధికారుల వద్ద ఉపయోగించుకోవచ్చునని తెలిపింది. చట్ట ప్రకారం వ్యవహరించేందుకు వీలుగా నేటి నుంచి రెండు వారాల్లోపు పార్టీ కార్యాలయాల నిర్మాణానికి సంబంధించిన ఆధారాలు, అదనపు డాక్యుమెంట్లు, వివరణ, అదనపు వివరణలను అధికారులకు సమర్పించవచ్చని పేర్కొంది. రెండు వారాల గడువు ముగిసిన తరువాత వైఎస్సార్‌సీపీ సమర్పించిన ఆధారాలు, అదనపు వివరణలు, డాక్యుమెంట్లను పరిగణలోకి తీసుకుని విచారణ జరపాలని అధికారులను ఆదేశించింది. వైఎస్సార్‌సీపీ వాదనను కూడా వినాలని ఆదేశించింది. అంతేకాకుండా రికార్డులు, సంబంధిత భవనాలను పరిశీలించిన తరువాతే పూర్వాపరాల ఆధారంగా నిర్ణయం తీసుకోవాలని అధికారులకు తేల్చి చెప్పింది. ప్రతి దశలోనూ వైఎస్సార్‌సీపీ వాదనలు వినాలని, ముఖ్యంగా మునిసిపల్ కార్పొరేషన్ చట్టం, మెట్రోపాలిటన్ రీజియన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్ట నిబంధనల కింద అవసరమైనప్పుడల్లా వారి వాదనను వినాల్సిందేనని తెలిపింది. ఈ ప్రక్రియ మొత్తం పూర్తయ్యే వరకు వైఎస్సార్ సీపీ కార్యాలయాల విషయంలో ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవడానికి వీల్లేదని అధికారులను ఆదేశించింది. ఈ ఆదేశాలతో పార్టీ కార్యాలయాల కూల్చివేతలపై వైఎస్సార్ సీపీ దాఖలు చేసిన వ్యాజ్యాలన్నింటినీ పరిష్కరించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ గురువారం తీర్పు వెలువరించారు.



కూల్చివేతల నోటీసులపై పిటిషన్లు..

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో తమ పార్టీ కార్యాలయాల కూల్చివేత నిమిత్తం పురపాలక శాఖ అధికారులు జారీ చేసిన షోకాజ్ నోటీసులు, ప్రాథమిక ఉత్తర్వులను సవాల్ చేస్తూ వైఎస్సార్ సీపీ, పార్టీ నేతలు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. కూల్చివేతలకు పాల్పడకుండా అధికారులను నియంత్రిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని అనుబంధ వ్యాజ్యాలు దాఖలయ్యాయి. వీటిపై గత గురువారం వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును రిజర్వ్ చేసిన విషయం తెలిసిందే.

నిర్మాణ సమయంలో అధికారులు సందర్శించలేదు..

'రాష్ట్ర విధానంలో భాగంగా అన్ని జిల్లాల్లో రాజకీయ పార్టీ కార్యాలయాల నిర్మాణం నిమిత్తం భూముల కేటాయింపు జరిగింది. భూములను స్వాధీనం కూడా చేశారు. ఆ ఖాళీ స్థలాలకు ఆస్తి పన్నులు కూడా చెల్లించారు. భవన నిర్మాణాలకు అనుమతి కోరుతూ దరఖాస్తులు సమర్పించారు. కొన్ని చోట్ల బిల్డింగ్ పర్మిట్‌లు కూడా వచ్చాయి. అత్యధిక చోట్ల భవన నిర్మాణాలు దాదాపుగా పూర్తయ్యాయి. అధికారులు ఎప్పుడూ నిర్మాణ సమయంలో భవనాలను సందర్శించ లేదు. ఇప్పుడు అతిక్రమణలు ఉన్నాయంటూ కూల్చివేతలకు సిద్ధమయ్యారు. సుదీర్ఘ కాలం తరువాత కూల్చివేతల కోసం నోటీసులు జారీ చేశారు' అని న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నారు.

నిబంధనలకు అనుగుణంగానే నిర్మాణాలు

భవన నిర్మాణాల్లో ఎలాంటి అతిక్రమణలు లేవని, చట్ట నిబంధనలకు అనుగుణంగానే నిర్మాణాలు చేపట్టామన్న వైఎస్సార్ సీపీ తరఫు సీనియర్ న్యాయవాది పొన్నెల్లుగారి వీరారెడ్డి వాదనను న్యాయమూర్తి పరిగణలోకి తీసుకున్నారు. చట్ట ప్రకారం పెనాల్టీ విధించి నిర్మాణాలను క్రమబద్ధీకరించే అధికారం కమిషనర్లకు ఉందన్న వాదనను కూడా పరిగణలోకి తీసుకున్నారు. భవనాల కూల్చివేత వల్ల ప్రభుత్వానికి వచ్చే లాభం ఏమీ లేదని, తమకు మాత్రం ఆర్థికంగా తీవ్ర నష్టం కలుగుతుందని, అధికారులు ప్రస్తావించిన అతిక్రమణలు సైతం సరిచేసేందుకు అవకాశం ఉన్నవేనన్న వాదనను కూడా న్యాయమూర్తి తన తీర్పులో ప్రస్తావించారు.

రాష్ట్రాభివృద్ధి కోసం హరిప్రసాద్ కృషి చేస్తారు

ఉప ముఖ్యమంత్రి పవన్ ఆకాంక్ష



సాక్షి, అమరావతి: శాసన మండలి సభ్యుడిగా అవకాశం కల్పించినందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు పి.హరిప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం పవన్ కళ్యాణ్‌ని కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. పవన్ మాట్లాడుతూ జనసేనకు హరిప్రసాద్ అందించిన సేవలు విలువైనవి, నిస్వార్థమైనవన్నారు. అంకితభావంతో పార్టీ కోసం పనిచేశారని కొనియాడారు. మండలిలో ప్రజా సమస్యలు, రాష్ట్రాభివృద్ధి కోసం బలంగా చర్చించే అవగాహన హరిప్రసాద్‌కు ఉందని, ఆయన మాట్లాడేటప్పుడు భాషలో కంటే భావంలో వాడి వేడి చూపే నైపుణ్యం కచ్చితంగా ప్రజా ప్రయోజనకరమైన చర్చలకు అవకాశమిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

సంస్కృతిలో సూర్యారాధన ఓ భాగం

విజ్ఞానాభివృద్ధికీ, సుఖ సంతోషాలకు, క్షేమానికీ ప్రత్యక్ష భగవానుడైన శ్రీ సూర్య భగవానుడిని ఆరాధించడం భారతీయ సంస్కృతిలో భాగమని పవన్ పేర్కొన్నారు. వారాహి ఏకాదశ దిన దీక్షలో భాగంగా మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదిత్య యంత్రం ఎదుట ఆశీనులై వేద పండితులు మంత్రోచ్చారణల నడుమ ప్రత్యక్ష భగవానుడిని ఆరాధించి గురువారం పూజాదికాలు నిర్వహించారు. నిత్యం సూర్య నమస్కారాలు చేసే పవన్ కొంతకాలంగా వెన్ను సంబంధిత ఇబ్బందితో చేయడం సాధ్యం కావడం లేదని అందుకు ప్రతిగా సూర్య నమస్కారాలకు సంబంధించి మంత్రసహిత ఆరాధనను నిర్వర్తిస్తున్నట్లు జనసేన ఒక ప్రకటన విడుదల చేసింది.

ఆదుకోండి

▶ మొదటి పేజీ తరువాయి



కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో సీఎం చంద్రబాబు

శివరాజ్‌సింగ్ చౌహాన్, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగరియా, గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి, విద్యుత్తు శాఖల మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌లతో సీఎం చంద్రబాబు వేర్వేరుగా సమావేశమయ్యారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, సహాయ మంత్రి పెమ్మసాని, టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయులు ఆయన వెంట ఉన్నారు. గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రాన్ని నెలకొల్పేందుకు రూ.385 కోట్లు విడుదల చేయాలని, రాష్ట్రంలో ఐపీఎస్‌ల సంఖ్యను 79 నుంచి 117కు పెంచాలని అమిత్‌షాను కోరారు. అమరావతి చుట్టూ ఔటర్ రింగు రోడ్ ప్రాజెక్టు మంజూరు చేయాలని, హైదరాబాద్-విజయవాడ - అమరావతి వరకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే అభివృద్ధి చేయాలని, కుప్పం-హోసూర్-బెంగళూరు నుంచి నాలుగు లేన్ల గ్రీన్ ఫీల్డ్ హైవే, విశాఖ-మూలపేట నుంచి 4 లేన్ గ్రీన్‌ఫీల్డ్ కోస్టల్ హైవే ఏర్పాటుకు సహకరించాలని నితిన్ గడ్కరీకి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో నాలుగు పారిశ్రామిక నోడ్‌లను గుర్తించి విద్యుత్తు, రైల్వే రోడ్డు కనెక్టివిటీ సదుపాయాలకు గ్రాంట్ రూపంలో ఆర్థిక సాయం చేయాలని పీయూష్ గోయల్‌ను కోరారు. ఆక్వా పార్క్ మంజూరు చేయాలని, హార్టికల్చర్ రైతులకు సబ్సిడీ పెంచేందుకు విధానాన్ని రూపొందించాలని, పీఎండీఎంపీ పథకం కింద రూ.125.52 కోట్ల కేంద్ర వాటాను విడుదల చేయాలని శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కోరారు. కర్నూలు నుంచి వైజాగ్ వరకు హెచ్‌వీడీసీ ఐఎస్‌టీఎస్ లైన్ ఆమోద ప్రక్రియను వేగవంతం చేయాలని, వైజాగ్-కాకినాడ గ్రీన్ హైడ్రోజన్ తయారీ కేంద్రంగా ప్రకటించాలని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

విజయవాడ తూర్పు బైపాస్‌కు టెండర్లు

విజయవాడ తూర్పు బైపాస్‌కు త్వరలో టెండర్లు పిలవనున్నట్లు ఎంపీ కేశినేని చిన్ని తెలిపారు. విజయవాడ తూర్పు బైపాస్ రోడ్డు, అవుటర్ రింగ్ రోడ్డు, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నుంచి నిడమానూరు వరకు ఫ్లైఓవర్ ఏర్పాటుకు నితిన్ గడ్కరీ పచ్చజెండా ఊపినట్లు వెల్లడించారు. విజయవాడ వెస్ట్రన్ బైపాస్‌పై కూడా సమీక్ష జరిగిందని, ఈ పనులు మరో ఆరు నెలల్లో పూర్తి కానున్నట్లు చెప్పారు.

- సీఎం చంద్రబాబు శుక్రవారం ఉదయం నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యంను కలుసుకుంటారు. అనంతరం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఆరోగ్య, సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌లతో భేటీ కానున్నారు.

ఈవీఎంల ట్యాంపరింగ్‌కు చాన్స్

- 10% ఈవీఎంలను మారిస్తే ఫలితాలు తారుమారు
- ఏపీలో ఐదేళ్లకోసారి ప్రభుత్వ మార్పు..
- 'రియల్' పెట్టుబడులకు అమరావతి కంటే హైదరాబాద్, బెంగళూరు బెటర్
- ఢిల్లీలో మీడియాతో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు



సాక్షి, న్యూఢిల్లీ: ఈవీఎంల ట్యాంపరింగ్‌పై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో ఈవీఎంల ట్యాంపరింగ్‌కు అవకాశాలు ఉన్నాయని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో వాటి ట్యాంపరింగ్ జరుగుతోందని వ్యాఖ్యానించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా గురువారం ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాతో సమావేశమైన అనంతరం మీడియా సమావేశం నిర్వహించారు. '2009లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ట్యాంపరింగ్ జరుగుతోందని ప్రశ్నించిందే టీడీపీ (అప్పుడు నేను ఆ పార్టీలోనే ఉన్నా). ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషనల్ క్లబ్ ఆఫ్ ఇండియాలో దీనిపై సెమినార్ నిర్వహించి అవగాహన కల్పించాం. అప్పట్లో ఈవీఎంల ట్యాంపరింగ్‌కు సంబంధించి అరెస్టులు కూడా జరిగాయి' అని చెప్పారు. 'ఎన్నికలకు ముందురోజు ప్రతి నియోజకవర్గానికి ఈవీఎంలను తీసుకొచ్చి పంపిణీ కేంద్రంలో ఉంచుతారు. పోలింగ్‌కు అవసరమైన ఈవీఎంల కంటే 15 శాతం ఈవీఎలను ఎక్కువగా కేటాయిస్తారు. ఎన్నికల రోజు ఎక్కడైనా ఈవీఎంలు మొరాయిస్తే వీటిని వాడుకుంటారు. పోలింగ్ ముగిశాక ఈవీఎంలన్నీ తొలుత డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కే వస్తాయి. అక్కడే రాత్రంతా ఉంచుతారు. ఆ రాత్రి ఈవీఎంలను అటూ ఇటూ మార్చేలా ఏదైనా జరగొచ్చు. పోలింగ్ ముగిసిన మర్నాడు ఈవీఎంలు స్ట్రాంగ్ రూమ్‌కు వెళ్తున్నాయి' అని రేవంత్ పేర్కొన్నారు.

ఫ్రీక్వెన్సీని బట్టి ట్యాంపరింగ్

'ఈవీఎంల ట్యాంపరింగ్‌ను ఎక్కడో కూర్చుని చేశారా.. లేక చిప్‌లలోకి ఏదైనా ఫ్రీక్వెన్సీని పంపారా అనేది మనం చెప్పలేము. చిప్‌లోకి లోఫ్రీక్వెన్సీ అయితే ఒకలాగా, హైఫ్రీక్వెన్సీ అయితే మరోలాగా ఈవీఎంలను ఆపరేట్ చేయొచ్చు. కంపెనీ తయారు చేసే ప్రోగ్రామ్‌ని బట్టే ఈవీఎం పని చేస్తుంది. ప్రోగ్రాం రీరైట్ చేయాలంటే మిషన్ చేతికి రావాల్సి ఉంటుంది. అయితే సిగ్నల్ ద్వారా ట్యాంపరింగ్ చేస్తున్నారా లేదా అనేది నాకు తెలియదు. ఫ్రీక్వెన్సీ ఉంటే ఒకలా, లేకపోతే ఇంకోలా దేనికి దానికే ట్యాంపరింగ్ చేసే అవకాశం ఉంటుంది. గెలుపోటముల కోసం 100 శాతం మెషీన్లను ట్యాంపరింగ్ చేయాల్సిన అవసరం లేదు. జనరల్‌గా 10 శాతం ట్యాంపరింగ్ చేసే అవకాశం ఉండొచ్చు. అంటే 10 వేల ఓట్ల వ్యవధిలోనే గెలుపోటములను డిసైడ్ చేయొచ్చు కదా' అని రేవంత్ చెప్పారు.

ఏపీలో ఐదేళ్లకు ప్రభుత్వం మార్పు

ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణలో పదేళ్లకు ఒకమారు, ఆంధ్రప్రదేశ్‌లో ఐదేళ్లకు ఒకసారి ప్రభుత్వాలు మారే ట్రెండ్ కొనసాగుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఐదేళ్లకు ప్రభుత్వం మారుతుందన్నారు. ఏపీ రాజధాని అమరావతి హైదరాబాద్‌కు ఎంతమాత్రం పోటీ కాదన్నారు. అమరావతిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కంటే హైదరాబాద్ శివారు ప్రాంతాలు, వరంగల్ లేదా బెంగళూరు, చెన్నైలలోనూ పెట్టుబడి పెట్టడం మంచిదని సలహా ఇచ్చారు.

పట్టణాల్లో వసతులు మెరుగుపరుస్తాం

పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అన్ని పట్టణాభివృద్ధి సంస్థ (యూడీఏ)ల పరిధిలో మౌలిక వసతులను మెరుగు పరుస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఆయన గురువారం సచివాలయంలో 20 పట్టణాభివృద్ధి సంస్థల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. సీఆర్డీఏ సహా రాష్ట్రంలోని 20 యూడీఏల పరిధిలో వేసిన లే అవుట్లలో విద్యుత్తు, రోడ్లు, తాగు నీరు, పార్కులు, మురుగు నీటి పారుదల వ్యవస్థ ఏర్పాటు చేయడం యూడీఏలో ప్రధాన లక్ష్యమన్నారు. నెల్లూరు, కడప లేఅవుట్లలో అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదులు అందాయని, వాటిపై విచారణకు కమిటీని వేశామన్నారు. ఆ కమిటీ నివేదిక వచ్చాక బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. గతంలో తణుకు మున్సిపాలిటీలో టీడీఆర్ బాండ్ల జారీలో అవకతవకలు జరిగాయని చెప్పారు. దీనిపైనా విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. నిలిచిపోయిన ఎంఐజీ, టిడ్కో గృహాల నిర్మాణాన్ని కూడా ప్రారంభిస్తామని తెలిపారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో ప్రతి ఇంటికీ 24 గంటలు తాగు నీరందించడానికి ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ ద్వారా రూ.5,300 కోట్లు కేటాయించామని, ఈ నిధుల్లో గత ప్రభుత్వం రూ.240 కోట్లే వెచ్చించిందన్నారు. మిగిలిన నిధుల వినియోగానికి కాల పరిమితిని పెంచాలని ఆ బ్యాంకుకు లేఖ రాసినట్లు చెప్పారు. 2023–24లో వచ్చిన రూ.1100 కోట్లను కూడా దారి మళ్లించిందన్నారు. ఈ సమావేశంలో డీటీసీపీ విద్యుల్లత, పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ చీఫ్ ఆనందరావు పాల్గొన్నారు.

ఇంటింటికీ రేషన్ పంపిణీ మూర్ఖపు నిర్ణయం

- ఎండీయూ వాహనాలతో పౌరసరఫరాల సంస్థకు నష్టం
- 2027 వరకు కాంట్రాక్టు ఇవ్వడం వల్ల రూ.1500 కోట్లు భారం
- రేషన్ డోర్ డెలివరీపై త్వరలో అందరితో చర్చించి నిర్ణయం
- మంత్రి నాదెండ్ల మనోహర్



సాక్షి, అమరావతి: ఇంటింటికీ రేషన్ పంపిణీ మూర్ఖపు నిర్ణయమని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసే మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ల (ఎండీయూ) వల్ల పౌర సరఫరాల సంస్థకు తీవ్ర నష్టం కలుగుతోందన్నారు. రేషన్ మాఫియాలో ఎండీయూలదే కీలక పాత్ర అని విమర్శించారు. ఆయన గురువారం విజయవాడలోని పౌర సరఫరాల సంస్థ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. పౌర సరఫరాల సంస్థకు రూ.1,500 కోట్లు నష్టం కలిగేలా 9,260 ఎండీయూ వాహనాలు కొన్నారని, ప్రతి నెలా ఒక్కో వాహనానికి రూ.27 వేలు వెచ్చిస్తున్నామని, ఇంత కన్నా అన్యాయం ఉండదని చెప్పారు. 2027 వరకు వీటితో కాంట్రాక్టు కుదుర్చుకొని కార్పొరేషన్‌కు నష్టం కలిగించేలా మూర్ఖమైన నిర్ణయం తీసుకున్నారన్నారు. రేషన్ డోర్ డెలివరీపై త్వరలో స్టేక్ హోల్డర్లతో విస్తృతంగా చర్చించి, నివేదిక రూపొందిస్తామని, కేబినెట్‌లోనూ చర్చిస్తామని చెప్పారు. పౌర సరఫరాల సంస్థను రూ.36,300 కోట్ల అప్పుల పాలు చేశారన్నారు. రూ. 2 వేల కోట్ల బకాయిలు బ్యాంక్ ఆఫ్ బరోడాకి ఇటీవలే చెల్లించామన్నారు. వచ్చే మార్చి 31 నాటికి మరో రూ.10 వేల కోట్లు బకాయిలు తగ్గించుకునే ప్రయత్నిస్తామని తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేసే బియ్యం, నిత్యావసర సరుకులు కచ్చితంగా నాణ్యమైనవే అందిస్తామని చెప్పారు. బియ్యం స్థానంలో నగదు పంపిణీపై విలేకరులు ప్రశ్నించగా.. ప్రభుత్వంలో అనేక ఆలోచనలు ఉన్నాయని, కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ సూచనలతో ఉమ్మడి ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. ఆ ప్రణాళికలను అనుసరించి ప్రజా పంపిణీ వ్యవస్థలో మరిన్ని మార్పులు తీసుకువస్తామని తెలిపారు. రబీ ధాన్యం సేకరణకు రైతులకు రూ.1,600 కోట్లు చెల్లించాల్సి ఉండగా ముఖ్యమంత్రి ఆదేశాలతో 50 వేల మంది రైతులకు రూ.1,000 కోట్లు విడుదల చేశామన్నారు. మిగిలిన రైతులకు త్వరలోనే చెల్లిస్తామని తెలిపారు.

గత ప్రభుత్వ హయాంలో బియ్యం అక్రమ రవాణా జరిగిందని, కాకినాడ పోర్టును అడ్డాగా మార్చుకొని ఓ మాజీ ఎమ్మెల్యే కుటుంబం భారీ అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మాజీ ఎమ్మెల్యే కుటుంబం బియ్యం మాఫియాను పెంచి పోషించిందన్నారు. వారం రోజుల్లో రూ. రూ.159 కోట్లు విలువైన 35,404 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీజ్ చేశామని చెప్పారు. పీడీఎస్ వ్యవస్థ ప్రక్షాళన జరిగే వరకు తనిఖీలు చేస్తూనే ఉంటామన్నారు.

తండ్రి లేని బిడ్డలకు వారి ఆస్తిని వారికివ్వండి. పరిశుద్ధమైన, ధర్మసమ్మతమైన వస్తువులకు బదులు అపవిత్రమైన, అధర్మమైన వస్తువులను తీసుకోకండి. మీ సొమ్ములతో పాటు వారి సొమ్మును కూడా కలగాపులగం చేసి స్వాహా చేయకండి. ముమ్మాటికీ ఇది మహా పాతకమే.

– ఇస్లాం ధర్మం

ఫోకస్

సాక్షి

శుక్రవారం, 5 జూలై 2024

రచ్చ కాదు... చర్చ కావాలి!

కొత్త సభ కొలువు తీరిందన్న మాటే కానీ, పార్లమెంట్‌లో పాత దృశ్యాలే పునరావృతమయ్యాయి. 18వ లోక్‌సభ ఏర్పడ్డాక జరిగిన తొలి పార్లమెంట్ సమావేశాలు సభ్యుల ప్రమాణ స్వీకారం, రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానానికే పరిమితమయ్యాయి. కానీ, నేతలెవరు మాట్లాడుతున్నా... వెనుక నుంచి అవే అరుపులు, గందరగోళ పరిస్థితులు, రన్నింగ్ కామెంటరీలు, సభాపతితో వాగ్వాదాలు, చివరకు వాకౌట్లు తప్పలేదు. సర్వసాధారణంగా ఏకగ్రీవం గానో, లేదంటే అధికార – ప్రతిపక్షాల మధ్య పోటీతోనో జరగాల్సిన లోక్‌సభ స్పీకర్ ఎన్నిక సంప్రదాయానికి భిన్నంగా ఈసారి మూజువాణి ఓటుతో సాగింది. ఇక, ప్రతిపక్షాలకు కేటాయించాల్సిన లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ పదవిని తద్భిన్నంగా గత అయిదేళ్ళుగా ఖాళీగా అట్టిపెట్టేసిన అధికార బీజేపీ, ఈసారి కూడా ఆ పదవిని వారికి వదిలిపెట్టే పెద్దమనసు చేస్తున్నట్టు లేదు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వ సారథిగా తన మిత్రపక్షాలకు ఆ పదవిని కట్టబెట్టాలని బీజేపీ చూస్తున్నట్టు వస్తున్న కథనాలే అందుకు నిదర్శనం. ఇక, సభానాయకుడికీ, ప్రతిపక్ష నేతకూ మధ్య పొసగని పరిస్థితి సరేసరి. వెరసి లోక్‌సభలో మంగళవారం, రాజ్యసభలో బుధవారం ముగిసిన తొలి సమావేశాలు అసంతృప్తినే మిగిల్చాయి.

ఈ పాపంలో అధికార, ప్రతిపక్షాలు రెంటికీ సమాన భాగస్వామ్యం ఉంది. కొద్ది నెలలుగా పూర్తి స్థాయి ఎన్నికల ప్రచారంలో మునిగితేలిన పార్టీలు ఇప్పటికీ ఆ మానసిక స్థితి నుంచి బయట పడినట్టు లేవు. ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా పార్లమెంట్ సాక్షిగా ఇరుపక్షాలూ పరస్పరం ఎన్నికల ప్రచార తరహా ఆరోపణల పర్వం కొనసాగించడం దురదృష్టం. ప్రతిపక్ష నాయకుడిగా తొలిసారిగా బాధ్యతలు చేపట్టిన రాహుల్ గాంధీ తన ప్రథమ ప్రసంగంలోనే ప్రభుత్వంపై నిశిత విమర్శలతో దూకుడు ప్రదర్శించారు. ఇతర ప్రతిపక్ష నేతలు సైతం శక్తిమంతమైన ప్రసంగాలే చేశారు. కాబట్టి వారికి తగినంత సమయం ఇవ్వలేదన్న ప్రసక్తే లేదు. రాహుల్ ఉద్వేగభరితంగా మాట్లాడుతూ మార్కులు సంపాదించినా, సరైన గణాంకాలతో సమస్యల్ని నిర్దిష్టంగా ప్రస్తావించలేకపోయారు. అగ్నివీర్ లాంటి అంశాల్లో ఆయన లెక్కలు తప్పు చెప్పారు. మరోపక్క ప్రధాని లోక్‌సభలో మాట్లాడుతున్నంత సేపూ ప్రతిపక్షాలు నినాదాలు హోరెత్తించాయే తప్ప, హుందాతనం పాటించలేదు. రాహుల్ సైతం సభలో సభ్యుల్ని రెచ్చిపొమ్మన్నట్టు ప్రేరేపించడం సైతం ఏ మాత్రం సమర్థనీయం కాదు.

రాహుల్‌ది పిల్లతనం, కాంగ్రెస్ పరాన్నజీవి లాంటి రాజకీయ విమర్శలు గుప్పించిన మోదీ కూడా తక్కువేమీ తినలేదు. ఎంతసేపటికీ పాత ఎమర్జెన్సీ గాయాన్ని గుర్తు చేసి, కాంగ్రెస్‌ను తప్పు బట్టడానికి ప్రయత్నించారు. లేదంటే గడచిన తమ పదేళ్ళ ప్రస్థానాన్ని గుణగాన సంకీర్తన చేశారు. అంతేతప్ప లోక్‌సభలో చేసిన రెండున్నర గంటల సుదీర్ఘ ప్రసంగంలో ప్రతిపక్షాలు ప్రస్తావించిన, దేశాన్ని పీడిస్తున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కార్యాచరణ ఏమిటన్నది మాత్రం చెప్పలేదు. చెప్పాలనుకోలేదు. సంక్షుభిత మణిపుర్‌లో ఏడాదిగా ఒక్కసారైన పర్యటించని మోదీ సదరు ఈశాన్య రాష్ట్రంలో పరిస్థితులు మెరుగుపడ్డాయంటూ రాజ్యసభలో అసత్యాలాపన చేయడం మరీ విడ్డూరం. ఒక్కమాటలో... ఈసారి సొంత మెజారిటీ తగ్గి, కూటమి ప్రభుత్వం నడుపుతున్న మోదీ ఇప్పటికీ గత రెండుసార్లు తిరుగులేని మెజారిటీతో సాగిన బీజేపీ ప్రభుత్వ ఆధిపత్య ధోరణినే ప్రదర్శిస్తున్నారు. ప్రభుత్వ పెద్దగా, అనుభవజ్ఞుడిగా ప్రతిపక్షాలను సైతం కలుపుకొని పోవాలన్న ఆలోచన చేయట్లేదు. పట్టువిడుపులు చూపట్లేదు. దాంతో ఇరుపక్షాలకూ మధ్య రాజీ కుదిరేలా కనిపించట్లేదు.

అందరూ కలిసి నాటకీయ చర్యలు, వ్యాఖ్యలతో పార్లమెంట్‌ను (రణ) రంగస్థలిగా మార్చేశారన్నది చేదు నిజం. అధికార, ప్రతిపక్ష నేతలు అంశాల వారీగా చర్చిస్తే, విభేదిస్తే ఫరవాలేదు కానీ, నిత్యం ఉప్పు నిప్పుగా ఉంటే పార్లమెంట్ నడిచేదెట్లా? మళ్ళీ జనం ముందుకు వెళ్ళడానికి మరో అయిదేళ్ళుండగా, రేపే ఎన్నికలన్నట్టు రాజకీయ విమర్శల్లో మునిగితేలితే లాభమేంటి? నీట్ పరీక్ష, నిరుద్యోగం, ఈ అయిదేళ్ళలో సాగాల్సిన నియోజక వర్గ పునర్విభజన, ఇప్పటికే చాలా ఆలస్యమైపోయిన జనగణన లాంటి అనేక తక్షణ, దీర్ఘకాలిక అంశాలు చర్చకు మిగిలే ఉన్నాయి. అలాంటి వాటిపై దృష్టి పెట్టాలి. కీలకమైన బిల్లుల ఆమోదానికి లోక్‌సభలో టీడీపీ, జేడీయూల పైన, రాజ్యసభలో బిజూ జనతాదళ్ సైతం దూరమైనందున ఇతరులపైన ఆధారపడాల్సిన మోదీ 3.0 ఆభిజాత్యం వదులుకోకపోతే కష్టం. ఘర్షణ, విద్వేషం మరింత పెరిగిపోవడాని కన్నా ముందే నేతలు ఆత్మపరిశీలన చేసుకోవాలి. దేశ శ్రేయస్సు కోసం హుందా చర్చకు తెర తీయాలి.

బడ్జెట్ కోసం జూలై మూడో వారంలో పార్లమెంట్ తిరిగి సమావేశం కానుంది. అప్పుడైనా అధికార, ప్రతిపక్షాలు తమ వైఖరి మార్చుకోవాలి. ఇరుపక్షాలూ విజ్ఞతతో వ్యవహరించాలి. ప్రతిపక్ష వాదనకు చెవి ఒగ్గాల్సిన బాధ్యత పాలకులకు తప్పనిసరిగా ఉంది. అదే సమయంలో– ప్రజలిచ్చిన మెజారిటీతో గద్దెనెక్కి, చెప్పే అధికారం చేజిక్కించుకున్న పాలకుల మాటలను ప్రతిపక్షాలూ సావధానంగా విని తీరాలి. ఎవరు ఎవరిని మాట్లాడనివ్వబోమన్నా, వినిపించుకోబోమన్నా అది ప్రజాస్వామ్యం కాదు. ప్రజాక్షేమానికి అసలు పనికిరాదు. అనేక అంశాలపై పరస్పర భిన్నమైన అభిప్రాయాలు సహజంగానే ఉంటాయి. కానీ పార్లమెంట్‌లో జరగాల్సింది అర్థవంతమైన చర్చే తప్ప అనవసర రాద్ధాంతం కాదు. ప్రజాస్వామ్య దేవాలయంగా, అత్యున్నత నిర్ణాయక వేదికగా పార్లమెంట్‌కు ఉన్న ప్రతిష్ఠకు భంగం కలిగేలా ప్రవర్తిస్తే అది అందరికీ నష్టం. గత పదేళ్ళుగా చట్టసభల్లో అంతకంతకూ పెరిగిపోతున్న ఇలాంటి ప్రవర్తన ఇలాగే కొనసాగితే, మొదటికే మోసం వస్తుంది. ప్రజాసమస్యలపై చర్చించాల్సిన చట్టసభల సమావేశాలకు ప్రయోజనం లేకుండా పోతుంది.

మహా కూటమిలో 'ముఖ్య' విభేదాలు

విశ్లేషణ



రోహిత్ చందావర్కర్

ముఖ్యమంత్రి అభ్యర్థి, సీట్ల పంపకం అంశాల్లో మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ)లో విభేదాలు కనిపిస్తున్నాయి. రానున్న మహారాష్ట్ర శాసన సభ ఎన్నికల్లో ఎన్సీపీ, శివసేన–ఉద్ధవ్ గ్రూపు, కాంగ్రెస్ ఉమ్మడిగా పోటీ చేస్తున్నాయి. వీటి మధ్య విస్తృత అవగాహన ఏమిటంటే, మొత్తం 288 స్థానాలకు గానూ తలా 95 స్థానాల్లో పోటీ చేయాలనేది! కానీ ఉద్ధవ్ పార్టీ 150 సీట్లలో వాస్తవ పరిస్థితిని అంచనా వేస్తున్నట్టుగా తెలుస్తోంది. ఇక, ఎంవీఏ ముఖ్యమంత్రి ముఖం ఉద్ధవ్ అని ఆయన గ్రూపు ప్రతినిధి వ్యాఖ్యానించడమూ, అలాంటి ముఖం ఏదీ లేదని శరద్ పవార్ అనడమూ, మరోవైపు కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలేను ముఖ్యమంత్రి ముఖంగా చెబుతూ పోస్టర్లు వెలియడమూ కూటమి మధ్య జరగనున్న ఘర్షణను సంకేతిస్తున్నాయి.

ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) సభ్యులు సాధించిన అధిక ఓట్ల శాతం, మహారాష్ట్రలో ప్రతిపక్షాల చేతిలో తుపాకి గుండులా పనిచేసింది. అది వారికి ఎంత విశ్వాసాన్ని కలిగించిందంటే, కాబోయే ముఖ్యమంత్రి ఎవరు అనే అంశం గురించి, రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో పోటీ గురించి అనేక అంశాలపై పరస్పరం వివాదాలకు దిగుతూ కనిపిస్తున్నారు. ఎంవీఏ భాగస్వాములు ఇటీవల ముంబైలో మీడియా ముందు ఐక్యతా ముఖాన్ని ప్రదర్శించి ఉండవచ్చు; కానీ కొంతమంది నాయకులు ఇప్పుడు ముంబై వంటి ముఖ్య నగరాల్లోని కీలక నియోజకవర్గాలపై కూటమి అభ్యర్థుల మధ్య విభేదాలు ఎలా ఉన్నాయో వివరిస్తున్నారు.



నానా పటోలే, ఉద్ధవ్ ఠాకరే, శరద్ పవార్

'ముఖ్యమంత్రి ముఖం' ఎవరు?

విధాన్ భవన్‌లో ఈ మంగళవారం కూటమిలో పగుళ్లు స్పష్టంగా కనిపించాయి. అక్కడ ఉద్ధవ్ ఠాకరేకు చెందిన శివసేన పార్టీ, ఆకస్మికంగా పార్టీ కార్యదర్శి మిలింద్ నార్వేకర్‌ను జూలై 12 నాటి ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్ దాఖలు చేయమని కోరింది. అసెంబ్లీలో బలాబలాల ప్రకారం చూస్తే మహా వికాస్ అఘాడీకి కేవలం రెండు సీట్ల కోటా మాత్రమే ఉంది. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) వ్యవస్థాపకుడు శరద్ పవార్ ఈ కోటాలో ఒక సీటును 'పీజెంట్స్ అండ్ వర్కర్స్ పార్టీ (పీడబ్ల్యూపీ)కి ఇవ్వాలని అనుకున్నారు. అయితే, ఉద్ధవ్ 12వ తేదీన పోటీని అనివార్యం చేస్తూ తన సొంత అభ్యర్థి ఎంపికతో ముందుకు సాగారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కూడా పశ్చిమ మహారాష్ట్రలోని సాంగ్లీ నియోజక వర్గంలో ఉద్ధవ్ తన పార్టీ పోటీ చేస్తుందని పట్టుబట్టారు. ఆ ఎన్నికల్లో ఓడిపోయిన మల్లయోధుడు చంద్రహార్ పాటిల్‌కు ఉద్ధవ్ పార్టీ టిక్కెట్ ఇచ్చారు. కానీ అక్కడ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన కాంగ్రెస్ నేత విశాల్ పాటిల్ మంచి ఆధిక్యతతో గెలుపొందారు.

రాష్ట్రంలోని 150కి పైగా నియోజకవర్గాల్లో వాస్తవ పరిస్థితిని అంచనా వేయాలని ఉద్ధవ్ కోరినట్లు శివసేన-ఉద్ధవ్ గ్రూపు అంతర్గత వర్గాలు చెబుతున్నాయి. ముంబయిలో జరిగిన కూటమి సమావేశంలో మహావికాస్ అఘాడిలోని మూడు భాగస్వాములు ఒక్కొక్కటీ 95 స్థానాల్లో పోటీ చేస్తాయని విస్తృత అవగాహన ఉన్నప్పటికీ, శివసేన–ఉద్ధవ్ గ్రూపు 150 నియోజకవర్గాల్లో ఎందుకు సర్వే చేస్తోందని చాలామంది ఆశ్చర్యపోతున్నారు. గత వారం శివసేన ఫైర్‌బ్రాండ్ అధికార ప్రతినిధి సంజయ్ రౌత్ రాబోయే అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఉద్ధవ్ ఠాకరే ముఖ్యమంత్రి పదవికి కూటమి తరఫు అభ్యర్థిగా ఉంటారని ప్రకటించారు. ఎన్సీపీ వ్యవస్థాపకుడు శరద్ పవార్ వెంటనే, తమ కూటమిలో సీఎం అభ్యర్థిని ముందుగానే నిర్ణయించబోమని స్పష్టతనిచ్చారు. ''మేము కూటమిలోని అన్ని భాగస్వామ్య పార్టీల ఉమ్మడి బలంతో ఎన్నికల్లో పోరాడతాం. మా అందరికీ ఉమ్మడి బాధ్యత ఉంది. ప్రస్తుతానికి సీఎం ముఖం అంటూ ఏమీ లేదు'' అని శరద్ పవార్ పుణెలో మీడియాతో అన్నారు. ఈ 'సీఎం ఫేస్' విషయంపై భిన్నాభిప్రాయాలు చాలా స్పష్టంగా కనిపించాయి. అయితే శరద్ పవార్ కూటమిలో విభేదాలు లేవని చెప్పడమే కాకుండా, ప్రతి విషయంపైనా కూటమి భాగస్వాముల మధ్య సమన్వయం ఉందని అన్నారు.

ఎవరు ఎక్కడ?

అలాగే కాంగ్రెస్ పార్టీ, శివసేన– ఉద్ధవ్ ఠాకరే గ్రూపు మధ్య కూడా కొన్ని విభేదాలు ఉన్నాయి. ఇవి ప్రధానంగా ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్) లేదా ఎంఎంఆర్ లోని నియోజకవర్గాలకు సంబంధించినవి. ముంబై ఎంఎంఆర్ ప్రాంతంలో తమ ఉనికిని నిలుపుకోవాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తుండగా, ఉద్ధవ్ ఇప్పుడు తనకు గరిష్ఠంగా ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ సీట్లు కావాలని పట్టుబట్టారు. ముంబై నార్త్ సెంట్రల్ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించారు. గతంలో పార్టీకి కంచుకోటగా ఉన్న నార్త్ సెంట్రల్, నార్త్ వెస్ట్‌లలో తమ స్థావరాన్ని నిలుపుకోవాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. కూటమి భాగస్వాముల మధ్య విస్తృత అవగాహన ఏమిటంటే, శివసేన–ఉద్ధవ్ గ్రూప్ కొంకణ్, థానే, మరాఠ్వాడా ప్రాంతంలో గరిష్ఠ స్థానాలు తీసుకోవాలి; కాంగ్రెస్ పార్టీ విదర్భ ప్రాంతంలో గరిష్ఠ స్థానాలు తీసుకోవాలి; ఇకపోతే, శరద్ పవార్ ఎన్సీపీ పశ్చిమ మహారాష్ట్రపై దృష్టి పెట్టాలి. కాంగ్రెస్ పార్టీ మహారాష్ట్ర అధ్యక్షుడు నానా పటోలేకు చెందిన విదర్భ ప్రాంతంలోని కొన్ని జిల్లాల్లో కాంగ్రెస్ ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించింది. అలాగే పశ్చిమ మహారాష్ట్రలోని పుణె, సాంగ్లీ జిల్లాల్లో కూడా పార్టీ క్షేత్రస్థాయి కార్యాచరణను మొదలుపెట్టింది.

లోక్‌సభ ఎన్నికల సమయంలో సాంగ్లీలో ఏమి జరిగిందో పునరావృతం కాకుండా పశ్చిమ మహారాష్ట్రలో కచ్చితమైన సీట్ల పంపకం గురించి తమ పార్టీ, శివసేన ఉద్ధవ్ ఠాకరే గ్రూపుతో తెర వెనుక కమ్యూనికేషన్‌ను ప్రారంభించిందని శరద్ పవార్–ఎన్సీపీ వర్గాలు చెబుతున్నాయి. కూటమిలోని మూడు భాగస్వామ్య పార్టీలూ కెమెరా ముందు పరస్పరం వ్యతిరేక వ్యాఖ్యలకు దూరంగా ఉన్నప్పటికీ, సీట్ల పంపకాల చర్చల కోసం కూర్చున్నప్పుడు కొంత ఘర్షణ జరిగే అవకాశం ఉందని లోపలి వ్యక్తులు అంటున్నారు. కూటమి వర్గాల అభిప్రాయం ప్రకారం, ఎన్నికల సమయంలో అనుసరించాల్సిన సాధారణ సూత్రం ఏమిటంటే, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి మెజారిటీని పొందినట్లయితే, అసెంబ్లీలో ఏ పార్టీ ఎక్కువ స్థానాలను గెలుచుకుంటుందో ఆ పార్టీ ముఖ్యమంత్రి స్థానాన్ని ఆశిస్తుంది. విదర్భలో కాంగ్రెస్ కార్యకర్తలు రాష్ట్ర అధ్యక్షుడు నానా పటోలేను తదుపరి ముఖ్యమంత్రిగా చిత్రీకరిస్తూ పోస్టర్లు వేశారు. కాబట్టి, 'కాబోయే ముఖ్యమంత్రి ముఖం' అనే సమస్య కూటమి భాగస్వాములలో కొన్ని చీలికలను, ఒత్తిడిని కలిగిస్తోందని స్పష్టంగా తెలుస్తోంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

('ద ఫ్రీ ప్రెస్ జర్నల్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సంతోషంలో భాగస్వాములు



ప్రపంచ కప్ గెలవగానే రోహిత్ శర్మ కన్నీళ్లతో తన భార్యను హత్తుకున్నాడు; విరాట్ కోహ్లీ దాన్ని ఉత్సవం చేసుకోవడానికి భార్యకు వీడియో కాల్ చేశాడు; జస్‌ప్రీత్ బుమ్రా సంతోషంతో భార్యను కౌగిలించుకున్నాడు... మౌలిక విషయాలకు విలువ ఇవ్వడం వారిని ఛాంపియన్లుగా మలుస్తోంది. కానీ ఇప్పుడు ఒక తరం వ్యవస్థాపకులు యువ ఆంత్రప్రెన్యూర్లకు పెళ్లనేది కలలకు ఆటంకం అని బోధిస్తున్నారు. పెళ్లి ఒక అందమైన ప్రయాణం. మీ రోల్ మోడల్స్‌ను జాగ్రత్తగా ఎంచుకోండి.

– రాజీవ్ తల్‌రేజా, బిజినెస్ కోచ్

పదవి ఎందుకో?



నిజం చెప్పాలంటే– బైడెన్, ట్రంప్ వయసులో ఉన్నవాళ్లు ఎందుకు అధ్యక్షుడు కావాలని కోరుకుంటారో నాకైతే అర్థం కాదు. నాకిప్పుడు 60 ఏళ్లు. కనీసం పై అంతస్థుకు పోవడానికి కూడా ఇష్టపడను.

– డేవిడ్ బడియేల్, రచయిత

మౌన బాధితులు



భారతీయ న్యాయ సంహితలోని 325వ సెక్షన్ ప్రకారం... ఒక జంతువును చంపడం, అవయవ ఛేదనకు ఐదేళ్ల జైలు, జరిమానా, లేదా రెండింటినీ విధించే అవకాశం ఉంది. కానీ జంతువులపై జరిగే లైంగిక దాడి విషయంలో ఎలాంటి ఏర్పాటూ లేదు. కాబట్టి మోదీజీ, అమిత్‌షాజీ... బీఎన్ఎస్‌ను సవరించి, దీన్ని నేరంగా చేర్చగలరు.

– వేదిక, నటి

అటవీ సేవ



కొండల్లో పడే వానలు అడవికి విస్తారమైన జలరాశిని అందిస్తాయి. అవి గడ్డి, అడవిలోని వృక్షజాలం వల్ల వడగట్టబడతాయి. తాజా నీటిని అందించడం అనేది అడవులు అందించే అత్యంత ప్రాధాన్యత కలిగిన పర్యావరణ సేవ.

– పర్వీన్ కాశ్వాన్, ఐఎఫ్ఎస్ అధికారి

స్థిరత్వమే సూత్రం



సెన్సెక్స్ మళ్లీ 80,000 మార్కును చేరింది. మార్కెట్లు పైకీ, కిందికీ మారుతున్నప్పుడు మనం ఏం చేయాలి? మీ సంపద కేటాయింపులు చూసుకోండి. మీకు 60:40 (ఈక్విటీ: రుణం) ఓకే అయ్యి, మార్కెట్ ఉన్నట్టుండి పెరగడం వల్ల అవి 70:30 అయితే, మీరు తిరిగి 60:40కి వెళ్లిపోండి. మార్కెట్లు పైకీ కిందికీ వెళ్తాయి, మీరు వెళ్లకూడదు.

– మోనికా హాలన్, బిజినెస్ స్పీకర్

తగ్గిస్తే మంచిది



మీ ఆరోగ్యం మెరుగుపడాలంటే – చక్కెర, మతం... ఈ రెండింటినీ బాగా తగ్గించండి. రెండూ ఎక్కువగా ప్రాసెస్ చేసినవి, పైగా వ్యసనాలు.

– తారా దేశ్‌పాండే, నటి

వృథా ఖర్చు వద్దు!



మూడు రకాల సినిమాలు ఉంటాయి. హై బడ్జెట్ సినిమాలు, లో బడ్జెట్ సినిమాలు, నో–వేస్ట్ (వృథా చేయని) సినిమాలు. నేను నో–వేస్ట్ ఫిలిం మేకర్‌ను.

– జేమ్స్ కామెరాన్, 'అవతార్' దర్శకుడు

ఏది వాస్తవ చరిత్ర?

జూన్ 27న 'వాస్తవ చరిత్రతోనే మెరుగైన భవిత' అని డా॥ కత్తి పద్మారావుగారు రాసిన వ్యాసంలో వ్యక్తం చేసిన అభిప్రాయానికి అభ్యంతరం లేదు. కాని వాస్తవ చరిత్ర ఏదన్నదే అసలైన చిక్కు. నాలుగు దశాబ్దాల నాడు వచ్చిన ఒక తెలుగు సినిమాలో రావుగోపాలరావు పాత్ర ద్వారా చెప్పించిన డైలాగ్ 'చరిత్ర అడక్కు... చెప్పింది విను' అనే దాన్ని ఆయన తన వ్యాసం ద్వారా మరోమారు చెప్పారు. డీ.డీ. కోశాంబి, రొమిల్లా థాపర్, బిపిన్ చంద్రలు చెప్పిందే చరిత్రగా అంగీకరించి తీరాలా! అంతకన్నా భిన్నమైన చరిత్ర ఉందని కొత్త పరిశోధన ద్వారా బయటకు తీసుకురాకూడదా?

ఒక సబ్జెక్టులో ఒకరి కన్నా ఎక్కువ మంది రాసిన పుస్తకాలు ఉంటాయి. వాటిలో దేనినైనా చదువుకోవచ్చు. కాని చరిత్రలో మాత్రం నియంతృత్వ పోకడగా రొమిల్లా, బిపిన్ చంద్రల పుస్తకాలు దాటి చదవటానికి వీలు లేదనడం సబబేనా? ఈ రచయితలు భారతీయ చరిత్రకు ఒక రంగు పులిమారు. ఆ రంగును పలుచన చెయ్యటాన్ని అంగీకరించం అంటారు వారి శిష్యులు. వివాదాస్పద కట్టడం కూల్చివేత చిన్న విషయం కాదన్నారాయన. ఆ కూల్చివేత వెనుక హిందూ రాజ్య నిర్మాణ భావన ఉందని తీర్మానించారు. అయితే జమ్మూ–కశ్మీర్, కాశీ, మధురల్లో దేవాలయాలు ధ్వంసమవ్వడం చారిత్రక వాస్తవమే కదా! ఆ ధ్వంసం వెనుకనున్న భావన ఏమిటో కూడా పిల్లలకు తెలియాలి కదా!

ఎన్.సి.ఇ.ఆర్.టి. వారి చరిత్ర పుస్తకాలలో మత ఘర్షణల గురించి చెప్పిన అధ్యాయంలో ఏమి రాశారో ఆయన చదివారా? అందులో గుజరాత్‌లో జరిగినవి, అయోధ్య నేపథ్యంలో జరిగినవి మాత్రమే ఉన్నాయి. నవీన భారత చరిత్రలో ఆ రెండు సందర్భాలలో తప్పించి మరెన్నడూ మత కల్లోలాలు జరగలేదన్నది యోగేంద్ర యాదవ్, సుహాస్ పల్శీకర్ వంటి రచయితలు భావిస్తుంటే అంతకన్నా హాస్యాస్పదం ఏదీ ఉండదు. కశ్మీరీ పండిట్ల ఊచకోత గురించి, ఇందిరాగాంధీ హత్య జరిగినప్పుడు సిక్కుల ఊచకోత గురించి కూడా వీరు ప్రస్తావించి ఉంటే అది వాస్తవ చరిత్ర అయి ఉండేది. కొన్నింటిని కప్పిపుచ్చి, మరికొన్నింటిని కొందరి రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా వివరంగా రాస్తామంటే అది వాస్తవ చరిత్ర కానేకాదు. రైతు ఉద్యమాల గురించి రాసినప్పుడు, 2018లో నాసిక్ నుండి ముంబైకి, ఆ తర్వాత పంజాబ్ నుండి ఢిల్లీకి జరిగిన రైతాంగ ఊరేగింపుల గురించే రాస్తామంటే ఎలా! ఆంధ్రాలో జరిగిన ఎన్జీ రంగా ఆధ్వర్యంలో పలాస నుండి చెన్నపట్నంకి జరిగిన రైతు యాత్ర గురించి రాయం అంటే ఎలా! 'దేశంలో లౌకికవాదం, రాజ్యాంగ స్ఫూర్తి పెరగనున్నాయి' అనడాన్ని అంతా స్వాగతించాల్సినదే. అయితే భారతీయులందరికీ వర్తించే లౌకిక చట్టాలు లేకుండా లౌకికవాదం ఎలా పెరుగుతుంది? అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 44 అమలు చెయ్యకుండా రాజ్యాంగ స్ఫూర్తి ఎలా వస్తుంది?

ఏ వర్గానికి చెందినవైనా చరిత్రలోని మంచి చెడులు చెబితేనే అది వాస్తవ చరిత్ర. ముఖ్యమైనవి, విద్యార్థులకు అంతగా అవసరం లేని అంశాలు పుస్తకాల నుండి తొలగించటం అన్ని సబ్జెక్టులలో జరుగుతుంది. చరిత్ర పుస్తకాల్లోనూ జరిగింది. విద్యార్థులకు మేలు చేసిన అంశం మీద అనవసరపు రాద్ధాంతం ఎందుకు?

డా॥ దుగ్గరాజు శ్రీనివాసరావు । 9440421695

సమ్మిళిత అభివృద్ధికి సహకార నమూనా!

'సమాజంలో ప్రతి ఒక్కరి కోసం మెరుగైన ప్రపంచాన్ని సహకార సంఘాలు నిర్మిస్తాయి...' ఇదీ ఈ ఏడాది అంతర్జాతీయ సహకార దినోత్సవ నినాదం! జూలై మొదటి శనివారం నాడు సహకార దినోత్సవం జరుపుకోవటం ఆనవాయితీ. ఈ జూలై 6న సహకార దినోత్సవ సంబురం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన కోట్లాది సహకారులు రకరకాల కార్యక్రమాల ద్వారా సరికొత్త ఆశలతో సహకార స్ఫూర్తిని మరోసారి చాటడానికి సమాయత్తమవుతున్నారు. మూడేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సహకార శాఖను ఏర్పాటు చేసి అనేక సంస్కరణలు చేపట్టిన తర్వాత మన దేశంలో సహకార వ్యవస్థలో కొత్త కదలిక మొదలైంది. అంతకుముందు నుంచే రాష్ట్రాల్లో ప్రత్యేకంగా సహకార శాఖలు ఉన్నప్పటికీ కేంద్రం స్థాయిలో వ్యవసాయ శాఖలో ఒక విభాగంగానే సహకార పాలన ఉంటూ వచ్చింది. అనాదిగా రైతులకు రుణాలు ఇచ్చే సొసైటీలుగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలు (పీఏసీఎస్‌లు) రైతుల ఆర్థిక సేవలకే పరిమితం కాకుండా ఇతర ప్రజల అవసరాలను కూడా తీర్చే వ్యాపార సంస్థగా ఉండాలని భావించి కేంద్ర సహకార శాఖ పీఏసీఎస్ లకు సరికొత్త బైలాస్‌ను నిర్దేశించటం ఒక కీలక పరిణామం. ఈ సేవలన్నీ పారదర్శకంగా అందించటం కోసం పీఏసీఎస్ లన్నిటినీ కంప్యూటరీకరించే పని జరుగుతోంది.



పీఏసీఎస్‌ల తర్వాత సంఖ్యాపరంగా పాడి రైతుల సొసైటీలు, మహిళా సహకార సంఘాలు (ఉదా: లిజ్జత్ పాపడ్‌ను ఉత్పత్తి చేసే మహిళా సొసైటీ), చేనేత కార్మికుల సొసైటీలు, మత్స్యకారుల సొసైటీలు, గృహనిర్మాణ సొసైటీలు, ఉద్యోగుల సొసైటీలు, ప్రత్యేకించి కార్మికుల సొసైటీలు (ఉదా: కేరళలో ప్రసిద్ధమైన ఉరులుంగల్ నిర్మాణ కార్మికుల సొసైటీ) సైతం గతంలోనే ఏర్పాటు కావటం మనకు తెలిసిందే. గుజరాత్‌లో ఏర్పడిన చిన్న పిల్లల పొదుపు సహకార సంఘం పెద్ద హిట్ అయ్యింది. ఆధునిక కాలానికి అనుగుణంగా సరికొత్త వర్గాలు విలక్షణమైన సహకార సంఘాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. అర్బన్ ప్రాంతాల్లో చిన్నపాటి ఎలక్ట్రానిక్ వస్తువులకు రిపేర్లు చేసే పనివారి సహకార సంఘం కూడా ఏర్పాటైంది. ఈ–కామర్స్ సంస్థల్లో వస్తువులు పంపిణీ చేసే గిగ్‌వర్కర్ల సహకార సంస్థలు సైతం ఏర్పాటవుతున్నాయి.

ఆయుర్దాయం పెరుగుతున్న కొద్దీ గ్రామాల్లో, పట్టణాల్లో వయోవృద్ధుల జనాభా పెరుగుతోంది. పిల్లలు చదువులు/ ఉద్యోగాలు/ వ్యాపారాల కోసం దేశ విదేశాలకు వెళ్లిపోవటంతో గ్రామాలు/ పట్టణాలు/ నగరాల్లో వృద్ధులే మిగిలిపోతున్నారు. కొందరు వృద్ధాశ్రమాల్లో చేరుతున్నా ఇళ్లు వదిలి వెళ్లలేక, అక్కడే ఉండలేక పండుటాకులు నానా అగచాట్లు పడుతున్నారు. వీరి ప్రత్యేక ఆహార, వైద్య, సామాజిక అవసరాలు తీర్చే ప్రత్యేక సహకార సంఘాలు ఇప్పటికే కేరళ వంటి రాష్ట్రాల్లో విశేష సేవలు అందిస్తున్నాయి. ప్రత్యేకంగా కమ్యూనిటీ కిచెన్లు ఏర్పాటు చేసుకొని ఉమ్మడిగా భోజన ఏర్పాట్లు చేసుకోవటం దగ్గరి నుంచి.. ప్రత్యేక ఆసుపత్రులు ఏర్పాటు చేసుకునే వరకు సభ్యులైన వృద్ధులకు అనేక సేవలు అందిస్తున్నాయి ఈ సొసైటీలు. తెలుగు రాష్ట్రాల్లోనూ వృద్ధుల సహకార సంఘాల అవసరం ఎంతో ఉంది.

గుజరాత్‌లో సహకార వ్యవస్థతో గట్టి సంబంధం ఉన్న అమిత్ షా కేంద్ర సహకార మంత్రిగా ఇటీవలే రెండోసారి బాధ్యతలు చేపట్టారు. సహకార వ్యాపారాన్ని దేశ విదేశాల్లో కొత్త పుంతలు తొక్కించాలన్నది తమ లక్ష్యమని మోదీ, అమిత్‌షా చెబుతున్నారు. సహకార రంగంలో ఢిల్లీ నుంచి తేదలచిన మార్పులన్నిటినీ క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సింది రాష్ట్ర సహకార శాఖలు. రాష్ట్రస్థాయిలో సహకార వ్యవస్థ చురుగ్గా పనిచేయాలంటే సలహా మండళ్లు కీలకం. వాటి జాడ లేకుండా పోయింది. సాచివేత ధోరణి, అవినీతి, మితిమీరిన రాజకీయ జోక్యం, జవాబుదారీతనం లోపించటం వంటి జాడ్యాలతో కునారిల్లుతున్న సహకార శాఖల్లో కొత్తగా సహకార స్ఫూర్తి వెల్లివిరియాలంటే రాష్ట్ర స్థాయిలోనూ సంస్కరణలు తేవాలి. అప్పుడే 'సహకార నమూనా' మేలైన సమ్మిళిత అభివృద్ధి మార్గంగా నిలుస్తుంది. వాతావరణ మార్పుల గడ్డు కాలంలో సహకార అభివృద్ధి నమూనా కొత్త ఆశలను రేకెత్తిస్తోంది.

– పంతంగి రాంబాబు । సీనియర్ జర్నలిస్ట్

(రేపు సహకార దినోత్సవ సంబురం)

అక్కర్లేని వెంపర్లాట

ప్రాచీన కాలాన్నీ, ప్రస్తుత కాలాన్నీ పోల్చి చూస్తే, ప్రజల జీవన శైలిలో కనబడే ఒక ముఖ్యమైన వ్యత్యాసం నిరాడంబరత. పాత కాలంలో పెద్దలు నిరాడంబరంగా జీవించమని బోధించేవాళ్ళు. శుకమహర్షి నాటి నుంచీ, రమణ మహర్షి నాటి వరకూ తక్కువ అవసరాలతో, వనరులతో జీవనం సాగించే యోగులనూ, త్యాగులనూ సామాజికులు ఎక్కువ గౌరవించేవాళ్ళు. బాహ్యమైన పటాటోపాలనూ, ఆర్భాటాలనూ, వాక్– ఆభరణ – వస్త్రాడంబరాలను వదిలేసి, అంతర్ముఖులై ఆత్మనిగ్రహంలో జీవించే వాళ్ళను ఆదర్శప్రాయులుగా భావించేవాళ్ళు.

క్రమంగా ఇది తలకిందులవుతున్నట్టు కనిపిస్తుంది. ఇరవయ్యొకటో శతాబ్దంలో ఎక్కడ చూసినా ఆడంబరాల వెంపర్లాటే!

జ్యోతిర్మయం

వాడుకకు పనికి రాని పాతిక లక్షల రూపాయల చేతి సంచీలు కొని ధరించేవాళ్ళు ఆదర్శం. సమయం సూచించని యాభై లక్షల రూపాయల చేతి గడియారం ధరించడం మహనీయతకు చిహ్నం. కోట్ల రూపాయలు విలువ చేసే కార్లలో తిరిగే వాళ్ళను మించిన ఘనులు, వ్యక్తిగతమైన పుష్పక విమానాలలో తిరిగే ఆచంట మల్లన్నలు. బిడ్డ వివాహం నాలుగయిదు దశలుగా చేసి పది వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయడం శ్రేష్ఠత్వానికి లక్షణం. ఎవరి పిచ్చి వారికి ఆనందమని సమర్థించవచ్చు కానీ, సామాన్య దృష్టికి ఇది కేవలం వెర్రితనంగా, ధనోన్మాదంగా కనిపిస్తుంది. ఈ ఆడంబర ప్రియత్వం మునుపు లేదని కూడా అనలేం. కానీ ఇటీవలి దశకాలలో ఇది మరింత వెర్రితలలు వేస్తున్నదనటం నిర్వివాదం. సమాజంలో కూడా ఈ 'అతి'ని గర్హించే ధోరణికంటే, ఎవరికి చేతయినంత వరకు వాళ్ళు ఈ ఆడంబరాలను అనుకరించడమే జీవిత లక్ష్యమని నమ్మే భావజాలం బలపడుతున్నట్టు కనిపిస్తుంది.

ఆడంబరాల మీద వ్యామోహం తీరని దాహం అని తెలిసీ దాని వెంట పరుగెత్తడం ఒక వ్యసనం లాంటిదే. దానివల్ల కలిగే కష్టనష్టాలు కూడా అందరూ ఎరిగినదే. ఎరిగి కూడా ఈ ఆడంబరాల మీది నుంచి దృష్టి మళ్ళించకపోతే ఇహపరాలలో ఉభయ భ్రష్టత్వం మిగులుతుందేమో శ్రద్ధగా తర్కించుకోవడం శ్రేయస్కరం.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీక్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు; జ్యేష్ఠ మాసం, తిథి: అమావాస్య తె.3.53 వరకు (తెల్లవారితే శనివారం), తదుపరి ఆషాఢ శుక్ల పాడ్యమి; నక్షత్రం: ఆరుద్ర తె.4.20 వరకు (తెల్లవారితే శనివారం); తదుపరి పునర్వసు; వర్జ్యం: ప.12.47 నుండి 2.24 వరకు ; దుర్ముహూర్తం: ఉ.8.09 నుండి 9.02 వరకు, తదుపరి ప.12.30 నుండి 1.23 వరకు ; అమృత ఘడియలు: రా.6.24 నుండి 8.01 వరకు; సూర్యోదయం : 5.33 ; సూర్యాస్తమయం : 6.34 ; రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు, యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

సర్వర్లు డౌన్.. ప్రవేశాలకు ఆటంకం!

కుల, ఆదాయ ధ్రువపత్రాల జారీలో ఆలస్యం

సకాలంలో సర్టిఫికెట్లు అందక దరఖాస్తుకు ఇబ్బందులు	10తో ముగుస్తున్న డిగ్రీ కోర్సుల గడువు	సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న విద్యార్థులు	అధికారుల తీరుతో విద్యార్థులకు తప్పని ఇక్కట్లు



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రస్తుతం వివిధ కోర్సుల్లో విద్యార్థుల ప్రవేశాలు జరుగుతున్నాయి. వీటికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. అలాగే ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లోనే అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అయితే తరచూ సర్వర్లు మొరాయిస్తుండటంతో సమయానికి విద్యార్థులకు సర్టిఫికెట్లు అందడం లేదు. ఇంజనీరింగ్ ప్రవేశాలకు ఈ నెల 7, డిగ్రీ ప్రవేశాలకు 10వరకు మాత్రమే గడువు ఉంది. సర్వర్ల మొరాయింపుతో సకాలంలో సర్టిఫికెట్లు అందక విద్యార్థులు హైరానా పడుతున్నారు. సమయానికి ఆయా కోర్సులకు దరఖాస్తు చేసుకోగలమా, లేదా అనే ఆందోళన వారిలో కనిపిస్తోంది. ఆయా ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేస్తే గానీ విద్యార్థులకు రిజర్వేషన్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటివి అందే అవకాశం లేదు.

సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు

విద్యా సంవత్సరం ప్రారంభంలో విద్యార్థులకు కుల, నివాస, ఆదాయ ధ్రువపత్రాలు తప్పనిసరి. దీంతో వాటికోసం దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఇటీవల సచివాలయ సిబ్బందితో పింఛన్లను పంపిణీ చేయించడంతో ఈ నెల ఒకటి, రెండు తేదీల్లో సచివాలయాల్లో సిబ్బంది అందుబాటులో లేరు. మరికొన్నిచోట్ల సచివాలయాలను వేరొక చోటకి మార్చారు. కొత్తగా వీటిని ఎక్కడ పెట్టారో తెలియక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ధ్రువపత్రాలకు దరఖాస్తు చేసుకునే సమయంలో విద్యార్థులు తప్పనిసరిగా నోటరీ చేయించాలంటున్నారు. పాత సర్టిఫికెట్లను రెన్యువల్ చేయడానికి మళ్లీ నోటరీ ఎందుకు అని ప్రశ్నిస్తే నోటరీ చేయిస్తేనే దరఖాస్తులు ముందుకు కదులుతాయని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో విద్యార్థులు నోటరీ చేయించాల్సి వస్తోంది. నోటరీకి సుమారు రూ.200 వసూలు చేస్తుండడం పేద విద్యార్థులకు భారంగా పరిణమించింది. దీంతో పాటు పాత ధ్రువపత్రాలు, రేషన్ కార్డులు, కుటుంబంలోని అందరు సభ్యుల ఆధార్ కార్డుల జిరాక్సులకు మరికొంత వెచ్చించాల్సి రావడం ఆర్థికంగా ఇబ్బందవుతోంది. ఇవన్నీ సచివాలయ సిబ్బందికి సమర్పించడానికి విద్యార్థులు ఒకటికి రెండుసార్లు సచివాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

కుల, ఆదాయ ధ్రువపత్రాల జారీలో ఆలస్యం

ఎలాగోలా సచివాలయ సిబ్బంది కోరిన పత్రాలన్నీ సమర్పించి వారి నుంచి పత్రాలను తీసుకువెళ్లి తహసీల్దారు కార్యాలయంలో సమర్పిస్తే అక్కడ ఆర్ఐ, తహసీల్దారు సంతకాలకు ఆలస్యమవుతోంది. వారు ఇతర పనులతో బిజీగా ఉండడంతో రాత్రికి గానీ కార్యాలయాలకు చేరుకోవడం లేదు. ఆ తర్వాత ఇతర పనులపై దృష్టి సారించి విద్యార్థుల ధ్రువపత్రాలపై చివరలో సంతకాలు చేస్తున్నారు. ఆ తర్వాత ఆన్‌లైన్ చేయడానికి సర్వర్ల మొరాయింపుతో మరింత ఆలస్యమవుతుంది. దీంతో విద్యార్థులకు ఇబ్బంది తప్పడం లేదు.

వలంటీర్లతో ఇంటి వద్దే అందించిన గత ప్రభుత్వం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యా సంవత్సరం ప్రారంభంలోనే వలంటీర్ల ద్వారా విద్యార్థుల కోసం ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించింది. ఆయా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వలంటీర్లు ఇంటింటికీ తిరిగి ఎవరికి ఏ సర్టిఫికెట్లు కావాలో అడిగి తెలుసుకుని వారే ఇంటి వద్దే ఆన్‌లైన్ చేశారు. కావాల్సిన సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేసి సర్టిఫికెట్లు వచ్చేలా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పైగా ఈ డ్రైవ్‌ల్లో సర్టిఫికెట్లకు దరఖాస్తులు చేసుకున్నవారికి ఎటువంటి రుసుం తీసుకోకుండా వాటిని అందజేసింది. ప్రస్తుతం వలంటీర్ వ్యవస్థను ప్రభుత్వం దూరం పెట్టడంతో ధ్రువపత్రాలు పొందడం విద్యార్థులకు కష్టమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రవేశాల గడువు ముంచుకొస్తుండటంతో తమకు సకాలంలో సర్టిఫికెట్లు అందేలా చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

మధ్యాహ్న భోజన ఏజెన్సీ కోసం టీడీపీ నేతల దౌర్జన్యం

- అనంతపురం జిల్లా, ఛాయాపురంలో ఏజెన్సీ నిర్వాహకురాలిపై దాడి
- మనస్తాపంతో బాధితురాలు ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న సుంకమ్మ

వజ్రకరూరు: అధికారం అండగా టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. అంతా తాము చెప్పినట్టే జరగాలని ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఇదే క్రమంలో అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం ఛాయాపురంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలిపై టీడీపీ నేతలు దౌర్జన్యం చేశారు. దీంతో ఆమె క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. వివరాల్లోకి వెళితే.. ఛాయాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో గత 23 ఏళ్లుగా మధ్యాహ్న భోజన ఏజెన్సీని బోయ సుంకమ్మ నిర్వహిస్తున్నారు. ఆమెకు సహాయకురాళ్లుగా ఆమె కుమార్తెలు రాధ, లక్ష్మి ఉన్నారు. ఇన్నేళ్లలో వారిపై చిన్న ఫిర్యాదు కూడా అందలేదు. కానీ గత కొన్ని రోజులుగా టీడీపీ నేతలు ఏజెన్సీ కోసం బోయ సుంకమ్మను బెదిరింపులకు గురిచేస్తున్నారు. రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి వచ్చిందని, మధ్యాహ్న భోజన ఏజెన్సీ కూడా తమ పార్టీ కార్యకర్తలే చూసుకుంటారని అందువల్ల స్వచ్ఛందంగా తప్పుకోవాలని ఒత్తిడి తెస్తున్నారు. కానీ అధికారికంగా తనకు ఎవరూ ఏజెన్సీ నిర్వహించవద్దని చెప్పకపోవడంతో బోయ సుంకమ్మ ఎప్పటిలాగే చిన్నారులకు మధ్యాహ్న భోజనం వండుతోంది. ఈ క్రమంలో గురువారం పాఠశాల వద్దకు వెళ్లిన కొందరు టీడీపీ నాయకులు సుంకమ్మపై మరోసారి దౌర్జన్యానికి దిగారు.

చెబితే వినవా...

'ఒక్కసారి చెబితే నువ్వు వినవా.. ఏజెన్సీ నుంచి తప్పుకోకపోతే నీ అంతు చూస్తాం' అంటూ హెచ్చరించారు. దీంతో సుంకమ్మ అది చెప్పేందుకు మీరెవరని ప్రశ్నించడంతో ఆగ్రహంతో ఊగిపోయిన టీడీపీ నేతలు వంట గదిలోని సామగ్రి, కూరగాయలు తీసుకువచ్చి రోడ్డుపై పడేశారు. అడ్డుకోబోయిన సుంకమ్మ కూతురు రాధ, మనుమడు దొరబాబు, మనుమరాలిని పక్కకు నెట్టివేశారు. దీంతో మనస్తాపం చెందిన సుంకమ్మ వంటగదిలోకి వెళ్లి క్రిమి సంహారక మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. దీన్ని గమనించిన కుటుంబీకులు వెంటనే ఆమెను 108లో గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వజ్రకరూరు ఎస్ఐ నరేష్ ఆస్పత్రికి వెళ్లి సుంకమ్మ నుంచి వివరాలు నమోదు చేసుకున్నారు. అలాగే మండల విద్యాధికారి తిమ్మప్ప కూడా ఆమెను పరామర్శించి వివరాలు సేకరించారు. కాగా అదే పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్ మహేశ్వరిని కూడా టీడీపీ నేతలు బెదిరించారు. ఉద్యోగం వదిలేసి వెళ్లిపోవాలంటూ టీడీపీ నాయకులు తీవ్ర ఒత్తిడి చేస్తున్నట్టు స్వీపర్ మాముడూరు మహేశ్వరి కన్నీటి పర్యంతమయ్యారు. ఉద్యోగం వదిలేస్తే తన కుటుంబ పోషణ భారమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

క్లుప్తంగా...

9న తిరుమలలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



తిరుమల: జూలై 16న ఆణివార ఆస్థానం సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయంలో 9న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఏడాదిలో 4సార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని నిర్వహిస్తారు. ఇందులో ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం ఆలయ శుద్ధి చేస్తారు. 9న ఉదయం 6 గంటలకు తిరుమంజనం ప్రారంభమవుతుంది. అనంతరం స్వామివారి మూలవిరాట్టుకు అర్చకులు ఆగమోక్తంగా పూజాది కార్యక్రమాలు నిర్వహించి మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. తిరుమంజనం కారణంగా ఆ రోజున నిర్వహించే అష్టదళపాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది.

డీసీఐఎల్‌కు మరో కొత్త కాంట్రాక్ట్

కొచ్చిన్ పోర్టు వార్షిక నిర్వహణను దక్కించుకున్న సంస్థ



సాక్షి, విశాఖపట్నం: నష్టాల నుంచి లాభాల బాట పడుతూ క్రమంగా అభివృద్ధి చెందుతున్న డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (డీసీఐఎల్).. మరో కొత్త కాంట్రాక్టును సొంతం చేసుకుంది. ప్రతిష్టాత్మకమైన కొచ్చిన్ పోర్టు అథారిటీ వార్షిక నిర్వహణ డ్రెడ్జింగ్ కాంట్రాక్టును దక్కించుకుంది. 2024–25కు గాను రూ.156.50 కోట్లతో పోర్టు నిర్వహణ బాధ్యతను డీసీఐకి అప్పగించారు. పోర్టులోని ఔటర్ చానెల్, అప్రోచ్ చానెల్, ఐసీటీటీ బేసిన్, ఎల్ఎన్‌జీ బేసిన్ చానెల్ తదితర విభాగాల్ని డీసీఐ నిర్వహించనుంది. వచ్చే ఏడాది కాంట్రాక్టును కూడా డీసీఐకి అప్పగించేందుకు కొచ్చిన్ పోర్టు సుముఖంగా ఉందని డ్రెడ్జింగ్ కార్పొరేషన్ చైర్మన్ డా.అంగముత్తు వెల్లడించారు. డ్రెడ్జింగ్ పరిశ్రమల విభాగంలో డీసీఐ దేశంలోనే అగ్రస్థానానికి చేరుకుందన్నారు.


రూ.2.46 కోట్ల విలువైన అక్రమ సిగరెట్లు స్వాధీనం



సాక్షి, అమరావతి/లక్ష్మీపురం: అక్రమంగా తరలిస్తోన్న రూ.2.46 కోట్ల విలువైన సిగరెట్లను సెంట్రల్ జీఎస్టీ అధికారులు గన్నవరంలో స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు సెంట్రల్ జీఎస్టీ అధికారులు గన్నవరంలోని డీటీడీసీ ఎక్స్‌ప్రెస్ కార్యాలయంలో బుధవారం సోదాలు నిర్వహించగా అక్రమంగా నిల్వ చేసిన సిగరెట్లను గుర్తించారు. వాటి విలువ ఇన్‌వాయిస్‌ల్లో రూ.8 లక్షలుగా చూపించారు. కానీ తనిఖీల్లో వాటి విలువ రూ.2.46 కోట్లుగా తేలింది. ఆ సిగరెట్ల పార్సిళ్లపై వాటి ఉత్పత్తి తేదీ, ఇతర వివరాలు లేవు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నర్సింహారెడ్డి తెలిపారు. 2024–25 ఆర్థిక ఏడాదిలో ఇప్పటివరకు రూ.2.73 కోట్ల విలువైన అక్రమ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన గురువారం ప్రకటన విడుదల చేశారు.

కిడ్నాపర్ల చెర నుంచి మిర్చి వ్యాపారికి విముక్తి

24 గంటల్లో కేసు ఛేదించిన పోలీసులు



మార్కాపురం రూరల్: మండలంలోని బిరుదులనరవ గ్రామంలో బుధవారం కిడ్నాప్‌కు గురైన మిర్చి వ్యాపారి రావి వెంకటరెడ్డిని కిడ్నాపర్ల చెర నుంచి పోలీసులు గురువారం సాయంత్రం విడిపించారు. గొట్టిపడియ, బిరుదులనరవ గ్రామాలకు చెందిన పలువురు రైతుల నుంచి వెంకటరెడ్డి మిర్చి కొనుగోలుచేసి డబ్బులు ఇవ్వలేదు. దీంతో వెంకటరెడ్డి బుధవారం బిరుదులనరవ గ్రామ శివార్లలోని పొలంలో ఉండగా గొట్టిపడియకు చెందిన పలువురు రైతులు కిడ్నాప్ చేశారు. ఈ ఘటనపై వెంకటరెడ్డి అత్త, మామలు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో డీఎస్పీ బాలసుందరరావు రంగంలో దిగారు. మార్కాపురం, యర్రగొండపాలెం సీఐలు ఆవుల వెంకటేశ్వర్లు, రాములు నాయక్ ఆధ్వర్యంలో ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. గొట్టిపడియతోపాటు సమీపంలోని వెలుగొండ డ్యామ్, గొట్టిపడియ కొండలమీద ప్రత్యేక బృందాలు గాలించాయి. ఈ ఘటనపై రూరల్ పోలీసులు తొమ్మిది మందిపై కేసు నమోదు చేయడంతోపాటు పలువురిని అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో ఆందోళనకు గురైన కిడ్నాపర్లు వెంకటరెడ్డిని విడిచిపెట్టారు. ఈ విషయమై సీఐ ఆవుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ త్వరలోనే కిడ్నాపర్లను అరెస్ట్ చేస్తామని చెప్పారు.

ఆగస్టు 16 నుంచి ముంబైకి ఇండిగో విమాన సర్వీస్



విమానాశ్రయం (గన్నవరం): దేశ ఆర్థిక రాజధానిగా గుర్తింపు పొందిన ముంబై నుంచి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి (గన్నవరం) సర్వీస్‌లు నడిపేందుకు మరో ఎయిర్‌లైన్స్ సంస్థ ముందుకొచ్చింది. ఇప్పటికే ఈ రూట్‌లో ఎయిరిండియా సంస్థ విజయవంతంగా సర్వీస్‌లు నడుపుతోంది. దీంతో పెరిగిన ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఇండిగో ఎయిర్‌లైన్స్ ఆగస్టు 16 నుంచి సర్వీస్‌లు ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు విమాన ప్రయాణ షెడ్యూల్‌ను ప్రకటించడంతో పాటు టికెట్ బుకింగ్‌ను కూడా ప్రారంభించింది. ఈ సర్వీస్ నిమిత్తం 180 మంది ప్రయాణికుల సామర్థ్యం కలిగిన ఎయిర్‌బస్ ఎ320 విమానాన్ని వినియోగించనున్నారు. ఈ విమానం ముంబై నుంచి రోజూ సాయంత్రం 6.30 గంటలకు బయలుదేరి రాత్రి 8.20కు గన్నవరం చేరుకుంటుంది. తిరిగి ఇక్కడి నుంచి రాత్రి 9.00కు బయలుదేరి 11 గంటలకు ముంబై చేరుకుంటుందని ఎయిర్‌లైన్స్ ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రారంభ టికెట్ ధరలు ముంబై నుంచి విజయవాడకు రూ.3,645, విజయవాడ నుంచి ముంబైకి రూ.3,712గా నిర్ణయించారు. ఈ సర్వీస్ వల్ల ముంబైతో పాటు గల్ఫ్, యూకే, యూఎస్ఏ దేశాలకు వెళ్లే ప్రయాణికులకు సులువైన కనెక్టివిటీ సదుపాయం ఉంటుందని తెలిపారు.

త్వరలో చెన్నైకు ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సర్వీస్

చెన్నై నుంచి విజయవాడకు త్వరలో చౌక ధరల విమాన సంస్థ ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లను ప్రారంభించనుంది. ప్రస్తుతం ఈ రూట్‌లో ఇండిగో మాత్రమే సర్వీస్‌లను నడుపుతోంది. కొత్త సర్వీసులకు సంబంధించిన షెడ్యూల్ త్వరలోనే ప్రకటించనున్నట్లు విమానాశ్రయ వర్గాలు తెలిపాయి.

బొగ్గు వ్యాగన్లలో మృతదేహం

ఎర్రగుంట్ల ఆర్టీపీపీలో కలకలం


బొగ్గులో నుంచి బయట పడిన మృతదేహం

ఎర్రగుంట్ల: వైఎస్సార్ జిల్లాలోని డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీలోని యూనిట్లకు సరఫరా అవుతున్న బొగ్గులో బయటపడిన ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఘటన తీవ్ర కలకలం రేపుతున్నది. గురువారం స్థానికులు తెలిపిన ప్రాథమిక సమాచారం మేరకు.. ఆర్టీపీపీకి కృష్ణపట్నం పోర్టు నుంచి ప్రతి రోజూ బొగ్గు ర్యాకులు వస్తుంటాయి. వచ్చిన బొగ్గు ర్యాకులలోని వ్యాగిన్‌ను కోల్ ప్లాంట్‌లోని బంకర్ల నుంచి యూనిట్లకు నేరుగా సరఫరా చేస్తుంటారు. రెండు రోజుల క్రితం క్రిష్ణపట్నం నుంచి బయలుదేరిన బొగ్గు వ్యాగన్ గురువారం ఆర్టీపీపీకి చేరుకుంది. ఈ వ్యాగన్‌లోని బొగ్గును నేరుగా బంకర్లకు యంత్రం సాయంతో అన్‌లోడ్ చేశారు. ఇలా అన్‌లోడ్ చేస్తున్న సమయంలో బంకర్లలో కుప్పలుగా ఉన్న బొగ్గును అక్కడి కార్మికులు గునపంతో తోస్తుంటారు. ఇలా గునపంతో తోస్తున్న సమయంలో బొగ్గులో నుంచి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బయటకు వచ్చింది. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన కార్మికులు ఏఈ వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఈఈ టి.సోమశేఖర్‌రెడ్డికి సమాచారం అందించారు. ఆర్టీపీపీలోని ఎస్పీఎఫ్ పోలీసులు, విజిలెన్స్ అధికారులు, కలమల్ల పోలీస్ స్టేషన్ నుంచి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కాగా, ఆ మృతదేహం ఎవరిది.. ఎక్కడినుంచి బొగ్గు వ్యాగన్‌లోకి వచ్చిందనే వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

వంతెన పనులు నిలిపివేత

ఏలూరు జిల్లా బలివేలో టీడీపీ నేతల దాష్టీకం



సాక్షి, టాస్క్‌ఫోర్స్: ఏలూరు జిల్లాలో అధికారం అండతో టీడీపీ నేతలు బరితెగించారు. వారి ఆగడాలతో ముసునూరు మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం బలివే వద్ద తమ్మిలేరుపై నిర్మాణంలో ఉన్న వంతెన కమ్ చెక్ డ్యామ్ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. వివాదాస్పద టీడీపీ ఎమ్మెల్యే ఆదేశాలతో 2 జేసీబీలు, 40 మంది టీడీపీ నేతలు వంతెన నిర్మాణ ప్రదేశానికి గురువారం ఉదయం చేరుకున్నారు. పనులు నిలిపివేయకపోతే దాన్ని కూల్చివేసేందుకు వచ్చారని అర్థమైన కాంట్రాక్టర్.. వంతెన శ్లాబ్ కోసం ఏర్పాటుచేసిన సెంట్రింగ్ మెటీరియల్‌ను కూలీలతో ఆయనే తొలగింపజేయడం గమనార్హం. ఇప్పటికే 80 శాతం వంతెన పనులు పూర్తి కాగా మరో 34 మీటర్ల మేర శ్లాబ్ వేయాల్సి ఉంది. బ్రిడ్జి నిర్మాణం మొత్తం ఆరు భాగాలు కాగా, నాలుగు భాగాలు ఇప్పటికే పూర్తయ్యాయి. మరో రెండు భాగాలకు శ్లాబ్ వేసి, పది రోజుల్లోగా పూర్తి చేసే అవకాశముంది. ఈ నేపథ్యంలో బ్రిడ్జి పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ప్రజల చిరకాల వాంఛ కలగానే మిగిలిపోయే పరిస్థితి ఏర్పడింది. కాంట్రాక్టర్ నుంచి కమీషన్లు దండుకోవడానికే టీడీపీ నేతలు పనులు నిలిపివేయించినట్టు ప్రచారం జరుగుతోంది.

ఐదుగురు గంజాయి స్మగ్లర్లు అరెస్ట్

- నిందితుల్లో ఒకరు మైనర్
- పరారీలో ప్రధాన నిందితుడు


స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో పోలీసులు

చింతపల్లి రూరల్ (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఒడిశా నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న 759 కిలోల గంజాయిని గురువారం స్వాధీనం చేసుకుని ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు స్థానిక ఏఎస్పీ ప్రతాప్‌శివకిశోర్ తెలిపారు. ఏజెన్సీ పరిసర ప్రాంతాల్లో గంజాయి లభ్యం కాకపోవడంతో ధారకొండ పంచాయతీ గంగవరం గ్రామానికి చెందిన వండలం బాలు బద్దర్ తనకు పరిచయం ఉన్న ఒడిశాలోని చిత్రకొండ బ్లాక్ బరడబందకు చెందిన చేపల వ్యాపారి లింగుఖిలా (బాబూరావు)ను ఆశ్రయించాడు. అతని ద్వారా 759 కిలోల గంజాయిని కొనుగోలు చేశాడు. అక్కడి నుంచి రెండు బొలేరా వాహనాల్లో గూడెం, చింతపల్లి మీదుగా తాళ్లపాలెం చేర్చేందుకు లింగుఖిలాతో రూ.3 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ మేరకు వ్యాన్లలో గంజాయి తీసుకొస్తుండగా గూడెం కొత్తవీధిలోని సంస్థ కాలనీ వద్ద సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ అప్పలసూరి సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. వ్యాన్లలో ఉన్న బాలుబద్దర్‌తోపాటు రింతాడ పంచాయతీ కుమ్మరివీధికి చెందిన పాంగి గోవర్దన్, మాలిగుడకు చెందిన కొర్రలైకోన్ (లక్ష్మణ్), ఊబలపాలెంకు చెందిన కిల్లో శంకర్‌రావు, చింతపల్లి మండలం కడశిల్పకి చెందిన మైనర్ (17)ను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.38 లక్షల విలువైన 759 కిలోల గంజాయి, రెండు వాహనాలు, ఐదు సెల్‌ఫోన్లు, రూ.16,900 స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు లింగుఖిలా (బాబూరావు) కోసం గాలిస్తున్నామని ఏఎస్పీ తెలిపారు. ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని వెల్లడించారు.

మా కుమార్తె మృతిపై అనుమానాలున్నాయి

- నిజాలు నిగ్గుతేల్చండి
- మహిళా కమిషన్‌ను ఆశ్రయించిన కరిష్మా కుటుంబ సభ్యులు

సాక్షి, అమరావతి: తన కుమార్తె మృతిపై అనేక అనుమానాలున్నాయని.. నిజాలను నిగ్గు తేల్చాలని కరిష్మా తండ్రి రాష్ట్ర మహిళా కమిషన్ ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ లూనా సెంటర్‌లోని మదర్సా విద్యార్థిని కరిష్మా(17) ఇటీవల అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. దీనిని రాష్ట్ర మహిళా కమిషన్ సూమోటోగా విచారణకు స్వీకరించింది. ఈ నేపథ్యంలో కరిష్మా తండ్రి షేక్ మహబూబ్ సుభానీ, బంధువులు గురువారం మంగళగిరిలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మిని కలిశారు. కరిష్మా మృతిపై తమ అనుమానాలను తెలియజేశారు. 'మాది కృష్ణా జిల్లా అంగలూరు. నా కుమార్తె కరిష్మా ఏడో తరగతి పూర్తి చేసింది. మూడేళ్ల అరబిక్ కోర్సు చదివేందుకు ఏడాది కిందటే మదర్సాలో చేర్చా. ఇటీవల కరిష్మాకు అనారోగ్యంగా ఉందని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళ్తున్నామని మదర్సా నిర్వాహకులు మాకు ఫోన్ చేసి చెప్పారు. కానీ మా బంధువులు ఆస్పత్రికి వెళ్లేటప్పటికి మదర్సా నిర్వాహకుడే తన సొంత కారులో కరిష్మాను తీసుకొచ్చాడు. కానీ అప్పటికే కరిష్మా మరణించిందని వైద్యులు చెప్పారు. మాకు న్యాయం చేసే వరకు మృతదేహాన్ని తీసుకెళ్లబోమని తాము ఆందోళన చేస్తే పోలీసులు బలవంతంగా విరమింపజేశారు. నా కుమార్తె శరీరంపై గాయాలున్నాయి. నా కుమార్తె మృతి వెనుక నిజాలను నిగ్గు తేల్చండి' అని మహిళా కమిషన్‌ను కోరారు. మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మి స్పందిస్తూ.. దీనిపై ఇప్పటికే డీజీపీకి లేఖ రాసినట్లు చెప్పారు. పోలీస్ శాఖ సమగ్ర దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

పోలవరాన్ని ఏటీఎంలా వాడుకున్నారు


హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ: పోలవరం ప్రాజెక్టును ప్రభుత్వంలోని పెద్దలు ఏటీఎంలా వాడుకున్నారని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ విమర్శించారు. రాజమహేంద్రవరంలోని రాజీవ్‌గాంధీ డిగ్రీ కాలేజీలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. కష్టతరమైన డ్యాం నిర్మాణానికి డబుల్ డయాఫ్రమ్ వాల్ నిర్మించాలని నిపుణుల కమిటీ సూచించినప్పటికీ, ఖర్చు మిగుల్చుకోవడానికి ఒక్క డయాఫ్రమ్ వాల్ మాత్రమే నిర్మించారని, అది కాస్త ఇప్పుడు కొట్టుకుపోయిందన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో జాగ్రత్తలు తీసుకోకపోతే, భవిష్యత్తులో పోలవరం నుంచి కాకినాడ వరకూ ముంపునకు గురై, 40 లక్షల మంది ప్రాణాలు గాలిలో దీపంలా మారే ప్రమాదం ఉంటుందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి కాఫర్ డ్యామ్, డయాఫ్రం వాల్ వంటి ఎక్కువ శాతం నిర్మాణాలు చంద్రబాబు హయాంలోనే జరిగాయన్నారు. పోలవరం నిర్మాణ లోపాలకు ఎవరు బాధ్యత వహిస్తారని హర్షకుమార్ ప్రశ్నించారు. కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న ప్రాజెక్టు పనుల్లో నిర్లక్ష్యం వహించిన నిర్మాణ సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు అవకతవకలపై హైకోర్టులో పిల్ వేస్తున్నామని తెలిపారు. ముందుగా ప్రాజెక్టు నిర్వాసితులకు ప్యాకేజీ ఇచ్చిన తర్వాతే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని హర్షకుమార్ డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల 'ఫర్నిచర్' దొంగల అరెస్ట్

రూ.10 లక్షల విలువైన ఫ్యాన్‌లు, టీవీలు, ఏసీలు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ సౌజన్య

నెల్లూరు (క్రైమ్): కార్లలో తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలలను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను నెల్లూరు జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్దనుంచి రూ.10 లక్షల విలువ చేసే చోరీ సొత్తుతో పాటు రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో గురువారం ఏఎస్పీ సీహెచ్ సౌజన్య వివరాలు వెల్లడించారు. దుత్తలూరు మండలం రాచవారిపల్లి గ్రామానికి చెందిన పాత నేరస్తుడు పి.వెంకటరత్నం, ప్రకాశం జిల్లా దండుపాళెంకు చెందిన షేక్ మునీర్‌బాషా స్నేహితులు. వ్యసనాలకు బానిసైన వీరు పాఠశాలలను లక్ష్యంగా చేసుకుని కార్లలో తిరుగుతూ రాత్రి వేళల్లో పాఠశాలల తాళాలు పగులగొట్టి అందులో ఉన్న ఫ్యాన్లు, టీవీలు, ఏసీలు, ల్యాప్‌టాప్, సీపీయూ, ప్రింటర్‌లు, వైర్ కాయిల్స్‌ను దొంగలించి వాటిని అమ్మి జల్సాలు చేస్తున్నారు. వరుస దొంగతనాల నేపథ్యంలో సీసీఎస్, ఆత్మకూరు డీఎస్పీలు పి.రామకృష్ణాచారి, ఎస్.కోటారెడ్డి తమ సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం ఏఎస్‌పేట వద్ద నిందితులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్దనుంచి రూ.10 లక్షలు విలువ చేసే 118 సీలింగ్ ఫ్యాన్లు, 4 టీవీలు, డైకిన్ ఏసీ, ల్యాప్‌టాప్, సీపీయూ, ప్రింటర్, 75 వైర్ కాయిల్స్‌తో పాటు దొంగతనాలకు వినియోగించిన రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు.

పులుల ఏకాంతానికి వేళాయె

- వర్షాకాలం పెద్ద పులుల సంతానోత్పత్తికి అనుకూలం
- జూలై ఒకటి నుంచి సెప్టెంబర్ 30 వరకు ప్రత్యుత్పత్తి సమయం
- ఏకాంతానికి భంగం కలిగితే దాడి చేసే ప్రమాదం
- అభయారణ్యాల్లో మానవ సంచారాన్ని అదుపు చేసేలా అటవీశాఖ చర్యలు



బుట్టాయగూడెం: పెద్ద పులులు సంతానోత్పత్తి నిమిత్తం ఏకాంతంగా గడిపే సమయం వచ్చేసింది. జూలై ఒకటో తేదీ నుంచి సెప్టెంబర్ చివరి వరకు పులుల ప్రత్యుత్పత్తికి అనుకూలమైన కాలంగా పరిగణిస్తారు. పులి సాధారణంగా ఒంటరిగానే ఉన్నా సంతానోత్పత్తి సమయంలో జత కలవడం కోసం ఆసక్తి కనబరుస్తుంది. ఆ సమయంలో పూర్తిగా ప్రశాంతతను కోరుకుంటుంది. అడవిలో ఏ చిన్న అలజడైనా కలయిక నుంచి తప్పుకొంటుంది. ఈ సమయంలో అడవిలో పులుల ప్రత్యుత్పత్తికి ముప్పు వాటిల్లకుండా మూడు నెలల పాటు పాపికొండల అభయారణ్యంలో ప్రవేశాలను అటవీ అధికారులు నిలిపివేశారు. పాపికొండల అభయారణ్యంలో సుమారు నాలుగు పెద్ద పులులు సంచరిస్తున్నట్టు 2022 గణనలో నిర్ధారించారు. నాలుగు పులులు ట్రాప్ కెమెరాలకు చిక్కినట్టు అధికారులు వెల్లడించారు. ఇటీవల కాలంలో ఒక పెద్ద పులి సంచారం ఏలూరు జిల్లా ప్రజలను హడలెత్తించింది. ఆ పులి ట్రాప్ కెమెరాకు చిక్కినప్పటికీ అది ఈ ప్రాంతానికి చెందినది కాదని అధికారులు గుర్తించారు. పాపికొండల్లో పులుల సంఖ్య పెరిగినట్టు అధికారులు చెబుతున్నారు.

సంకేతాలు ఇలా..

ఆడ పులికి గర్భధారణ సమయం వచ్చినట్టు దాని మూత్ర విసర్జన వాసన ద్వారా తెలుస్తుంది. పసిగట్టిన మగ పులులు ఫ్లెహ్మెన్ రెస్పాన్స్‌గా పిలవబడి ముఖ చిట్లింపులను ప్రదర్శిస్తుంది. ఆడ పులి మూత్రం ద్వారా సంకేతాలను గమనించిన మగ పులులు ఉద్వేగంగా ఉంటాయి. మూడు నుంచి ఐదు రోజుల పాటు వేట కోసం ఆడపులితో తిరుగుతాయి. నీటి వనరులు ఉన్న అన్ని ప్రాంతాల్లో కూడా పులులు ఎక్కువగా సేదతీరుతాయి.


గర్భధారణకు 16 వారాల సమయం

పులికి గర్భధారణ సమయం సుమారు 16 వారాలు. సంతానోత్పత్తి కాలం 93 నుంచి 112 రోజులు. 18 నెలల వయస్సు వచ్చేసరికి పులి కూనలు స్వతంత్రులు అవుతాయి. రెండు నుంచి ఐదేళ్ల వరకు అవి తల్లిని వదిలిపెట్టవు. ఆడ పులులు మూడు నుంచి నాలుగేళ్లలో, మగ పులులు నాలుగు నుంచి ఐదేళ్లలో సంతానోత్పత్తికి సిద్ధమవుతాయి. అయితే పులుల గర్భధారణ సమయంలో రెండు మగ పులుల మధ్య హింసాత్మక పోరాటాలు సంభవించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. దాని ఫలితంగా ఒక పులి మృతి చెందే ఘటనలు అరుదుగా జరుగుతాయని అంటున్నారు.

కూనల పెంపకంలో మగ పులి పాత్ర ఉండదు..

పులి ఒక ఈతలో మూడు నుంచి నాలుగు కూనలకు జన్మనిస్తుంది. పిల్లలు గుడ్డివిగా, నిస్సహాయంగా జన్మిస్తాయి. ఆడ పులులు వాటిని ఒంటరిగా సాకుతాయి. పులి కూన పిల్లల పెంపకంలో మగ పులి పాత్ర ఉండదు. కొన్ని సందర్భాల్లో వాటితో సంబంధం లేని మగ పులులు ఆడపులులతో జత కలవడం కోసం వాటి పిల్లలను చంపేసే అవకాశాలు ఉంటాయి. ముందు ఈతలో పులి పిల్లలు చనిపోయినట్లయితే ఆడ పులి ఐదు నెలల్లో తర్వాతి ఈతకు సిద్ధమవుతుంది.

బైడెన్‌ను.. మార్చొచ్చా?



దొనాల్డ్ ట్రంప్‌తో ముఖాముఖి చర్చలో జో బైడెన్ ఆద్యంతం తడబడటం, మాటల కోసం వెతుక్కోవడంతో డెమొక్రాట్లలో భయాందోళనలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. 81 ఏళ్ల వయసులో బైడెన్ సమర్థుడైన అభ్యర్థి కాగలరా? మరో నాలుగేళ్లు అగ్రరాజ్యం అధినేతగా భారం మోయగలరా? అనే సందేహాలు ముప్పిరిగొన్నాయి. నవంబరు 5న అధ్యక్ష ఎన్నికలు ముంచుకొస్తుండటంతో వయోభారం రీత్యా అధ్యక్షుడి మానసిక సంతులతపై డెమొక్రాట్లలో అనుమానాలు తలెత్తుతున్నాయి. టెక్సాస్ నుంచి డెమొక్రాట్ ఎంపీ ఒకరు బైడెన్ అధ్యక్ష రేసు నుంచి తప్పుకోవాలని పిలుపునిచ్చారు. డెమొక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా జో బైడెన్‌ను మార్చే అవకాశం ఉందా? స్వయంగా ఆయన రేసు నుంచి తప్పుకోవచ్చా? అప్పుడు ఎవరు అధ్యక్ష అభ్యర్థి అవుతారు? అనే అంశాలను ఒకసారి పరిశీలిద్దాం.

- సాక్షి నేషనల్ డెస్క్

అవును.. తప్పుకోవచ్చు. కాకపోతే అందుకు ఆయన సిద్ధంగా లేరు. తానే డెమొక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థినని, వైదొలగాలని తననెవరూ ఒత్తిడి చేయడం లేదని బైడెన్ బుధవారం స్పష్టం చేశారు. డెమొక్రాటిక్ అధ్యక్ష అభ్యర్థిని ఆగస్టు 19–22 వరకు షికాగోలో జరిగే డెమొక్రాటిక్ నేషనల్ కన్వెన్షన్ (డీఎన్‌సీ)లో అధికారికంగా ఎన్నుకోనున్నారు. ఓహియో రాష్ట్రంలో బ్యాలెట్ పేపర్‌పై పేరుండటానికి వీలుగా జూలై 21 నుంచి ఆగస్టు 7వ తేదీ వరకు జరిగే వర్చువల్ కన్వెన్షన్‌లో తమ అభ్యర్థిని ఖరారు చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. వివిధ రాష్ట్రాల ప్రైమరీల్లో వచ్చిన ఫలితాల ఆధారంగా.. ఆ నిష్పత్తిలో అభ్యర్థులకు డెలిగేట్లను కేటాయిస్తారు. దాదాపు 4,000 డెలిగేట్లలో 99 శాతం బైడెన్ గెల్చుకున్నారు. డీఎన్‌సీ నిబంధనల ప్రకారం వీరందరూ బైడెన్‌కు మద్దతు పలకాలి. ఒకవేళ రాబోయే రోజుల్లో ఒత్తిడి మరీ పెరిగిపోయి.. రేసు నుంచి వైదొలగాలని బైడెన్ నిర్ణయించుకుంటే.. అప్పుడు ఉపాధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్‌తో పాటు ఇతరులెవరైనా డెమొక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం పోటీపడవచ్చు. అప్పుడు డెలిగేట్లు జాతీయ కన్వెన్షన్‌లో (ఓపెన్ కన్వెన్షన్ అంటారు) తమకు నచ్చిన అభ్యర్థులను సూచించి ఒకరికి మెజారిటీ వచ్చేదాకా రౌండ్ల వారీగా ఓటింగ్ చేయొచ్చు. 1968లో అప్పటి అధ్యక్షుడు లిండన్ బి.జాన్సన్ మళ్లీ పోటీచేయకూడదని నిర్ణయించడంతో ఓపెన్ కన్వెన్షన్ నిర్వహించారు.

బైడెన్‌పై తీవ్ర ఒత్తిడి

బలవంతంగా తప్పించొచ్చా?

పార్టీలో మెజారిటీ మార్పును కోరుకొని బైడెన్ ససేమిరా అంటే ఆయన్ను బలవంతంగా తప్పించడానికి ఆస్కారం ఉంది. డీఎన్‌సీ నియమావళిలో కొన్ని లొసుగులు ఉన్నాయి. 'జాతీయ కన్వెన్షన్లో డెలిగేట్లు తమను ఎన్నుకున్న వారి అభిప్రాయాన్ని/ మనోగతాన్ని ప్రతిబింబించాలి' అని నిబంధనలు చెబుతున్నాయి. అంటే డెమొక్రాటిక్ పార్టీ డెలిగేట్లు ఇతరుల వైపు కూడా మొగ్గ చూపవచ్చు (అదే రిపబ్లికన్ పార్టీలో అయితే డెలిగేట్లు ఎవరి తరపున అయితే ఎన్నికయ్యారో వారికే బద్ధులై ఉండాలని స్పష్టంగా ఉంది). బైడెన్ తరపున ఎన్నికైన 3,894 డెలిగేట్లలో 1,976 మంది పైచిలుకు డెలిగేట్లు వర్చువల్ కన్వెన్షన్‌లో ఓటింగ్‌కు దూరంగా ఉండాలి. అప్పుడు స్పష్టమైన తీర్పు రాక అదనపు రౌండ్ల ఓటింగ్ జరుగుతుంది. డెలిగేట్లు ఇంత పెద్ద సంఖ్యలో తిరుగుబాటు చేస్తారా? అని అమెరికా రాజకీయ పండితులు సందేహిస్తున్నారు. అయితే అధ్యక్ష అభ్యర్థిని ఎన్నుకొనే నిబంధనలను డీఎన్‌సీ రూల్స్ కమిటీ ఏ సమయంలోనైనా మార్చవచ్చు.

బైడెన్ స్వయంగా వైదొలిగితే తప్పితే ఆయన్ను అధ్యక్ష అభ్యర్థిగా తప్పించడం అంత సులభం కాదు. సాంకేతికంగా అవకాశాలు ఉన్నప్పటికీ ఆచరణలో కష్ట సాధ్యమే.

కమలా హారిస్‌కు ఛాన్స్ ఉందా?

నాలుగేళ్ల పదవీకాలంలో అధ్యక్షుడు ఎప్పుడైనా తప్పుకొంటే.. ఉపాధ్యక్షురాలైన కమలా హారిస్ ఆటోమెటిగ్గా పగ్గాలు చేపడతారు. కానీ అధ్యక్ష అభ్యర్థి రేసులో ఇలాంటి ఆస్కారం లేదు. ఓపెన్ కన్వెన్షన్‌లో అందరి అభ్యర్థుల్లాగే భారతీయ–అమెరికన్ హారిస్ కూడా పోటీపడాల్సి వస్తుంది. మెజారిటీ డెలిగేట్ల ఓట్లను సంపాదించాల్సి ఉంటుంది. అధ్యక్ష డిబేట్ తర్వాత సీఎన్ఎన్ నిర్వహించిన పోల్‌లో ట్రంప్‌కు 47 శాతం మంది ఓటర్లు మద్దతు పలుకగా, కమలా హారిస్‌కు 45 శాతం మంది మద్దతు లభించడం విశేషం. హారిస్‌కు అనుకూలించే మరో అంశం ఏమిటంటే.. డెమొక్రాటిక్ పార్టీ ప్రచార ఫండ్‌ను బైడెన్ కాకుండా ఆమె మాత్రమే నేరుగా పొందగలరు.

ఊపిరి తీస్తున్న వాయు కాలుష్యం

- దేశంలోని పది పెద్ద నగరాల్లో 7.2 శాతం మరణాలకు 'పీఎం 2.5' ధూళి కణాలే కారణం
- 'లాన్సెట్ ప్లానెటరీ హెల్త్' పత్రిక వెల్లడి

న్యూఢిల్లీ: ఆయువు పోయాల్సిన వాయువు ప్రాణాలు తోడేస్తోంది. వాయువులో ప్రాణాంతకమైన కాలుష్య కారకాలు కలుస్తున్నాయి. ఊపిరి పీలిస్తే శరీరంలోకి చేరిపోయి, అవయవాలను నిర్వీర్యం చేస్తున్నాయి. ఇండియాలోని పది అతిపెద్ద నగరాల్లో సంభవిస్తున్న రోజువారీ మరణాల్లో సగటున 7.2 శాతం మరణాలకు వాయు కాలుష్యమే కారణమని తాజా అధ్యయనంలో వెల్లడయ్యింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్ఓ) నిర్దేశించిన పరిమితి కంటే హైదరాబాద్, ఢిల్లీ, బెంగళూరు, ముంబై తదితర నగరాల్లోని గాలిలో అత్యంత సూక్ష్మమైన 'పీఎం 2.5' ధూళి కణాలు అధికంగా ఉన్నట్లు లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ పత్రిక స్పష్టం చేసింది. దేశ రాజధాని ఢిల్లీలో చాలా మరణాలకు వాయు కాలుష్యమే కారణమవుతున్నట్లు తెలియజేసింది. వాహనాలు, పరిశ్రమల నుంచి వెలువడుతున్న ఉద్గారాలు గాలిని విపరీతంగా కలుషితం చేస్తున్నాయని పేర్కొంది. అధ్యయనం వివరాలను పత్రికలో ప్రచురించారు. 2.5 మైక్రోమీటర్ల కంటే తక్కువ పరిమాణంలో ఉన్న ధూళి కణాలను 'పీఎం 2.5 కణాలు' అంటారు.

- భారతదేశంలోని పెద్ద నగరాల్లో నిత్యం వెలువడుతున్న పీఎం 2.5 ధూళి కణాలతో మరణాల ముప్పు నానాటికీ పెరుగుతోందని పరిశోధకులు వెల్లడించారు.
- ఇండియాలో వాయు కాలుష్యంపై వారణాసిలోని బనారస్ హిందూ యూనివర్సిటీ, ఢిల్లీలోని సెంటర్ ఫర్ క్రానిక్ డిసీజ్ కంట్రోల్‌తోపాటు పలువురు అంతర్జాతీయ పరిశోధకులు ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, అహ్మదాబాద్, కోల్‌కతా, పుణే, సిమ్లా, వారణాసి నగరాల్లో 2008 నుంచి 2019 దాకా ఈ అధ్యయనం నిర్వహించారు.
- క్యూబిక్ మీటర్ గాలిలో పీఎం 2.5 ధూళి కణాలు 10 మైక్రోగ్రాములు పెరిగితే రోజువారీ మరణాల సంఖ్య 1.4 శాతం పెరుగుతున్నట్లు గుర్తించారు. అంతేకాకుండా మరణాల ముప్పు 2.7 శాతం పెరుగుతున్నట్లు తేల్చారు.
- ప్రపంచ ఆరోగ్య సంస్థ విధివిధానాల ప్రకారం.. 24 గంటల వ్యవధిలో క్యూబిక్ మీటర్ గాలిలో పీఎం 2.5 కణాలు 15 మైక్రోగ్రాముల లోపు ఉంటే ప్రమాదం లేదు. అంతకంటే మించితే ముప్పు తప్పదు.
- భారత వాయు నాణ్యత ప్రమాణాల ప్రకారం.. 24 గంటల వ్యవధిలో క్యూబిక్ మీటర్ గాలిలో పీఎం 2.5 ధూళి కణాలు 60 మైక్రో గ్రాముల లోపు ఉండే ప్రమాదం అంతగా ఉండదు. కానీ, ప్రస్తుతం 75 మైక్రో గ్రాముల కంటే అధికంగానే ఉంటున్నట్లు తేలింది.
- క్యూబిక్ మీటర్ గాలిలో పీఎం 2.5 కణాలు 10 మైక్రోగ్రాములు పెరిగితే మరణాల రేటు సగటున 3 శాతం దాకా పెరుగుతున్నట్లు గుర్తించారు.
- స్థానికంగా వెలువడే ఉద్గారాలు, కాలుష్యంతో పీఎం 2.5 కణాల ఉత్పత్తి పెద్ద ఎత్తున జరుగుతోంది. అందుకే స్థానికంగా కాలుష్యాన్ని సమర్థవంతంగా కట్టడి చేస్తే మరణాల ముప్పు చాలావరకు తగ్గుతుందని సైంటిస్టులు సూచిస్తున్నారు.



జార్ఖండ్ సీఎంగా మళ్లీ సోరెన్

రాంచీ: జార్ఖండ్ ముక్తి మోర్చా ఎగ్జిక్యూటివ్ అధ్యక్షుడు హేమంత్ సోరెన్ జార్ఖండ్ ముఖ్యమంత్రిగా మరోసారి ప్రమాణం చేశారు. గురువారం రాంచీలోని రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ రాష్ట్ర 13వ సీఎంగా ఆయనతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో హేమంత్ తండ్రి, జేఎంఎం చీఫ్ శిబూ సోరెన్, తల్లి రూపి, భార్య కల్పన, తాజా మాజీ సీఎం చంపయి సోరెన్, కూటమి సీనియర్ నేతలు పాల్గొన్నారు. భూ కుంభకోణంలో మనీ లాండరింగ్ ఆరోపణలపై జనవరి 31వ తేదీన హేమంత్‌ను ఈడీ అధికారులు అరెస్ట్ చేయడం, జూన్ 28వ తేదీన హైకోర్టు ఆయన్ను బెయిల్‌పై విడుదల చేయాలని ఆదేశించడం తెల్సిందే. అరెస్ట్‌కు కొద్ది గంటల ముందే సీఎం పదవికి ఆయన రాజీనామా చేశారు.



సీఎంగా బాధ్యతలు స్వీకరిస్తున్న హేమంత్

ముఖ్యమంత్రిగా మూడోసారి..

తండ్రి శిబూ సోరెన్ రాజకీయ వారసత్వాన్ని కొనసాగిస్తూ హేమంత్ 2009లో రాజకీయాల్లోకి ప్రవేశించారు. అదే ఏడాది జేఎంఎం తరఫున రాజ్యసభకు ఎన్నికయ్యారు. 2010లో రాజ్యసభ ఎంపీ పదవికి రాజీనామా చేసి బీజేపీ సారథ్యంలోని అర్జున్ ముండా ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. రెండేళ్ల తర్వాత బీజేపీ ప్రభుత్వం కూలిపోవడంతో, రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన వచ్చింది. 2013 ఎన్నికల్లో జేఎంఎం, కాంగ్రెస్, ఆర్‌జేడీల సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. హేమంత్ సోరెన్ 38 ఏళ్ల వయస్సులోనే సీఎం పదవిని చేపట్టారు. ఈ ప్రభుత్వం స్వల్ప కాలమే మనుగడ సాగించింది. 2014లో రఘుబర్ దాస్ సారథ్యంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైంది. 2019లో జరిగిన ఎన్నికల్లో హేమంత్ సారథ్యంలో మళ్లీ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.

వాస్తవాధీన రేఖను గౌరవించాల్సిందే

చైనా విదేశాంగ మంత్రికి జై శంకర్ స్పష్టీకరణ

ఆస్తానా: వాస్తవాధీన రేఖ(ఎల్‌ఏసీ)ను చైనా గౌరవించాల్సిందేనని, సరిహద్దుల్లో శాంతి నెలకొనడం ఎంతో అవసరమని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. గురువారం కజఖ్‌స్తాన్ రాజధాని ఆస్తానాలో ఎస్‌సీవో శిఖరాగ్రానికి హాజరైన చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో ఆయన భేటీ అయ్యారు. రెండు దేశాల మధ్య సంబంధాలు పరస్పర విశ్వాసం, గౌరవం, ఆసక్తి, సున్నితత్వంపై ఆధారపడి ఉండాలని ఈ సందర్భంగా జై శంకర్ పేర్కొన్నారు. తూర్పు లద్దాఖ్‌లోని మిగతా ప్రాంతాల నుంచి సైన్యాన్ని పూర్తిగా ఉపసంహరించడానికి ప్రయత్నాలను ముమ్మరం చేయాలని కోరారు. రెండు దేశాల సంబంధాలను సాధారణ స్థితికి తీసుకువచ్చే క్రమంలో ఉన్న అడ్డంకులను అధిగమించి, శాంతియుత వాతావరణాన్ని పునరుద్ధరించడం అవసరమన్నారు. ఇందుకోసం, రెండు దేశాల సరిహద్దుల నిర్వహణకు సంబంధించి గతంలో కుదిరిన ఒప్పందాలు, నిర్ణయాలకు పూర్తిగా కట్టుబడి ఉండాలన్నారు. తూర్పు లద్దాఖ్‌లో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రయత్నాలను వేగవంతం చేయాలని ఇరువురు నేతలు అంగీకారానికి వచ్చారని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

బ్రిటన్‌లో ప్రశాంతంగా ఎన్నికలు

- రాత్రి పదింటిదాకా కొనసాగిన పోలింగ్
- ఓటేసిన ప్రధాని రిషి సునాక్, భార్య అక్షతామూర్తి
- విపక్ష లేబర్ పార్టీయే గెలుస్తుందంటున్న విశ్లేషకులు

లండన్: పధ్నాలుగేళ్ల కన్జర్వేటివ్ పార్టీ పాలనకు యూకే పౌరులు చరమగీతం పాడనున్నారన్న విశ్లేషణల నడుమ బ్రిటన్ సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పర్వం గురువారం ప్రశాంతంగా పూర్తయింది. ఆకాశాన్ని అంటుతున్న నిత్యావసరాల ధరలు, వలసల కట్టడిలో విఫలమయ్యారన్న విమర్శలు ఎదుర్కొంటున్న భారతీయ మూలాలున్న బ్రిటన్ ప్రధాని రిషి సునాక్‌కు ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారిన విషయం తెల్సిందే. ఉదయాన్నే భార్య అక్షతామూర్తితో కలిసి సునాక్ నార్త్‌ఆలెర్టన్ సిటీ దగ్గర్లోని కిర్బీ సిగ్‌స్టన్ గ్రామంలోని పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటేశారు. 'మార్పు' నినాదంతో ఎన్నికల్లో ఫేవరెట్‌గా నిలిచిన విపక్ష లేబర్ పార్టీ నేత కెయిర్ స్టార్మర్ సైతం భార్య విక్టోరియాతో కలిసి ఉత్తర లండన్‌లోని క్యామ్‌డెన్ విల్లింగ్‌హామ్ హాల్ పోలింగ్‌కేంద్రంలో హుషారుగా ఓటేశారు. బ్రిటిష్ స్థానిక కాలమానం ప్రకారం ఉదయం ఏడుగంటలకే 40,000 పోలింగ్‌బూత్‌లలో పోలింగ్ మొదలైంది. బ్రిటన్‌లో 4.6 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. ఉదయం ఏడు గంటల నుంచి రాత్రి 10 గంటలదాకా అంటే భారత కాలమానం ప్రకారం శుక్రవారం తెల్లవారుజామున 2:30 గంటల దాకా పోలింగ్ జరగనుంది. పోలింగ్ పూర్తయిన తర్వాత ఓట్ల లెక్కింపు మొదలుపెడతారు. బ్రిటన్ పార్లమెంట్ దిగువ సభ అయిన 'హౌజ్ ఆఫ్ కామన్స్'లో ఉన్న మొత్తం 650 ఎంపీ స్థానాలకు పోలింగ్ చేపట్టారు. సాధారణ మెజారిటీ సాధించాలంటే 326 సీట్లు గెలవాలి. ప్రధానమైన కన్జర్వేటివ్, లేబర్ పార్టీలతోపాటు లిబరల్ డెమొక్రాట్స్, గ్రీన్ పార్టీ, స్కాటిష్ నేషనల్ పార్టీ, ఎస్‌డీఎల్‌పీ, డెమొక్రటిక్ యూనియనిస్ట్ పార్టీ, సిన్ ఫియెన్, ప్లైయిడ్ సిమ్రూ, ది యాంటీ ఇమిగ్రేషన్ రిఫామ్ పార్టీలతోపాటు స్వతంత్రులు బరిలో దిగారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో 67 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ ముగిశాక ఎగ్జిట్‌పోల్స్ వెలువడే అవకాశముంది. కన్జర్వేటివ్ పార్టీ కేవలం 53–150 సీట్లు సాధిస్తుందని, లేబర్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ఇప్పటికే ఒపీనియన్స్ పోల్స్ వెల్లడయ్యాయి.

సంస్కరణవాదా ? అతివాదా?

మసూద్ పెజెష్కియన్, సయీద్ జలిలి మధ్య హోరాహోరీ పోరు • నేడు రెండో దఫా ఎన్నికలకు సిద్ధమైన ఇరాన్

ఇరాన్ అధ్యక్ష ఎన్నికల్లో అత్యల్ప ఓటింగ్‌తో ప్రతిష్టంభన నెలకొన్న తరుణంలో నేడు రెండో దఫా ఎన్నికలకు ఓటర్లు సిద్ధమయ్యారు. జూన్ 28న జరిగిన ఎన్నికల్లో అభ్యర్థులందరినీ తిరస్కరిస్తూ, ఎవరికీ కీలక 50 శాతం ఓటింగ్‌ను ఓటర్లు కట్టబెట్టకపోవడంతో రన్‌ఆఫ్(రెండోసారి ఎన్నికలు)కు వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తింది. మతబోధకుడి పాలనను జనం ఎంతగా తిరస్కరిస్తున్నారనేది జూన్ 28నాటి అత్యల్ప ఓటింగ్ సరళి కళ్లకు కట్టింది. కునారిల్లిన ఆర్థికవ్యవస్థ, యువతలో అసహనం, మతఛాందసవాదం, ఉద్యమాలు, అంతర్జాతీయంగా ఇజ్రాయెల్, అమెరికాలతో కయ్యంతో ఇంటాబయటా ఇబ్బందులు పడుతున్న దేశాన్ని ఎవరు ఏలుతారన్న విషయం నేటి ఎన్నికలతో తేలిపోనుంది.

తొలి రౌండ్‌లో ఏం జరిగింది?

మే 19న హెలికాప్టర్ ప్రమాదంలో అధ్యక్షుడు రైసీ మరణించడంతో అధ్యక్ష ఎన్నికలు అనివార్యమయ్యాయి. సుప్రీం లీడర్ ఆయాతొల్లా అలీ ఖమేనీ ఆజ్ఞలు పాటిస్తూ దేశాధ్యక్షునిగా పాలించేందుకు ముగ్గురు అతివాద నేతలు, ఒక సంస్కరణవాది ఎన్నికల్లో పోటీకి ముందుకొచ్చారు. తొలి రౌండ్‌లో సంస్కరణవాది డాక్టర్ మసూద్ పెజెష్కియన్ అందరికంటే ఎక్కువగా 42.5 శాతం ఓట్లు సాధించారు. అతివాది సయీద్ జలిలి 38.6 శాతం ఓట్లు ఒడిసిపట్టారు. దేశంలో 6 కోట్ల మంది ఓటర్లుంటే కేవలం 2.5 కోట్ల మంది ఓటేశారు. దేశ చరిత్రలోనే అత్యల్పంగా 40 శాతం పోలింగ్ నమోదైంది. ఎవరికీ 50 శాతం ఓట్లు రాని పక్షంలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన వారు రెండోదశ పోలింగ్‌కు అర్హత సాధిస్తారు. ఈ లెక్కన మసూద్, జలిలి మాత్రమే ఈరోజు జరిగే ఎన్నికల్లో పోటీపడుతున్నారు.

మసూద్ గెలిస్తే?

తొలి రౌండ్‌లో పోలింగ్ కేంద్రందాకా రాని 60 శాతం ఓటర్లపైనే ఈ ఇద్దరు అభ్యర్థులు దృష్టిసారించారు. తొలి రౌండ్‌లో సమీప అభ్యర్థి జలిలి కంటే 3.9 శాతం ఓట్లు ఎక్కువ సాధించడం ద్వారా జనాల్లో తనకు ప్రజాదరణ ఎక్కువ ఉందని మసూద్ పెజెష్కియన్ ఇప్పటికే నిరూపించుకున్నారు. కొన్ని అంశాల్లో మసూద్‌ను సమర్థిస్తున్నట్లు ఎన్నికలపర్వం మొదలవడానికి ముందు జలిలి కొన్ని సందర్భాల్లో వ్యాఖ్యానించారు. మైనారిటీలు, యువత, మహిళల సమస్యలను ప్రచారం సందర్భంగా ప్రస్తావిస్తూ జనాన్ని మసూద్ తనవైపునకు తిప్పుకుంటున్నారు. మసూద్ గెలిచి దేశాధ్యక్షుడైతే నాటి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయంతో మరుగునపడిన 2015నాటి అమెరికా–ఇరాన్ అణుఒప్పందాన్ని పునరుద్ధరించేందుకు కృషిచేయొచ్చు. పశ్చిమదేశాలతో దోస్తీకి ప్రయత్నించవచ్చు. దీంతో ఆంక్షలు తొలగి, విదేశీ పెట్టుబడులు పెరిగి దేశార్థికం బాగుపడే అవకాశముంది.


జలిలి గెలిస్తే?

సయీద్ జలిలి గెలిస్తే ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల్లో ఎలాంటి మార్పులు ఉండకపోవచ్చు. దేశాభివృద్ధి కోసం పశ్చిమదేశాలపై ఆధారపడాల్సిన పనిలేదని సుప్రీంలీడర్ ఖమేనీ అన్న మాటలనే జలిలి వల్లెవేస్తున్నారు. '' అసలు ఇరాన్‌పై ఎందుకు ఆంక్షలు విధించాం? అని పశ్చిమ దేశాలే బాధపడాలి. ఆంక్షలను సైతం మనం అవకాశంగా మలచుకోవాలి' అన్న జలిలి మాటలు చూస్తుంటే ఈయన గెలిస్తే దేశంలో మతఛాందస పాలనను కొనసాగిస్తారని అర్థమవుతోంది.


పిడివాదుల్లో పొరపొచ్చాలు?

అతివాద నేతల మధ్య అభిప్రాయభేదాలు పొడచూపాయి. అతివాదం నుంచి దేశాన్ని సంస్కరణల బాట పట్టిస్తే మంచిదని కొందరు అభిప్రాయపడ్డారు. ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ సీనియర్ సభ్యుడు, అతివాది సర్దార్ మొహసీన్ రషీద్ తన మద్దతు మసూద్‌కే అని ప్రకటించి అందర్నీ ఆశ్చర్యపరిచారు. తొలి రౌండ్‌లో పోటీపడి ఓడిన గలీబాఫ్‌కు ప్రచారసారథ్యంవహించిన సమీ నజారీ తర్కరానీ సైతం మసూద్‌కే తన ఓటు అని ప్రకటించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్



మసూద్ పెజెష్కియన్



సయీద్ జలిలి

స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే మార్గముందా?


దేశ కీలక అంతర్గత వ్యవహారాలు అన్నీ సుప్రీంలీడర్ ఖమేనీ కనుసన్నల్లో జరుగుతాయి. అలాంటపుడు అధ్యక్షుడిగా ఉండి కూడా మసూద్‌గానీ, జలిలిగానీ స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోగలరా? అనేది భేతాళ ప్రశ్నగా మిగిలిపోనుందని రాజకీయ విశ్లేషకుల మాట. అయితే విదేశీవ్యవహారాల్లో అధ్యక్షుడు, మంత్రివర్గం నిర్ణయాలే ఎక్కువగా చెల్లుబాటు అవుతాయని తెలుస్తోంది. ఇజ్రాయెల్, అమెరికాలతో శత్రుత్వం విషయం పక్కనబెడితే ఇతర పశ్చిమ దేశాలతో మైత్రికి నూతన అధ్యక్షుడు ప్రయత్నిస్తే దేశంలో ప్రగతి సాధ్యమే. మసూద్ అధ్యక్షుడైతే ఈ మార్పుకు బాటలు పడొచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఈ 'మార్పు'కు ఖమేనీ ఒప్పుకుంటారో లేదో వేచి చూడాల్సిందే.

ఐదేళ్ల తర్వాత మోదీ రష్యా పర్యటన



న్యూఢిల్లీ: చిరకాల మిత్రదేశం రష్యాలో భారత ప్రధాని మోదీ ఈనెల 8, 9వ తేదీల్లో పర్యటించనున్నారు. దాదాపు ఐదేళ్ల తర్వాత రష్యాలో మోదీ పర్యటిస్తుండటం విశేషం. రష్యాలో 22వ భారత్–రష్యా వార్షిక శిఖరాగ్ర సదస్సులో పుతిన్‌తోపాటు మోదీ పాల్గొననున్నారు. ఇరు దేశాల మధ్య పలు ద్వైపాక్షిక ఒప్పందాలపై చర్చలు జరపనున్నారని భారత విదేశాంగ శాఖ గురువారం ప్రకటించింది. రష్యా పర్యటన ముగించుకున్నాక మోదీ ఆస్ట్రియా దేశంలో పర్యటించనున్నారు. గత 41 సంవత్సరాల్లో ఆస్ట్రియాను భారత ప్రధాని సందర్శించడం ఇదే తొలిసారి అవుతుంది. రష్యాలో చివరిసారిగా మోదీ 2019లో వ్లాడివోస్టాక్ పట్టణంలో ఆర్థికసదస్సులో పాలుపంచుకున్నారు.


శపథం మేరకు కిరోడీ లాల్ రాజీనామా..



జైపూర్: ప్రధాని మోదీ తనకు బాధ్యతలు అప్పగించిన ఏడు లోక్‌సభ స్థానాల్లో ఎన్నికల్లో నాలుగింటిని బీజేపీ కోల్పోయినందుకు మాటకు కట్టుబడి మంత్రి పదవికి రాజీనామా చేసినట్లు రాజస్తాన్ మంత్రి కిరోడీ లాల్ మీనా(72) గురువారం తెలిపారు. అయితే, తన రాజీనామా లేఖను సీఎం భజన్‌లాల్ తిరస్కరించారని చెప్పారు. పార్టీ అధిష్టానం శుక్రవారం ఢిల్లీకి రావాలంటూ కబురు పంపించిందని, అక్కడ పార్టీ పెద్దలకు తన నిర్ణయాన్ని వివరిస్తానని కిరోడీ లాల్ మీడియాకు చెప్పారు. అధిష్టానంపైగానీ, సీఎం భజన్‌లాల్ శర్మపైగానీ తనకు ఎటువంటి అసంతృప్తి లేవన్నారు.

హరియాణా, ఢిల్లీలో ఆప్‌తో పొత్తు లేనట్టే!

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ వెల్లడి



న్యూఢిల్లీ: హరియాణా, ఢిల్లీలో మరో ఏడాదిలోగా జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) మధ్య పొత్తు కుదిరే అవకాశాలు పెద్దగా కనిపించడం లేదని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ చెప్పారు. కానీ, మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమిలోని పార్టీలన్నీ కలిసికట్టుగా పోటీ చేస్తాయని తెలిపారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాల్లో జరిగే శాసనసభ ఎన్నికల్లో ఇండియా కూటమి పార్టీలు తప్పనిసరిగా పొత్తు పెట్టుకోవాలన్న నిబంధన ఏదీ లేదని స్పష్టంచేశారు. అవగాహన కుదిరిన చోట కూటమి పార్టీలు కలిసి పోటీ చేస్తాయని వెల్లడించారు.

బిహార్‌లో కూలిన మరో వంతెన

పట్నా: బిహార్‌లో మరో వంతెన కూలింది. రాష్ట్రంలో పక్షం రోజుల వ్యవధిలో చోటుచేసుకున్న పదో ఘటన కాగా, సరన్ జిల్లాలో 24 గంటల వ్యవధిలో జరిగిన మూడో దుర్ఘటన. సరన్ జిల్లాలోని బనేయపూర్ బ్లాక్‌లోని పలు గ్రామాలను, సివాన్ జిల్లాతో కలుపుతూ పదిహేనేళ్ల క్రితం గండకీ నదిపై ఈ వంతెనను నిర్మించారు. గురువారం ఉదయం జరిగిన ఈ ఘటనలో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం సంభవించలేదని అధికారులు తెలిపారు. వరుసగా వంతెనలు కూలుతున్న ఘటనలపై ప్రభుత్వం ఉన్నతస్థాయి దర్యాప్తునకు ఆదేశించింది.

కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య

కోటా: రాజస్తాన్‌లోని కోటాలో మరో విద్యార్థి బలవన్మరణం చెందారు. జేఈఈ పోటీ పరీక్షకు ప్రిపేరయ్యే బిహార్ విద్యార్థి సందీప్ కుమార్ కుర్మి(16)హాస్టల్‌లోని తన గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. నలందా జిల్లాకు చెందిన ఇతడు రెండేళ్లుగా మహావీర్ నగర్‌లో ఉంటూ ఇంజనీరింగ్ పరీక్షకు సిద్ధమవుతున్నాడు. గురువారం ఉదయం 7 గంటలైనా ఇతడు రూం నుంచి బయటకు రాకపోవడంతో తోటి విద్యార్థి కిటికీలోంచి లోపలికి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. అతడి వద్ద ఎలాంటి సూసైడ్ నోట్ కనిపించలేదని పోలీసులు తెలిపారు. తాజా ఘటనతో కలిపి ఈ ఏడాది జనవరి నుంచి కోటాలో 13 మంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు.

ఆరుగురు సేవాదార్లు అరెస్టు

హత్రాస్/లక్నో: 121 మంది మరణానికి కారణమైన హత్రాస్ తొక్కిసలాట ఘటనపై ఉత్తరప్రదేశ్ పోలీసులు దర్యాప్తు వేగవంతంగా చేశారు. ఈ కేసులో సత్సంగ్ నిర్వాహక కమిటీకి చెందిన ఆరుగురు సేవాదార్లను అరెస్టు చేసినట్లు గురువారం వెల్లడించారు. వీరిలో ఇద్దరు మహిళలు ఉన్నారని చెప్పారు. రామ్ లాడైతి(50), ఉపేంద్రసింగయాదవ్(62), మేఘ్ సింగ్(61), ముకేశ్ కుమార్(38), మంజూ యాదవ్(30), మంజూ దేవి(40)ని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రధాన నిందితుడు, ముఖ్య సేవాదార్ దేవప్రకాశ్ మధుకర్ కనిపించకుండా పోయాడని, అతడిపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తామని, అతడి ఆచూకీ చెబితే రూ.లక్ష బహుమానం ప్రకటిస్తామని ఉన్నతాధికారులు తెలిపారు. సత్సంగ్‌లో ప్రజలకు జ్ఞానబోధ చేసిన నారాయణ్ సకర్ హరి అలియాస్ భోలే బాబా అలియాస్ సూరజ్‌పాల్ ఇంకా పరారీలోనే ఉన్నారు. ఆయన పేరును పోలీసులు ఎఫ్ఐఆర్‌లో చేర్చలేదు. అవసరమైతే భోలే బాబాను కూడా విచారిస్తామని పోలీసులు వెల్లడించారు.

నీట్‌- యూజీ రద్దు చేయొద్దు

సుప్రీంకోర్టును ఆశ్రయించిన అభ్యర్థులు

సాక్షి, న్యూఢిల్లీ: నీట్–యూజీ 2024 రద్దు చేయకుండా చూడాలని పలువురు అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పరీక్షను రద్దుచేయకుండా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)ని నిలువరిస్తూ ఆ సంస్థకు సంబంధిత ఆదేశాలు ఇవ్వాలంటూ గుజరాత్‌కు చెందిన దాదాపు 56 మంది అభ్యర్థులు కోర్టును కోరారు. తాజా నీట్–యూజీలో మంచి ర్యాంక్ సాధించిన అభ్యర్థులతోపాటు ఫస్ట్‌ర్యాంక్ సాధించిన కొందరు ఈ పిటిషన్ వేశారు.

అదే జరిగితే మానవజాతి అంతం!

ఐదేళ్ల తర్వాత భారీ గ్రహశకలం భూమిని ఢీకొట్టే చాన్స్: ఎస్.సోమ్‌నాథ్

న్యూఢిల్లీ: గ్రహశకలం. అత్యంత వేగంగా అంతరిక్షంలో పయనించే ఈ ఖగోళ అద్భుతాన్ని దూరం నుంచి చూసేందుకు అందరూ ఇష్టపడతారు. దూరం నుంచి దూసుకెళ్తుంటే ఆశ్చర్యం కల్గించే ఆస్టరాయిడ్ ఒకవేళ భూమికి దగ్గరగా వెళ్లినా, పేలినా అది సృష్టించే వినాశనం ఊహకు కూడా అందదు. అలాంటి ఘటనకు గత శతాబ్దంలో సెర్బియా సాక్షిభూతంగా నిల్చింది. 1908 జూన్ 30న ఒక భారీ గ్రహశకలం భూమి దిశగా దూసుకొచ్చి భూమిని ఢీకొట్టినంత పనిచేసింది. సెర్బియా గగనతలానికి కాస్తంత ఎత్తులో బద్దలైంది. ఈ పేలుడు ధాటికి వెలువడిన వేడి టుంగుస్కా ప్రాంతంలోని 2,200 చదరపు కిలోమీటర్ల అడవిని దహించేసింది. గాల్లో పేలితేనే ఇంతటి దారుణం జరిగితే ఇక నేరుగా భూమిని ఢీకొడితే ఎంతటి వినాశనం సంభవిస్తుందో ఊహించలేం. అయితే 2029 ఏప్రిల్ 13న అపోఫిస్ అనే గ్రహశకలం భూమిని ఢీకొట్టే ప్రమాదం పొంచి ఉందని ఇస్రో చైర్మన్ ఎస్.సోమ్‌నాథ్ ఆందోళన వ్యక్తంచేశారు. 370 మీటర్ల వెడల్పున్న అపోఫిస్ ఆస్టరాయిడ్ తన కక్ష్యలో దూసుకెళ్తూ 2036లోనూ భూమి సమీపానికి రానుంది. 10 కి.మీ.ల వెడల్పాటి ఆస్టరాయిడ్ ఢీకొంటే వెలువడే ఉష్ణంధాటికి భూమి మీది కొన్ని జీవజాతులు పూర్తిగా చనిపోయే ప్రమాదముందని ఒక సిద్ధాంతం. డైనోసార్లు ఇలాగే అంతర్ధానమయ్యాయని శాస్త్రవేత్తల అంచనా. భూమిని ఇలాంటి ఖగోళ ప్రమాదాల నుంచి రక్షించుకునే వ్యవస్థల అభివృద్ధికి సంపన్న దేశాలు సమాయత్తమయ్యాయి. భారత్ సైతం తన వంతు కృషిచేస్తోందని సోమ్‌నాథ్ చెప్పారు. రెండేళ్ల క్రితం డార్ట్ వ్యోమనౌక ఢీకొట్టడంతో డైమార్ఫస్ అనే గ్రహశకలం తన కక్ష్యను మార్చుకుంది. తమ ప్రయోగం కారణంగా డైమార్ఫస్ పరిభ్రమణ కక్ష్యలో దాదాపు 32 నిమిషాల మార్పు చోటుచేసుకున్నట్లు నాసా ఆనాడు ప్రకటించింది. గ్రహశకలాల రూపంలో భవిష్యత్తులో భూమికి ఎలాంటి ముప్పు ముంచుకొచ్చినా సమర్థంగా ఎదుర్కోగల సామర్థ్యాలను సముపార్జించుకోవడంలో ఇది కీలక ముందడుగు అని ఆనాడు ప్రపంచదేశాలు కీర్తించాయి.

సాక్షి 24|7
తమిళనాడు
TAMILNADU
శుక్రవారం । 5 । జూలై । 2024

అన్నా యూనివర్సిటీకి బాంబు బెదిరింపు

- సోదాలు నిర్వహించిన పోలీసులు

అన్నానగర్: చెన్నై అన్నా యూనివర్సిటీకి గురువారం ఓ ఈ–మెయిల్ ద్వారా మెసేజ్ వచ్చింది. అందులో అన్నా యూనివర్సిటీలో బాంబు పెట్టారని, అది పేలబోతోందని సమాచారం ఉంది. వెంటనే కోట్టూరుపురం పోలీసులు బాంబు స్క్వాడ్, స్నిఫర్ డాగ్స్‌తో యూనివర్సిటీ పరిసరాల్లో సోదాలు నిర్వహించారు. అయితే ఎలాంటి బాంబు లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కొట్టూరుపురం పోలీసులు కేసు నమోదు చేసి మెసేజ్ పంపించిన వ్యక్తుల వివరాలను సేకరించే ప్రయత్నం చేస్తున్నారు. కాగా ఇటీవలి కాలంలో నగరంలో బాంబు బెదిరింపు కాల్స్ ఎక్కువౌతుండడం గమనార్హం.

న్యూస్‌రీల్

మూడేళ్లు ఒకే ప్రాంతంలో పనిచేస్తే బదిలీ తప్పనిసరి

అన్నానగర్: పాఠశాల విద్యాశాఖలో 3 సంవత్సరాలకు పైగా ఒకే కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులను తప్పనిసరిగా బదిలీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీని ప్రకారం గత నెల (జూన్) 30వ తేదీ నాటికి పాఠశాల విద్యాశాఖ, ఉపాధ్యాయుల ఎంపిక బోర్డు, ఉద్యోగులు, ఇంటర్వ్యూ అసిస్టెంట్, సూపరింటెండెంట్, పదోన్నతి పొందిన సూపరింటెండెంట్‌లు, అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్ వంటి ఉద్యోగాల జాబితాను తీసుకోవాలని పాఠశాల విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్ (స్టాఫ్ బ్లాక్) అన్ని ప్రాథమిక విద్యా అధికారులకు సర్క్యులర్ జారీ చేశారు. శుక్రవారం సాయంత్రం 5 గంటలలోగా ఉద్యోగుల వివరాల జాబితాను సిద్ధం చేసి పంపాలని, వివరాలు మిస్ కాకుండా పూర్తి వివరాలు అందించాలని అందులో పేర్కొన్నారు.

బకాయిదారులపై కార్పొరేషన్ కొరడా

- ఆన్‌లైన్‌లో 100 మంది పేర్లు వెల్లడి

సాక్షి, చెన్నై: దీర్ఘకాలంగా ఆస్తి పన్ను చెల్లించకుండా ఉన్న వారిపై చెన్నై కార్పొరేషన్ గురువారం కొరడా ఝుళిపించింది. ఆన్‌లైన్‌లో వంద మంది పేర్లను ప్రకటించారు. వీరు రూ. 22 కోట్ల చెల్లించాల్సి ఉన్నట్లు వివరాలను పొందు పరిచారు. వివరాలు.. చెన్నై కార్పొరేషన్ పరిధిలో 15 మండలాలు 200 వార్డులు ప్రస్తుతం ఉన్నాయి. ఇక్కడ 12 లక్షల మంది ఆస్తిపన్ను చెల్లిస్తూ వస్తున్నారు. ఏడాదికి రెండు సార్లు ఈ పన్ను చెల్లించే వెసులుబాటును కల్పించారు. ఈ పన్ను ద్వారా రూ. 1,800 కోట్లు కార్పొరేషన్‌కు ఆదాయంగా వస్తోంది. ఈ పన్నుల వసూళ్లకు కొన్ని సందర్భాలలో కార్పొరేషన్ వర్గాలు కఠినంగా వ్యవహరించక తప్పడం లేదు. పలుమార్లు అవకాశాలు ఇచ్చినా, రాయితీలు కల్పించినా పన్ను చెల్లించకుండా ఎగవేత ధోరణితో ముందుకు సాగే వాళ్లు అనేక మంది ఉన్నారు. ప్రస్తుతం ఇలాంటి వారిని గుర్తించి, వారి పరువు బజారుకీడ్చే విధంగా నిర్ణయం తీసుకున్నారు. 100 మంది దీర్ఘకాలంగా పన్ను చెల్లించకుండా బకాయిలు పెడుతూ వస్తున్నట్లు తేల్చారు. వీరి వివరాలను కార్పొరేషన్ వెబ్‌సైట్‌లో ప్రకటించారు. వీరి నుంచి రూ. 22.44 కోట్ల పన్ను బకాయి రావాల్సి ఉందన్న వివరాలను తెలియజేశారు. కొందరు అయితే రూ. లక్ష నుంచి రూ. ఒక కోటి వరకు బకాయి ఉండటం గమనార్హం. ఐదుగురు ప్రముఖులతో పాటు కొందరు పారిశ్రామిక వేత్తల పేర్లు సైతం ఈ జాబితాలో ఉండడం గమనార్హం. ఇప్పటికైనా వీరు ఆస్తి పన్ను చెల్లిస్తే సరి లేని పక్షంలో తదుపరి చర్యగా వారి ఆస్తులను వేలంపై దృష్టి పెట్టక తప్పదని కార్పొరేషన్ రెవెన్యూ అధికారులు హెచ్చరికలు చేస్తున్నారు.

ఐఐటీ మద్రాసుతో సీమాట్స్ ఒప్పందం



ఐఐటీ డైరెక్టర్ కామకోటి సమక్షంలో ఒప్పందాలు

సాక్షి, చెన్నై: ఐఐటీ మద్రాసు, సీమాట్‌ల మధ్య విద్యా సంబంధిత ఒప్పందం గురువారం జరిగింది. ఐఐటీ మద్రాసు డైరెక్టర్ వి. కామకోటి సమక్షంలో విద్యాసంస్థల అధికారులు ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం మేరకు స్వయం ప్లస్ కోర్సును ప్రారంభించేందుకు సీమాట్స్ సిద్ధమైంది. సాంకేతిక, వైద్య రంగాలలో విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించడం, ఉన్నత, నాణ్యమైన విద్య, శిక్షణ ద్వారా కెరీర్ అవకాశాలను మెరుగు పరిచేందుకు చర్యలను విస్తృతం చేయనున్నారు. ఈ రెండు సంస్థల బలాలను మిళితం చేసే విధంగా సమగ్రమైన, వినూత్నమైన పాఠ్యాంశాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా నిర్ణయించారు. కోర్సుల కోసం ఆన్‌లైన్ వేదికగా వనరులను, భాగస్వామ్యాన్ని సులభతరం చేయనున్నారు.

'ఏఐ' టెక్నాలజీపై విస్తృత పరిశోధన



శ్రేయా బజాజ్‌ను సత్కరిస్తున్న దివ్య

సాక్షి,చెన్నై:ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీపై విస్తృత పరిశోధన దిశగా చెన్నైలో సదస్సు గురువారం జరిగింది. డిజిటల్ అక్షరాస్యతపై ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్‌కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఫిక్కీ)మహిళా విభాగం నేతృత్వంలో ఈ సదస్సు జరిగింది. మహిళ ప్రతినిధులకు డిజిటల్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ గురించి, వాటి విలువ, పరిమితులు తదితర అంశాలను గురించి, పరిశోధనల తీరు తెన్నులను ఇందులో చర్చించారు. ఫిక్కీ మహిళా విభాగం చైర్‌పర్సన్ దివ్య అభిషేక్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు ఈజీ హై సహ వ్యవస్థాపకురాలు శ్రేయా బజాజ్ నేతృత్వం వహించి ప్రత్యేక సెషన్స్ ద్వారా వివరాలను తెలియజేశారు. ప్రత్యేకంగా ఏఐ రంగంలో లోతుగా పరిశోధనలు, సామర్థ్యాలు, గోప్యత, కాపీరైట్ సంబంధించిన సమస్యలను గురించి చర్చించారు. అనంతరం సదస్సుకు హాజరైన ప్రతినిధులను దివ్య సత్కరించారు.

సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? అభివృద్ధిపై మీ అభిప్రాయం ఏంటి? అంటూ రాష్ట్ర ప్రజలతో సీఎం స్టాలిన్ స్వయంగా చర్చిస్తున్నారు. ఇందులో భాగంగా 'నింగల్ నలమా' (మీరు క్షేమమేనా) పేరిట మలి విడత కార్యక్రమాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. లబ్ధిదారులకు వీడియో కాల్ చేసి మాట్లాడారు. వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు సలహాలు, సూచనలను స్వీకరించారు.

వీడియో కాల్ ద్వారా లబ్ధిదారులతో మాట్లాడుతున్న సీఎం స్టాలిన్



మీరు క్షేమమేనా..?

- 'నింగల్ నలమా' పథకం పునః ప్రారంభం
- లబ్ధిదారులకు సీఎం వీడియోకాల్
- స్వయంగా అభిప్రాయాల సేకరణ

సాక్షి, చెన్నై: డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినానంతరం ఎన్నికల మేనిఫెస్టోలోని 95 శాతం వాగ్దానాలను అమలు చేసిందని ఆ పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. అలాగే ప్రజలతో మమేకమయ్యే విధంగా, ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో దరిచేర్చడమే లక్ష్యంగా వినూత్న కార్యక్రమాలను సైతం సీఎం స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వం నిర్వహిస్తూ వస్తోంది. ఈ పథకాలే ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో డీఎంకే కూటమికి సంపూర్ణ విజయం కట్టబెట్టాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిస్థితులలో ఎన్నికల కోడ్ కారణంగా గత మూడు నెలలుగా ఆగిన పథకాలు, కార్యక్రమాలను మళ్లీ సీఎం స్టాలిన్ విస్తృతం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా మీరు క్షేమమా కార్యక్రమానికి మళ్లీ గురువారం శ్రీకారం చుట్టారు. లోక్‌సభ ఎన్నికలకు ముందుగా మార్చి నెలలో ఈ కార్యక్రమం జరిగింది. ఆ తదుపరి ప్రస్తుతం ఈ కార్యక్రమాన్ని విస్తృతం చేసే దిశగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్లేందుకు సీఎం నిర్ణయించారు.

అభిప్రాయాల సేకరణ

మీరు క్షేమమేనా.. పథకంలో ప్రభుత్వ శాఖల పని తీరు, సంక్షేమ పథకాలు అమలు, అధికారులు, వివిధ శాఖల సేవలు లబ్ధిదారులకు ప్రయోజనకరంగా ఉన్నాయా? అని స్వయంగా సీఎం స్టాలిన్ ఆరా తీస్తున్నారు. ఈ కార్యక్రమం నిమిత్తం ప్రభుత్వ పథకాల సమగ్ర జాబితా ఆన్‌లైన్‌లో పొందు పరిచారు. సచివాలయం నుంచి వీడియో కాల్ ద్వారా లబ్ధిదారులను సీఎం సంప్రదించారు. వారి అభిప్రాయాలు సేకరించారు. ప్రభుత్వం ద్వారా అందిస్తున్న పథకాల గురించి ఆరా తీశారు. సంక్షేమ పథకాల తీరు తెన్నులతో పాటు ప్రజల సూచనలు తీసుకునే విధంగా వీడియో కాల్‌తో లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజల అభిప్రాయాలను స్వయంగా తెలుసుకునేందుకే తాను ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్య, సామాజిక, సమాజంలోని అట్టడుగున ఉన్న ప్రజల ఆర్థిక పరిస్థితుల మెరుగు దిశగా ముందుకెళ్తున్నామన్నారు. డాక్టర్ అంబేడ్కర్ పారిశ్రామిక మార్గదర్శక పథకం ద్వారా లబ్ధి పొందుతున్న కోయంబత్తూరుకు చెందిన చిత్రలేఖ ఆటోమొబైల్ విడిభాగాలు ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆది ద్రావిడ, గిరిజన తరగతులకు చెందిన వారు పారిశ్రామికవేత్తలుగా అవతరించేందుకు ఈ పథకం తన ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని, దరఖాస్తులు చేసుకున్న వారికి రూ.68,37,000 గ్రాంట్‌తో రుణం అందజేసినట్లు గుర్తుచేశారు. సంక్షేమ పథకం ద్వారా వికలాంగులకు లబ్ధి ఏ విధంగా చేకూరుతుందో? అని మైలాడుతురైకు చెందిన దివ్యాంగుడు సంజయ్ తల్లితో తాను మాట్లాడినట్టు పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ ఆ కుటుంబానికి ఎంతో ఉపయోగకరంగా ఉందని పేర్కొనడం ఆనందాన్ని కలిగించిందన్నారు. అలాగే, ఆమెకు కలైంజ్ఞర్ మహిళా హక్కు పథకం ద్వారా రూ. 1000 అందుతున్నట్లు పేర్కొన్నారని వివరించారు. ఇన్సూయిర్ కాపోం(ప్రాణ రక్షణ)పథకం ద్వారా ప్రమాదంలో గాయపడినా సకాలంలో అత్యవసర చికిత్స అందడంతో కోలుకున్న రాణిపేటకు చెందిన మణికంఠన్‌తో మాట్లాడుతున్నంత సేపు ఈ పథకాన్ని మరింత బలోపేతం చేయాలన్న కాంక్ష పెరిగినట్లు వివరించారు. అలాగే స్కాలర్ షిప్‌లు, అల్పాహార పథకం పథకాల ద్వారా ప్రయోజనం పొందుతున్న లబ్ధిదారులతో మాట్లాడినట్టు, వారు చెప్పిన మాటలు, వారి ఆనందం స్వయంగా వీక్షించడం గొప్ప అనుభూతి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి అదనపు ప్రధాన కార్యదర్శి మురుగానందం, సీఎం కమ్యూనికేషన్స్ విభాగంలో ప్రత్యేక అధికారి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంతో న్యాయవాద సంఘాల భేటీ

సచివాలయంలో గురువారం సీఎం స్టాలిన్‌ను న్యాయవాద సంఘాల నేతలు కలిశారు. కేంద్రం తీసుకు వచ్చిన కొత్త న్యాయ చట్టాలకు వ్యతిరేకంగా న్యాయవాదులు పోరాటాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ చట్టాలకు వ్యతిరేకంగా సీఎం స్టాలిన్ సైతం స్పందించారు. కేంద్ర హోంశాఖకు లేఖ కూడా రాశారు. ఈ పరిస్థితులలో డీఎంకే ఎంపీ, సీనియర్ న్యాయవాది విల్సన్ నేతృత్వంలో తమిళనాడు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ప్రభాకరన్, తమిళనాడు పుదుచ్చేరి అసోసియేషన్ సమాఖ్య అధ్యక్షుడు మారప్పన్, కోశాధికారి మురళీ బాబు, కార్యదర్శి కార్తికేయన్ తదితరులు సీఎం స్టాలిన్‌ను కలిశారు. చట్టానికి వ్యతిరేకంగా కేంద్రానికి లేఖ రాసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ చట్టాలకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో నిరసన గళం వినిపించే విధంగా ఎంపీలను ఆదేశించాలని న్యాయవాద సంఘాల నేతలు ముఖ్యమంత్రిని కోరారు.



సీఎం స్టాలిన్‌తో న్యాయవాదుల సంఘం ప్రతినిధులు, నేతలు

అనారోగ్యంతో నీలగిరి మాజీ ఎంపీ మృతి

సాక్షి, చెన్నై: అనారోగ్యంతో నీలగిరి పార్లమెంటు నియోజకవర్గం అన్నాడీఎంకే మాజీ ఎంపీ గోపాలకృష్ణన్ (63) గురువారం మృతి చెందారు. వివరాలు.. నీలగిరి జిల్లా కున్నూర్‌కు చెందిన గోపాలకృష్ణన్ న్యాయ వాద వృత్తి నుంచి రాజకీయాల్లోకి వచ్చారు. 2011లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కున్నూరు పంచాయతీ అధ్యక్షుడిగా గెలిచారు. వెనువెంటనే 2014లో జరిగిన పార్లమెంటు ఎన్నికల సమయంలో నీలగిరి నియోజకవర్గ అన్నాడీఎంకే అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం ఆయనకు దక్కింది. ఈ ఎన్నికలలో డీఎంకే అభ్యర్థి ఎ.రాజాపై గెలుపొందారు. ఈ పరిస్థితులలో గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఇంట్లోనే ఉంటూ చికిత్స పొందుతూ వచ్చిన గోపాలకృష్ణన్ గురువారం ఉదయం కన్నుమూశారు. ఆయన భౌతికకాయాన్ని కున్నూరులోని ఆయన స్వగృహంలో పార్టీ వర్గాలు, ప్రజల సందర్శనకు ఉంచారు. సాయంత్రం ఆయన భౌతికకాయానికి అంత్యక్రియలు జరిగాయి.

నీటికుంటలో మునిగి ఇద్దరు చిన్నారులు..



మృతి చెందిన చిన్నారులు

తిరుత్తణి: అరక్కోణం తాలూకాలోని గురువరాజుపేట సమీపం రామాపురం గ్రామానికి చెందిన వినాయకం కుమార్తె పవిత్ర(5), రాజేష్ కొడుకు గుణ(5). వీరిద్దరూ స్థానిక ప్రైవేటు పాఠశాలలో యూకేజీ చదువుకుంటున్నారు. గురువారం సాయంత్రం పాఠశాలకు వెళ్లి ఇంటికి వచ్చి గ్రామానికి అక్కడున్న నీటి కుంటలో ఆడుతూపాడుతూ బురదలో చిక్కుకున్నారు. స్థానికులు కాపాడి వెంటనే తిరుత్తణి ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అయితే చిన్నారులను పరీక్షించిన వైద్యులు అప్పటికే చిన్నారులు ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు నిర్ధారించారు. అరక్కోణం తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కల్తీ సారా బాధితులకు పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న సుధాకర్‌రెడ్డి, అశోక్‌బాబు

సాక్షి, చెన్నై: కల్తీ సారా బారినపడి ఆస్పత్రిలో ఇంకా చికిత్స పొందుతున్న వారిని బీజేపీ రాష్ట్ర వ్యవహారాల కో– ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, కర్ణాటక బీజేపీ జాతీయ కో– ఇన్‌చార్జ్ అశోక్ బాబు గురువారం పరామర్శించారు. పుదుచ్చేరిలోని జిప్మర్‌లో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి, వారి ఆరోగ్యం, వారికి అందుతున్న వైద్య చికిత్సల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

గూండా చట్టం నమోదు

కళ్లకురిచ్చి కల్తీ సారా కేసులో అరెస్టయిన వ్యాపారులు పళని స్వామి(35), హృదయరాజ్(39), పుదుచ్చేరి అన్నాదురై(46), శక్తివేల్(42), కుమార్(55)పై నాన్ బెయిల్ వారెంట్‌తో కూడిన గూండా చట్టాన్ని ప్రయోగిస్తూ ఆ జిల్లా కలెక్టర్ ప్రశాంత్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. అలాగే ఈ కేసును విచారిస్తున్న సీబీసీఐడీ అధికారులకు బహ్రూటి సమీపంలోని ఓ పెట్రోల్ బంక్‌లో 2 వేల లీటర్ల మిథనాల్‌ను సీజ్ చేశారు. నిందితుడు మాధేష్ ఇచ్చిన సమాచారంతో స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా విల్లుపురం ముండియం బాక్కం ఆస్పత్రిలో క్యాన్సర్ రోగి జయరామన్ మృతికి సారా కారణంగా తేలింది. ఆస్పత్రిలో చికిత్సలో ఉన్న జయరామన్‌కు అతడి బంధువు మురుగన్ పుదుచ్చేరి నుంచి సారా ప్యాకెట్ తీసుకొచ్చి మరీ ఇవ్వడం సీసీ కెమెరాలకు చిక్కింది. బుధవారం ఆస్పత్రిలో జయరామన్ మరణించిన నేపథ్యంలో గురువారం అతడి బంధువు మురుగన్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

సేలంలో అన్నాడీఎంకే నేత హత్య



షణ్ముగం (ఫైల్)

సేలం: అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళణి స్వామి సొంత జిల్లా సేలంలో అన్నాడీఎంకే నేత షణ్ముగం (54) దారుణహత్యకు గురయ్యాడు. వివరాలు.. సేలం కొండలం పట్టి మండలం మాజీ అధ్యక్షుడు, అన్నాడీఎంకే కార్యదర్శి షణ్ముగం బుధవారం రాత్రి బైక్‌పై బయటకు వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. కొండం పట్టి మారియమ్మన్ ఆలయం సమీపంలో ఓ ముఠా ఆయనపై దాడి చేసింది. కత్తులతో నరికి చంపేసి ఉడాయించింది. సమాచారం అందుకున్న అన్నాడీఎంకే వర్గాలు నిందితులను పట్టుకునే వరకు ఘటనా స్థలం నుంచి మృతదేహాన్ని తొలగించకూడదని పోలీసుతో వాగ్వాదానికి దిగారు. వివాదం ముదరడంతో పోలీసు ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. నిందితులను పట్టుకునేందుకు ఐదు బృందాలు రంగంలోకి దిగాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. గురువారం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

'సహకార' కసరత్తు

- ఎన్నికల ప్రక్రియపై దృష్టి
- 63 లక్షల మంది సభ్యుల తొలగింపు
- కొత్త సభ్యులను చేర్చేందుకు చర్యలు

సాక్షి, చెన్నై: సహకార సంఘాల ఎన్నికలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఎన్నికల ప్రక్రియ పనులలో భాగంగా ఓటర్ల జాబితా తయారీకి అధికారులు చర్యలు చేపట్టారు. అన్నాడీఎంకే హయాంలో చేర్పించిన సభ్యుల సమగ్ర వివరాలను పరిశీలించి 63 లక్షలమందిని జాబితా నుంచి తొలగించారు. వివరాలు.. రాష్ట్రంలో 23,149 సహకార సంఘాలు ఉన్నాయి. వీటికి ఐదేళ్లకు ఒకసారి ఎన్నికలు నిర్వహించడం జరుగుతోంది. 2018లో ఎన్నికలు జరిగాయి. అన్నాడీఎంకే అప్పట్లో అధికారంలో ఉండడంతో ఈ సంఘాలను క్లీన్‌స్వీప్ చేసుకుంది. అధ్యక్ష, ఉపాధ్యక్ష, సభ్యుల పదవులను ఆ పార్టీకి చెందిన స్థానిక నేతలే చేజిక్కించుకున్నారు. 2021లో డీఎంకే అధికారంలోకి రాగానే, ఈ సహకార సంఘాలన్నింటినీ రద్దు చేయించే దిశగా వ్యూహాలకు పదునుపెట్టింది. 5 సంవత్సరాలే కాకుండా ఇక మీదట 3 సంవత్సరాలే సహకార సంఘాల పదవీ కాలం అని ప్రకటించింది. ఇందుకు సంబంధించిన ముసాయిదా అసెంబ్లీ ఆమోదం పొందింది. అయితే ఈ ముసాయిదాకు గవర్నర్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వలేదు. దీంతో ప్రభుత్వ వ్యూహం బెడిసి కొట్టినట్లయ్యింది. ప్రస్తుతం సహకార సంఘాల పదవీ కాలం ముగిసింది. మళ్లీ ఎన్నికల నిర్వహణకు సహకార శాఖ సిద్ధమైంది.



తమిళనాడు సహకార యూనియన్ కార్యాలయం

కసరత్తులు..

సహకార ఎన్నికలు అన్నాడీఎంకే హయాంలో అనేక అవకతవకలకు నడుమ జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఈసారి పకడ్బందీ చర్యలపై దృష్టి పెట్టారు. గతంలో గెలుపే లక్ష్యంగా తమ పార్టీ వర్గాలను సహకార సంఘాల సభ్యులుగా చేర్పించి, ఓట్లను అన్నాడీఎంకే వర్గాలు రాబట్టుకున్నాయన్న ఆరోపణలను ప్రస్తుతం పరిగణించారు. సహకార సంఘాలలో నిజమైన సభ్యులు ఎవరో తేల్చే విధంగా గత కొద్ది రోజులుగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బోగస్ ఓటర్ల ఏరివేత రహస్యంగా సాగడం గమనార్హం. సభ్యులుగా ఉన్న వాళ్లు తమ ఆధార్, రేషన్ కార్డును సహకార సంఘాలలో సమర్పించాలని ఆదేశించారు. దీంతో సభ్యులుగా ఉన్న వాళ్లు తమ గుర్తింపు కార్డులను సమర్పించారు. కోటి 90 లక్ష 26 వేల 152 మంది సహకార సభ్యుల పేర్లు ఓటరు జాబితాలో ఉండగా, 63 లక్ష 22 వేల 288 మంది ఆధార్, రేషన్ కార్డుల నకలును సమర్పించ లేదు. వీరంతా బోగస్ అని తేలడంతో ఓటరు జాబితా నుంచే కాదు, సహకార సంఘాల సభ్యుల జాబితా నుంచి తొలగిస్తూ ప్రస్తుతం చర్యలు తీసుకున్నారు. కొత్తగా సహకార సంఘాలలో సభ్యులుగా చేరదలచిన వారు తమ ఆధార్, రేషన్ తదితర గుర్తింపు కార్డులు సమర్పించి చేరేందుకు అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రక్రియను నెలాఖరులోపు ముగించి ఆగస్టులో సహకార నగారా మోగించే దిశగా కసరత్తు సాగుతోంది. దీంతో ఈ పదవులను చేజిక్కించుకునేందుకు డీఎంకు చెందిన ఆయా ప్రాంతాల స్థానిక నాయకులు ప్రయత్నాలపై దృష్టి పెట్టారు. కొత్త సభ్యులను చేర్పించుకుని తమ బలాన్ని చాటుకునే పదవులను చేజిక్కించుకునే వ్యూహంతో ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది.

రంగన్న సర్కారుకు గండం?

- మద్దతు ఉపసంహరణకు బీజేపీ ఎమ్మెల్యేల పట్టు
- పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డాకు ఫిర్యాదు
- అమిత్ షా భేటీలో నిర్ణయం

సాక్షి, చెన్నై: పుదుచ్చేరి రాజకీయం ఢిల్లీ వేదికగా వేడెక్కింది. సీఎం రంగస్వామి సర్కారుకు గండం ఎదురు కాబోతున్నట్టుగా పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయి. ఈ ప్రభుత్వానికి ఇస్తున్న మద్దతును ఉపసంహరించుకోవాలని పార్టీ పెద్దలకు వినతిపత్రాలు, ఫిర్యాదుల రూపంలో పుదుచ్చేరి బీజేపీ ఎమ్మెల్యేలు ఒత్తిడి తెస్తుండడం చర్చకు దారి తీసింది. వివరాలు.. కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలో బీజేపీ – ఎన్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న విషయం తెలిసిందే. సీఎంగా ఎన్ఆర్ కాంగ్రెస్‌నేత రంగస్వామి, హోంశాఖ మంత్రిగా బీజేపీనేత నమశ్శివాయం వ్యవహరిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం రంగస్వామిపై బీజేపీ ఎమ్మెల్యేలు తిరుగుబాటు ధోరణి అనుసరించే పనిలో పడ్డారు. బీజేపీ ఎమ్మెల్యే కల్యాణ సుందరం నేతృత్వంలో పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు జాన్‌కుమార్, రిచర్డ్ జాన్‌కుమార్, బీజేపీ మద్దతు స్వతంత్ర ఎమ్మెల్యేలు శివశంకర్, అంగాలన్, నామినేటెడ్ ఎమ్మెల్యేలు వెంకటేషన్, అశోక్ బాబు రంగన్న సర్కారుపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేయడమే కాకుండా, ఫిర్యాదులను, ఆరోపణలను హోరెత్తించే పనిలో పడ్డారు. అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తయినా ఇంత వరకు తమకు నామినేటెడ్ పోస్టులను రంగస్వామి కేటాయించక పోవడం, తమతో చర్చించకుండానే తమ నియోజకవర్గాలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడం వంటి పరిణామాలను అస్త్రంగా చేసుకుని బీజేపీ ఎమ్మెల్యేలు రంగన్న సర్కారును కూల్చే వ్యూహంతో ఉన్నట్టు సంకేతాలు వెలువడ్డాయి. ఇందుకు బలాన్ని చేకూర్చే విధంగా తొలుత లెఫ్టినెంట్ గవర్నర్ సీపీరాధాకృష్ణన్‌కు ఫిర్యాదు చేశారు. ఈనెల 2వతేదీ ఢిల్లీ వెళ్లిన ఎమ్మెల్యేల బృందం అక్కడే తిష్ట వేశారు.



జేపీ నడ్డాతో సమావేశమైన బీజేపీ ఎమ్మెల్యేలు

ఢిల్లీలో మంతనాలు

బుధవారం కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్‌తో బీజేపీ ఎమ్మెల్యేలు భేటీ అయ్యారు. గురువారం బీజేపీ జాతీయఅ ధ్యక్షుడు జేపీ నడ్డాను కలిశారు. పుదుచ్చేరిలో జరుగుతున్న పరిణామాలను, సీఎం రంగస్వామి తమతో వ్యవహరిస్తున్న తీరును నడ్డాకు ఫిర్యాదు చేశారు. పుదుచ్చేరిలో తమ మద్దతుతో కొనసాగుతున్న రంగస్వామి సర్కారుకు కూల్చేద్దామన్న నిర్ణయాన్ని నడ్డా దృష్టికి తీసుకెళ్లినట్టు సంకేతాలు వెలువడ్డాయి. ప్రభుత్వానికి ఇస్తున్న మద్దతును వెనక్కి తీసుకోవాలని పట్టుబట్టినట్టుగా ఓ ఎమ్మెల్యే పేర్కొనడం గమనార్హం. అదే సమయంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో భేటీ అనంతరం కీలక నిర్ణయం తీసుకునేందుకు ఎమ్మెల్యేలు నిర్ణయించారు. శుక్రవారం అమిత్‌షాతో భేటీకి అవకాశాలు ఉండడంతో, ఫిర్యాదు చేసినానంతరం ఆయన ఇచ్చే సూచన మేరకు తదుపరి అడుగులు వేయడికి పుదుచ్చేరి బీజేపీ ఎమ్మెల్యేలు సిద్ధం అవుతోండడంతో రాజకీయం వేడెక్కింది. ఈ ఎమ్మెల్యేలు కీలక నిర్ణయం తీసుకున్న పక్షంలో రంగన్న సర్కారుకు గండం తప్పదేమో? అనే చర్చ జోరందుకుంది.

విక్రవాండికి.. ఉదయనిధి

- రెండు రోజుల పాటు ప్రచారం
- ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

సాక్షి, చెన్నై: విక్రవాండి ఉప ఎన్నికల్లో నేతల ప్రచారం హోరెత్తుతోంది. ఈ నేపథ్యంలో డీఎంకే యువజన నేత, మంత్రి ఉదయ నిధి రెండు రోజుల పాటుగా నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఎన్నికల ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం వేగవంతం చేసింది. ఈవీఎంలలో చిహ్నాలను పొందు పరిచే కార్యక్రమంతో పాటు, పోలీసుల తపాల్ ఓట్ల నమోదు ప్రక్రియను గురువారం ఆ జిల్లా కలెక్టర్ ఎన్నికల అధికారి పళణి పర్యవేక్షించారు. వివరాలు.. విక్రవాండి అసెంబ్లీ స్థానానికి ఈనెల 10వ తేదీన ఉప ఎన్నిక జరగనున్న విషయం తెలిసిందే. డీఎంకే అభ్యర్థి అన్నియూరు శివాకు మద్దతుగా మంత్రులు ఆ నియోజకవర్గంలో తిష్ట వేశారు. గ్రామగ్రామానా తిరుగుతూ ఓట్ల వేటలో దూసుకెళ్తున్నారు. పీఎంకే అభ్యర్థి సి. అన్బుమణికి మద్దతుగా ఆ పార్టీ అధ్యక్షుడు అన్బుమణి రాందాసు ప్రచారంలో పరుగులు తీస్తున్నారు. నామ్ తమిళర్ కట్చి అభ్యర్థి అభినయకు మద్దతుగా ఆ పార్టీ నేత సీమాన్ ఓట్ల వేటలో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో డీఎంకే అభ్యర్థికి మద్దతుగా ప్రచార ప్రయాణానికి డీఎంకే యువజన ప్రధాన కార్యదర్శి, మంత్రి ఉదయనిధి స్టాలిన్ సిద్ధమయ్యారు. ఈనెల 7,8 తేదీలలో ఆయన నియోజకవర్గంలో పర్యటించనున్నారు. 8 గ్రామాలలో ఆయన ఓటర్లను ఉద్దేశించి ప్రసంగించే విధంగా డీఎంకే వర్గాలు ఏర్పాట్లు చేపట్టాయి.



ఉదయనిధి స్టాలిన్

పోస్టల్ ఓట్ల నమోదు..

ప్రచారం ఓ వైపు ఉధృతంగా సాగుతుంటే, మరో వైపు ఎన్నికల సమయం సమీపించడంతో ఏర్పాట్లపై అధికారులు దృష్టి పెట్టారు. ఈ విషయంపై ఆ జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి పళణి మాట్లాడుతూ, పోలీసులకు తపాల (పోస్టల్) ఓట్ల నమోదు తాలుకా కార్యాలయంలో శనివారం వరకు జరగనున్నట్లు వివరించారు. 370 మంది తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారని పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు 574 మంది తమ తపాల్ ఓట్లను నమోదు చేశారని తెలిపారు. ఈవీఎంలలో చిహ్నాలు, అభ్యర్థుల పేర్లను పొందు పరిచే పనులు శరవేగంగా జరుగుతున్నట్టు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 276 పోలింగ్ బూత్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని, 140 పోలింగ్ బూత్‌లలో వెలుపల, పరిసరాలలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. 44 సమస్యాత్మక పోలింగ్ బూత్‌లను గుర్తించామని, ఇక్కడ పారా మిలటరీ భద్రతకు నిర్ణయించామన్నారు. ఈనెల 10 వ తేదీ విక్రవాండికి లోకల్ హాలిడే ప్రకటించనున్నామని, రెండు రోజులు టాస్మాక్ దుకాణాల మూతకు ఆదేశాలు ఇవ్వానున్నామన్నారు. తమకు ఇప్పటి వరకు 41 ఫిర్యాదులు వచ్చాయని, వీటిని పరిశీలించి చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

క్లుప్తంగా

సారా ఊట ధ్వంసం



సారా ఊట ధ్వంసం చేస్తున్న పోలీసులు

వేలూరు: ఎస్పీ మణివన్నన్ ఆదేశాల మేరకు వేలూరు జిల్లావ్యాప్తంగా సారా విక్రయం, తయారీపై ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక నిఘా ఉంచారు. ఈమేరకు అటవీ ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. అనకట్టు నియోజక వర్గంలోని అల్లేరి, జార్థాన్ కొల్లై, తదితర అటవీ ప్రాంతాల్లో సారా ఊటలను గుర్తించి ధ్వంసం చేశారు. ఆంధ్ర సరిహద్దుల్లోనూ పెద్దఎత్తున సోదాలు చేస్తున్నట్లు తెలిసింది.

స్కూల్ వ్యాన్ ఢీకొని చిన్నారి మృతి

అన్నానగర్: స్కూల్ వ్యాన్ ఢీకొని చిన్నారి మృతి చెందింది. తంజావూరులోని నటరాజపురానికి చెందిన ఇళయరాజా (40) కెరీర్ డెవలప్‌మెంట్ శిక్షణ కేంద్రాన్ని నడుపుతున్నాడు. ఇతనికి భార్య అభినయ, సాయివెన్బ(4), ద్యాలిని(2) అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరిలో తంజావూరులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో సాయివెన్బ ఎల్‌కేజీ చదువుతోంది. గురువారం సాయివెన్బ స్కూల్ నుంచి వ్యాన్‌లో ఇంటికి వచ్చింది. పాపను తీసుకెళ్లడానికి సాయివెన్బ తాత పళనివేల్ వెళ్లాడు. ఆ సమయంలో రెండేళ్ల చిన్నారి ద్యాలిని కూడా వెళ్లింది. అయితే చిన్నారిని పట్టించుకోకుండా డ్రైవర్ వ్యాన్‌ను స్టార్ట్ చేసినట్లు తెలుస్తోంది. దీంతో వ్యాను చక్రం ఎక్కి దిగడంతో చిన్నారి ద్యాలిని అక్కడికక్కడే మృతి చెందింది. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాన్ ఢీకొని డీఎంకే మహిళా నేత..

అన్నానగర్: వ్యాన్ ఢీకొని డీఎంకే మహిళా నేత మృతి చెందింది. చెన్నై సమీపంలోని పుళల్ భజనై కోవిల్ వీధికి చెందిన క్లారా (59) డీఎంకే పుళల్ 23వ జిల్లా ఉప కార్యదర్శిగా ఉన్నారు. ఓ ప్రైవేట్ కంపెనీలోనూ పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి పుళల్ సైకిల్ షాప్ సమీపంలో చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారిని దాటేందుకు యత్నించింది. ఆ సమయంలో మాధవరం నుంచి పుళల్ వైపు వస్తున్న వ్యాను ఢీకొంది. దీంతో క్లారా అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదంపై మాధవరం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'కావల్ కరంగల్'కు మూడు రెస్క్యూ వాహనాలు

కొరుక్కుపేట: రెస్క్యూ అండ్ రిలీఫ్ పనుల కోసం కావల్ కరంగల్ బృందానికి అందించిన 3 రెస్క్యూ వాహనాలను గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ సందీప్ రాయ్ రాథోడ్ జెండా ఊపి లాంఛ ప్రారంభించారు. 'కావల్ కరంగల్' పథకం గ్రేటర్ చెన్నై పోలీసుల చొరవతో 2021లో 9444717100 (24గీ7) హెల్ప్‌లైన్ నంబర్‌తో ప్రారంభమైంది. 'మానవులను గౌరవించడం – మానవత్వానికి సేవ చేయడం' అనే లక్ష్యంతో ఇది ఏర్పాటైంది. ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించడం, రక్షించడం, సరైన వైద్య సంరక్షణ, రక్షణ, కౌన్సెలింగ్, మద్దతు ఇవ్వడం ద్వారా నిరుపేదలు, మానసిక స్థితి కోల్పోయిన వ్యక్తులను రక్షించడం, మంచి సంరక్షణ ఆశ్రయాల్లో వారిని ఉంచడం, కుటుంబాలను గుర్తించి అప్పగించడం, అలాగే క్లెయిమ్ చేయని మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించి వలంటీర్ల సహాయంతో గౌరవప్రదంగా ఖననం చేయడం ఈ బృందం పని. ఇప్పటి వరకు, కావల్ కరంగల్ బృందం 6,876 మంది నిరాశ్రయులను రక్షించింది. అంతేకాకుండా, 1,88,019 కిలోల ఆహారాన్ని దాతల నుంచి సేకరించి, కావల్ కరంగల్ ఆహార వాహనం ద్వారా ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ నేపథ్యంలో ఎగ్మూర్‌లోని రాజరత్నం స్టేడియంలో రోటరీ క్లబ్ మద్రాస్ సెంట్రల్ నుంచి కావల్ కరంగల్ బృందానికి రక్షణ కోసం అందించిన మూడు రెస్క్యూ ఎల్‌వీఎం వాహనాలను పోలీసు కమిషనర్ సందీప్ రాయ్ రాథోడ్ జెండా ఊపి ప్రారంభించారు. అలాగే కావల్ కరంగల్ వలంటీర్లకు రెస్క్యూ కిట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (హెడ్ క్వార్టర్స్) కపిల్ కుమార్ సి శరత్కర్, రోటరీ క్లబ్ మద్రాస్ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్‌లు, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్, పోలీస్ ఆఫీసర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



జెండా ఊపి రెస్క్యూ వాహనాలను ప్రారంభిస్తున్న పోలీసు కమిషనర్ సందీప్ రాయ్ రాథోడ్

పేద విద్యార్థికి యేవా సంస్థ చేయూత

కొరుక్కుపేట: చెన్నైలోని పేద విద్యార్థికి యేవా సంస్థ ఆపన్న హస్తం అందించింది. చెన్నై పులియంతోపులోని కన్యకాపురంలో నివసిస్తున్న జయంతి కుమారుడు సంతోష్ ప్లస్ -2 పరీక్షల్లో ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించాడు. ఈ విద్యార్థి పాలిటెక్నిక్‌లో చేరడానికి తగిన ఆర్థిక స్థోమత లేనందున యూత్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసోసియేషన్ (యేవా)ను ఆశ్రయించాడు. దీంతో యేవా సంస్థ అతనికి పాలిటెక్నిక్‌లో చేరడానికి తగిన ఫీజును, రెండు జతల బట్టలను, విద్యాసామగ్రిని అందించింది.



విద్యార్థికి సాయం అందిస్తున్న యేవా వ్యవస్థాపకుడు మాల్యాద్రి

7న మహిళల కార్ల ర్యాలీ

కొరుక్కుపేట: డచ్చస్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన చెన్నై నగరంలో మహిళల కార్ల ర్యాలీ నిర్వహించనున్నట్లు డచెస్ క్లబ్ నిర్వాహకులు, సవేరా హోటల్ అధినేత నీనారెడ్డి తెలిపారు. మైలాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నీనారెడ్డి మాట్లాడుతూ గ్రేటర్ చెన్నై చరిత్రను నగరంలో స్థిరపడిన పొరుగు రాష్ట్రాల వారు తెలుసుకునేలా 23 ఏళ్లుగా మహిళల కార్ల ర్యాలీని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 7వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటలకు సవేరా హోటల్ ప్రాంగణం నుంచి బయల్దేరనున్న ర్యాలీలో 100 కార్లు పాల్గొంటున్నాయని, ఒక్కొక్క కారులో నలుగురు మహిళలుంటారని, 50 నుంచి 65 కిలోమీటర్ల మేరకు ఈ ర్యాలీ సాగుతుందన్నారు. ఏఏ మోటార్స్ స్పోర్ట్స్ సాల్యూషన్స్ అనుమతితో ట్రాఫిక్‌కి ఎలాంటి అంతరాయం లేకుండా నిర్వహించనున్నారు. ఈ ర్యాలీలో పాల్గొనదలచిన వారు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకుంటున్నారని తెలిపారు. నగరంలో చారిత్రాత్మక కట్టడాలు సందర్శించడం, పర్యాటక ప్రాంతాలను సందర్శించే పోటీదారులు వాటి ఫొటోలు కూడా తీసి, పంపిస్తారని, ఆరు కేటగిరీల్లో విజేతలకు విలువైన బహుమతులు పంపిణీ చేయనున్నట్లు నీనా రెడ్డి తెలిపారు.



కార్ల ర్యాలీని విజయవంతం చేయాలని కోరుతున్న నిర్వాహకులు

16 అడుగుల పాములు పట్టివేత



పాములను పట్టుకున్న యువరాజ్

సేలం: ఈరోడ్‌లో ఒక ప్రైవేట్ టైల్స్ గోడౌన్ లోకి ప్రవేశించిన 16 అడుగుల పొడవున్న పాముసహా నాలుగు పాములను యువరాజ్ అనే వ్యక్తి పట్టుకుని అటవీశాఖ అధికారులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. ఈరోడ్ లోని ఇడియంకట్టు వలసు ప్రాంతంలోని ఓ ప్రైవేట్ టైల్స్ గోడౌన్ ఉంది. అందులో పాములు ఉన్నట్టు గురువారం పాములను పట్టే యువరాజ్‌కు సమాచారం అందింది. వెంటనే అక్కడికి చేరుకున్న యువరాజ్ అక్కడ ఉన్న 16 అడుగుల పొడవున్న రెండు పాములసహా నాలుగు పాములను పట్టుకున్నారు. తర్వాత వాటిని అటవీ శాఖ అధికారులకు అప్పగించారు.

ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేయడంపై అవగాహన

వేలూరు: కార్పొరేషన్ పరిధిలో పారిశుద్ధ్య కార్మికులు సేకరించే చెత్తలో ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేసి ఇవ్వాలని ఆరోగ్యశాఖ అధికారి శివకుమార్ సూచించారు. ఈమేరకు బుధవారం వేలూరు కార్పొరేషన్ ఒకటో డివిజన్ పరిధిలోని రైతు బజారు వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇంటి నుంచి ఇచ్చే చెత్తను పూర్తిగా వేరు చేసి ఇవ్వడం ద్వారా సేంద్రియ ఎరువులుగా తయారు చేసే అవకాశం ఉంటుందన్నారు. అలాగే చెత్తను కేటాయించిన ప్రాంతంలోనే వేయాలని ఎక్కడపడితే అక్కడ చెత్తను వేయడంతో పారిశుద్ధ్యం లోపిస్తుందన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు ప్రజలు కూడా సహకరిస్తేనే పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోగలమన్నారు. రైతు బజారులోని వ్యాపారులతో పాటు కొనుగోలు దారులకు, ప్రజలకు కరపత్రాలను అందజేశారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న ఆరోగ్యశాఖ అధికారి

గుర్తింపు కార్డులు మంజూరు చేయాలి

వేలూరు: తమకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని స్వాతంత్ర సమయ యోధుల వారసులు గురువారం కోరారు. గురువారం ఉదయం వేలూరు కలెక్టరేట్‌లో జిల్లాలోని స్వాతంత్ర సమరయోధుల వారసుల సమస్యలపై సమీక్షా సమావేశం కలెక్టర్ సుబ్బలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల వారసులు మాట్లాడుతూ తమకు ఇళ్ల పట్టాలు, పెన్షన్ సదుపాయం, ఉద్యోగావకాశాల్లో అధిక ప్రాధాన్యత, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. తమ సమస్యలపై పలుసార్లు వినతి పత్రాలు సమర్పించినా కాలయాపన చేస్తున్నారని, వీటిపై విచారణ జరిపి వెంటనే పరిష్కరించాలని కోరారు. అలాగే స్వాతంత్ర్య సమరయోధుల వారసుల కుటుంబ సభ్యులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, బస్సులో ప్రయాణం చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. అనకట్టు తాలుకాలోని ఈ-సేవా కేంద్రంలో ప్రతి దరఖాస్తునకు అదనపు నగదు వసూలు చేస్తున్నారని, దీనిపై విచారణ జరిపి, ప్రజలకు న్యాయం చేయాలన్నారు. వినతులను స్వీకరించిన కలెక్టర్ సుబ్బలక్ష్మి తంజై గ్రామానికి చెందిన గోపాలన్ భార్య కౌసల్యకు కుట్టు మిషన్‌ను అక్కడిక్కడే మంజూరు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ సేవా కేంద్రంలో అదనంగా నగదు వసూలు చేస్తున్నారని, తనకు ఫిర్యాదు వచ్చిందని వీటిని తానే నేరుగా వెళ్లి విచారణ జరిపి, న్యాయం చేస్తామన్నారు. ప్రస్తుతం వారసులు ఇచ్చిన వినతులపై ప్రభుత్వానికి నివేదిక పంపి, న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. డీఆర్వో మాలతి, మాజీ కౌన్సిలర్ చంద్రప్రకాష్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సాతంత్ర్య సమరయోధుల వారసులు

ఆర్కేపేటలో 54 ఇళ్లు కూల్చివేత

పళ్లిపట్టు: ఆర్కేపేటలో పోలీసు బందోబస్తు నడుమ 54 ఇళ్లను రెవెన్యూ అధికారులు కూల్చివేసిన ఘటన కలకలం రేపింది. తిరువళ్లూరు జిల్లా ఆర్కేపేట మండలంలోని ఎస్‌వీజీపురంలో ఆది ద్రావిడ సంక్షేమ శాఖ ద్వారా 20 ఏళ్లకు క్రితం వంద కుటుంబాలకు చెందిన పేదలకు ఉచితంగా ఇళ్లపట్టాలు మంజూరు చేశారు. అయితే ఇళ్లు నిర్మించుకుని కాపురం ఉండేందుకు సౌకర్యాలు లేదని, ఇళ్లు నిర్మించుకోకుండా లబ్ధిదారులు ఖాళీగా విడిచి పెట్టారు. ఈ క్రమంలో మూడు నెలల కిందట రెవెన్యూ శాఖ అధికారులు పేదలకు ఇచ్చిన స్థలాన్ని ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ ప్రైవేటు వ్యక్తులు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. దీంతో ఆందోళన చెందిన లబ్ధిదారులు ఆగమేఘాలపై రెండు నెలల్లో తాత్కాలికంగా ఇళ్లు నిర్మించుకున్నారు. అయితే ఇవేమి పట్టించుకోని రెవెన్యూ అధికారులు గురువారం డీఎస్పీ విఘ్నేష్, సీఐ ధర్మలింగం ఆధ్వర్యంలో 200 మంది పోలీసులు ఎస్‌వీజీ.పురంలో మొహరించి తహసీల్దార్ విజయకుమార్ ఆధ్వర్యంలో 6 జేసీబీల సాయంతో ఇళ్లను కూల్చివేశారు. కష్టపడి కట్టుకున్న ఇళ్లను కూల్చివేయడం చూసి బాధితులు బోరుమని విలపించి కన్నీరు మున్నీరయ్యారు.



ఆర్కేపేట యూనియన్ ఎస్‌వీజీ పురంలో ఇళ్లు కూల్చివేస్తున్న అధికారులు

కోలీవుడ్ టాక్స్



జమ చిత్రంలో పారి ఇళవళగన్, అమ్ము అభిరామి

కూలంగళ్ సంస్థ నుంచి మరో చిత్రం

తమిళసినిమా: అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో ప్రదర్శింపబడిన చిత్రం కూలంగళ్. ఆస్కార్ అవార్డుల పోటీ వరకు వెళ్లిన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలు పొందిన విషయం తెలిసిందే. ఈ చిత్రాన్ని నిర్మించిన లెర్న్ అండ్ టీచ్ ప్రొడక్షన్స్ సంస్థ అధినేత సాయి దేవానంద్ నిర్మిస్తున్న తాజా చిత్రం జమ. ఈ చిత్రానికి పారి ఇళవళగన్ దర్శకత్వం వహిస్తూ ప్రధాన పాత్రను పోషిస్తున్నారు. నటుడు చేతన్, అమ్ము అభిరామి, శ్రీకృష్ణదేవరాయన్, కేవీఎన్ మణిమేఘాలై, కాలాకుమార్, వసంత్ మారిముత్తు తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి ఇళయరాజా సంగీతం అందిస్తున్నారు. గోపాలకృష్ణన్ ఛాయాగ్రహణం నిర్వహిస్తున్న ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకుని త్వరలో తెరపైకి రావడానికి సిద్ధమవుతోంది. చిత్రం వివరాలను దర్శకుడు వెల్లడిస్తూ.. పారంపర్య, సంస్కృతి సంప్రదాయాలతో కూడిన కథా చిత్రాలకు ప్రేక్షకుల ఆదరణ ఎప్పుడూ ఉంటుందన్నారు. అలాంటి తమిళనాడు సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే వీధి నాటకాల కళాకారుల జీవన విధానం, వారు ఎదుర్కొనే సవాళ్లను ఆవిష్కరించే కథా చిత్రంగా జమ ఉంటుందన్నారు. దీన్ని తిరువణ్ణామలై నేపథ్యంలో రూపొందించినట్లు చెప్పారు. చిత్రం షూటింగ్‌ను సింగిల్ షెడ్యూల్లో నిర్వహించి 35 రోజుల్లో పూర్తి చేసినట్లు చెప్పారు. చిత్రానికి ఇళయరాజా అందించిన పాటలు నేపథ్య సంగీతం పక్కా బలంగా ఉంటాయనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.



రకుల్ ప్రీత్ సింగ్

రకుల్‌కు కోపం వచ్చింది

తమిళసినిమా: భారతీయ సినిమాలో ప్రముఖ కథానాయకల్లో ఒకరిగా గుర్తింపు తెచ్చుకున్న నటి రకుల్ ప్రీత్ సింగ్. తెలుగు, తమిళం, హిందీ తదితర భాషల్లో నటిస్తున్న ఈమె ఎక్కువగా అందాల ఆరబోతకే ప్రాధాన్యతనిస్తూ వచ్చారు అని చెప్పక తప్పదు. అయితే ఇటీవల అవకాశాలు తగ్గడంతో చాలాకాలంగా ప్రేమిస్తూ వచ్చిన తన చిరకాల బాయ్ ఫ్రెండ్ జాకీ బాగ్నానిని గత ఫిబ్రవరిలో పెళ్లి చేసుకున్నారు. కాగా కమలహాసన్ కథానాయకుడిగా శంకర్ దర్శత్వంలో రూపొందిన ఇండియన్– 2 చిత్రంలో రకుల్ ప్రీత్ సింగ్ ముఖ్య పాత్రలో నటించారు. ఇందులో ఆమె నటుడు సిద్ధార్థ్‌కు జంటగా నటించారు. ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమం పూర్తి చేసుకుని ఈ నెల 12వ తేదీన ప్రపంచవ్యాప్తంగా తెరపైకి రావడానికి సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా రకుల్ ప్రీత్ సింగ్ ఇన్‌స్టాగామ్‌లో తన ఫాలోవర్స్‌తో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆమె తన గురించి ఏమైనా అడగండి అంటూ పోస్ట్ చేశారు. దీంతో పలువురు అభిమానులు రకుల్ ప్రీత్ సింగ్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు. వారందరికీ ఎంతో ఓపిగ్గా బదులిచ్చిన రకుల్ ప్రీత్ సింగ్ ఒక ప్రశ్నకు మాత్రం కోపంతో రగిలిపోయారు. ఇంతకీ ఆ ప్రశ్న ఏంటో తెలుసా? ఒక అభిమాని వివాహ వ్యవస్థ గురించి మీ అభిప్రాయం ఏమిటి? ఎప్పుడు పెళ్లి చేసుకోబోతున్నారు అని అడిగాడు. దీంతో రకుల్ ప్రీత్ సింగ్ కోపం కట్టలు తెచ్చుకుంది. అయినా సహనం పాటిస్తూ తన పెళ్లి ఎప్పుడో జరిగిపోయిందని, తనను ఇంకా ఎన్నిసార్లు పెళ్లి చేసుకోమంటారంటూ కాస్త చిరాగ్గా ప్రశ్నించారు. అలాగే ఆమె తన భర్త జాకీతో కలిసి ఉన్న ఫొటోలను ఇన్‌స్టాగామ్‌లో పోస్ట్ చేశారు.

ప్రేమంటే ఇదేరా..!



అజిత్, షాలిని

తమిళసినిమా: ఇద్దరి మధ్య అనుబంధాన్ని, మనసులను పెనవేసేది ప్రేమ. ఒకసారి మనసులు కలిస్తే జీవితాంతం విడిపోని బంధమే ప్రేమ. అలాంటి ప్రేమకు ఉదాహరణ నటుడు అజిత్, నటి షాలిని జంట. అమర్కళం చిత్రం షూటింగ్‌లో పుట్టిన వీరి మధ్య ప్రేమ పెళ్లికి దారి తీసింది. ఆ తర్వాత వీరిద్దరూ ఒకరికి ఒకరుగా, ఒకరిలో ఒకరిగా ఆదర్శ జీవితాన్ని సాగిస్తున్నారు. వివాహానంతరం నటనకు స్వస్తి పలికిన షాలిని భర్త, పిల్లలే సర్వస్వంగా ఆనందకరమైన జీవితాన్ని గడుపుతున్నారు. కానీ ఆమె ఇటీవల చిన్న అస్వస్థతకు గురయ్యారు. దీంతో చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరి చిన్న శస్త్రచికిత్స చేయించుకున్నారు. భార్యకు శస్త్ర చికిత్స అని తెలియగానే విడాముయర్చి చిత్రం షూటింగ్‌లో ఉన్న నటుడు అజిత్ హుటాహుటిన చెన్నైకి తిరిగి వచ్చి సతీమణి సేవలో మునిగిపోయారు. ఇది ఈ సినీ సెలబ్రిటీస్ ప్రేమానుబంధానికి ప్రతీక. ప్రేమంటే ఇదేరా అని నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఇకపోతే షాలిని ఆస్పత్రిలో తన భర్తతో ఉన్న ఫొటోను ఇన్‌స్ట్రాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. ఆమె పేషెంట్ దుస్తుల్లో ఉన్న ఫొటోను చూసి అభిమానులు దిగ్భ్రాంతికి గురయ్యారు. షాలిని త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ఇంటికి చేరాలని ఇన్‌స్ట్రాగామ్‌లో పోస్టులు పెడుతున్నారు. అయితే షాలిని ఆరోగ్యంగానే ఉన్నట్టు సమాచారం. కాగా తన భార్యకు సర్యలు చేస్తున్న అజిత్, ఆమె డిశ్చార్జి అయిన తర్వాతే మళ్లీ విడాముయర్చి చిత్రం షూటింగ్‌లో పాల్గొంటారని సమాచారం.

ఐ డోంట్ కేర్..!



త్రిష

తమిళసినిమా: అందానికి అందం ఈ పుత్తడి బొమ్మ అనే వర్ణన నటి త్రిషకు చక్కగా నప్పుతుంది అనవచ్చు. ఈమె వయసుతో సమాంతరంగా అందం కూడా పెరుగుతూ వస్తోంది అనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. మొదట్లో అందాల పోటీల్లో చెన్నై క్వీన్‌గా కిరీటాన్ని గెలుచుకున్న బ్యూటీ త్రిష. ఆ తర్వాత జోడీ చిత్రంలో చిన్న సహాయపాత్రలో మెరిసిన త్రిష లేసాలేసా చిత్రం ద్వారా కథానాయకిగా ఎంట్రీ ఇచ్చారు. అయితే సూర్యకు జంటగా నటించిన మౌనం పేసియదే చిత్రం తొలుత తెరపైకి రావడంతో అదే ఆమె తొలిచిత్రంగా ముద్ర పడింది. ఆ తర్వాత విక్రమ్‌తో జత కట్టిన సామీ చిత్రం కమర్షియల్‌గా పెద్ద హిట్ అయ్యి త్రిషకు స్టార్ ఇమేజ్‌ను తెచ్చిపెట్టింది. ఆ తర్వాత ఈ సుందరికి కెరీర్ పరంగా వెనక్కి తిరిగి చూసుకొనే అవకాశం లేకపోయింది. తమిళం, తెలుగు, కన్నడం, మలయాళం, హిందీ భాషల్లో నటిస్తూ పాన్ ఇండియా నటిగా గుర్తింపు పొందింది. ముఖ్యంగా తమిళం తెలుగు భాషల్లో అగ్ర కథానాయకిగా రాణిస్తున్నారు. అలా అగ్ర కథా నాయకిగానే 22 ఏళ్లుగా వెలిగిపోతున్న త్రిష నేటికీ సూపర్ స్టార్స్‌తో జత కడుతూ బిజీగా ఉండడం విశేషం. ముఖ్యంగా తమిళంలో ఇటీవల విజయ్‌తో లియో చిత్రంలో నటించిన ఈమె ప్రస్తుతం అజిత్‌కు జంటగా విడాముయర్చి, కమలహాసన్ సరసన థగ్ లైఫ్ చిత్రాల్లో నటిస్తున్నారు. అలాగే తెలుగులో మెగాస్టార్ చిరంజీవి సరసన, మలయాళంలో మోహన్‌లాల్ వంటి స్టార్ హీరోలతో నటిస్తూ బిజీబిజీగా ఉన్నారు. ఇప్పటికీ ఈమెను చూసిన అభిమానులు అబ్బా ఏం అందం, వయసుతోపాటు అందం కూడా పెరుగుతోంది అని అబ్బురపడుతున్నారు. అయితే ఇప్పటికీ పెళ్లి కాని ఈ నాలుగు దశాబ్దాల పరువాల త్రిష గురించి పలు వదంతులు షికార్లు చేస్తున్నాయి. ముఖ్యంగా ఓ స్టార్ నటుడితో ప్రస్తుతం ఈ భామను కలుపుతూ ప్రచారం హాట్ హాట్‌గా జరుగుతోంది. అయితే అలాంటి ప్రచారాలను ఎప్పుడు పట్టించుకోని త్రిష ఇప్పుడు కూడా డోంట్ కేర్ అంటూ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు. అందులో ఇతరుల అభిప్రాయాలపై తనకెలాంటి చింత లేదని ఆమె పేర్కొన్నారు.

దెయ్యం ఇతివృత్తంతో పార్క్



పార్క్ చిత్రంలో తమన్ కుమార్, శ్వేత టోరది

తమిళసినిమా: అక్షయ మూవీ మేకర్స్ పతాకంపై నటరాజ్ నిర్మిస్తున్న చిత్రం పార్క్. దర్శకుడు ఏ వెంకటేష్ శిష్యుడు ఈకే మురుగన్ దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రంలో తమన్‌కుమార్ కథా నాయకుడుగా నటిస్తున్నారు. ఈయన ఇంతకు ముందు నటించిన ఒరునొడి చిత్రం మంచి విజయాన్ని సాధించింది.

కాగా ఈ తాజా చిత్రంలో నటి శ్వేత టోరది నాయకిగా నటిస్తుండగా ప్రధాన ప్రతినాయకుడిగా యోగిరామ్ నటిస్తున్నారు. కాగా నిర్మాణ కార్యక్ర మం పూర్తి చేసుకున్న పార్క్ చిత్రం త్వరలో తెరపైకి రావడానికి ముస్తాబవుతుంది. చిత్రం వివరాలను దర్శకుడు మీడియాకు విడుదల చేసిన ఓ ప్రకటనలో ఇలా పేర్కొన్నారు. ఇది దెయ్యం ఇతివృత్తంతో రూపొందిస్తున్న కథా చిత్రమని చెప్పారు. దీన్ని పర్ఫెక్ట్ ప్రణాళికతో 36 రోజుల్లోనే షూటింగు పూర్తి చేసినట్లు చెప్పారు. ఇంతకుముందు అనేక దెయ్యాల కథా చిత్రాలు ప్రేక్షకులు చూసి ఉంటారని, అందులో దెయ్యాలను వదిలించడానికి వివిధ మతాలకు చెందిన స్వామీజీలనో, మంత్రగాళ్లనో చూపించి ఉంటారన్నారు. అయితే ఈ చిత్రంలో దెయ్యాన్ని వదిలించడానికి ఏ మతానికి చెందిన స్వామీజీలు గానీ మంత్రగాళ్లుగానీ చూపించలేదని, వేరే విధానంలో దెయ్యాన్ని వదిలించే సన్నివేశాలు చోటు చేసుకుంటాయని చెప్పారు. ఇలాంటి సన్నివేశాలను ఏ చిత్రంలోనూ చూసి ఉండరని చెప్పారు. హారర్ కథా చిత్రాలకు మినిమం గ్యారంటీ ఉంటుందని, పెట్టుబడి పెట్టే నిర్మాతలను అలాంటి చిత్రాలు కాపాడుతాయని, అందుకే ఈ హారర్, థ్రిల్లర్ నేపథ్యంలో పార్క్ చిత్రాన్ని రూపొందించినట్లు చెప్పారు. ఈ చిత్రం కచ్చితంగా ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం ఉందన్నారు. చిత్రాన్ని ఆగస్టు నెలలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు దర్శకుడు తెలిపారు.

క్లుప్తంగా

ఖరీఫ్‌లో రైతులకు తోడ్పాటు

సాక్షి, చెన్నై: రుతు పవనాలు ద్వితీయార్థంలో విస్తృతం కావడంతో ఖరీఫ్ సీజన్‌లో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలు ఉన్న దృష్ట్యా, రైతులకు తమ వంతు తోడ్పాటు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని అంతర్జాతీయ ట్రాక్టర్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ రామన్ మిట్టల్ తెలిపారు. జూన్ 24లో దేశీయ పరిశ్రమను అధిగమించే విధంగా క్వార్టర్-1లో అత్యుత్తమ పని తీరును కనబరిచిన సోనాలికా ట్రాక్టర్ల ఉత్పత్తుల గురించి స్థానికంగా గురువారం ఆయన వివరించారు. క్వార్టర్-1 లో 41,465, జూన్ నెలలో 14,062 ట్రాక్టర్ల అమ్మకాలతో అత్యధిక మార్కెట్ వాటాను సాధించామన్నారు. క్వాలిటీ ఇన్‌ఇండియా నినాదంతో వ్యవసాయ సంబంధిత పనిముట్ల ఉత్పత్తులలో క్వార్టర్-1 ఎఫ్‌వై 25లో కొత్త చరిత్రతో మైలు రాయిని సృష్టిస్తున్నట్టు పేర్కొన్నారు. రుతు పవనాలు ప్రస్తుతం విస్తరించాయని, ఖరీఫ్ విస్తీర్ణం 30 శాతానికి పైగా పెరిగే అవకాశాలు ఉన్న నేపథ్యంలో వ్యవసాయ రంగానికి తోడ్పాటు ఇచ్చే విధంగా అన్నదాతలకు కొత్త వ్యవసాయ, సాంకేతిక యంత్రాలను రూపకల్పన చేసి అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

కండక్టర్లకు రివార్డులు

కొరుక్కుపేట: ప్రయాణికుల్లో డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించే కండక్టర్లకు గవర్నమెంట్ ఎక్స్‌ప్రెస్ క్యాన్సిలేషన్ కార్పొరేషన్ ద్వారా బహుమతి ఇవ్వనున్నట్లు ప్రకటించారు. గత ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ప్రభుత్వ ర్యాపిడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ బస్సుల్లో ఎలక్ట్రానిక్ టికెటింగ్ మెషిన్ ద్వారా టికెట్లు జారీ విధానం అమలులోకి వచ్చింది. ప్రస్తుతం ప్రభుత్వ ఎక్స్‌ప్రెస్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ బస్సుల్లో డిజిటల్ లావాదేవీల ద్వారా టికెట్లు పొందే విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు రవాణాశాఖ పేర్కొంది. గూగుల్ పే, ఫోన్ పే తదితర వాటి ద్వారా టికెట్ చెల్లించి బస్సుల్లో చేసే సౌకర్యం ఉన్నప్పటికీ ఇంకా చాలా మంది డబ్బులు చెల్లించి టికెట్లు పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రయాణికుల్లో డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించే కండక్టర్లకు బహుమతి ఇస్తామని ప్రభుత్వ ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో ప్రతి నెలా అత్యధికంగా ఈ-మనీ లావాదేవీలు జరిపిన కండక్టర్లకు రివార్డులు అందజేస్తారు. కండక్టర్ లను ప్రోత్సహించేందుకు ప్రైజ్‌మనీ, ప్రశంసాపత్రాలు అందజేస్తారు.

వజ్రపు నెక్లెస్ విక్రయం పేరిట రూ.43.57 లక్షల మోసం

అన్నానగర్: వజ్రపు నెక్లెస్ విక్రయం పేరిట రూ.43.57 లక్షల మోసం చేసిన సంఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. చెన్నై షావుకారుపేటకు చెందిన యోగేష్షా (70) ఎన్ఎస్ బోస్ రోడ్డులో డైమండ్ నగల దుకాణం నడుపుతున్నాడు. ఇతనికి బాగా పరిచయం ఉన్న బంగారు ఆభరణాలు కొని, విక్రయించే బ్రోకర్ కన్నన్ ఉన్నాడు. ఈ పరిస్థితిలో మూడు నెలలకు ముందు కన్ననను కలిసిన యోగేష్షా, తన వద్ద రూ.43.57 లక్షల విలువైన డైమండ్ నెక్లెస్ ఉందని, దానిని అమ్మి ఇవ్వగలవా? అని అడిగాడు. తకు అత్యవసరంగా డబ్బు కావాలని యోగేష్షా చెప్పారు. ఈ మేరకు డైమండ్ నెక్లెస్ తీసుకున్న కన్నన్, విక్రయించకుండా మోసం చేశాడు. దీంతో యోగేష్షా ఈ విషయమై థౌజండ్‌లైట్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెన్నైలో గంజాయి విక్రయం

అన్నానగర్: చెన్నైలోని పులియంతోపులో గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో ఇన్‌స్పెక్టర్ అబ్రహం క్రూజ్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం దాడులు చేశారు. లక్ష్మీయమ్మ గుడి సమీపంలో ఒకరిని అదుపులోకి తీసుకుని విచారించగా పెరంబూరు సుబ్రమణియన్ గార్డెన్ ప్రాంతానికి చెందిన లూర్దు ఫెలిక్స్ (22) అని తేలింది. మూలకొత్తలం ప్రాంతానికి చెందిన రాజా(47) నుంచి గంజాయిని కొనుగోలు చేసినట్లు తేలింది. అనంతరం రాజాను అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 600 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే పెరంబూర్ రైల్వేస్టేషన్ వద్దకు వచ్చిన ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ రైలులో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న దిండిగల్ జిల్లా పొన్నగరం ప్రాంతానికి చెందిన దీనన్ (26), హేమంత్ రాజా (23)ను అరెస్టు చేశారు. బేసిన్‌బ్రిడ్జి ప్రాంతంలో జరిపిన దాడిలో బైకుపై వెళుతున్న వ్యక్తి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అతడు కీల్పాక్కంలోని శాస్త్రినగర్ 11వ వీధికి చెందిన మణిమారన్ (30)గా గుర్తించి, అరెస్టు చేశారు.

భార్యను రోకలి బండతో కొట్టి చంపాడు!

అన్నానగర్: భర్త తన భార్యను రోకలి బండతో కొట్టి హతమార్చిన సంఘటన కలకలం సృష్టించింది. వివరాల్లోకి వెళితే.. ఉలుందూరుపేట సమీపంలోని ఎ.కురుంబూరు గ్రామానికి చెందిన వీరమణి (28)కి భార్య దేవనై (26), కొడుకు, కూతురు ఉన్నారు. కొన్ని నెలల క్రితం భార్యాభర్తలిద్దరూ కేరళలో ఉంటూ అక్కడే కూలీ పనులు చేసుకున్నారు. అక్కడ ఓ యువకుడితో దేవనై వివాహేతర సంబంధం పెట్టుకుందని తెలుస్తుంది. ఈ విషయం తెలుసుకున్న వీరమణి భార్యను మందలించి స్వగ్రామానికి తీసుకొచ్చాడు. భార్యను అక్కడే వదిలి వీరమణి తిరిగి కేరళ వెళ్లి ఉద్యోగం చేసేవాడు. కొద్ది రోజుల క్రితం వీరమణి తన భార్య, పిల్లలను చూసేందుకు స్వగ్రామానికి వచ్చాడు. బుధవారం రాత్రి దేవానై సెల్‌ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతోంది. ఇది చూసిన వీరమణి సెల్‌ఫోన్ లాక్కున్నాడు. అప్పుడు వివాహేతర ప్రియుడితో మాట్లాడుతుందని తేలిపోయింది. దీంతో కోపోద్రిక్తుడైన వీరమణి ఇంట్లోని రోకలి బండ తీసుకుని భార్య తలపై కొట్టాడు. దీంతో దేవనై స్పృహ తప్పి పడిపోయింది. ఇది చూసి వీరమణి భయపడి పారిపోయాడు. ఇరుగుపొరుగు వారు దేవనైని ఉలుందూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలిపారు. దీంతో పోలీసులు వీరమణిని అరెస్టు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఐదు రోజులు వర్షాలు

- చెన్నైలో ఉరుములు, మెరుపులతో వాన
- శివార్లలో భయం
- ముందు జాగ్రత్తల్లో జనం



చెన్నైలో కురుస్తున్న వర్షం



సాక్షి, చెన్నై : రాష్ట్రంలో పలు జిల్లాలో ఐదు రోజుల పాటు విస్తారంగా వర్షాలు పడనున్నాయి. నీలగిరి, కోయంబత్తూరు జిల్లాల పరిధిలోని కొండ కోనల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నట్టు వాతావరణ కేంద్రం ప్రకటించింది. నైరుతి రుతు పవనాలు విస్తరించిన నేపథ్యంలో అక్కడక్కడ రాష్ట్రంలో మోస్తరుగా వర్షం పడుతోంది. పశ్చిమ కనుమల వెంబడి ఉన్న జిల్లాలో భారీ వర్షం కురుస్తోంది. ఇందులో నీలగిరి, కన్యాకుమారిలో అధికంగా వర్ష పాతం నమోదైంది. ఈ పరిస్థితుల్లో బుధవారం రాత్రి చెన్నై, శివార్లలో భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన వర్షం పడడంతో రోడ్ల మీదకు నీరు చేరింది. ఆగమేఘాలపై వాటిని కార్పొరేషన్ సిబ్బంది తొలగించారు. ఐదు నుంచి ఏడు సెంటీమీటర్ల వర్షం కురిసినట్లు వాతావరణ అధికారులు పేర్కొంటున్నారు. ఈ వర్షాలు మరో ఐదురోజులు కొనసాగనున్నాయి. చెన్నై, శివార్లలో అక్కడక్కడ ఉరుములు మెరుపుల వర్షం పడుతుందని, ఆకాశం మేఘావృతంగా ఉంటుందని ప్రకటించారు. నీలగిరి, కోయంబత్తూరు జిల్లాలోని పశ్చిమ కనుమల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. మిగిలిన జిల్లాల్లో మోస్తరుగా అక్కడక్కడ వర్షాలు పడనున్నాయి. మనార్‌వలి కుడ, దక్షిణ, ఆగ్నేయ , సెంట్రల్ బంగాళాఖాతం వైపుగా చేపల వేటకు వెళ్లవద్దని జాలర్లకు హెచ్చరికలు జారీ చేశారు. ఇలా ఉండగా చెన్నైలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి పులియంతోపులో తాగునీటితో పాటుగా మురికి నీరు రావడంతో జనం ఆందోళనకు దిగారు. ఈ వర్షం కారణంగా తండయారుపేటలో దాడులకు దిగడంతో ఇద్దరు గాయపడ్డారు.

జనంతో భయం..

గత కొన్నేళ్లుగా ఏటా నైరుతీ సీజన్ చివర్లో లేదా, ఈశాన్య రుతు పవనాల ఆరంభంతో చెన్నైలో భారీగానే వర్షం కురుస్తోంది. ఈ ఏడాది కూడా అదే తరహాలో వర్షాలు కురవచ్చన్న సంకేతాలు వెలువడ్డాయి. దీంతో చెన్నై శివార్లలోని పళ్లికరణై, వేళచ్చేరి పరిసరాలు, ముడిచ్చూరు, వరద రాజపురం పరిసరాల్లోని జనంలో వరదల భయం పట్టుకుంది.

గ్రౌండ్ ఫ్లోర్‌లలో ఉన్న వాళ్లు ముందు జాగ్రత్తగా ఇళ్లను ఖాళీ చేసి మరోచోటకు మకారం మార్చుకునే పనిలో పడ్డారు. సొంతిళ్లు కలిగిన వారు సైతం ప్రతి ఏటా తమకు ఎదురు అవుతున్న కష్టాలు, నష్టాల నేపథ్యంలో ముందు జాగ్రత్తగా మరోచోట అద్దెకు ఇళ్లను చూసుకుని తమ వస్తువులను జాగ్రత్త పరిచే పనిలో నిమగ్నమయ్యారు.

కోవైలో 'మెట్రో' సేవలకు కసరత్తు



స్థల పరిశీలన చేస్తున్న ఆసియా అభివృద్ధి బ్యాంక్ ప్రతినిధులు

సాక్షి, చెన్నై : కోయంబత్తూరులో మెట్రో రైలు సేవలకు కసరత్తు వేగవంతమైంది. ఇక్కడ చేపట్టనున్న పనులకు నిధులను సమకూర్చేందుకు ఆసియా అభివృద్ధి బ్యాంక్ సిద్ధమవుతోంది. గురువారం ఈ బ్యాంక్ ప్రతినిధులు కోయంబత్తూరులో పరిశీలన చేపట్టారు. వివరాలు.. తమిళనాడులోని వ్యవసాయం, చేనేత రంగానికి, కొంగు వేలాలర్, మొదలియార్ సామాజిక వర్గం అత్యధికంగా నివసించే జిల్లాలను కొంగు మండలంగా పిలుస్తూ వస్తున్న విషయం తెలిసిందే. ఈ మండలంలో కోయంబత్తూరు, తిరుప్పూర్, కరూర్, ఈరోడ్, సేలం, నామక్కల్ ఆరు జిల్లాలు ఉన్నాయి. ఇందులో ప్రధాన నగరంగా కోయంబత్తూరు ఉంది. రాష్ట్రంలో రాజధాని చెన్నై తర్వాత రెండో స్థానంలో ఈ నగరం ఉంది. దీన్ని చెన్నై తరహాలో అభివృద్ధి పరిచేందుకు పాలకులు సిద్ధమయ్యారు. ఇప్పటికే పలు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. తాజాగా కోయంబత్తూరుకు మెట్రో రైలు సేవలను పరిచయం చేయడానికి చర్యలు చేపట్టారు. ఇందుకు సంబంధించిన తొలి విడత రూట్ మ్యాప్ రెడీ అయింది. కోయంబత్తూరు అవినాశి రోడ్డు, ఉక్కడం బస్టాండ్ నుంచి విమానాశ్రయం మీదుగా నీలాంబూర్ వరకు 20 కి.మీ దూరం ఓ మార్గంలో, శక్తి రోడ్డు రైల్వే స్టేషన్ నుంచి శరవణ పట్టిమీదుగా పాళయం జంక్షన్ వరకు 14 కి.మీ దూరం మరో మార్గంలో పనులు చేపట్టే విధంగా కార్యాచరణ రెడీ అయింది. ఈ పనులకు నిధులను సమకూర్చేందుకు ఆసియా మౌలిక వసతుల కల్పన అభివృద్ధి బ్యాంక్ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ మేరకు పనులు చేపట్టనున్న ప్రాంతాల్లో ఈ బ్యాంక్ ప్రతినిధులు గురువారం పర్యటించారు. చెన్నై మెట్రో రైల్ డైరెక్టర్ అర్జునన్, ఆ బ్యాంక్ ఉన్నతాధికారులు హేంబు, రేఖా ప్రకాష్‌తో కూడిన ప్రతినిధుల బృందం పనులకు సిద్ధం చేసిన రూట్ మ్యాప్ ఆధారంగా ఆయా ప్రాంతాలను పరిశీలించారు. ఇక శుక్రవారం మదురైలో చేపట్టేందుకు నిర్ణయించిన మెట్రో రైలు రూట్ మ్యాప్ ఆధారంగా అక్కడ పరిశీలన చేపట్టనున్నారు. అనంతరం చెన్నైలో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో ఈ బృందం సమావేశం కానుంది.

యువకుడి ఆత్మాహుతి యత్నం



నిప్పు అంటించుకున్న యువకుడు

తిరువళ్లూరు: ఆక్రమణ పేరిట నివాసం ఉంటున్న ఇంటిని తొలగించడానికి అధికారులు తరచూ రావడంతో మనస్తాపం చెందిన యువకుడు పెట్రోల్ పోసుకుని ఆత్మాహుతికి యత్నించిన సంఘటన గుమ్మిడిపూండి వద్ద కలకలం రేపింది. తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి తాలుకా కోట్టకరై గ్రామానికి చెందిన దినకరన్ కల్యాణి దంపతులు 50 ఏళ్ల క్రితం బర్మా నుంచి వలస వచ్చినట్టు తెలుస్తుంది. ఈ క్రమంలో ధినకరన్ మృతి చెందాడు. దీంతో కల్యాణి తన ఇద్దరు కొడుకులతో కలిసి నివాసం ఉంటున్నారు. కాగా కల్యాణి పేదరికంతో ఇబ్బంది పడడాన్ని గుర్తించిన స్థానిక వ్యాపారవేత్త కల్యాణికి ఒకటిన్నర సెంటు భూమిని దానంగా ఇచ్చినట్టు తెలుస్తుంది. ఈ స్థలంలోనే కల్యాణి తన ఇద్దరు కొడుకులతో కలిసి నివాసం ఉంటున్నారు. అయితే కల్యాణికి దానంగా ఇచ్చి భూమి వేరొక వ్యక్తికి చెందినట్టు గుర్తించారు. సంబంధిత స్థలంలో ఉన్న ఇంటిని తొలగించాలని పట్టాదారుడు పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదును పరిశీలించిన అధికారులు కల్యాణి ఉన్న ఇల్లు అక్రమమని నిర్ధారించి, తొలగించడానికి గురువారం యత్నించారు. ఇంటి విద్యుత్ కనెక్షన్‌ను విద్యుత్‌శాఖ అధికారులు తొలగించి గుడిసెను జేసీబీతో కూల్చడానికి యత్నించారు. దీంతో మనస్థాపం చెందిన చిన్న కొడుకు రాజ్‌కుమార్ ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని అధికారుల ముందే ఆత్మాహుతికి యత్నించాడు. వెంటనే అప్రమత్తమైన అధికారులు మంటలను ఆర్పి తీవ్రంగా గాయపడిన యువకుడ్ని వైద్యశాలకు తరలించారు.

హత్య కేసులో యువకుడి అరెస్టు

అన్నానగర్: వీసీకే ప్రముఖుడు హత్య కేసులో పోలీసులు ఓ యువకుడిని అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. మైలాడుదురై జిల్లా పట్టవర్తి నటరాజపురం ఉత్తరానికి చెందిన రాజమాణిక్యం కుమారుడు రాజేష్ (26) విడుదలై చిరుతై పార్టీ ప్రముఖుడిగా రాణిస్తున్నాడు. రాజేష్ బుధవారం రాత్రి నటరాజపురం వద్ద పెట్రోల్ బంక్ వద్ద నుంచి మెయిన్ రోడ్డుపైకి వస్తున్న సమయంలో గుర్తు తెలియనివ్యక్తులు కొందరు బైకులో వచ్చి రాజేష్‌ను హత్య చేశారు. సమాచారం అందుకున్న సందల్ మేడు పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి రాజేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మైలాడుదురై ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రాజేష్ స్నేహితుడు వి.వినోద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సందలమేడు పోలీసులు గురువారం నటరాజపురం ప్రాంతానికి చెందిన రంజిత్ (27)ని అరెస్టు చేసి విచారిస్తున్నారు.

10 వాహనాలు దగ్ధం

అన్నానగర్: కోయంబేడులోని పార్కింగ్ స్థలంలో బుధవారం రాత్రి ఆగి ఉన్న ఓ ప్రైవేట్ ఆమ్నీ బస్సు, ఆటోసహా 10 వాహనాలు దగ్ధమయ్యాయి. కోయంబేడు ప్రాంతంలో అంగడి మేనేజ్‌మెంట్ టీమ్‌కు చెందిన పార్కింగ్ స్థలంలో ప్రైవేట్ ఆమ్నీ బస్సులు, ఆటోలు, వ్యాన్‌లు, కార్లు పార్కింగ్ చేస్తారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి అక్కడే ఆగి ఉన్న ఆమ్నీ బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో పక్కనే ఆగి ఉన్న ఆటో, వ్యాన్లు, కార్లకు మంటలు వేగంగా వ్యాపించాయి. దీంతో షాక్‌కు గురైన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే అప్పటికే ఆమ్నీ బస్సు, ఆటోసహా 10 వాహనాలు కాలిపోయాయి. అగ్నిప్రమాదానికి గల కారణాలపై కోయంబేడు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ నాయకుడి అరెస్టు

కొరుక్కుపేట: లోడ్‌మాన్ ఆత్మహత్య కేసులో బీజేపీ నాయకుడిని పోలీసులు అరెస్టు చేశారు. విరుదునగర్ జిల్లా, సాత్తూర్ సమీపంలోని మెట్టమలై ఉత్తర వీధికి చెందిన పార్థసారధి (55) బీజేపీ జిల్లా మాజీ సంయుక్త కార్యదర్శి, మెట్టమలై పంచాయతీ ప్రధానాధికారి పనిచేస్తున్నాడు. పట్టణంలో అగ్గిపెట్టెల కంపెనీ నడుపుతున్నాడు. ఇందులో అదే పట్టణానికి చెందిన ఆకురాజ్ (27) లోడ్‌మ్యాన్‌గా పనిచేస్తున్నాడు. అతడిని పార్థసారథి గత నెలలో ఉద్యోగం నుంచి సస్పెండ్ చేశారు. ఈ కేసులో పార్థసారథి, మరో ఇద్దరు వ్యక్తులు ఆకురాజ్‌కు ఇచ్చిన అడ్వాన్స్ డబ్బును మోసం చేశారు. దీంతో మనస్తాపానికి గురైన ఆకురాజు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆకురాజ్ భార్య అభి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఆత్మహత్యకు ప్రేరేపించినందుకుగాను పార్థసారథిని బుధవారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. పార్థసారథిపై రెండు విభాగాల కింద కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

వేడుకగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో జూలై 10 నుంచి 12వ తేదీ వరకు జరగనున్న సాక్షాత్కార వైభవోత్సవాలను పురస్కరించుకుని గురువారం వేడుకగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి తోమాల సేవ, కొలువు, పంచాంగశ్రవణం నిర్వహించారు. ఉదయం 6.30 నుంచి 11.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. మధ్యాహ్నం 12.30 గంటల నుండి భక్తులను దర్శనానికి అనుమతించారు. సాక్షాత్కార వైభవోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి జూలై 10న పెద్దశేష వాహనం, జూలై 11న హనుమంత వాహనం, జూలై 12న గరుడ వాహనంపై రాత్రి 7 నుంచి 8 గంటల వరకు ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులను కటాక్షించనున్నారు. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డెప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపినాథ్, సూపరింటెండెంట్ వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్ ముఠా అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకున్న వస్తువులు

అన్నానగర్: పోలీసుల వలే నటించి ఫార్మాస్యూటికల్ సంస్థ యజమానిని కిడ్నాప్ చేసి రూ.10 లక్షలు దోపిడీ చేసిన సంఘటనలో 9 మంది ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. పల్లావరం సమీపం తిరుముడివాక్కం ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో అజారుద్దీన్ నివసిస్తున్నాడు. క్రోమ్‌పేటలో ఫార్మాస్యూటికల్ సంస్థ నడుపుతున్నాడు. గత నెల 22వ తేదీ రాత్రి అడయార్ నది వంతెన ముందు తిరుముడివాక్కం ప్రధాన రహదారిపై బైకులో ఒంటరిగా వెళుతున్న సమయంలో కారులో వచ్చిన గుర్తుతెలియని ముఠా అజారుద్దీన్‌ను అడ్డగించింది. తాము పోలీసులమని మీరు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని తమకు ఫిర్యాదు వచ్చింది, ఈ విషయమై విచారించాలి, కారులో ఎక్కాలని తెలిపారు. వారి చేతుల్లో వాకీటాకీలు, తుపాకులు, సంకెళ్లు ఉండడంతో అనుమానం వచ్చిన అజారుద్దీన్ కారు ఎక్కేందుకు నిరాకరించి వాగ్వాదానికి దిగాడు. దీంతో ఆ గ్యాంగ్ అజారుద్దీన్ చేతికి సంకెళ్లు వేసి కారులో తీసుకెళ్లారు. కళ్లకు గంతలు కట్టి దాడికి పాల్పడ్డారు. రూ.50 లక్షలు ఇస్తేనే విడుదల చేస్తామని బెదిరించారు. దీంతో అజారుద్దీన్ రూ.25 లక్షలు ఇచ్చేందుకు అంగీకరించాడు. అనంతరం కిడ్నాప్ ముఠా రాత్రంతా వివిధ ప్రాంతాల్లో తిరిగారు. మరుసటి రోజు ఉదయం అతన్ని ఆర్కాడ్ ప్రాంతంలో దింపారు. అంతకుముందు అజారుద్దీన్ నుంచి రూ.9 వేలు, క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు లాక్కొని సీక్రెట్ నంబర్ తీసుకున్నారు. దీని ద్వారా ముఠా ఆన్‌లైన్‌లో ఒకరి బ్యాంకు ఖాతాకు రూ.9 వేలు , క్రెడిట్ కార్డ్, డెబిట్ కార్డు ద్వారా ఏటీఎం నుంచి రూ.1.30 లక్షలు విత్‌డ్రా చేశారు. రూ. 6.10 లక్షలకు ఆన్‌లైన్‌లో ఉత్పత్తులను కొనుగోలు చేశారు. అజారుద్దీన్ నుంచి ఆ ముఠా మొత్తం రూ.10 లక్షలు దోచుకున్నారు. గత జూలై 1వ తేదీన అదే ముఠా ఎక్కువ డబ్బులు డిమాండ్ చేసింది. దీంతో అజారుద్దీన్ తనను కిడ్నాప్ చేసి రూ.10 లక్షలు పోగొట్టుకున్నట్లు శంకర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై పోలీసులు విచారణ చేపట్టారు. ఇందులో పోలీసులుగా నటించి నగదు మోసానికి పాల్పడిన కుండ్రత్తూర్ కొలంచేరికి చెందిన అరుణ్‌కుమార్, పెరుంబాక్కం ప్రాంతానికి చెందిన కార్మేగం, కాంచీపురానికి చెందిన సదాం, కుండ్రత్తూర్ కి చెందిన ఆంథోనీ రాజ్, పమ్మెల్ మహమ్మద్ రబీ, పల్లవరం ఇమ్రాన్, పమ్మెల్ యస్వంత్, జమీన్, పల్లవరానికి చెందిన సతీష్, వేలు అనే 9 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి వాకీ టాకీ, తుపాకీ, పెంపుడు జంతువులు, సెల్‌ఫోన్లు, సంకెళ్లు, కార్లు స్వాధీనం చేసుకున్నారు.

తాళం వేసిన ఇంట్లో తల్లీ, కొడుకు మృతదేహాలు

అన్నానగర్: పెరంబలూరులో గురువారం ఉదయం తాళం వేసి ఉన్న ఇంట్లో తల్లి, కొడుకు శవమై కనిపించారు. పెరంబలూరుకు చెందిన సెల్వరాజ్. ఇతనికి పెరంబలూరు ముత్తునగర్‌లో ఇళ్లు ఉన్నాయి. వాటిని అద్దెకు ఇచ్చాడు. శివగంగై జిల్లా కారైకుడికి చెందిన శర్వానందం భార్య ఆనంది (66), కుమారుడు శ్రీరామ్ కుమార్ (34) గత ఏడాది కాలంగా సెల్వరాజ్ ఇంట్లో అద్దెకు నివసిస్తున్నారు. శ్రీరామ్ కుమార్ తిరుచ్చిలో ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తున్నాడు. అతనికి ఇంకా పెళ్లి కాలేదు. గురువారం ఉదయం వారి ఇంటి నుంచి భరించలేని దుర్వాసన వచ్చింది. ఇరుగుపొరుగు వారు ఇచ్చిన సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరకుని పరిశీలించగా ఇంటి బయట తాళం వేసి ఉంది. దీంతో ఇంటి తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి పరిశీలించగా హాలులో ఆనంది మృతదేహం కుళ్లిన స్థితిలో కనిపించగా, బెడ్‌రూమ్‌లో శ్రీరామ్‌కుమార్ మృతదేహంగా ఫ్యాన్‌కు వేలాడుతూ ఉన్నాడు. ఆనంది శరీరంపై గుడ్డ చుట్టి ఉంది. ఆమె అతని శరీరం చుట్టూ గడ్డి, నిమ్మరసంతో పాటు వంటకు ఉపయోగించే కారం, కొబ్బరి, పసుపు, ధనియాల పొడి, నారింజ ఉప్పు వంటి ఇతర వస్తువులు ఉన్నాయి. దీంతో తల్లి ఆనందిని హత్య చేసిన తర్వాత ఆమె కుమారుడు శ్రీరామ్‌కుమార్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు సందేహిస్తున్నారు. కాగా పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

గుండె ఆపరేషన్లకు ఒప్పందం



ఒప్పందం చేసుకుంటున్న ప్రీతారెడ్డి, పనీష్ రావు

కొరుక్కుపేట: ఆర్థిక స్తోమతలేని చిన్నారుల గుండె ఆపరేషన్‌లకు ఎల్‌టీఐ మైండ్ ట్రీ, రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాసు ఈస్ట్, అపోలో చిల్డ్రన్స్ హాస్పిటల్‌లు కలిసి అవగాహన ఒప్పందం చేసుకున్నాయి. ఈ సందర్భంగా హీలింగ్ టినీ హార్ట్స్ ప్రాజెక్ట్ నాలుగో ఎడిషన్‌ను ప్రారంభించారు. ఇందులో ఎల్‌టీఐ మైండ్ ట్రీ ఫౌండేషన్ చీఫ్ సస్టైనబిలిటీ ఆఫీసర్ పనీష్ రావుతో సహా విశిష్ట అతిథులు, అపోలో చిల్డ్రన్స్ హాస్పిటల్ వైస్ చైర్‌పర్సన్ ప్రీతారెడ్డి, రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్ ఈస్ట్ అధ్యక్షుడు ముత్తు, జిల్లా గవర్నర్ ఆర్ఐ 3234 ఎన్ఎస్ శరవణన్ తదితరులు పాల్గొని సంతకాలు చేశారు.

కుండ్రత్తూరులో ఇళ్ల పనుల తనిఖీ



పనులు తనిఖీ చేస్తున్న కలెక్టర్ కలైసెల్వి

కాంచీపురం(పళ్లిపటు): కుండ్రత్తూరులో పట్టాభివృద్ధి సంస్థ ద్వారా నిర్మిస్తున్న హౌసింగ్ బోర్డు ఇళ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ కలైసెల్వి గురువారం తనిఖీ చేశారు. కాంచీపురం జిల్లా కుండ్రత్తూరు యూనియన్ సాలమంగళంలో రూ.91.90 కోట్ల వ్యయంతో మూడు అంతస్తులతో 752 ఇళ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పట్టణ ప్రాంతాల్లో నివాసముంటున్న పేదలకు అతి తక్కువ ధరకు హౌసింగ్ బోర్డులో ఇళ్లు కేటాయించనున్నారు. ఇళ్ల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లోని పేద ప్రజల కోసం నిర్మిస్తున్న హౌసింగ్ బోర్డులో ఒక్కొక్క ఇల్లు 400 చదరపు మీటర్లలో నిర్మిస్తున్నట్లు తెలిపారు. హౌసింగ్ బోర్డులో రేషన్ దుకాణం, పాఠశాల, వర్షపునీరు ఇంకుడు గుంతలు, రోడ్లు, విద్యుదీపాలు, తాగునీరు తదితర కనీస సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు.

నీట్ రద్దు చేయాలని ధర్నా

కొరుక్కుపేట: పెరంబూర్ నియోజకవర్గ పరిధిలోని వ్యాసర్పాడి అంబేడ్కర్ కళాశాల ఎదుట ఉత్తర చెన్నై జిల్లా ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫోరం ఆధ్వర్యంలో గురువారం నిరసన ప్రదర్శన జరిగింది. దీనికి అఖిల భారత విద్యార్థి పెరుమాన్ రాతిన్ సంఘం ఉత్తర చెన్నై జిల్లా అధ్యక్షుడు రామసామి అధ్యక్షత వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రహీం, ఇతర అధికారులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్షను వెంటనే రద్దు చేయాలని నినాదాలు చేశారు.

పోలీస్ బాయ్స్- గర్ల్స్ క్లబ్‌లకు రూ.6 లక్షల విరాళం



పోలీసు కమిషనర్ సందీప్ రాయ్ రాథోర్‌కు చెక్కు అందజేస్తున్న ప్రైవేట్ కంపెనీ నిర్వాహకులు

కొరుక్కుపేట: చెన్నైలోని మూడు పోలీస్ బాయ్స్ అండ్ గర్ల్స్ క్లబ్‌కు ఒక ప్రైవేట్ కంపెనీ రూ.6 లక్షల విరాళం అందజేసింది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును పోలీస్ కమిషనర్ సందీప్ రాయ్ రాథోర్‌కు అందజేసింది. గ్రేటర్ చెన్నై పోలీస్‌లో మొత్తం 111 పోలీస్ బాలుర, బాలికల క్లబ్‌లు పనిచేస్తున్నాయి. గ్రేటర్ చెన్నై పోలీస్‌లోని 28 పోలీస్ బాయ్స్ అండ్ గర్ల్స్ క్లబ్‌ల పనితీరును మెరుగుపరచడానికి కార్పొరేట్ కంపెనీలు హెచ్‌సీఎల్, సెయింట్ గోబైన్, భూమిక ట్రస్టు, బాల మందిర్ కామరాజ్ ట్రస్టు తదితర సంస్థలు ఆర్థిక సహాయం అందిస్తున్నాయి. ఈ క్రమంలో ఆదిత్య బిర్లా సంస్థ 3 పోలీస్ బాయ్స్ అండ్ గర్ల్స్ క్లబ్‌లకు (వీ-6 కొలత్తూరు, కే-5 పెరవళ్లూర్, కే-7 ఐసీఎఫ్)కు ఆర్థిక సహాయం అందించడానికి ముందుకు వచ్చింది. ఆదిత్య బిర్లా గ్రూప్స్ జాయింట్ ప్రెసిడెంట్ వివేక్ వల్సన్ పోలీస్ కమిషనర్ సందీప్ రాయ్ రాథోర్‌కు ఈ మేరకు రూ. 6 లక్షల చెక్కును అందించారు. అండ్రూస్ స్టీఫెన్ మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకున్నారు. డాన్ బాస్కో అన్బు ఇల్లం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజ్, గ్రేటర్ చెన్నై పోలీసులు ఒప్పందం చేసుకుని పిల్లలకు అవసరమైన సేవలను అందించడానికి కృషి చేయనున్నారు.

పోలీసు ఆత్మహత్య

అన్నానగర్: తిరుముల్లైవాయల్‌లోని గార్డు హౌస్‌లో ఓ పోలీసు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే.. చెన్నై పరిధిలోని తిరుముల్లైవాయల్ సత్యమూర్తినగర్‌లో ఉన్న 2వ బెటాలియన్ కానిస్టేబుల్‌గా అశోక్ కుమార్ (31) పనిచేస్తున్నారు. ఇతని స్వస్థలం మదురైలోని పెరైయూర్. ఇతను అవివాహితుడు, 2022లో తమిళనాడు స్పెషల్ పోలీస్‌ఫోర్స్‌లో కానిస్టేబుల్‌గా చేరాడు. తర్వాత తమిళనాడు మధురైలో స్పెషల్ పోలీస్ ఫోర్స్‌లో పనిచేస్తున్న అశోక్ కుమార్ గత ఫిబ్రవరిలో మధురై నుంచి బదిలీపై వచ్చి ఆవడి తమిళనాడు స్పెషల్ పోలీస్ ఫోర్స్ ఐదో బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తు వచ్చాడు. ఈ స్థితిలో, అతను గత కొన్ని రోజులుగా పనికి వెళ్లడం లేదని తెలుస్తుంది. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం అతని గది నుంచి దుర్వాసన వస్తోంది. దీంతో ఆ చుట్టుపక్కల వారు తిరుముల్లైవాయల్ పోలీసులకు సమాచారం అందించారు. ఆ తర్వాత పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లారు. అనంతరం అశోక్ కుమార్ బెడ్‌రూంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెంది కనిపించాడు. చనిపోయి రెండు రోజులు అయినందున శరీరం కుళ్లిపోయి దుర్వాసన వస్తోందని పోలీసులు తెలిపారు. అనంతరం తిరుముల్లైవాయల్ పోలీసులు అతని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చెన్నైలోని కీల్పాక్కం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతని ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం అతని మృతదేహాన్ని తల్లి దండ్రులకు అప్పగించి స్వస్థలమైన మదురైకి తరలించారు.

సంతానం కలగలేదని దంపతులు..

సంతానం కలుగలేదన్న వేదనతో దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే.. కేరళ రాష్ట్రం ఎర్నాకులంలోని కారుకుట్టి మావేలి హౌస్‌కు చెందిన షాజ కుమారుడు ఆండోవర్గీస్(34)కు జిస్మల్ (29)తో తొమ్మిదేళ్ల కిందట వివాహమైంది. అయితే వీరికి పిల్లలు లేకపోవడంతో చికిత్స నిమిత్తం వివిధ ఆస్పత్రులకు వెళ్లారు. ఇందుకోసం చాలా చోట్ల అప్పులు తీసుకున్నారు. ఈ స్థితిలో దంపతులు గత 2వ తేదీన నాగై జిల్లాలోని వేలంగణికి వచ్చారు. అక్కడ ఓ లాడ్జిలో బస చేశారు. సంతానం లేకపోవడం, అప్పుల బాధతో తీవ్ర మనోవేదనకు గురైన ఆండోవర్గీస్ నీటిలో ఎలుకల మందు కలిపి ఇంజెక్షన్ చేసుకుని స్పృహతప్పి పడిపోయాడు. ఇది చూసిన భార్య వెంటనే అతడిని రక్షించి 108 ఆంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం నాగై మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందక మృతి చెందాడు. తనకు ఆసరాగా నిలిచిన భర్త ఆత్మహత్య చేసుకోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె ఆస్పత్రి నుంచి తిరిగి తాను ఉన్న హోటల్ గదికి వెళ్లి అదే సూదిని తీసుకొని తన శరీరంలోకి ఇంజెక్షన్ చేసుకుంది. దీంతో ఆమె కూడా మృతి చెందింది. ఈ ఘటన గురించి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

నాటు తుపాకుల స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న నాటు తుపాకులు

వేలూరు: వృద్ధురాలు అనుమానస్పద మృతి కేసులో అనుమానితుడి ఇంట్లో మూడు నాటు తుపాకులు ఉండగా పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. తిరుపత్తూరు జిల్లా వాణియంబాడి సమీపంలోని పలపనత్తం గ్రామంలో రెండు రోజుల క్రితం వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు వృద్ధురాలి ఇంటి వద్ద విచారణ జరిపేందుకు వెళ్లారు. ఆ సమయంలో వృద్ధురాలి ఇంటి సమీపంలోని వెంకటేశన్‌ను విచారించడానికి వెళ్లారు. అతడి ఇంట్లో మూడు నాటు తుపాకీలు ఉన్నట్లు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు పరారీలో ఉన్న వెంకటేశన్ కోసం గాలిస్తున్నారు. ఈ విషయమై విచారణ చేపట్టగా వెంకటేశన్‌తో కలిసి ఆలంగాయం గ్రామానికి చెందిన కుమార్ రోజా అడవిలోకి వేటకు వెళుతున్నట్లు పోలీసుల విచారణలో తెలిసింది. దీంతో ఇద్దరిపై కేసు నమోదు చేసి ఇద్దరి కోసం గాలిస్తున్నారు.

చెత్తకుప్పులో తుపాకీ స్వాధీనం

అన్నానగర్: గూడువాంచేరి సమీపంలోని ఆదనూరులో గురువారం ఉదయం ఓ ఇంటి వెనుక చెత్తకుప్పల మధ్య ఉన్న తుపాకీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఆ ప్రాంత ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది. ఆదనూరు పంచాయతీ పరిధిలోని కొరుక్కంతాంగల్‌లో ఒకరి ఇంటి వెనుక చెత్తకుప్పలో తుపాకీ ఉన్నట్లుగా సమాచారం అందుకున్న మణిమంగళం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ, చెత్తలో, చాపలు, దిండుల మధ్య తుపాకీ ఉండడం గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా...

వడ్డీ వ్యాపారుల వేధింపులకు ఇద్దరు బలి

పుంగనూరు మండలంలో దారుణం

పుంగనూరు: అధిక వడ్డీలు, వ్యాపారుల వేధింపులు తట్టుకోలేక వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్న ఘటనలు గురువారం వెలుగుచూశాయి. వివరాల్లోకి వెళితే.. కర్ణాటకకు చెందిన మునిరాజ (42) తన భార్య అమరావతితో కలసి కొన్నేళ్ల క్రితం నుంచి మండలంలోని పెద్దగడదేశిలో నివాసముంటున్నాడు. అత్యవసరాల రీత్యా గ్రామానికి చెందిన మురళీనాయక్ వద్ద అప్పు తీసుకున్నాడు. మురళీనాయక్ బుధవారం రాత్రి ఇంటికొచ్చి తన డబ్బులివ్వాలని గొడవ చేయడంతో మనస్తాపానికి గురై ఇంటి వద్దే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మరో ఘటనలో పట్టణంలోని కొత్తపేటలో మెడికల్‌షాపు నిర్వహిస్తున్న నరసింహులు (40) వ్యాపార నిమిత్తం పలువురి వద్ద అప్పు తీసుకున్నాడు. వడ్డీ వ్యాపారుల వేధింపులు భరించలేక అన్నమయ్య జిల్లా వాల్మీకిపురంలోని కొత్తఇందిరమ్మ కాలనీకి వెళ్లి అక్కడే ఉరేసుకున్నాడు. మృతులకు భార్యలు, పిల్లలున్నారు. పోలీసులు కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెడ్‌బుక్‌లో పేరున్న వారిపై చర్యలు తీసుకుంటాం

మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



అనంతపురం టవర్‌క్లాక్: గత ప్రభుత్వంలో టీడీపీ నాయకులపై దాడులు చేసి ఇబ్బందులు పెట్టిన వారి పేర్లను మంత్రి నారా లోకేశ్ రెడ్‌బుక్‌లో ఎక్కించారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు హెచ్చరించారు. ఆయన గురువారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ హయాంలో టీడీపీ నాయకులను, కార్యకర్తలను అనేక ఇబ్బందులు పెట్టారని, అయినా తమకు వారిపై కక్ష లేదన్నారు. వారు చేసిన పాపాలకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కూటమి ప్రభుత్వంపై వైఎస్ జగన్ ఆరోపణలు చేయడం తగదన్నారు. చంద్రబాబు కక్ష సాధింపు చర్యలకు పాల్పడలేదని, ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజా సమస్యలు మరిచి జైలులో ఉండే వారిని కలవడం ఏమిటని ప్రశ్నించారు.

ఇరిగేషన్ అధికారుల అత్యుత్సాహం

ఇప్పటంలో పశువుల కొట్టం కూల్చివేత



ఆవులు ఉండగానే కూల్చివేస్తున్న పాక

సాక్షి ప్రతినిధి, గుంటూరు: మంగళగిరి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పనిచేసిన వారిపై కక్ష సాధింపు చర్యలు కొనసాగుతున్నాయి. తాజాగా గురువారం తాడేపల్లి మండలం ఇప్పటంలో పొలం గట్టున ఉన్న ఓ రైతు పశువుల కొట్టం(పాక)ను ఇరిగేషన్ అధికారులు కూల్చివేశారు. ఇప్పటం గ్రామానికి చెందిన హరిబాబుగౌడ్ అనే రైతు వ్యవసాయంతోపాటు ఆవులను పోషిస్తూ పాలవ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల ఎన్నికల్లో హరిబాబు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పనిచేశాడని కూటమి నేతలు అతనిపై కక్ష కట్టారు. ఈ మేరకు ఇరిగేషన్ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి కరకట్టపై హరిబాబు తన పొలం వెంబడి ఏర్పాటుచేసుకున్న పశువుల కొట్టాన్ని కూల్చివేయాలని చెప్పారు. ఈ మేరకు ఐదు రోజుల నుంచి ఇరిగేషన్ అధికారులు పశువుల కొట్టాన్ని తొలగించాలని హరిబాబుపై ఒత్తిడి తీసుకువచ్చారు. 'చట్ట ప్రకారం నోటీసులు ఇవ్వండి. ఇరిగేషన్ కట్ట మీద నాతోపాటు చాలామంది పశువుల కొట్టాలు, ఇళ్లు నిర్మించుకున్నారు. వాటిని కూడా తొలగించండి' అని హరిబాబు కోరారు. దీంతో 'మాకు మీ పశువుల కొట్టం ఒక్కటే తొలగించాలని చెప్పారు. మీ ఒక్క పశువుల కొట్టం మాత్రమే తొలగిస్తామని ఇరిగేషన్ అధికారులు శ్రీనివాసరావు, ప్రకాష్ ఫోన్‌లో చెప్పారు' అని హరిబాబు తెలిపారు. పాకను తొలగించుకునేందుకు కొంత సమయం ఇవ్వాలని కోరినా పట్టించుకోకుండా పాడిపశువులు ఉన్న సమయంలోనే జేసీబీతో వచ్చి గురువారం కొట్టాన్ని కూల్చివేశారు. దీంతో పలువురు రైతులు మాట్లాడుతూ రోడ్లపై అనేక అక్రమ కట్టడాలు నిర్మించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు... పశువుల కొట్టాన్ని కూల్చడంపై శ్రద్ధ చూపిస్తున్నారంటే వారు అధికార పార్టీకి ఏ విధంగా వత్తాసు పలుకుతున్నారో అర్థమవుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు.

వైఎస్సార్ జయంతి వేడుకలకు హాజరుకండి

కర్ణాటక కాంగ్రెస్ పెద్దలకు షర్మిల ఆహ్వానం

సాక్షి బెంగళూరు: ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల బెంగళూరులో పర్యటించారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కలిశారు. తొలుత బెంగళూరు సీఎం అధికారిక నివాసం కృష్ణాలో సిద్ధరామయ్యను కలిసి పలు రాజకీయ అంశాలపై మాట్లాడారు. అనంతరం సదాశివనగరలోని డీకే శివకుమార్ ఇంటికి చేరుకుని ఆయనతో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ నెల 8న విజయవాడలో దివంగత వైఎస్సార్ 75వ జయంతి వేడుకల్లో పాల్గొనాల్సిందిగా వారిని షర్మిల ఆహ్వానించారు.

టీడీపీలో ఇసుక దుమారం?

- రాజమండ్రి రూరల్, సిటీ నియోజకవర్గాల్లోని ఇసుక నిల్వలు ఊడ్చేసిన జనసేన నేత
- రూరల్ ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరికి సన్నిహితుడిగా గుర్తింపు
- దీంతో గోరంట్ల, ఆదిరెడ్డి మధ్య చెలరేగిన చిచ్చు
- సుమారు రూ.5 కోట్ల విలువచేసే ఇసుక అక్రమ విక్రయం
- సిటీ పరిధిలోకి ఎందుకొచ్చావని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు ఆగ్రహం
- మైన్స్ అధికారులకూ మందలింపు
- మీరైనా ఆపాలి కదా అని అధికారులపై చిందులు



రాజమహేంద్రవరం స్పిన్నింగ్ మిల్లు సమీపంలోని గుట్టల నుంచి అక్రమంగా ఇసుక తరలింపు

సాక్షి, రాజమహేంద్రవరం : నిన్న మొన్నటి వరకు ప్రశాంతంగా ఉన్న రాజమహేంద్రవరంలో ఇప్పుడు ఇసుక తుపాను చెలరేగుతోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చీరావడంతో ఆ పార్టీల నేతలు ఇసుక మీద పడ్డారు. వర్షాకాలం పురస్కరించుకుని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందస్తుగా నిల్వ ఉంచిన ఇసుకను ఊడ్చేశారు. ఇప్పుడిదే వారి మధ్య వివాదాలకు ఆజ్యం పోస్తోంది. ఓ జనసేన నేత అత్యుత్సాహం రాజమహేంద్రవరంలోని ఇద్దరు టీడీపీ సీనియర్ నేతల మధ్య విభేదాలకు ఆజ్యం పోస్తోంది. నగర రాజకీయాల్లో ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారిన ఈ ఇసుక బాగోతం కథాకమామిషు ఏంటంటే..

తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మధ్య ఈ ఇసుక దుమారం రేగింది. గోరంట్లకు అనుచరుడిగా పేరుగాంచిన ఓ జనసేన నేత ఇసుక వ్యాపారమే ఇందుకు కారణంగా నిలుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే టీడీపీ, జనసేన నేతలు ఇసుక దందాకు తెరలేపారు. ఇందులో భాగంగా.. గోదావరి వరదల సమయంలో ప్రజలకు ఇబ్బందిలేకుండా ర్యాంపుల్లో నిల్వ ఉంచిన ఇసుకను ఇదే అదునుగా భావించిన టీడీపీ నేతలు ఆ గుట్టలు మింగేశారు. రాత్రి, పగలు అన్న తేడాలేకుండా అక్రమంగా తరలించి రూ.కోట్లలో సొమ్ము చేసుకున్నారు. ఇప్పుడు ఇక్కడే అసలు సమస్య ప్రారంభమైంది. రాజమండ్రి రూరల్ పరిధిలోని గ్రాయత్రి–1, 2, 3, 4, 5 పేర్లతో ఉన్న ఇసుక ర్యాంపుల్లోని నిల్వలను ఆ నియోజకకవర్గ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇదే అదునుగా బుచ్చయ్య అనుచరుడైన ఓ జనసేన నేత ఇసుక మొత్తం ఊడ్చేశాడు. అధికార పార్టీకి చెందిన నేత కావడంతో అధికారులు అటువైపు వెళ్లేందుకు కూడా సాహసించలేదు. దీంతో మరింత రెచ్చిపోయిన ఆ నేత రాజమండ్రి సిటీ నియోజకవర్గ పరిధిలోని కోటిలింగాల ర్యాంపులపై కూడా కన్నేశాడు. పరిస్థితులు అనుకూలంగా ఉండటం.. నూతన ఇసుక పాలసీ త్వరలో రానుండటంతో ముందుగానే తరలించేయాలన్న ఆలోచనతో దానిని ఎడాపెడా తరలించేసి అమ్మేశారు. ఇలా రూరల్, సిటీ నియోజకవర్గాల పరిధిలో నిల్వ ఉన్న సుమారు రూ.5 కోట్లు విలువ చేసే ఇసుక కొల్లగొట్టినట్లు సమాచారం. దోపిడీ చేసిన సొమ్ములో తన గురువుకు కొంత లాభం చేకూర్చినట్లు తెలిసింది.

సిటీ ఎమ్మెల్యే తండ్రి సీరియస్..

ఇదిలా ఉంటే.. ఈ విషయం రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తండ్రి, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు దృష్టికి వెళ్లడంతో ఆయన అగ్గిమీద గుగ్గిలమయ్యారు. తమ ఇలాకాలో తమకు తెలీకుండా ఇసుక తరలించుకుపోవడంపై అవాక్కయ్యారు. అదీ తన విరోధి బుచ్చయ్యచౌదరి అనుచరుడని తేలడంతో మండిపడ్డారు. తన నియోజకవర్గ పరిధిలో ఉన్న నిల్వలకు సంబంధించిన నగదు తనకివ్వాలని సదరు నేతకు కబురు పంపినట్లు సమాచారం. ఆ నేత నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంపై అప్పారావు కారాలు మిరియాలు నూరుతున్నారు. అలాగని ఏదైనా దుందుడుకు చర్యలకు పాల్పడితే కూటమిలో భాగమైన జనసేన నేత కావడం, పార్టీ పెద్దలకు మరో రకమైన సంకేతాలు వెళ్తాయని ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు తెలిసింది.

అధికారులపై చిందులు?

మరోవైపు.. ఇసుక తరలించేస్తుంటే 'మీరేం చేస్తున్నారు? అడ్డుకోవాలి కదా..' అంటూ ఆదిరెడ్డి అప్పారావు మైనింగ్ అధికారులపై చిందులేసినట్లు తెలిసింది. రాజమండ్రి సిటీ పరిధిలో ఒక్క ఇసుక రేణువు తీసుకెళ్లాలన్నా తన అనుమతి ఉండాలని హెచ్చరించినట్లు సమాచారం. అధికార పార్టీకి చెందిన నేత కావడంతో ఏమీ చెప్పలేక అధికారులు మిన్నకుండిపోయారు. ఇసుక తరలించిన వ్యక్తి కూటమి నేత కావడం, ఆయన్ను ఏమీ అనలేక తమపై రుబాబు చూపడంపట్ల అధికారుల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

చెప్పాపెట్టకుండా పెద్దారెడ్డి ఇంటి వద్ద సర్వే

- తాడిపత్రి మున్సిపల్ అధికారుల దుందుడుకు చర్య
- నోటీసు ఇవ్వకుండానే సర్వే
- ఇంటి వెలుపల, పక్కనున్న స్థలాన్ని సర్వే చేసిన అధికారులు
- సర్వేపై ఆరా తీసిన డీఐజీ, ఎస్పీ

తాడిపత్రి అర్బన్: వైఎస్సార్‌సీపీకి నేత, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటి వద్ద మున్సిపల్ అధికారులు గురువారం సర్వే చేశారు. మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్ ఆధ్వర్యంలో టౌన్ ప్లానింగ్ అధికారి మహబూబ్ బాషా, సర్వేయర్లు హఠాత్తుగా ఉదయమే తాడిపత్రిలోని పెద్దారెడ్డి నివాసానికి వచ్చారు. పెద్దారెడ్డి నివాసం వెలుపల, నివాసాన్ని ఆనుకునే ఉన్న ఖాళీ స్థలాన్ని కూడా సర్వే చేశారు. నిబంధనల ప్రకారం ఇంటి యజమానికి ముందస్తుగా నోటీసులు ఇచ్చిన తర్వాతే సర్వే చేయాలి. అయితే, ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, అది కూడా ఇంట్లో ఎవరూ లేని సమయంలో సర్వే చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇది మున్సిపల్ అధికారుల దుందుడుకు చర్యేనని, టీడీపీ నేతల ఒత్తిడితోనే ఇలా చేశారని స్థానికులు విమర్శిస్తున్నారు. పెద్దారెడ్డి నివాసం వద్ద మున్సిపల్ అధికారులు సర్వే చేసిన విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో అర్బన్ సీఐ ఇస్మాయిల్ మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్‌ను అడగ్గా.. అలాంటిది ఏమీ లేదంటూ ఆయన దాటవేశారు. ప్రస్తుతం తాడిపత్రిలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా రాజకీయ నాయకుల ఇళ్ల వద్ద సర్వే చేయాలంటే తప్పకుండా పోలీసుల దృష్టికి తీసుకు రావాలని, అప్పుడు బందోబస్తు ఏర్పాటు చేస్తామని సీఐ మున్సిపల్ కమిషనర్‌కు చెప్పినట్లు సమాచారం. ఈ విషయం అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి, ఎస్పీ గౌతమిశాలి దృష్టికి వెళ్లడంతో వెంటనే తాడిపత్రి డీఎస్పీ జనార్దన్ నాయుడు, అర్బన్ సీఐ ఇస్మాయిల్‌ను ఫోన్‌లో ఆరా తీసినట్లు తెలిసింది. తాడిపత్రి నివురుగప్పిన నిప్పులా ఉందని, అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ, సీఐని ఆదేశించినట్లు తెలిసింది.

తాడిపత్రిలోనే మకాం వేసిన జేసీ ప్రభాకర్‌రెడ్డి

ఎన్నికల అనంతరం చెలరేగిన ఘర్షణల నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి, టీడీపీ నేత, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తాడిపత్రిలోకి అడుగుపెట్టకూడదని కోర్టు ఆదేశించింది. దీంతో జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఆయన కుమారుడు, ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి జిల్లా కేంద్రం అనంతపురంలోనే ఉంటున్నారు. జూన్ 30న జేసీ ప్రభాకర్‌రెడ్డి సోదరి సుజాతమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో పోలీసుల అనుమతితో ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అస్మిత్ తాడిపత్రికి వచ్చారు. సుజాతమ్మ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కర్మకాండలు పూర్తయ్యే వరకు ఊరు పొలిమేర దాటకూడదన్న ఆచారం ఉందని, అందువల్ల పెద్ద కర్మ పూర్తయ్యే వరకు తాడిపత్రిలోనే ఉండేందుకు అనుమతి ఇవ్వాలని జేసీ ప్రభాకర్‌రెడ్డి జూలై 2న కోర్టును ఆశ్రయించగా, ఆయన ఈ నెల 14 వరకు తాడిపత్రిలోనే ఉండేందుకు కోర్టు అనుమతించింది. ప్రభాకర్ రెడ్డి తాడిపత్రిలో ఉండగానే గురువారం పెద్దారెడ్డి నివాసం వద్ద మున్సిపల్ అధికారులు సర్వే చేయడం గమనార్హం.

లోఫర్ నా కొడకా

- ప్రభుత్వ టీచర్‌పై టీడీపీ నేత బూతు పురాణం
- రేషన్ బియ్యాన్ని స్కూల్‌లో పెట్టొద్దన్నందుకు దుర్భాషలు



ఉపాధ్యాయుడిని బెదిరిస్తూ బూతులు తిడుతున్న టీడీపీ నేత విజయభాస్కర్‌రెడ్డి

సాక్షి, టాస్క్‌ఫోర్స్: అధికార దర్పంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు చెలరేగిపోతున్నారు. తమ ఆగడాలను అడ్డుకున్న వారిపై విరుచుకుపడుతున్నారు. తాజాగా పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడిని ఓ టీడీపీ నాయకుడు ఇష్టారీతిన బూతులు తిడుతూ బెదిరించాడు. ఈ ఘటన నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం కోర్నపల్లె గ్రామంలో జరిగింది. ఇటీవల రేషన్ డీలర్‌షిప్ దక్కించుకున్న టీడీపీ నాయకుడు విజయభాస్కర్‌రెడ్డి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో రేషన్ బియ్యం బస్తాలు దించుతుండగా విద్యార్థులకు ఇబ్బంది అంటూ ఓ ఉపాధ్యాయుడు అడ్డు చెప్పారు. దీంతో టీడీపీ నేత బూతులతో చెలరేగిపోయాడు. 'ఎవడు ఎంతవో.. చెప్పుతో కొడతా.. ఏం పీకుతావ్ రా ఎర్రి.. (బూతు)? లోఫర్ నా కొడకా.. మాకు ఎన్ని సీట్లు వచ్చాయో తెలుసా? 164 సీట్లొచ్చాయి. స్టోర్ బియ్యం బడిలో ఎలా దించుతావని మమ్మల్నే ప్రశ్నిస్తావా? ఇక్కడ ఉండలేకపోతే ... (బూతు)' అంటూ విరుచుకుపడ్డాడు. దీంతో ఆ ఉపాధ్యాయుడు బిత్తరపోయాడు. సహ ఉపాధ్యాయులు, విద్యార్థుల ముందే ఇలా నోటికొచ్చినట్లు బూతులు తిట్టడంతో ఆ ఉపాధ్యాయుడు మిన్నకుండిపోయాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. టీడీపీ నాయకుడి తీరుపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇంత జరిగినా విద్యాశాఖ అధికారులు కానీ, ఉపాధ్యాయ సంఘాలు కానీ స్పందించక పోవడం విచారకరం.

నాకు భద్రతను పునరుద్ధరించండి

హైకోర్టులో మాజీ మంత్రి అంబటి రాంబాబు పిటిషన్

సాక్షి, అమరావతి: తనకు ప్రాణహాని ఉందని.. కాబట్టి తనకు భద్రతను పునరుద్ధరించేలా ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత అంబటి రాంబాబు హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఇప్పటివరకు తనకున్న 4+4 గన్‌మెన్ల భద్రతను ఉపసంహరించడాన్ని సవాల్ చేస్తూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తనకున్న ప్రాణహాని దృష్ట్యా ఈ వ్యాజ్యం తేలేంతవరకు తనకు 4+4 భద్రతను కొనసాగించేలా ఆదేశాలు ఇవ్వాలని ఆయన కోర్టును కోరారు. ఈ వ్యాజ్యంపై గురువారం న్యాయమూర్తి జస్టిస్ బొప్పన వరాహ లక్ష్మీనరసింహ చక్రవర్తి విచారణ జరిపారు. అంబటి తరఫున న్యాయవాది చింతల సుమన్ వాదనలు వినిపిస్తూ.. భద్రతను కొనసాగించాలని పల్నాడు ఎస్పీ, డీజీపీకి వినతిపత్రాలు సమర్పించామని, అయినా ప్రయోజనం లేదన్నారు. పిటిషనర్‌కు ప్రాణహాని ఉందని, అందువల్ల భద్రతను పునరుద్ధరించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ అంబటి రాంబాబు ప్రస్తుతం ఎక్కడ నివసిస్తున్నారని ప్రశ్నించారు. గుంటూరులో ఉంటున్నారని సుమన్ సమాధానం ఇవ్వగా, మరి పల్నాడు ఎస్పీకి వినతి పత్రం ఇవ్వడం వల్ల ప్రయోజనం ఏముంటుందన్నారు. పిటిషనర్ ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గం పల్నాడు జిల్లా పరిధిలో ఉందని, అందువల్ల ఆ జిల్లా ఎస్పీకి వినతి పత్రం ఇచ్చామని సుమన్ తెలిపారు. ఇది పూర్తిగా సాంకేతికపరమైన అంశమని సుమన్ తెలిపారు. ప్రభుత్వ న్యాయవాది (జీపీ) కె.మురళీకృష్ణారెడ్డి జోక్యం చేసుకుంటూ.. ఇది తాజా వ్యాజ్యమని, గడువు నిస్తే పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామన్నారు. ప్రాణహాని దృష్ట్యా ఈలోపు భద్రతను పునరుద్ధరించేలా ఆదేశాలు ఇవ్వాలని సుమన్ కోరారు. ఈ వ్యాజ్యానికి సంబంధించి పూర్తి వివరాలను తమ ముందుంచాలని ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశించారు. తదుపరి విచారణను ఈ నెల 10కి వాయిదా వేశారు.

త్వరలో కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశాలు

మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి



మాట్లాడుతున్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్. చిత్రంలో ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, తిప్పల నాగిరెడ్డి, కె.కె. రాజు, వాసుపల్లి గణేష్‌కుమార్

సాక్షి, విశాఖపట్నం: దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి కార్యక్రమాన్ని ఈ నెల 8న ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. గురువారం ఎండాడలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, డిప్యూటీ రీజనల్ కో–ఆర్డినేటర్ తిప్పల నాగిరెడ్డి, నగర మేయర్ హరి వెంకట కుమారి, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, సమన్వయకర్త కె.కె.రాజు, పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అనంతరం అమర్‌నాథ్, వరుదు కళ్యాణి మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్ జయంతి వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించాలని, ప్రతి వార్డులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి సేవా కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో పార్టీ ఓటమికి కారణాలను సమీక్షిస్తున్నామని, వచ్చే వారం నుంచి పార్టీ నాయకులు, శ్రేణుల మనోభావాలు తెలుసుకుంటారని చెప్పారు. త్వరలోనే పార్టీ జిల్లా, నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాలు కూడా నిర్వహిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల అయిందని, మరో 4 నెలలు పాలనా విధానాన్ని పరిశీలించి ఆ తర్వాత మాట్లాడతామని చెప్పారు. తాము ప్రజల పక్షాన పోరాటం చేస్తామని, తిరిగి వారి అభిమానాన్ని సంపాదిస్తామని అన్నారు. ప్రజలు తమ నుంచి ఏం కోరుకుంటున్నారో తెలుసుకొని, దానికి అనుగుణంగా పార్టీ నాయకత్వాన్ని ముందుకు తీసుకెళ్తామన్నారు. అదేవిధంగా పార్టీ కార్యకర్తల ఆలోచనలు, సమస్యలను తెలుసుకొని, పార్టీ అధినాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. వారి మనోభావాలకు అనుగుణంగానే పని చేస్తామన్నారు. 2019కి ముందు జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన ప్రతి అంశాన్ని మళ్లీ అమలు చేస్తామని తెలిపారు.

వ్యాపారం చేయాలంటే కప్పం కట్టాల్సిందే!

వైఎస్సార్ జిల్లా మైలవరంలో టీడీపీ నాయకుల రౌడీయిజం

జమ్మలమడుగు/మైలవరం: 'మాకు మామూళ్లు ఇస్తేనే మీ లారీలు కదులుతాయి.. మీరు వ్యాపారం చేయాలంటే కప్పం కట్టాల్సిందే' అంటూ ట్రాన్స్‌పోర్ట్ సంస్థల యజమానులను టీడీపీ నాయకులు బెదిరించారు. తమకు మామూళ్లు ఇవ్వకపోతే అంతు చూస్తామంటూ హెచ్చరించారు. నిజాయితీగా వ్యాపారం చేసుకుంటున్న తామెందుకు డబ్బులివ్వాలని ట్రాన్స్‌పోర్టు సంస్థల యజమానులు ప్రశ్నించడంతో టీడీపీ నాయకులు ఏకంగా 11 లారీలను ధ్వంసం చేశారు. ఈ ఘటన వైఎస్సార్ జిల్లా వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం మైలవరం మండలంలో జరిగింది. ఇక్కడి దాల్మియా సిమెంట్ ఫ్యాక్టరీలోకి ప్రతిరోజూ వివిధ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలకు చెందిన వందలాది లారీలు సిమెంట్ రవాణా కోసం వస్తుంటాయి. కొన్నిరోజులుగా ఈ కంపెనీల యజమానులను టీడీపీ నాయకులు మామూళ్లు డిమాండ్ చేస్తున్నారు. వ్యాపారాలు సాఫీగా జరగాలన్నా.. లారీలు రోడ్డెక్కాలన్నా మామూళ్లు ఇవ్వాలని బెదిరించారు. అయినా యజమానులు పట్టించుకోకపోవడంతో.. కక్ష పెంచుకున్న టీడీపీ నాయకులు గురువారం తెల్లవారుజామున లారెన్స్ ట్రాన్స్‌పోర్ట్‌కు చెందిన 11 లారీలను ధ్వంసం చేశారు. మామూళ్లు ఇవ్వకపోతే మిగతా కంపెనీలకూ ఇదే గతి పడుతుందని హెచ్చరించారు. దీంతో ట్రాన్స్‌పోర్ట్ కంపెనీల యజమానులు, పారిశ్రామికవేత్తలు ఆందోళనకు గురవుతున్నారు. బాడుగల రూపంలో వస్తున్న ఆదాయం తమ ఖర్చులకే సరిపోవడంలేదని, డ్రైవర్లకు, క్లీనర్లకు జీతాలు, లారీలకయ్యే ఖర్చులు పెరిగిపోయాయని, ఇప్పుడు ఇలా రౌడీయిజం చేస్తే తామంతా బతికేదెలా అని ట్రాన్స్‌పోర్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని తలమంచిపట్నం పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ హనుమంతప్పకు లారెన్స్ ట్రాన్స్‌పోర్టు మేనేజర్ కిరణ్‌కుమార్‌రెడ్డి ఫిర్యాదు చేశారు.

చేపల పెంపకానికీ మామూళ్లు.. లేదంటే దాడే

జమ్మలమడుగులో చేపల పెంచుకోవాలన్నా టీడీపీ నాయకులకు మామూళ్లు ఇవ్వాల్సిందే. లేదంటే దాడి చేసి చంపడానికీ వెనుకాడట్లేదు. చేపల పెంపక కేంద్రం నిర్వహిస్తున్న మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ సుబ్బారాయుడిని కూడా ఇటీవల టీడీపీ నాయకులు బెదిరించారు. రూ.20 లక్షలు ఇవ్వకపోతే చేపల కేంద్రాన్ని మూసేస్తామంటూ హెచ్చరించారు. వారి హెచ్చరికలను లెక్కచేయకపోవడంతో సుబ్బారాయుడు, అతని కుమారులపై దాడి చేశారు. చికిత్స కోసం వెళ్తుండగా.. ప్రభుత్వాస్పత్రి ఆవరణలో కూడా దాడి చేశారు. దీంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. టీడీపీ నాయకుల తీరుతో వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై జనసేన శ్రేణుల దాడి

- తలకు తీవ్రగాయాలు
- ఏలూరు జిల్లా సరిపల్లిలో ఘటన



తీవ్రంగా గాయపడిన జిట్టా వెంకటేశ్వరరావు

కొయ్యలగూడెం: రాష్ట్రంలో టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తల దాడులు రోజురోజుకీ పెచ్చుమీరిపోతున్నాయి. విచ్చలవిడిగా వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు తెగబడుతున్నారు. ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం సరిపల్లిలో గురువారం జనసేన శ్రేణులు వైఎస్సార్‌సీపీ కార్యకర్త జిట్టా వెంకటేశ్వరరావుపై దాడి చేశారు. ఇంటి నుంచి మెయిన్ సెంటర్‌కు వస్తుండగా.. వెంకటేశ్వరరావుతో వాగ్వివాదానికి దిగిన కొందరు జనసేన కార్యకర్తలు ఆయనపై గునపంతో దాడికి దిగారు. వెంకటేశ్వరరావు తలకు తీవ్ర గాయమైంది. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ ఎం.రామకృష్ణ తెలిపారు.

స్థలం కబ్జా చేసిన టీడీపీ నేత

- మనస్తాపంతో మహిళ ఆత్మహత్యాయత్నం
- అన్నమయ్య జిల్లాలో ఘటన



కబ్జా అయిన స్థలం వద్ద అపస్మారక స్థితిలో తలారి మావి

సాక్షి, టాస్క్‌ఫోర్స్: అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం ములకలచెరువులో దారుణం జరిగింది. గ్రామానికి చెందిన టీడీపీ నేత నాయనిచెరువుపల్లి రెడ్డప్ప తన ఇంటి స్థలం కబ్జా చేశాడనే మనస్తాపంతో ఒక మహిళ గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. ములకలచెరువులో తలారి మావి అనే మహిళకు ఇంటి స్థలం.. అందులో షెడ్డు ఉంది. వారం క్రితం మావి ఇంటి స్థలాన్ని కబ్జా చేసిన టీడీపీ నేత రెడ్డప్ప అందులోని షెడ్డును కూడా దౌర్జన్యంగా కూల్చేశాడు. తనకు జరిగిన అన్యాయంపై పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని తలారి మావి తీవ్ర మనస్తాపానికి గరయ్యారు. కబ్జాకు గురైన తన స్థలం వద్దే ఆమె పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అపస్మారక స్థితిలో ఉన్న తలారి మావిని కుటుంబ సభ్యులు 108 వాహనం ద్వారా మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ములకలచెరువు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

టీడీపీ నేతల వేధింపులు తాళలేక వీఆర్‌ఏ మృతి

నెలనుంచి నరకం చూపించారని మృతుని కుమారుడు ఆవేదన



మునెప్ప(ఫైల్)

సాక్షి, టాస్క్‌ఫోర్స్: టీడీపీ నేతల వేధింపులు తాళలేక వీఆర్‌ఏ (గ్రామ రెవెన్యూ సహాయకుడు) తలారి మునెప్ప (55) గుండెపోటుతో మృతిచెందిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. మృతుని కుమారుడు చెన్నప్ప కథనం మేరకు.. చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం పెద్దపంజాణి మండలం గోనుమాకులపల్లెకు చెందిన తలారి మునెప్ప చామనేరు రెవెన్యూ గ్రామానికి వీఆర్‌ఏగా ఉన్నాడు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తన కుమారుడు చెన్నప్ప వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచారు. దీంతో అతని కుటుంబంపై అదే గ్రామానికి చెందిన ఇద్దరు టీడీపీ నేతలు నెల రోజులుగా కక్ష కట్టి నరకం చూపారు. టీడీపీ నేతకి చెందిన కోళ్ల ఫారం సమీపంలో ఉన్న మునెప్పకు చెందిన పశువుల షెడ్డుకు కరెంటు సరఫరాను నిలిపివేయించారు. అంతటితో ఆగకుండా ఆవుల షెడ్డులో పనుల కోసం వచ్చే కూలీలను భయభ్రాంతులకు గురిచేసి పనులకు రానీయకుండా అడ్డుకున్నారు. వారం రోజులుగా నిత్యం ఆ ఇద్దరు టీడీపీ నేతలు తన తండ్రి తలారి మునెప్పకు, తనకు ఫోన్ చేసి అసభ్య పదజాలంతో దూషించడంతో తీవ్ర ఆవేదన చెంది బుధవారం గుండెపోటుకు గురై ఇంట్లో కుప్పకూలాడని చెన్నప్ప చెప్పారు. తాము వెంటనే పలమనేరు ప్రభుత్వ వైద్యశాలకు మునెప్పను తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పినట్లు చెన్నప్ప తెలిపారు.

ఎమ్మెల్యే ఇంట్లో తన్నుకున్న తమ్ముళ్లు

సాక్షి, నరసరావుపేట: పల్నాడు జిల్లా నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద్‌బాబు ఇంట్లో... ఆయన సమక్షంలోనే టీడీపీకి చెందిన రెండు వర్గాలు ఒకరిపై ఒకరు దాడులకు తెగబడడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమయ్యింది. గురువారం జరిగిన సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. డాన్స్ పార్టీ ఆర్కెస్ట్రా బృందాలతో సన్నిహితంగా ఉండే ఓ టీడీపీ యువనేత ఆ వ్యవస్థపై అధిపత్యం కోసం ప్రయత్నిస్తున్నాడట. జనసేనకు అనుకూలంగా ఉండే మరో వర్గం టీడీపీ నేతలు సైతం తమ పట్టుకోసం దృష్టి సారించారని సమాచారం. ఈ నేపథ్యంలో రెండు వర్గాల మధ్య వివాదం చెలరేగినట్టు తెలుస్తోంది. గురువారం ఈ పంచాయితీ ఎమ్మెల్యే చదలవాడ అరవింద్‌బాబు ఇంటికి చేరింది. ముందుగా వెళ్లిన ఓ వర్గం ఎదుటి వర్గంపై ఫిర్యాదులు చేశారట. ఇంతలో అక్కడికి మరో వర్గం టీడీపీ కార్యకర్తలు చేరుకోవడంతో ఒకరిపై ఒకరు తీవ్రస్థాయిలో దూషించుకున్నారట. తరువాత ఇరువర్గాలు దాడికి పాల్పడ్డారట. ఎమ్మెల్యే ఇంట్లోని పూలకుండీలు ఇతర సామగ్రిని ధ్వంసం చేశారని తెలుస్తోంది. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డ ముగ్గురిని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించినట్లు తెలుస్తున్నది. ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని వన్‌టౌన్ సీఐ కృష్ణారెడ్డి తెలిపారు.

పొలంలో దౌర్జన్యంగా కంచె తొలగింపు

వైఎస్సార్ జిల్లాలో టీడీపీ నేతల బరితెగింపు



దేరంగుల వెంకటేశ్ పొలంలో తొలగించిన కంచె

బి.కోడూరు: టీడీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుంచి ఆ పార్టీ నేతలు వైఎస్సార్‌సీపీ నేతలపై కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారు. వైఎస్సార్ జిల్లా బి.కోడూరు మండలం తంగేడుపల్లెలో గురువారం జరిగిన ఘటన ఇందుకు అద్దం పడుతోంది. గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు దేరంగుల వెంకటేశ్ పదేళ్లుగా తన పొలం చుట్టూ కంచె వేసుకుని సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన కొందరు టీడీపీ నాయకులు ఇటీవల శ్మశానానికి దారి నెపంతో ఆ కంచెను తొలగించారు. అంతటితో ఊరుకోకుండా తన పట్టా భూమిలో దౌర్జన్యంగా రోడ్డు ఏర్పాటు చేశారని దేరంగుల వెంకటేశ్ ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులకు తెలిపినా స్పందించకపోవడంతో జిల్లా పోలీసు అధికారులకు గురువారం ఫిర్యాదు ఫిర్యాదు చేశారు. టీడీపీ నాయకుల ఆగడాలను అరికట్టి తనకు న్యాయం చేయాలని కోరారు.

రోడ్డు శిలాఫలకం ధ్వంసం

పార్వతీపురం మన్యం జిల్లాలో ఘటన



ధ్వంసమైన శిలాఫలకం

కురుపాం: పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం గొటివాడ పంచాయతీ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తులు రోడ్డు శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. పంచాయతీ పరిధిలోని బల్లుకోటకు టేఖరఖండి మీదుగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.1.25 కోట్ల వ్యయంతో 4 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మించింది. దీన్ని అప్పటి ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి ప్రారంభించారు. ఖర్చు వివరాలతో కూడిన శిలాఫలకాన్ని ఏర్పాటుచేశారు. దీన్ని గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న గొటివాడ పంచాయతీ సర్పంచ్ తిమ్మక తట్టమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు తిమ్మక సునీత ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితులను పట్టుకోవాలని పోలీసులను డిమాండ్ చేశారు.

పిల్లలకు బ్రషింగ్ నేర్పడం ఇలా...



పెరిగే పిల్లల పళ్లు, చిగుళ్లు ఆరోగ్యంగా ఉండాలంటే, వాళ్లకు పళ్లు రంధ్రాలు పడటం, పుచ్చుపళ్లు రావడం వంటివి నివారించాలంటే ఈ కింది జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు బ్రషింగ్ ప్రక్రియనూ నేర్పాలి... ● పళ్లపై ఏర్పడే గార తొలగిపోడానికి, అది ఏర్పడకుండా ఉండటానికి పేస్ట్‌తో రోజూ రెండుసార్లు బ్రష్ చేయడం నేర్పాలి. ● పళ్ల మీద గుండ్రంగా తిప్పుతున్నట్లుగా బ్రష్‌ను ఉపయోగించేలా చిన్నప్పటినుంచి అలవాటు చేయాలి. దానికి వాళ్లు అలా అలవడిపోయి, జీవితాంతం కరెక్ట్‌గా బ్రషింగ్ చేస్తారు. ● బ్రష్ మీద బఠాణీ గింజ అంత పేస్ట్ వేస్తే ... దానిని వారు మింగకుండా ఉంటారు. ● నాలుగేళ్లు దాటాక కూడా వేలు చప్పరించే పిల్లల పళ్లు వంకర టింకరగా రావడం లేదా ఒకేచోట గుంపుగా రావడం జరగవచ్చు. అందుకే ఈ అలవాటు త్వరగా మానేలా జాగ్రత్త తీసుకోవాలి.

వంటిల్లు

మన వంటగదికి పొరుగింటి రుచిని అద్దుదాం.
కేరళ కొబ్బరితో బ్రేక్‌ఫాస్ట్ చేద్దాం.
పెరుగుతో పంజాబీ కడీ చేద్దాం.
శనగలతో జైసల్మీర్ చనే కూడా ట్రై చేద్దాం.
పిల్లలకు అన్ని రుచులూ అలవాటైతే...
పై చదువులకు ఏ రాష్ట్రానికి వెళ్లినా సరే...
మన ఇంట్లో భోజనం చేసినట్లే ఉంటుంది.

ఆ ఉత్తరం ఈ దక్షిణం అన్ని రుచులూ అద్భుతః

కేరళ పాలాపం



కావలసినవి: బియ్యం– పావు కేజీ ; పచ్చి కొబ్బరి తురుము – యాభై గ్రాములు ; నీరు– వంద మిల్లీలీటర్లు ; చక్కెర – అర స్పూన్ ; ఉప్పు – అర స్పూన్ ; బేకింగ్ సోడా– చిటికెడు.

తయారీ: ● బియ్యాన్ని శుభ్రంగా కడిగి మంచినీటిలో ఐదు గంటల సేపు నానబెట్టాలి. మిక్సీలో బియ్యంతోపాటు కొబ్బరి తురుము కూడా వేసి తగినంత నీటిని చేరుస్తూ మెత్తగా గ్రైండ్ చేయాలి. ఇది ఆపం పిండి ● బాణలిలో నీటిని పోసి, అందులో పై మిశ్రమాన్ని ఒక కప్పు వేసి గరిటెతో కలుపుతూ మరిగించి దించేయాలి. మిశ్రమం చల్లారిన తర్వాత ఆపం పిండిలో వేసి కలపాలి. ఈ పిండిని ఎనిమిది గంటల సేపు కదిలించకుండా ఉంచాలి. రాత్రి గ్రైండ్ చేసి పెడితే ఉదయానికి పొంగుతుంది. ఇందులో చక్కెర, ఉప్పు, బేకింగ్ సోడా వేసి గరిటెతో బాగా కలపాలి. మిశ్రమం గరిటె జారుడుగా ఉండాలి. అవసరాన్ని బట్టి మరికొంత నీటిని వేసుకోవచ్చు ● ఆపం పెనం వేడి చేసి ఒక గరిటె పిండి వేసి అంచులు పట్టుకుని వలయాకారంగా తిప్పితే పిండి దోశెలాగ విస్తరిస్తుంది. మీడియం మంట మీద కాల్చాలి. కాలే కొద్దీ అంచులు పైకి లేస్తాయి. అట్లకాడతో తీసి ప్లేట్‌లో పెట్టాలి. దీనిని రెండవ వైపు కాల్చాల్సిన పని లేదు, కాబట్టి తిరగేయకూడదు. ఈ ఆపం అంచులు ఎర్రగా కరకరలాడుతూ మధ్యలో దూదిలా మెత్తగా ఉంటుంది. నూనె వేయాల్సిన పని లేదు. ఆపం పెనం లేకపోతే దోశె పెనం (ఫ్లాట్‌గా కాకుండా కొంచెం గుంటగా ఉండే పెనం) మీద ప్రయత్నించవచ్చు.

పంజాబీ కడీ



కావలసినవి: శనగపిండి మిశ్రమం కోసం: ; శనగపిండి– కప్పు ; పెరుగు– 2 కప్పులు ; నీరు– 4 కప్పులు ; పసుపు– చిటికెడు.

కడీ కోసం: ఆవనూనె లేదా వేరుశనగ నూనె– టేబుల్ స్పూన్ ; పసుపు – అర టీ స్పూన్ ; ఇంగువ– పావు టీ స్పూన్ ; ఆవాలు – టీ స్పూన్ ; జీలకర్ర – టీ స్పూన్ ; మెంతులు – అర టీ స్పూన్ ; లవంగాలు – 3 ; ఎండుమిర్చి – 2 ; కరివేపాకు – 3 రెమ్మలు ; ఉల్లిపాయ – 1 పెద్దది (తరగాలి) ; అల్లం– అంగుళం ముక్క (తరగాలి) ; వెల్లుల్లి– 4 రేకలు (తరగాలి) ; మిరప్పొడి– అర టీ స్పూన్ ; ధనియాల పొడి –2 టీ స్పూన్‌లు ; ఉప్పు – టీ స్పూన్ ; గరం మసాలా– అర టీ స్పూన్ ; ఆమ్‌చూర్ పొడర్– 2 టీ స్పూన్‌లు లేదా పచ్చి మామిడి గుజ్జు టేబుల్ స్పూన్ ; కసూరీ మేథీ (ఎండిన మెంతి ఆకుల పొడి)– 2 టీ స్పూన్.

తడ్కా కోసం: నూనె – టేబుల్ స్పూన్ ;ఎండుమిర్చి– 2 ; కశ్మీరీ మిర్చిపొడర్– అర టీ స్పూన్ ; కొత్తిమీర తరుగు– టేబుల్ స్పూన్

తయారీ: ● ఒక పెద్ద పాత్రలో పెరుగు, శనగపిండి వేసి బాగా కలిసేటట్లు చిలకాలి. అందులో పసుపు వేసి, నీరు పోసి మళ్లీ చిలికి అరగంట సేపు పక్కన ఉంచాలి ● స్టవ్ మీద మందపాటి పాత్ర పెట్టి నూనె వేడి చేయాలి. అందులో ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి, మెంతులు, అల్లం, వెల్లుల్లి, లవంగాలు, ఉల్లిపాయ ముక్కలు, ఇంగువ వేసి వేగనివ్వాలి. అవి వేగిన తర్వాత మిర్చిపొడర్, ధనియాల పొడి, పసుపు, ఉప్పు వేసి కలపాలి. ఇవన్నీ చక్కగా వేగిన తర్వాత ముందుగా కలిపి పెట్టుకున్న శనగపిండి– పెరుగు మిశ్రమాన్ని పోసి ఉండలు కట్టకుండా గరిటెతో కలుపుతూ ఉడికించాలి. ఐదు నిమిషాల సేపు మీడియం మంట మీద ఉడికిన తర్వాత మంట తగ్గించి మూత పెట్టి పది నిమిషాల సేపు ఉడికించిన తర్వాత ఆమ్‌చూర్ పొడర్, కసూరీ మేథీ, గరం మసాలా పొడి వేసి కలిపి దించేయాలి ● బాణలి పెట్టి నూనె వేడి చేసి అందులో ఎండుమిర్చి, కశ్మీరీ మిర్చిపొడర్ వేసి వేగిన తర్వాత ఉడికించిన కడీ మిశ్రమాన్ని పోసి చివరగా కొత్తిమీర చల్లితే పంజాబీ కడీ రెడీ. ఇది అన్నంలోకి బాగుంటుంది. పంజాబీ కడీలో నీరు ఎక్కువగా కలిపి పలుచగా చేసుకుని సూప్‌లా కూడా తాగుతారు. వర్షాకాలం, చలికాలం ఈ సూప్ తాగుతుంటే జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడి తేలిగ్గా, హాయిగా ఉంటుంది.

జైసల్మీరీ చనే



కావలసినవి: ముడి శనగలు – కప్పు ; నెయ్యి – టేబుల్ స్పూన్; ఇంగువ – చిటికెడు ; జీలకర్ర– అర టీ స్పూన్ ; జీలకర్ర పొడి– టీ స్పూన్ ; ధనియాల పొడి – 2 టీ స్పూన్‌లు ; మిరప్పొడి – టేబుల్ స్పూన్ ; పసుపు– అర టీ స్పూన్ ; గరం మసాలా పొడి– అర టీ స్పూన్ ; పెరుగు– ఒకటిన్నర కప్పులు ; శనగ పిండి –3 టేబుల్ స్పూన్‌లు ; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూన్.

తయారీ: ● శనగలను శుభ్రంగా కడిగి ఆరింతలుగా నీటిని పోసి రాత్రంతా నానబెట్టాలి. ఉదయం నీటిని వంపేసి మరోసారి కడిగి ప్రెషర్ కుకర్‌లో వేసి నాలుగు కప్పుల నీటిని పోసి ఐదు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి. దించేసిన తర్వాత చల్లారే వరకు పక్కన ఉంచాలి ● ఒక వెడల్పు పాత్రలో శనగపిండి, పెరుగు, పసుపు, మిరప్పొడి, జీలకర్ర పొడి, ధనియాల పొడి, గరం మసాలా పొడి, ఉప్పు వేసి ఉండలు లేకుండా బాగా కలపాలి ● పెనంలో నెయ్యి వేడి చేసి జీలకర్ర, ఇంగువ వేయాలి. జీలకర్ర చిటపట పేలిన తర్వాత ముందుగా కలిపి పెట్టుకున్న శనగపిండి, పెరుగు మిశ్రమాన్ని వేసి అడుగు పట్టకుండా కలుపుతూ ఐదు నిమిషాల సేపు ఉడికించాలి ● ప్రెషర్‌కుకర్‌లో ఉడికించి సిద్ధంగా ఉంచిన శనగలను నీటితో సహా ఉడుకుతున్న శనగపిండి, పెరుగు మిశ్రమంలో వేసి కలిపి మరో ఐదు నిమిషాల సేపు ఉడికించాలి. చివరగా కొత్తిమీర చల్లి దించేయాలి. ఈ జైసల్మీరీ చనే కర్రీ రోటీ, పుల్కాలతో పాటు అన్నంలోకి కూడా రుచిగా ఉంటుంది.

ఫ్యాషన్

స్కర్టే... స్టయిల్







అమ్మాయిల సంప్రదాయ అలంకరణలో
స్కర్ట్‌కు ప్రత్యేక స్థానం ఉంటుంది.
ఒకేతరహా ఫ్యాబ్రిక్‌తో స్కర్ట్ సాదాసీదాగా కనిపించేది.
దీనికి అదనపు హంగుగా కుచ్చులు జత చేసి,
ఒకవైపు నుంచి మరోవైపుకు సెట్ చేస్తే..
వచ్చిన స్టైల్ డ్రేప్డ్ స్కర్ట్.
షార్ట్ కుర్తీ, ట్యునిక్, ఖఫ్తాన్ వంటి టాప్స్ ఎంపిక ఏదైనా
డ్రేప్డ్ స్కర్ట్‌కి జత చేస్తే ఆ స్టైల్ అదుర్స్ మరి.

ఇండియన్ ట్రెడిషనల్ డ్రెస్‌గా ఆకట్టుకునే డ్రేప్డ్ స్కర్ట్ వెస్టన్ స్టైల్‌లోనూ యంగ్‌స్టర్స్‌ని ఆకట్టుకుంటుంది. ఫ్లోరల్ ప్రింట్లు, ఎంబ్రాయిడరీ వర్క్‌తో మరింత ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంటుంది.



డ్రేప్డ్ స్కర్ట్ అంచులు ఎగుడు దిగుడుగా ఉండటమే దీని ప్రత్యేకత. అందుకే ఎక్కువ భాగం ఈ స్కర్ట్‌కి ఎంబ్రాయిడరీ వంటి హంగులు అవసరం లేదు. టాప్‌గా ఎంచుకునే కుర్తీ, లాంగ్ అండ్ షార్ట్ జాకెట్స్, ఖఫ్తాన్, ట్యునిక్స్‌ని ఎంబ్రాయిడరీ లేదా ఫ్లోరల్ వర్క్‌తో రిచ్‌లుక్‌ని తీసుకురావచ్చు.



ప్లెయిన్ శాటిన్, సిల్క్ మెటీరియల్‌తో విరివిగా కనిపించే డ్రేప్డ్ స్కర్ట్ సెట్స్ ఇండోవెస్టన్ లుక్‌ని సొంతం చేస్తుంది. అందుకే ఈ స్టైల్ యూత్‌ని అట్రాక్ట్ చేస్తుంది.

టాప్ టు బాటమ్ ఒకే రంగులో ప్లెయిన్‌గా ఉండే డ్రేప్డ్ స్కర్ట్ సెట్స్ ఫ్యామిలీ గెట్ టు గెదర్ వేడుకలకు ప్రత్యేకంగా నిలిస్తే, పట్టు, ఫ్లోరల్, జరీ వర్క్‌తో డిజైన్ చేసినవి వివాహ వేడుకలలోనూ గ్రాండ్‌గా కనిపిస్తాయి.

మన్ కీ బాత్

కష్టాలకు గొడుగు పట్టారు

కేరళలోని అట్టపాడి గిరిజన ప్రాంతంలో నవజాత శిశువుల మరణాలు అనేకం చోటు చేసుకున్నాయి. కారణం పౌష్టికాహార లోపం. పోషకాలు ఇచ్చే అటవీ ఆహారం నశించిపోయి గర్భిణులకు తిండి కరువైంది. దాంతో ఒక స్వచ్ఛంద సంస్థ వారిని గొడుగుల తయారీలో శిక్షణ ఇచ్చింది. 2015 నుంచి 'కార్తుంబి' (తూనీగ) అనే బ్రాండ్ కింద ఆ గిరిజన మహిళలు తయారు చేస్తున్న గొడుగులు దేశమంతా అమ్ముడుపోతున్నాయి. తాజాగా ప్రధాని మోడి తన 'మన్ కీ బాత్'లో వీరిని శ్లాఘించారు. కర్తుంబి గురించి....



కార్తుంబి గొడుగుల తయారీలో ఆదివాసీ మహిళలు

'కేరళ సంస్కృతిలో గొడుగులు ఒక భాగం. అక్కడి కార్తుంబి గొడుగుల గురించి నేను ప్రస్తావించ దలుచుకున్నాను. రంగు రంగుల ఆకర్షణీయమైన ఈ గొడుగులను ఆదివాసి మహిళలు తయారు చేస్తారు. కేరళలోని చిన్న పల్లె నుంచి తయారయ్యే ఈ గొడుగులు నేడు పెద్ద పెద్ద మల్టీనేషనల్ కంపెనీలకు చేరుతున్నాయి. ఓకల్ ఫర్ లోకల్‌కు ఇంతకుమించిన ఉదాహరణ ఏం కావాలి' అని జూన్ 30న తన 111వ 'మన్ కీ బాత్'లో ప్రధాని మోడి కర్తుంబి గొడుగుల గురించి చేసిన ప్రస్తావన అక్కడి గిరిజన మహిళల ముఖాన చిర్నవ్వులు తేవడమే కాదు దేశవ్యాప్తంగా వారు సాగిస్తున్న కృషిని తెలిపింది. చాలామంది నేడు కార్తుంబి గొడుగుల గురించి తెలుసుకుంటున్నారు. ఆ గాథతో స్ఫూర్తి పొందుతున్నారు.

పాలక్కాడ్‌లో గిరిజనులు

పాలక్కాడ్‌లోని లోపలి పల్లెల్లో ముడుగ, ఇరుల, కర్మ్మగ తదితర గిరిజనులు ఉంటారు. చాలా ఏళ్లపాటు వీరికి డబ్బు అవసరం ఏర్పడలేదు. అటవీ ఆహారమే వీరి ఆహారం. అయితే 2012 నుంచి ఈ ప్రాంతంలో నవజాత శిశువుల మరణాలు ఎక్కువగా నమోదవడం స్వచ్ఛంద సంస్థలు గమనించాయి. 2012 నుంచి 2015 వరకు ఇక్కడ అనధికారికంగా 200 శిశుమరణాలు జరిగి ఉంటాయని అంచనా. ఇందుకు కారణం గర్భిణులకు పౌష్టికాహారం లేకపోవడమే.'మేము తినే కందమూలాలు, పండ్లు, ఆకుకూరలు ఇప్పుడు అడవుల్లో లేవు. క్రూరమృగాల భయం వల్ల మేము వ్యవసాయం చేయము. మాకు అంతిమంగా డబ్బుతో అవసరం ఏర్పడింది. అది మా దగ్గర లేదు. కాబట్టి మేము ఆహారం కొనుక్కుని తినే పరిస్థితుల్లో లేము' అని అక్కడ మహిళలు చెప్పారు. దాంతో పాలక్కాడ్‌లో గిరిజనుల కోసం పని చేసే 'తంపు' అనే స్వచ్ఛంద సంస్థ వీరి సమస్యను లోకానికి తెలియచేసింది. గల్ఫ్‌లో పని చేస్తున్న కేరళీయుల బృందం వీరి సాయానికి ముందుకు వచ్చింది. ఫలితంగా ఏర్పడిందే 'కార్తుంబి' గొడుగుల బ్రాండ్.



రంగుల తూనీగ

పాలక్కాడ్‌లో పిల్లల కోసం పని చేసే ఒక సంస్థ 'కార్తుంబి' (తూనీగ) పేరుతో అందరికీ తెలుసు. అందరినీ ఆకర్షించే ఈ పేరుతోనే బ్రాండ్ ఏర్పాటు చేసి ఆదివాసీ మహిళలకు గొడుగుల తయారీలో శిక్షణ ఇచ్చారు. మొదట 70 మందిని ఎంపిక చేసి వారికి మెటీరియల్ సరఫరా చేస్తే గొడుగులు ఎలా చేయాలో నేర్పారు. ఆ తర్వాత వారు తమ రోజువారీ పనులు చేసుకుంటూనే ఇంట్లో వీలైనప్పుడల్లా గొడుగులు తయారు చేసే వెసులుబాటు ఇచ్చారు. ఒక గొడుగు తయారు చేస్తే 30 రూపాయల కూలీతో ఈ పని మొదలైంది. 2017 నుంచి కేరళ గిరిజన సంక్షేమ శాఖ ఫండ్ రిలీజ్ చేస్తోంది. వీరి నుంచి తయారైన గొడుగులు వివిధ సంస్థల ద్వారా మార్కెటింగ్ అవుతున్నాయి.

సీజన్‌లో 17 వేల గొడుగులు

70 మంది మహిళలతో మొదలైన ఈ పని నేడు 350 గిరిజన మహిళలకు చేరుకుంది. వీరు జనవరి నుంచి మే చివరి వరకు మాత్రమే పని చేస్తారు. జూన్ మొదటి వారంలో మాన్‌సూన్ రావడంతో గొడుగుల అమ్మకాలు ఉంటాయి కాబట్టి. ఒక సీజన్‌లో వీరంతా కనీసం 17 వేల గొడుగులు తయారు చేస్తున్నారు. ఒక్కొక్క మహిళ రోజుకు 700 నుంచి వేయి రూపాయల వరకు సంపాదిస్తుంది. ఈ త్రీఫోల్డ్ గొడుగులు మెటీరియల్‌ను బట్టి 350 రూపాయల నుంచి 649 రూపాయల వరకూ అందుబాటులో ఉన్నాయి.

గొడుగుల దానం

చలికాలంలో రగ్గుల దానం ఎంత అవసరమో వానాకాలంలో గొడుగుల దానం అంత అవసరం. కార్తుంబి గొడుగుల మార్కెటింగ్ కోసం ఒక టెకీ సంస్థ కార్పొరేట్ సంస్థలను సంప్రదించి వారిచేత గొడుగులు కొనేలా చేస్తోంది. ఉద్యోగులకు, పేదవారికి ఉచితంగా ఇచ్చేలా చూస్తుంది. అలాగే కేరళలో వానాకాలంలో స్కూళ్లకు వచ్చిపోయే పేద పిల్లలకు గొడుగులు చాలా అవసరం. అందుకే 'స్కూలు పిల్లలకు కార్తుంబి గొడుగులు' పేరుతో కూడా క్యాంపెయిన్‌లు జరుగుతుంటాయి. సీజన్ మొదట్లో బల్క్‌గా ఈ గొడుగులు కొని పిల్లలు పంచుతుంటారు చాలామంది. ఇప్పుడు ప్రధాని ప్రసంగం వల్ల కేరళలోని ఇతర మహిళలు కూడా ఈ గొడుగుల తయారీ పట్ల ఆసక్తి చూపుతున్నారు. రాబోయే రోజుల్లో వానలొస్తే రంగు రంగుల కార్తుంబి తూనీగలు ప్రతి ఒక్కరి నెత్తిమీద ఎగురుతుంటాయని ఆశిద్దాం.

● టెక్.. టాక్

ఆస్క్ మెటా ఏఐ



రోజురోజుకూ ఏఐ టూల్స్‌కు ప్రాధాన్యత పెరుగుతున్న నేపథ్యంలో పెద్ద సంస్థలు కొత్త ఏఐ టూల్స్‌ను యూజర్‌లకు చేరువచేస్తున్నాయి. వాట్సాప్ 'ఆస్క్ మెటా ఏఐ' అలాంటిదే. వాట్సాప్ చాట్‌మెనూలో మెటా ఐకాన్‌ను క్లిక్ చేస్తే 'ఆస్క్ మెటా ఏఐ ఎనీ థింగ్' అనే పాప్‌అప్ ఓపెన్ అవుతుంది. యూజర్‌ల కోసం కొన్ని టాపిక్‌లు కనిపిస్తాయి. వాటికి సంబంధించిన ప్రశ్నలకు 'ఆస్క్ మెటా ఏఐ' సమాధానం చెబుతుంది. 'ఏఐ'తో చిట్‌చాట్ చేయవచ్చు. 'ఆస్క్ మెటా'కు సంబంధించి యూజర్‌ల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటుంది వాట్సాప్. మెటా ఏఐ ఇచ్చిన జవాబులను లాంగ్ ప్రెస్ చేస్తే 'గుడ్ రెస్పాన్స్' 'బ్యాడ్ రెస్పాన్స్' అనే ఆప్షన్‌లు కనిపిస్తాయి. వీటి ద్వారా మన అభిప్రాయాన్ని తెలియజేయవచ్చు.

రియల్‌మీ సి 63



సైజ్	: 6.74 అంగుళాలు
రిజల్యూషన్	: 720×1600 పిక్సెల్స్
ర్యామ్	: 4జీబి
స్టోరేజ్	: 128జీబి
బ్యాటరీ	: 5000 ఎంఏహెచ్
వోఎస్	: ఆండ్రాయిడ్ 14
ఫ్రంట్ కెమెరా	: 50 ఎంపీ
బ్యాటరీ	: 5000 ఎంఏహెచ్
కనెక్టివిటీ	: 5జీ

మెటా ఏఐ ఇన్ఫో



'మేడ్ విత్ ఏఐ' లేబుల్స్‌ను 'ఏఐ ఇన్ఫో'గా అప్‌డేట్ చేసింది మెటా. వైట్‌హౌజ్ ఫొటోగ్రాఫర్ సూజ తీసిన బాస్కెట్‌బాల్ గేమ్ ఫొటోపై 'మేడ్ బై ఏఐ'గా లేబుల్ వేయడం దుమారం రేపింది. ఎడిట్ చేసిన ఒరిజినల్ ఇమేజ్‌లను 'మేడ్ విత్ ఏఐ'గా మార్క్ చేసినందుకు 'ఏఐ ఇమేజ్ లేబుల్స్' ఇటీవల విమర్శలు ఎదుర్కొంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని కంపెనీ తన యాప్‌లలో 'ఏఐ ఇమేజ్ లేబుల్స్'ను 'ఏఐ ఇన్ఫో'గా మార్చింది. 'ఏఐ ఇన్ఫో' బ్యాడ్జ్ ద్వారా కంటెంట్ గురించి మరింత సమాచారం తెలుసుకోవచ్చు.

వివో ఎక్స్ 100 అల్ట్రా



డిస్‌ప్లే	: 6.8 అంగుళాలు
వోఎస్	: ఆండ్రాయిడ్ 14
మెమోరీ	: 256జీబి 12జీబి ర్యామ్/ 512జీబి 16జీబి ర్యామ్
రిజల్యూషన్	: 1440×3200 పిక్సెల్స్
రిఫ్రెష్‌రేట్	: 120 హెచ్‌జడ్
బ్యాటరీ	: 5500 ఎంఏహెచ్
కనెక్టివిటీ	: 5జీ

యువర్స్

● సక్సెస్ స్టోరీ
మోటో వ్లాగింగ్

'ప్రయాణం అంటే మరో ప్రపంచంలోకి వెళ్లడం' అంటున్న ముంబైకర్ నిఖిల్(నిఖిల్ శర్మ) సోలో మోటర్‌సైకిల్ ట్రిప్స్‌తో మోటో వ్లాగింగ్ మొదలుపెట్టాడు. కే2కే (కన్యాకుమారి టు కశ్మీర్) యాత్ర చేసి సోషల్ మీడియాలో లక్షలాదిమంది ఫాలోవర్‌లను సంపాదించుకున్నాడు. లైఫ్‌స్టైల్ ఇన్‌ఫ్లూయెన్సర్‌గా కంటెంట్ క్రియేట్ చేస్తున్నాడు....

జయహో విజయ విహారి



ముంబైలో హోటల్ మేనేజ్‌మెంట్ చేసిన నిఖిల్‌కు ప్రయాణాలు చేయడం అంటే బోలెడు ఇష్టం. ఎంత ఇష్టం అంటే రోజూ 50 నుంచి 100 కిలోమీటర్‌లు ఎక్కడో ఒకచోటుకి వెళ్లిరావాల్సిందే. అయితే ఒకానొక రోజు మాత్రం... 'ఎప్పుడూ ముంబై మాత్రమేనా....ఔట్ సైడ్ ముంబై కూడా వెళ్లాలి' అనుకున్నాడు.

అలా బైక్‌పై ఆజ్మీర్, బెంగకూరుకు వెళ్లాడు. ఇక అప్పటి నుంచి మొదలైన ఔట్‌సైడ్ ముంబై ప్రయాణాలు ఆగలేదు. ఈ ప్రయాణాల పుణ్యమా అని మన దేశంలోని 'మోటో వ్లాగింగ్' ప్రఖ్యాత యూట్యూబర్‌లలో ఒకరిగా నిఖిల్ శర్మ పేరు తెచ్చుకున్నాడు.

నిఖిల్ ఫ్యాన్ బేస్ విషయానికి వస్తే.... యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ఫాలోవర్‌ల సంఖ్య లక్షలలో ఉంది. తాను వీడియోలు చేయడం మొదలుపెట్టినప్పుడు మన దేశంలో వ్లాగింగ్‌కు పెద్దగా ప్రాచుర్యం లేదు. డైలీ వ్లాగింగ్ చేయడం ద్వారా ఆడియెన్స్‌తో ఎప్పటికప్పుడూ టచ్‌లో ఉండేవాడు. మన దేశంలో ఏ మూలన ఉన్న ఆడియెన్స్ అయిన నిఖిల్ చెబుతున్న కబుర్లు విని ఊహల్లోనే తాను ఉన్న చోటుకి వెళ్లేవారు.

వ్లాగింగ్‌కు ఆవలి ప్రపంచంలోకి వెళితే... నిఖిల్‌కు నటన అంటే ఇష్టం. బాలీవుడ్ సినిమాల్లో, టీవీ సీరియల్స్‌లో నటించాడు. ఫ్లైట్ అటెండెంట్‌గా కొంతకాలం ఉద్యోగం కూడా చేశాడు. ఉద్యోగం మానేసినప్పుడు తల్లిదండ్రులు ఆందోళన పడ్డారు. అదే సమయంలో తండ్రి చనిపోవడంతో కుటుంబాన్ని పోషించాల్సిన బాధ్యత తన భుజస్కంధాలపై పడింది. 'వ్లాగింగ్ వదలేయ్. డబ్బు సంపాదనపై దృష్టి పెట్టు' అని కొద్దిమంది సలహా ఇచ్చారు. అయితే ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురైనా తన పాషన్‌కు ఎప్పుడూ దూరం కాలేదు.

ఆ ప్యాషనే తనను ప్రతిష్ఠాత్మకమైన యూట్యూబ్ ఫ్యాన్స్ ఫెస్టివల్‌లో పాల్గొనేలా చేసింది. ఔట్ సైడ్ ముంబై యాత్రలు చేస్తే చాలు అనుకున్న అతడిని అమెరికా, కెనడా, ఇండోనేషియ, సౌత్ కొరియా, జపాన్... మొదలైన దేశాలకు వెళ్లేలా చేసింది. 'ఫోర్బ్స్ 30 అండర్ 30-ఇండియా' జాబితాలో చోటు సంపాదించేలా చేసింది. క్లాతింగ్ బ్రాండ్ లేబుల్ ఎంఎస్‌తో డిజైనర్, ఎంటర్‌ప్రెన్యూర్‌గా నిరూపించుకున్న నిఖిల్... 'ఎన్ని చేసినా వ్లాగింగ్ అనేది నా పాషన్' అంటున్నాడు.

ప్రతిభతో పాటు...

మన పాషన్‌కు ప్రతికూల పరిస్థితులు ఎదురు కావచ్చు. రాజీ పడి వేరే దారి చూసుకోవడం సులభం. రాజీ పడకుండా నచ్చిన దారిలోనే వెళ్లడం కష్టం. అయితే ఆ కష్టం ఎప్పుడూ వృథా పోదు. తప్పకుండా ఫలితం ఇస్తుంది. ప్రతిభతో పాటు ఓపిక కూడా ఉండాలి. తొందరపాటు వల్ల నష్టపోయిన ప్రతిభావంతులు ఎంతో మంది ఉన్నారు.

– నిఖిల్ శర్మ

● యంగ్ టాలెంట్

రాక్ మాయాజాలం



అమెరికాస్ గాట్ టాలెంట్ వేదికపై తన ప్రదర్శనతో ఉర్రూతలూగించిన మాయా నీలకంఠన్‌ను సైమన్ కోవెల్ 'రాక్ దేవత' అని ప్రశంసించింది. ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా కూడా ఆమెను ప్రశంసల్లో ముంచెత్తాడు. ముంబైలోని మహీంద్రా బ్లూస్ ఫెస్టివల్‌లో మాయ త్వరలో ప్రదర్శన ఇవ్వనుంది.

రెండేళ్ల వయసు నుంచే సంగీతంతో స్నేహం మొదలు పెట్టింది మాయ. నాన్న గిటార్ వాయించేవాడు. ఆయన ద్వారా ఎన్నో పాటలు నేర్చుకుంది మాయ.

యూట్యూబ్ వీడియోల ద్వారా గిటార్ వాయించడం ఎలాగో తండ్రి నేర్పించాడు. ఆరేళ్ల వయసు నుంచే గిటార్ ప్లే మొదలు పెట్టింది. యాభైమంది ప్రేక్షకులు ఉన్న హాలులో తొలిసారి స్టేజీపై ప్రదర్శన ఇచ్చింది. ఇంటి నాలుగు గోడలకే పరిమితమైన తన ప్రతిభ తొలిసారిగా ప్రేక్షకుల్లోకి వచ్చింది.

ప్రపంచంలోనే నంబర్ వన్ టాలెంట్ షో అమెరికాస్ గాట్ టాలెంట్(ఏజీటీ)లో వెయ్యిమంది ప్రేక్షకుల మధ్య ప్రదర్శన ఇచ్చింది. తాను స్టేజీ మీదికి వెళుతున్నప్పుడు ప్రేక్షకులు అరవడంతో మాయ కాస్త భయపడింది.

అయితే మాయ ప్రదర్శన మొదలు కావడంతో ప్రేక్షకులు మంత్రముగ్ధులయ్యారు.

గిటార్ ప్రసన్న అనే గురువు దగ్గర కర్నాటక సంగీతం నేర్చుకుంది మాయ. 'ఏజీటీ' కోసం రెండు మూడు వారాల పాటు శిక్షణ తీసుకుంది. శిక్షణ సమయంలో ప్రసన్నతో పాటు ఎంతోమంది తనకు సలహాలు ఇచ్చారు.

'ఏజీటీ' వేదికపై మూమెంట్స్‌కు సంబంధించి నెటిఫ్లిక్స్ సిరీస్ 'ఆరేంజ్ ఈజ్ ది న్యూ బ్లాక్'తో అవార్డ్ గెలుచుకున్న జెస్సికా పిమెంటల్ శిక్షణ ఇచ్చింది. షో కోసం మానసికంగా సిద్ధం కావడానికి అవసరమైన సలహాలు ఇచ్చింది. 'విభిన్నమైన జానర్స్‌తో నాదైన సంగీతాన్ని సృష్టించాలనేది నా కల' అంటుంది మాయా నీలకంఠన్.



ఆన్ ఏ టియర్

క్విక్‌గా రైజ్ కావడం. సడన్‌గా యాక్టివ్ కావడం... మొదలైన సందర్భాలలో వాడే మాట... ఆన్ ఏ టియర్.

ఉదా: ది ప్రైస్ ఆఫ్ గోల్డ్ హ్యాజ్ బీన్ ఆన్ ఏ టియర్ రీసెంట్లీ

* * *

గివ్ ఇట్ ఏ వర్ల్

తొలిసారిగా చేసే పని, కొత్తగా ప్రయత్నించడం... మొదలైన సందర్భాల్లో వాడే మాట... గివ్ ఇట్ ఏ వర్ల్.

ఉదా: ఐ హ్యావ్ నెవర్ డ్యాన్స్‌డ్ సల్సా బిఫోర్ బట్ ఐ విల్ గివ్ ఇట్ ఏ వర్ల్

గురి చూసి కొట్టాలి

థర్డ్-పర్సన్ షూటర్ గేమ్ 'ది ఫస్ట్ డిసెన్‌డెంట్' విడుదల అయింది. హైక్వాలిటీ గ్రాఫిక్స్‌తో కూడిన ఈ స్ట్రాటజిక్ గేమ్‌లో యూనిక్ క్యారెక్టర్లు ఉంటాయి. 'ఇన్‌గ్రిస్' కాంటినెంట్‌ను కాపాడడానికి ఆక్రమణదారులకు వ్యతిరేకంగా ప్లేయర్ పోరాడవలసి ఉంటుంది. ఇది మాత్రమే కాదు ప్లేయర్ రకరకాల మిషన్‌లలో పాల్గొనవలసి ఉంటుంది. డిస్టింక్టివ్ కాన్సెప్ట్‌తో వచ్చిన ఈ గేమ్‌లో యూనిక్ స్కిల్ సెట్స్, ఫ్రీ మూమెంట్స్, చైన్ యాక్షన్స్, గ్రాప్లింగ్ హుక్స్, కలర్‌ఫుల్ ఫైర్‌ఆర్మ్స్... మొదలైనవి గేమింగ్ ప్రియులను ఆకట్టుకుంటాయి.

డెవలపర్: నెక్సన్ గేమ్స్ ఇంజిన్: యునైటెడ్ ఇంజిన్ 5
జానర్: థర్డ్-పర్సన్ షూటర్ యాక్షన్ ఆర్‌పీజీ మోడ్: కోఆపరేటివ్ మల్టీప్లేయర్.



సినిమా

మాటలు ఆరంభం


● చిరంజీవి

చిరంజీవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వంభర' డబ్బింగ్ పనులు షురూ అయ్యాయి. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో త్రిష, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. యూవీ క్రియేషన్స్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న ఈ చిత్రం 2025 సంక్రాంతి సందర్భంగా జనవరి 10న విడుదల కానుంది. అందుకు తగ్గట్టు ఓ వైపు షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ పనులు మొదలు పెట్టింది చిత్రబృందం. గురువారం మాటల (డబ్బింగ్) పనులను ప్రారంభించారు. ''క్రేజీ సోషియో ఫ్యాంటసీ యాక్షన్ అడ్వెంచరస్ మూవీగా 'విశ్వంభర' రూపొందుతోంది. ఈ చిత్రంలో హనుమాన్ భక్తుడిగా కనిపిస్తారు చిరంజీవి. యాక్షన్ సీక్వెన్స్‌లు అద్భుతంగా ఉంటాయి. పోస్ట్ ప్రొడక్షన్ పనులకు ఎక్కువ టైమ్ పడుతుంది. అందుకే ప్రొడక్షన్, పోస్ట్ ప్రొడక్షన్ పనులను ఏకకాలంలో చేస్తున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: ఎంఎం కీరవాణి, కెమెరా: ఛోటా కె. నాయుడు.

పెళ్లి చేసుకోను సార్


● శ్రుతీహాసన్

అమ్మాయిలను వారి పెళ్లి గురించి అడగడం మానుకోండి అంటున్నారు హీరోయిన్ శ్రుతీహాసన్. ఇంతకీ విషయం ఏంటంటే.. వీలైనప్పుడల్లా సోషల్ మీడియా మాధ్యమాల్లో నెటిజన్లతో చాట్ సెషన్ నిర్వహించడం శ్రుతీహాసన్‌కు అలవాటు. ఇటీవల మరోసారి ఈ బ్యూటీ చాట్ సెషన్‌ను నిర్వహించారు. ఇందులో భాగంగా... 'మీరు ఎలాంటి వ్యక్తిని పెళ్లి చేసుకుంటారు?' అని ఓ నెటిజన్ అడిగితే శ్రుతీహాసన్ కాస్త గట్టిగానే బదులిచ్చారు. ''ఇది 2024... అమ్మాయిలను ఇలాంటి ఉపయోగం లేని వెర్రి ప్రశ్నలు అడగడం మానుకోండి'' అంటూ బదులిచ్చారామె. అలాగే 'మీరు ఎప్పుడు పెళ్లి చేసుకుంటారు మేడమ్' అని మరో నెటిజన్ శ్రుతీహాసన్‌ను ప్రశ్నించగా... 'ఐ వోన్ట్ సార్' (చేసుకోను సార్) అని బదులిచ్చారు. అంటే... పెళ్లి చేసుకోనని సూటిగా చెప్పేశారు. ఇక సినిమాల విషయానికొస్తే... అడివి శేష్‌తో 'డెకాయిట్' సినిమా చేస్తున్నారు. అలాగే ప్రభాస్‌తో 'సలార్ 2', తమిళంలో 'చెన్నై స్టోరీ' సినిమాలు కూడా శ్రుతి చేతిలో ఉన్నాయి.

హింసకు బీమా!


● నాని

సూర్య కోపంగా ఉంటే ఎలా ఉంటాడో చూశాం. కానీ కూల్‌గా ఉంటే ఇలా ఉంటారంటూ చూపిస్తున్నారు 'సరిపోదా శనివారం' సినిమా మేకర్స్. నాని హీరోగా నటిస్తున్న సినిమా ఇది. ఇందులో నాని పాత్ర పేరు సూర్య. గురువారం ఈ సినిమా నుంచి సూర్య సెకండ్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ''సండే టు ఫ్రైడే.. వయొలెన్స్‌కి ఇన్సూరెన్స్ (హింసకు బీమా) సూర్య' అంటూ తన సెకండ్ లుక్‌ను ఉద్దేశించి 'ఎక్స్'లో పేర్కొన్నారు నాని. అంటే... మిగతా రోజుల్లో కూల్‌గా ఉండే సూర్య శనివారం శత్రువుల భరతం పడతాడు. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో డీవీవీ దానయ్య, దాసరి కల్యాణ్ నిర్మిస్తున్న ఈ సినిమాలో ప్రియాంకా అరుళ్ మోహన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఆగస్టు 29న విడుదల కానున్న 'సరిపోదా శనివారం' సినిమాకు సంగీతం: జేక్స్ బిజోయ్, కెమెరా: జి. మురళి.

పవర్‌ఫుల్ సూర్య


● సత్యదేవ్

సత్యదేవ్, డాలీ ధనంజయ హీరోలుగా ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వం వహించిన మల్టీస్టారర్ మూవీ 'జీబ్రా'. 'లక్ ఫేవర్స్ ది బ్రేవ్' అనేది ట్యాగ్‌లైన్. ప్రియా భవానీ శంకర్, జెన్నిఫర్ పిక్కినాటో హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రంలో నటుడు సత్యరాజ్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఎస్ఎన్ రెడ్డి, ఎస్. పద్మజ, బాల సుందరం, దినేష్ సుందరం నిర్మించారు. గురువారం (జూలై 4) సత్యదేవ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు మేకర్స్. ''క్రైమ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'జీబ్రా'. ఈ సినిమాలో సత్యదేవ్ చేసిన సూర్య పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది. సునీల్, సత్య ఆకల కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్, కెమెరా: సత్య పొన్మార్.

అరిషడ్వర్గాల అరి


● అనసూయ

అనసూయ భరద్వాజ్, సాయికుమార్, వినోద్ వర్మ, సూర్య పురిమెట్ల, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'అరి'. మై నేమ్ ఈజ్ నో బడీ అనేది ఉపశీర్షిక. 'పేపర్ బాయ్' ఫేమ్ జయశంకర్ దర్శకత్వం వహించారు. ఆర్‌వీ రెడ్డి సమర్పణలో శ్రీనివాస్ రామిరెడ్డి, తిమ్మప్ప నాయుడు పురిమెట్ల, శేషు మారంరెడ్డి నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ''ప్రస్తుతం మైథాలజీ సక్సెస్‌ఫుల్ ట్రెండ్‌గా మారింది. పురాణాలు, ఇతిహాసాలు, దైవిక అంశాలతో కూడిన సినిమాలు బ్లాక్ బస్టర్ అవుతున్నాయి. మా 'అరి' అరిషడ్వర్గాలు, శ్రీకృష్ణుడి గొప్పతనం వంటి అంశాలతో రూపొందింది. అరిషడ్వర్గాల కాన్సెప్ట్‌తో నిర్మించిన మా సినిమాపై అందరిలో ఆసక్తి ఏర్పడింది. ఈ సినిమా కథ నచ్చడంతో అభిషేక్ బచ్చన్ హిందీలో రీమేక్ చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు'' అన్నారు మేకర్స్.

నా లైఫ్‌ని మార్చేసింది!


● సుహాస్, సంగీర్తనా విపిన్

'ఆ ఒక్క డెసిషన్ నా లైఫ్‌ని మార్చేసింది' అంటూ మొదలవుతుంది 'జనక అయితే గనక' సినిమా టీజర్. సుహాస్ హీరోగా నటిస్తున్న సినిమా ఇది. సంగీర్తనా విపిన్, రాజేంద్రప్రసాద్, గోపరాజు రమణ ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. రాజేంద్రప్రసాద్, 'వెన్నెల' కిశోర్ కీలక పాత్రల్లో నటించారు. సందీప్ బండ్ల దర్శకత్వంలో శిరీష్ సమర్పణలో 'దిల్' రాజు ప్రొడక్షన్స్ పతాకంపై హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించిన ఈ సినిమా త్వరలోనే విడుదల కానుంది. ఈ సినిమా టీజర్‌ను హీరో ప్రభాస్ విడుదల చేసి, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ''నేను ఒకవేళ తండ్రినైతే నా పెళ్లాన్ని సిటీలోని బెస్ట్ హాస్పిటల్‌లో చూపించాలి. నా పిల్లల్ని బెస్ట్ స్కూల్‌లో చదివించాలి. బెస్ట్ కాలేజీలో చదివించాలి. వాళ్లకు బెస్ట్ లైఫ్ ఇవ్వాలి. బెస్ట్ ఇవ్వలేనప్పుడు పిల్లల్ని కనకూడదు'' అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి.

స్వీయ రక్షణ నేర్చుకోవాలి


● మాల్వీ మల్హోత్రా

రాజ్ తరుణ్, మాల్వీ మల్హోత్రా జంటగా నటించిన చిత్రం 'తిరగబడర సామీ'. ఏఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వంలో మల్కాపురం శివకుమార్ నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో హీరోయిన్ మాల్వీ మల్హోత్రా మాట్లాడుతూ– ''స్వస్థలం హిమాచల్ ప్రదేశ్. స్టడీస్ కోసం ముంబై వెళ్లి, థియేటర్ ఆర్ట్స్‌లో చేరాను. తెలుగులో నేను నటించిన తొలి సినిమా 'తిరగబడర సామీ'. ఈ సినిమాలో నా క్యారెక్టర్ ఆసక్తికరంగా ఉంటుంది. అమ్మాయిలు సెల్ఫ్ డిఫెన్స్ నేర్చుకోవాలని నా క్యారెక్టర్ చెబుతుంది. నేను రియల్ లైఫ్‌లో ఎమ్ఎమ్ఏ (మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్) నేర్చుకున్నాను. అందుకే ఈ సినిమాలో నా పాత్రకు ఉన్న యాక్షన్ సీక్వెన్స్‌ని ఈజీగా చేశాను. రాజ్ తరుణ్‌గారి పాత్ర సైలెంట్‌గా మొదలై వైలెంట్‌గా మారుతుంది. ఎందుకు అనేది సినిమాలో చూడాలి. లవ్, యాక్షన్, రొమాన్స్, ఎమోషన్... ఇలా అన్ని అంశాలు మిళితమైన 'తిరగబడరా సామీ' సినిమా ప్రేక్షకులను అలరిస్తుంది'' అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ''తమిళ, మలయాళ భాషల్లో కూడా సినిమాలు చేశాను. 'ఆర్ఆర్ఆర్' తర్వాత తెలుగు పరిశ్రమ గురించి అంతర్జాతీయ స్థాయిలో మాట్లాడుకుంటున్నారు. ఇప్పుడు తెలుగులో నేనూ భాగమైనందుకు హ్యాపీగా ఉంది. రాజమౌళిగారి సినిమాలో నటించాలన్నది నా కల. అలాగే మణిరత్నం గారన్నా చాలా అభిమానం. హీరోల్లో మహేశ్‌బాబు, నాని, అడివి శేష్‌గార్లంటే ఇష్టం. నా తర్వాతి సినిమాల గురించి చర్చలు జరుగుతున్నాయి'' అన్నారు.

గీతా ఆర్ట్స్‌లో...


● నిహారిక

కంటెంట్ క్రియేటర్‌గా సోషల్ మీడియాలో ఫేమస్ అయిన నిహారిక ఎన్ఎం గీతా ఆర్ట్స్ సంస్థ నిర్మించనున్న సినిమాతో తెలుగు పరిశ్రమలోకి హీరోయిన్‌గా అడుగుపెడుతున్నారు. గురువారం ఆమె పుట్టినరోజు (జూలై 4) సందర్భంగా ఈ చిత్రాన్ని ప్రకటించింది గీతా ఆర్ట్స్ సంస్థ. చెన్నైలో పుట్టిన నిహారిక బెంగళూరులో పెరిగారు. కాలిఫోర్నియాలోని చాప్‌మాన్ యూనివర్సిటీలో ఎంబీఏ చేశారు. థియేటర్ ఆర్ట్స్‌పై ఆసక్తి ఉన్న నిహారిక తన పదో తరగతిలో యూట్యూబ్ ఇన్‌ఫ్లుయెన్సర్‌గా కెరీర్ ఆరంభించి, సోషల్ మీడియాలో ఎంటర్‌టైన్‌మెంట్, కామెడీ క్వీన్‌గా పేరు తెచ్చుకున్నారు. ఇటీవల యూట్యూబ్ ఆధ్వర్యంలో జరిగిన 'క్రియేటర్స్ ఫర్ ఛేంజ్' కార్యక్రమంలో ఇండియా నుంచి వరుసగా రెండోసారి రిప్రజెంట్ చేశారామె.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	63	80,050
నిఫ్టీ ▲	16	24,302

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు బుధవారం ముగింపు)		
నాస్‌డాక్	18,188	▲ 159
డోజోన్స్	39,308	▽ 24
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,228	▲ 57
డాక్స్	18,428	▲ 54
షాంఘై	2,953	▽ 25
నికాయ్	40,914	▲ 333

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	72,469	▲ 243
బంగారం (99.5 స్వచ్ఛత)	72,179	▲ 242
వెండి (కేజీ)	90,018	▲ 320

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.13	84.15
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.83	107.38
€	యూరో	ఎస్‌బీఐ	88.69	91.04
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	51.29	52.41
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.88	56.82
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.25	63.94
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.35	22.91
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.83	23.61
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.37	12.44



లీజు కారు.. యమా జోరు!

వాహనాల సబ్‌స్క్రిప్షన్‌కు డిమాండ్
- జెన్–జెడ్ యూజర్ల మొగ్గు
- 4 ఏళ్లలో మార్కెట్ 30% వృద్ధి
- సర్వీసులు అందిస్తున్న మారుతీ, టాటా మోటార్స్, మహీంద్రా తదితర సంస్థలు

కారు కొనుగోలు వ్యయాలు పెరిగిపోతుండటంతో కొనుక్కోవడం కన్నా కొన్నాళ్ల పాటు అద్దెకు తీసుకుంటే మంచిదనే ధోరణి క్రమంగా పెరుగుతోంది. ప్రధానంగా కొత్త తరం యూజర్లు (జెన్–జెడ్), మధ్యతరగతి వారు ఈ విధానం వైపు మొగ్గు చూపుతున్నారు. దీనితో, ప్రస్తుతం బేస్ కాస్త తక్కువగానే ఉన్నప్పటికీ వచ్చే 3–4 ఏళ్లలో దేశీయంగా సబ్‌స్క్రిప్షన్ మార్కెట్ 20–30% మేర పెరగవచ్చని పరిశ్రమ అంచనా వేస్తోంది. పెరుగుతున్న మధ్య తరగతి వర్గాల ఆదాయాలు, పట్టణీకరణ, ఫైనాన్సింగ్ ఆప్షన్లు, జెన్–జెడ్ తరం కొనుగోలు దార్లు ఇందుకు ఊతంగా ఉండవచ్చని భావిస్తోంది. 2030 నాటికి దేశ జనాభాలో మధ్య తరగతి వర్గం ప్రజలు 45% ఉంటారని అంచనా.

మారుతీకి 10వేల మంది వినియోగదారులు..

మారుతీ సుజుకీ ఇండియా, టాటా మోటర్స్, మహీంద్రా అండ్ మహీంద్రా వంటి దిగ్గజాలు తమ వాహనాలకు సబ్‌స్క్రిప్షన్ మోడల్స్‌ను అందిస్తున్నాయి. 2020లో ఈ విధానాన్ని ప్రవేశపెట్టిన మారుతీ సుజుకీ వాహనాలకు 10,000 మంది పైచిలుకు వినియోగదారులు ఉన్నారు. పెద్దగా బాదరబందీకి ఇష్టపడని యువ వినియోగదార్లే, తమ యూజర్లలో ఎక్కువగా ఉంటున్నారని మారుతీ వర్గాలు తెలిపాయి. 2024 ఆర్థిక సంవత్సరంలో ఈ విభాగం 36% వృద్ధి నమోదు చేసిందని పేర్కొన్నాయి. మొత్తం అమ్మకాల్లో 53% వాటా బ్రెజా, బాలెనో, గ్రాండ్ విటారా, ఎర్టిగా వంటి మోడల్స్‌ది ఉంటోందని వివరించాయి. ఇటీవలే ప్రవేశపెట్టిన ఫోర్త్ జనరేషన్ స్విఫ్ట్‌కి కూడా కస్టమర్ల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని కంపెనీ వర్గాలు తెలిపాయి. కన్సల్టెన్సీ సంస్థ డెలాయిట్ నిర్వహించిన అంతర్జాతీయ అధ్యయనంలో 18–34 ఏళ్ల యూజర్లలో 67% మంది సబ్‌స్క్రిప్షన్ విధానం వైపు మొగ్గు చూపారు. అనిశ్చితి వల్ల ఆర్థిక పరిస్థితులు ఆందోళనకరంగా మారుతుండటంతో యువ యూజర్లు కారు కొనడం కంటే, వీలైతే సబ్‌స్క్రిప్షన్‌ను ఇష్టపడుతున్నట్లు సర్వేలో వెల్లడైంది.

మోడల్ ఇలా ..

వాహన సబ్‌స్క్రిప్షన్ విధానంలో కారును పూర్తి రేటు పెట్టి కొనుక్కోవాల్సిన అవసరం లేకుండా కొన్నాళ్ల పాటు తీసుకునేందుకు వీలుంటుంది. 1–4 ఏళ్ల పాటు సబ్‌స్క్రయిబ్ చేసుకోవాలి. నెలకు ఇంతని అద్దె చెల్లించాలి. వాహన ఖరీదు, మెయింటెనెన్స్, బీమా, రోడ్ సైడ్ అసిస్టెన్స్ మొదలైనవి ఇందులోకి వస్తాయి. సాధారణంగా కారు కొనుక్కోవాలంటే ముందస్తుగా డౌన్‌పేమెంట్లు, రిజిస్ట్రేషన్, రోడ్ ట్యాక్స్‌లు మొదలైనవి చెల్లించాల్సినవి చాలానే ఉంటాయి. దానితో పోలిస్తే సబ్‌స్క్రిప్షన్ మోడల్‌లో తక్కువ ముందస్తు వ్యయాలు, నెలవారీగా కొంత మొత్తం కడితే చాలు.. కావాల్సినన్నాళ్లు వాహనాన్ని ఉపయోగించుకుని, తర్వాత కావాలంటే వేరే దానికి మారే వీలుండటం ఆకర్షణీయాంశం!!

– సాక్షి, బిజినెస్ డెస్క్

మార్కెట్ల పరుగు... తస్మాత్ జాగ్రత్త!

- సెబీ, శాట్‌లకు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ సూచన
- మరిన్ని ట్రిబ్యునల్ బెంచ్‌ల ఏర్పాటు అవసరమని ఉద్ఘాటన

ముంబై: ఈక్విటీ మార్కెట్ల గణనీయమైన పెరుగుదల నేపథ్యంలో భారత్ ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ రెగ్యులేటర్–సెబీ, సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు (శాట్) కీలక సూచనలు చేశారు. ఈ విషయంలో ముందస్తు జాగ్రత్త అవసరమన్నారు. ఎటువంటి సవాలునైనా సత్వరం పరిష్కరించడానికి, వ్యవస్థ పటిష్టంగా ఉండడానికి మరిన్ని ట్రిబ్యునల్ బెంచ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. శాట్ కొత్త ప్రాంగణాన్ని ఇక్కడ ప్రారంభించిన ప్రధాన న్యాయమూర్తి ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్కెట్లలో అధిక మొత్తంలో లావాదేవీలు, అలాగే కొత్త నిబంధనల కారణంగా శాట్‌పై అధిక పనిభారం పడుతోందన్నారు. ఈ నేపథ్యంలో శాట్ కొత్త బెంచ్‌లను ఏర్పాటు చేసే అంశాన్ని అధికారులు పరిశీలించాలన్నారు.

- బీఎస్‌ఈ సెన్సెక్స్ 80,000 పాయింట్ల మైలురాయిని దాటడం ఒక ఆనందకరమైన క్షణం అంటూ వచ్చిన వార్తాపత్రికల కథనాలను ప్రస్తావిస్తూ, ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవ్వరూ నష్టపోని వ్యవస్థల ఏర్పాటు, పటిష్టతలపై రెగ్యులేటరీ అధికారుల దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని ఇలాంటి సంఘటనలు ఉద్ఘాటిస్తున్నాయని తెలిపారు.
- 'మీరు స్టాక్ మార్కెట్‌లో ఉప్పెనను ఎంత విజయవంతంగా చూస్తారో... అంతే స్థాయిలో జాగ్రత్తలు పాటించే విషయంలో సెబీ, శాట్‌లకు ఎక్కువ పాత్ర ఉంటుందని నేను విశ్వసిస్తున్నాను. మార్కెట్ భారీ పెరుగుదల సమయాల్లోనే వ్యవస్థ స్థిరంగా ఉండేలా చూసుకోవాలి' చీఫ్ జస్టిస్ పేర్కొన్నారు.
- స్థిరమైన–ఊహాజనిత పెట్టుబడి వాతావరణాన్ని మెరుగుపరచడంలో, పరిరక్షించడంలో సెబీ, శాట్ వంటి అప్పీలేట్ ఫోరమ్‌ల ప్రాముఖ్యత ఎంతో ఉంటుందన్నారు. దీనిని కీలక జాతీయ ప్రాముఖ్యతగల అంశంగా పేర్కొన్న ఆయన, ఇది దేశ ఆర్థిక వృద్ధిలో ఎంతో కీలకమైన అంశంగా వివరించారు.

6,700 అప్పీళ్ల పరిష్కారం

శాట్ ప్రిసైడింగ్ ఆఫీసర్ జస్టిస్ పీఎస్ దినేష్ కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ శాట్‌లో ప్రస్తుతం 1,028 పెండింగ్ అప్పీళ్లు ఉన్నాయని, 1997లో మొదలైనప్పటి నుండి 6,700 అప్పీళ్లను పరిష్కరించామని తెలిపారు.



ముంబైలో శాట్ కొత్త కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా చీఫ్ జస్టిస్ డి.వై. చంద్రచూడ్

శాట్ కొత్త వెబ్‌సైట్ ప్రారంభం..

నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ రూపొందించిన శాట్ కొత్త వెబ్‌సైట్‌ను భారత్ ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ ఈ కార్యక్రమంలో ప్రారంభించారు. సాంకేతికత సమస్యపై తగిన శ్రద్ధ వహించాల్సిన అవసరాన్ని ఉద్ఘాటించారు. డిజిటల్ రంగం పురోగతి నేపథ్యంలో న్యాయం పొందడానికి సంబంధించిన భావనకు కొత్త రూపును ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

అన్విత గ్రూప్ 2,000 కోట్ల ప్రాజెక్టు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: నిర్మాణ సంస్థ అన్విత గ్రూప్ రూ.2,000 కోట్ల భారీ ప్రాజెక్టు చేపట్టింది. హైదరాబాద్ సమీపంలోని కొల్లూరు వద్ద ఇవానా పేరుతో గృహ నిర్మాణ ప్రాజెక్టును నెలకొల్పుతోంది. 12.9 ఎకరాల్లో రెండు దశల్లో 1,850 ఫ్లాట్లు రానున్నాయి. మొదటి దశలో 15 అంతస్తుల్లో 2 టవర్లలో 450 ఫ్లాట్ల నిర్మాణం పూర్తి కావస్తోంది. వీటిని ఈ ఏడాది చివరికల్లా కస్టమర్లకు అప్పగిస్తారు. రెండవ దశలో 36 అంతస్తుల్లో 4 టవర్లను నిర్మించనుంది. ఇందులో భాగంగా 1,400 ఫ్లాట్లను 2027లో వినియోగదార్లకు అందజేస్తామని అన్విత గ్రూప్ సీఎండీ అచ్యుతరావు బొప్పన గురువారమిక్కడ మీడియాకు తెలిపారు. 36 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇవానా ఉంటుందని కంపెనీ డైరెక్టర్ అనూప్ బొప్పన చెప్పారు. భారత్‌లో 6, అమెరికాలో 3 స్థిరాస్తి ప్రాజెక్టులను గ్రూప్ చేపట్టింది.




అన్విత గ్రూప్ సీఎండీ అచ్యుతరావు బొప్పన

భారత్‌లో మెటా థ్రెడ్స్ జోరు

అంతర్జాతీయంగా 17.5 కోట్ల యాక్టివ్ యూజర్లు

న్యూఢిల్లీ: మైక్రోబ్లాగింగ్ సైట్ ట్విటర్ (ఇప్పుడు ఎక్స్)కు పోటీగా ఏడాది క్రితం ప్రవేశపెట్టిన థ్రెడ్స్ యాప్‌కి గణనీయంగా ఆదరణ లభిస్తోందని సోషల్ మీడియా దిగ్గజం మెటా తెలిపింది. అంతర్జాతీయంగా నెలవారీ యాక్టివ్ యూజర్ల సంఖ్య 17.5 కోట్లుగా ఉందని పేర్కొంది. క్రియాశీలక వినియోగదారులు అత్యధికంగా ఉన్న దేశాల్లో భారత్ కూడా ఒకటని మెటా సీఈవో మార్క్ జూకర్‌బర్గ్ ఒక ప్రకటనలో తెలిపారు. భారత్‌లో ఎక్కువగా సినిమాలు, టీవీ, ఓటీటీ, సెలబ్రిటీలు, స్పోర్ట్స్‌కి సంబంధించిన కంటెంట్ ఉంటోందని మెటా వివరించింది. క్రికెట్‌లో రిషభ్ పంత్, రవీంద్ర జడేజా, ఆకాశ్ చోప్రా మొదలైన వారు క్రియాశీలకంగా ఉంటున్నారని పేర్కొంది. టీ20 క్రికెట్ వరల్డ్ కప్, ఐపీఎల్, ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ 2024 మొదలైనవి హాట్ టాపిక్‌లుగా నిల్చాయని, 200 మంది పైచిలుకు క్రియేటర్లు ఇటీవల ముగిసిన ఐపీఎల్ సీజన్‌పై అప్‌డేట్స్ ఇచ్చారని వివరించింది. 2023 జూలైలో ప్రవేశపెట్టిన వారం రోజులకే 10 కోట్లకు పైగా యూజర్ సైనప్‌లతో థ్రెడ్స్ ఒక్కసారిగా ప్రాచుర్యంలోకి వచ్చింది. అయితే, క్రమంగా దానిపై యూజర్ల ఆసక్తి తగ్గుతూ వస్తోందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.



80,000 పైన సెన్సెక్స్

ముంబై: దేశీయ స్టాక్ సూచీలు గురువారమూ ఇంట్రాడే, ముగింపులోనూ కొత్త రికార్డులు నమోదు చేశాయి. అయితే జీవితకాల గరిష్టాల వద్ద ఇన్వెస్టర్లు లాభాలు స్వీకరించడంతో స్వల్ప లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయ సానుకూల సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం సెన్సెక్స్ 80,322 వద్ద మొదలైంది. ఐటీ, ఫార్మా, బ్యాంకులు, టెలికం షేర్లు రాణించడంతో ట్రేడింగ్‌లో 406 పాయింట్లు పెరిగి 80,393 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 63 పాయింట్లు పెరిగి 80,050 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో నిఫ్టీ 115 పెరిగి 24,401 వద్ద ఆల్‌టైం హైని అందుకుంది. ఆఖరికి 16 పాయింట్ల లాభంతో 24,302 వద్ద నిలిచింది. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు అరశాతానికి పైగా లాభపడ్డాయి. కన్జూమర్ డ్యూరబుల్స్, ఎఫ్ఎంసీజీ, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆయిల్‌అండ్ గ్యాస్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఆసియాలో చైనా మినహా అన్ని దేశాల స్టాక్ సూచీలు సానుకూలంగా ముగిశాయి. యూరప్ మార్కెట్లు అరశాతం పెరిగాయి. స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా గురువారం అమెరికా మార్కెట్లు పనిచేయలేదు.

- ప్రమోటర్ ఐనాక్స్ విండ్ ఎనర్జీ రూ.900 కోట్ల పెట్టుబడులు పెట్టడంతో ఐనాక్స్ విండ్ షేరు 10% పెరిగి రూ.157 వద్ద ముగిసింది. అలాగే ఐనాక్స్ విండ్ ఎనర్జీ 5% షేరు ఎగసి రూ.7562 వద్ద అప్పర్ సర్క్యూట్ తాకింది.
- అధిక వెయిటేజీ గల ఐసీఐసీఐ బ్యాంకు 2.65%, టీసీఎస్ 1.50%, ఇన్ఫోసిస్ 1.30%, కోటక్ బ్యాంక్, ఎంఅండ్ఎం, ఏషియన్ పేయింట్స్ ఒకశాతం చొప్పున రాణించి సూచీలకు దన్నుగా నిలిచాయి.

447 లక్షల కోట్లు

రికార్డుల ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో నమోదైన కంపెనీల మొత్తం విలువ, జీవితకాల గరిష్టం రూ.447 లక్షల కోట్లకు చేరింది.

క్లీన్‌స్వీప్ లక్ష్యంగా...

- నేడు దక్షిణాఫ్రికాతో భారత్ తొలి టి20 మ్యాచ్
- రాత్రి 7 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



చెన్నై: ఇప్పటికే వన్డే సిరీస్‌ను 3–0తో క్లీన్‌స్వీప్ చేసి... ఏకైక టెస్టులో ఘనవిజయం సాధించి... జోరు మీదున్న భారత మహిళల క్రికెట్ జట్టు టి20 సిరీస్‌నూ దక్కించుకోవాలనే లక్ష్యంతో ఉంది. దక్షిణాఫ్రికా మహిళల జట్టుతో మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో భాగంగా ఇరు జట్ల మధ్య నేడు తొలి మ్యాచ్ జరుగుతుంది. బలాబలాలను పరిశీలిస్తే దక్షిణాఫ్రికాతో టి20 సిరీస్‌లోనూ భారత్‌దే పైచేయి ఉండటం ఖాయమనిపిస్తోంది. వన్డే సిరీస్‌లో రెండు సెంచరీలు, ఒక అర్ధ సెంచరీతో అదరగొట్టిన స్మృతి మంధాన... ఏకైక టెస్టులో డబుల్ సెంచరీతో మెరిసిన షఫాలీ వర్మ అదే జోరును టి20 సిరీస్‌లోనూ కొనసాగిస్తే భారత్‌కు తిరుగుండదు. బౌలింగ్ విభాగంలో పేసర్లు రేణుక సింగ్, అరుంధతి రెడ్డి... స్పిన్నర్లు ఆశా శోభన, శ్రేయాంక పాటిల్ కీలకం కానున్నారు. దక్షిణాఫ్రికా అవకాశాలన్నీ కెప్టెన్ లౌరా వొల్‌వార్ట్, మరిజన్ కాప్, సునె లుస్ ఆటతీరుపై ఆధారపడి ఉన్నాయి.

మూడో రౌండ్‌లో జొకోవిచ్



లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో మాజీ చాంపియన్ జొకోవిచ్ (సెర్బియా) మూడో రౌండ్‌లోకి ప్రవేశించాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో రెండో సీడ్ జొకోవిచ్ 6–3, 6–4, 5–7, 7–5తో జేకబ్ ఫెర్న్‌లె (బ్రిటన్)పై గెలుపొందాడు. మరో రెండో రౌండ్ మ్యాచ్‌లో టాప్ సీడ్ యానిక్ సినెర్ (ఇటలీ) 3 గంటల 42 నిమిషాల్లో 7–6 (7/3), 7–6 (7/4), 2–6, 7–6 (7/4)తో బెరెటిని (ఇటలీ)పై గెలిచాడు. మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో ఐదో సీడ్ జెస్సికా పెగూలా (అమెరికా) 4–6, 7–6 (9/7), 1–6తో జిన్‌యు వాంగ్ (చైనా) చేతిలో ఓడిపోయింది. పురుషుల డబుల్స్‌లో రోహన్ బోపన్న (భారత్)–ఎబ్డెన్ (ఆస్ట్రేలియా); యూకీ బాంబ్రీ (భారత్)–అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడీలు తొలి రౌండ్‌లో నెగ్గి రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టాయి.

సంద్రం.. జనసంద్రం

పొట్టి ఫార్మాట్‌లో 17 ఏళ్ల క్రితం ఆరంభించిన తొలి టి20 ప్రపంచకప్‌ను ధోని బృందం గెలుచుకొచ్చింది. దేశమంతా వరల్డ్‌కప్ విజయంతో పెద్ద పండగే చేసుకుంది. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత రోహిత్ శర్మ జట్టు రెండో టి20 ప్రపంచకప్‌ను తెచ్చి పెట్టింది. మరి అ'ద్వితీయ' చాంపియన్‌షిప్ సంబరాలు మామూలుగా ఉండవుగా! ఢిల్లీలో ప్రత్యేక విమానం ల్యాండ్ అవగానే గ్రాండ్‌గా మొదలైన సంబరాలు సాయంత్రం ముంబైలో మెరైన్‌డ్రైవ్‌ను ముంచెత్తాయి. రాత్రయ్యేసరికి వాంఖెడేలో ఆటగాళ్లకు రూ. 125 కోట్ల నజరానా, ఘన సన్మానంతో కనులవిందుగా ముగిసింది.



జగజ్జేతలకు ఘనస్వాగతం







"ఇంతటి జనసందోహం చూస్తుంటే మాలాగే ఈ ప్రపంచకప్ కోసం వాళ్లు ఎంతగా ఆరాటపడ్డారో... టీమిండియా గెలవాలని ఎంత బలంగా కోరుకున్నారో అర్థమవుతోంది.
–కెప్టెన్ రోహిత్ శర్మ

కిక్కిరిసిన రోడ్లపై ఈ రాత్రి మీరు కురిపించిన ప్రేమాభిమానాల్ని ఇకపై మిస్ అవుతాను. ఈ అనిర్వచనీయ ఆనందాన్ని నేనెప్పటికీ మరచిపోను.
–కోచ్ రాహుల్ ద్రవిడ్

2011లో వన్డే ప్రపంచకప్ నెగ్గినపుడు సీనియర్లు వెలిబుచ్చిన భావోద్వేగాలకు, కన్నీళ్లకు నేను చలించలేదు. కానీ ఇప్పుడు అవే... నన్ను నేను అదుపు చేసుకోలేనంతగా బయటికి వస్తున్నాయి.
–విరాట్ కోహ్లి

- ఢిల్లీలో ఉదయం ప్రధానితో భేటీ
- ముంబైలో సాయంత్రం కనులవిందు
- టీమిండియాకు రూ. 125 కోట్లు నజరానా అందించిన బీసీసీఐ

న్యూఢిల్లీ/ముంబై: గత శనివారం టీమిండియా టి20 ప్రపంచకప్ గెలిచింది. యావత్ భారతం చిందేసింది. 17 ఏళ్ల తర్వాత మరోసారి ప్రపంచకప్ గెలవడం... ఆ కప్ రాక ఆలస్యం కావడంతో దాని కోసం ఇన్నాళ్లూ వేచి చూసిన అభిమానగణం రాగానే ఊరుకుంటారా? 'పూనకాలు లోడింగ్' అని హోరెత్తించరు! అవును సరిగ్గా అదే చేశారు. అడుగడుగునా అ'ద్వితీయ' ప్రపంచకప్‌నకు అపూర్వ స్వాగతం పలికారు. వేల సంఖ్యలో వచ్చిన అభిమానుల్లో కొందరు 'త్రివర్ణ' పతాకాలతో... మరికొందరు 'కంగ్రాట్స్' ప్లకార్డులతో ఆటగాళ్లను అభినందిస్తూ తెగ సందడి చేశారు. క్రికెట్‌కు మతమైన భారత్‌లో అభిమానులు కప్‌నకు, కప్ కార్యసాధకులకు అడుగడుగునా నీరాజనం పలికారు. ఉదయం ఢిల్లీలో ఆగమనంతో మొదలైనపుడు ఎంతటి జోష్ కనబడిందో... ముంబైలో ఘన సన్మానం పూర్తయ్యేసరికి రాత్రిదాకా అభిమానోత్సాహం అలాగే కొనసాగడం విశేషం!

అభిమాన ప్రవాహం

ప్రత్యేక విమానంలో 16 గంటల పాటు ఏకబిగిన 14 వేల కిలోమీటర్ల ప్రయాణం బహుశా ఇదే మొదటిసారేమో! ఎందుకంటే 14,000 వేల కి.మీ. అంటే సగం ప్రపంచాన్ని చుట్టేసే దూరమన్న మాట! ఇంత ప్రయాణ బడలిక ఎవరికైనా అసౌకర్యంగానే ఉంటుంది. వెంటనే తనువు–మనసు విశ్రాంతి కోరుతుంది. కానీ అభిమాన ప్రవాహం ముందు ఆటగాళ్లలో ఎలాంటి అలసటే కనిపించలేదు.

కిక్కిరిసిన మెరైన్ డ్రైవ్

ముంబై ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రత్యేక బస్‌లో బయలుదేరిన భారత క్రికెటర్లు నారీమన్ పాయింట్‌కు రాగానే ప్రత్యేకంగా ముస్తాబు చేసిన ఓపెన్ టాప్ బస్‌లో ఎక్కారు. మెరైన్ డ్రైవ్ తీరం వెంట సాగరం (అరేబియా సముద్రం) పక్కన సాగరం (ప్రేక్షకులతో) కనిపించింది. వానచినుకులు పడుతున్నా ఇసుకేస్తే రాలనంత జనం ఎక్కడికీ కదల్లేదు. తమ దేశానికి కప్ సాధించిపెట్టిన క్రికెటర్ల అభివాదాల కోసం వాళ్లంతా వేయి కళ్లతో ఎదురు చూశారు తప్ప వెనక్కి తగ్గలేదు. ఓపెన్ టాప్ బస్‌లో ప్రపంచకప్‌తో ఉన్న ఆటగాళ్లను క్రికెట్ వీరాభిమానులంతా తమతమ ఫోన్ కెమెరాల్లో అదేపనిగా బంధించే పనిలో పడ్డారు. దారిపొడవునా సాగిన ఈ విజయోత్సవ ర్యాలీ మెరైన్ డ్రైవ్‌కే కొత్త శోభ తెచ్చిందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అక్కడే సమీపంలో ఉన్న వాంఖెడే స్టేడియంలో సీట్ల సామర్థ్యానికి సరిపడా అభిమానుల్ని అనుమతించగా, ప్రత్యేకంగా నీలిరంగులో ఏర్పాటు వేదికపై తెలుపు రంగులో 'చాంపియన్స్' అక్షరాలు ప్రముఖంగా కనిపించేలా తీర్చిదిద్దారు. కోహ్లి, రోహిత్, హార్దిక్ ఇతర సభ్యులందరూ డాన్స్ చేసి ప్రేక్షకులను అలరించారు. ఇక ఆలస్యం చేయకుండా ప్రకటించిన నజరానాను ఒక్కొక్కరిగా కాకుండా టీమ్ సాధించిన విజయానికి సూచికగా రూ. 125 కోట్ల చెక్‌ను ఆటగాళ్లకు అందజేసి ఘనంగా సన్మానించారు. ఇక నిష్క్రమించే సమయంలో టీమిండియా ఆటగాళ్లంతా టెన్నిస్ బంతులపై ఆటోగ్రాఫ్ చేసి ప్రేక్షకుల గ్యాలరీ దిశగా కొట్టారు.

జగజ్జేతలకు మోదీ జేజేలు

కరీబియన్ గడ్డపై టి20 ప్రపంచకప్ సాధించిన భారత క్రికెటర్లకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆత్మీయ ఆతిథ్యమిచ్చారు. ఉదయం అల్పాహార విందు ఇచ్చిన ప్రధాని ప్రతి ఒక్క క్రికెటర్ కప్ కోసం చేసిన పోరాటాన్ని కొనియాడారు. కెప్టెన్ రోహిత్ శర్మ, కోచ్ ద్రవిడ్ ఇద్దరు కలిసి మోదీ చేతిలో ప్రపంచకప్‌ను పెట్టారు. ఇరువైపులా జట్టు సభ్యులంతా నిల్చొని ఫొటోకు పోజిచ్చారు. 'చాంపియన్స్‌తో జరిగిన ఈ మీటింగ్ చాలా అద్భుతంగా గడిచింది. వారికి ఇచ్చిన ఆతిథ్యం ఎంతో ఆనందాన్ని పంచింది. కప్ వేటలో వాళ్లు పడిన పాట్లు, చేసిన పోరాటాలు. మొత్తం టోర్నీ జర్నీపై వారినాతో పంచుకున్న అనుభవాలు ఎప్పటికీ చిరస్మరణీయంగా నా మదిలో పదిలంగా ఉంటాయి' అని మోదీ 'ఎక్స్'లో ఫొటోలను జతచేసి ట్వీట్ చేశారు. క్రికెటర్లతో పాటు ప్రధానిని కలిసిన బోర్డు అధ్యక్ష కార్యదర్శులు రోజర్ బిన్నీ, జై షా ఈ సందర్భంగా మోదీకి 'నమో' పేరిట నం.1 జెర్సీని అందజేశారు.

క్లుప్తంగా...

ఆర్జేయూకేటీ వీసీ రాజీనామా

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వర్సిటీల వైస్ చాన్సలర్ల రాజీనామాల పర్వం కొనసాగుతోంది. ప్రభుత్వం నుంచి నిత్యం ఒత్తిళ్లు ఎక్కువ అవడంతో దాదాపు 17 మంది వీసీలు పదవుల నుంచి తప్పుకోగా గురువారం రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం వీసీ ఎం.విజయ్‌కుమార్, నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ గోపాలరాజు, చీఫ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ బండి ప్రసాద్, డీన్ అకడమిక్స్ డి.శ్రావణి, పరీక్షల విభాగం డీన్ భాను ప్రకాశ్ ఒత్తిడిని తట్టుకోలేక తమ రాజీనామాలను చాన్స్‌లర్‌కు సమర్పించారు.

ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ పోస్టుల ఫలితాలు విడుదల

సాక్షి, అమరావతి: ప్రజారోగ్య శాఖలో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్ష ఫలితాలను ఏపీపీఎస్సీ ప్రకటించింది. ఎంపికైన అభ్యర్థుల జాబితాను సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్ https://psc.ap. gov.inలో ఉంచినట్టు కార్యదర్శి ప్రదీప్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

జాతీయ ఉపాధ్యాయ పురస్కారాలకు షెడ్యూల్

ఈనెల 15 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ ఏటా ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులకు అందించే జాతీయ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పాఠశాల విద్య కమిషనర్ సురేశ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత గలవారు 2024 విద్యా సంవత్సరానికి గాను ఈనెల 15వ తేదీలోగా ఆన్‌లైన్ http://nationalawardstoteacher.education.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే నెల 13న విజేతలను ఎంపిక చేసి, సెప్టెంబర్ 4, 5 తేదీల్లో పురస్కారాలు ప్రదానం చేస్తారని పేర్కొన్నారు.

ట్రిపుల్ ఐటీలో ఎన్‌సీసీ, క్రీడా కోటా సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

నూజివీడు: ఏలూరు జిల్లా, నూజివీడు ట్రిపుల్ ఐటీలో ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన నాలుగో రోజైన గురువారం కూడా కొనసాగింది. ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో ప్రస్తుత విద్యా సంవత్సరానికి నిర్వహిస్తున్న అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా ప్రత్యేక కేటగిరీకి చెందిన ఎన్‌సీసీ, క్రీడా కోటాలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. ఎన్‌సీసీ కోటాకు సంబంధించి 590 మంది, స్పోర్ట్స్ కోటాకు సంబంధించి 350 మంది అభ్యర్థులు హాజరైనట్టు అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ తెలిపారు. ఈనెల 5వ తేదీన కూడా ఎన్‌సీసీ, క్రీడా కోటా అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తామని ఆయన చెప్పారు.

ఎంబీబీఎస్ సెల్ఫ్ ఫైనాన్స్ కోటా రద్దు చేయండి

సాక్షి, అమరావతి/ గుంటూరు మెడికల్: కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ సెల్ఫ్ ఫైనాన్స్ కోటా విధానాన్ని రద్దు చేయాలని ఏపీ మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డా. అలా వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను గురువారం ఆయన సచివాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు గత ప్రభుత్వం జారీ చేసిన 107, 108 జీవోలను రద్దు చేయాలని కోరారు. ఈ సీట్లను పేద విద్యార్థులకు ప్రతిభ ఆధారంగా కేటాయించాలన్నారు. టీడీపీ సైతం గతంలో ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించినట్టు వివరించారు. అదే విధంగా సిద్ధార్థ వైద్య కళాశాలలోని మొత్తం మెడికల్ సీట్లను ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు మాత్రమే కేటాయించాలన్నారు. మెడికల్ అడ్మిషన్స్ పూర్తిగా పారదర్శకంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ముఖ్యమంత్రి దృష్టికి సమస్యలను తీసుకువెళ్లి వీలైనంత త్వరలో పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు.

డిసెంబర్‌లో విశాఖలో ప్రపంచ స్థాయి సదస్సు

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ హయాంలో అంతర్జాతీయ స్థాయి సదస్సులకు వేదికగా నిలిచి.. అందరి దృష్టిని ఆకర్షించిన విశాఖపట్నం.. మరో కీలక సదస్సుకు ఆతిథ్యమిస్తోంది. వైద్య ఉపకరణాల తయారీలో ప్రపంచానికి దిక్సూచిగా నిలిచిన ఏపీ మెడ్‌టెక్ జోన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 12 నుంచి మూడు రోజుల పాటు వరల్డ్ హెల్త్ ఇన్నోవేషన్ ఫోరం నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. డిసెంబర్ 14 వరకూ జరిగే ఈ సదస్సులో వైద్య రంగంలో ఆవిష్కరణలపై ప్రపంచ దేశాల ప్రతినిధులు చర్చించనున్నారు. ఈ సందర్భంగా వైద్య ఉపకరణాల ప్రదర్శన నిర్వహించనున్నట్లు మెడ్‌టెక్ జోన్ వర్గాలు వెల్లడించాయి. వరల్డ్ హెల్త్ ఫోరం నిర్వహణకు మెడ్‌టెక్ జోన్ రెండో సారి ఆతిథ్యమిస్తుండటం విశేషం.

అధికార మదం.. ఆర్యవైశ్యులపై ప్రతాపం

డబ్బులివ్వలేదని మూసేశారు

చంద్రగిరిలో ఎమ్మెల్యే దాష్టీకం

- ఆర్యవైశ్య సంఘం నేత రైస్ మిల్లుకు మూత
- పెద్ద మొత్తంలో డబ్బు కోసం మిల్లు యజమానికి బెదిరింపులు
- అడిగినంత ఇవ్వలేనని, కొంత ఇస్తానని అన్న యజమాని
- వెంటనే రంగంలోకి అధికారులు
- మిల్లుకు కరెంటు సరఫరా నిలిపివేసి, తాళాలు వేసిన అధికారులు
- రోడ్డునపడ్డ 200 మంది కార్మికుల కుటుంబాలు
- రెండుసార్లు వేడుకొన్నా కనికరించని ఎమ్మెల్యే



మూసివేసిన రైస్ మిల్లు

తిరుపతి రూరల్: టీడీపీ కూటమి నేతల దృష్టి ఆర్యవైశ్యుల వ్యాపారాలపై పడింది. కష్టనష్టాలకోర్చి వ్యాపారాల ద్వారా ప్రభుత్వానికి పన్నుల ద్వారా ఆదాయాన్నివ్వడమే కాకుండా, పది మందికి ఉపాధి చూపిస్తున్న ఆర్యవైశ్యులను టీడీపీ నేతలు బెదిరింపులకు గురిచేస్తున్నారు. పెద్ద ఎత్తున డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. అడిగినంత ఇవ్వకుంటే అధికారులతో వ్యాపారాలను సీజ్ చేయిస్తున్నారు. వ్యాపారులతో పాటు వందలాది కార్మికుల జీవితాలను రోడ్డు పాలు చేస్తున్నారు. గత కొద్ది రోజులుగా జిల్లావ్యాప్తంగా పలువురు వ్యాపారులను బెదిరించి, డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. తాజాగా చంద్రగిరి నియోజకవర్గం కుంట్రపాకంలో ఆర్యవైశ్యుల సంఘం నాయకుడు కిషోర్‌కు చెందిన ఎల్.వి.ఎం రైస్ మిల్లును మూసివేయించారు. గత 19 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఈ మిల్లులో 200 మంది కార్మికులు పనిచేస్తున్నారు. తిరుపతి రూరల్, రామచంద్రాపురం మండలాల నుంచి ఎంతో మంది రైతులు ధాన్యాన్ని ఈ మిల్లులో బియ్యం చేసుకుని వెళుతుంటారు. ఇటు కార్మికులకు, అటు అన్నదాతలకు బాసటగా నిలిచిన ఈ రైస్ మిల్లుపై చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కన్ను పడింది. తన బంధువులు, తిరుపతి రూరల్ మండలానికి చెందిన టీడీపీ నేతలు అమిలినేని మధు, చెరుకూరి మధు, శ్రీధర్ నాయుడును రైస్ మిల్లు యజమాని కిషోర్ వద్దకు పంపినట్లు సమాచారం. వారు ముగ్గురూ కిషోర్ దగ్గరకు వెళ్లి పెద్ద మొత్తంలో డబ్బు డిమాండ్ చేసినట్లు తెలిసింది. అంత ఇవ్వలేనని, కొంత ఇస్తానని చెప్పినప్పటికీ వారు అంగీకరించలేదని సమాచారం. దీంతో ఎమ్మెల్యే పులివర్తి నాని వెంటనే అధికారులను రంగంలోకి దించి, అన్ని రకాల అనుమతులతో నడుస్తున్న రైస్ మిల్లుకు బుధవారం అకస్మాత్తుగా విద్యుత్తు సరఫరా నిలిపివేయించి, సీజ్ చేయించినట్లు వ్యాపారవర్గాలు చెబుతున్నాయి. దీంతో రైసు మిల్లు మూతపడింది. 200 మంది కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. మిల్లు యజమాని కిషోర్ రెండుసార్లు ఎమ్మెల్యే పులివర్తి నాని వద్దకు వెళ్లి వేడుకోగా, ఆయన తీవ్రంగా దుర్భాషలాడినట్లు తెలిసింది. తాను లోకేశ్‌కు అత్యంత సన్నిహితుడినని, తన మాట వినకుంటే జిల్లాలో ఎక్కడా నిన్ను వ్యాపారం చేయనీయను అంటూ కిషోర్‌ను భయపెట్టినట్లు సమాచారం. దీంతో కిషోర్ కంట నీరు పెట్టుకొని బయటకు వచ్చినట్లు వ్యాపారవర్గాలు తెలిపాయి.

వ్యాపారుల ఆగ్రహం

వ్యాపారుల్లో ఎవరికి కష్టం వచ్చినా అండగా నిలబడే ఆర్యవైశ్యుల సంక్షేమ సంఘం నాయకుడు, చాంబర్ ఆఫ్ కామర్స్‌లో ఎగ్జిక్యూటివ్ మెంబర్, తిరుపతి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అయిన కిషోర్‌నే వేధించి, ఆయన మిల్లును మూసివేయించడంపై వ్యాపారవర్గాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అధికార పార్టీ దౌర్జన్యాలను అడ్డుకొనేందుకు వ్యాపారులంతా సంఘటితమవుతున్నారు. తమ నేత కిషోర్‌కు న్యాయం జరిగేంత వరకు బాసటగా నిలుస్తామని చెబుతున్నారు. వ్యాపార సంస్థలను మూసివేయిస్తే ఎంత మంది జీవితాలు రోడ్డున పడతాయన్నది ఆలోచించని ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆయన బంధువుల తీరును ప్రజలకు వివరించడంతో పాటు ముఖ్యమంత్రి, మంత్రుల దృష్టికి తీసుకెళ్లేందుకై వారు నిర్ణయించినట్లు సమాచారం.

అధికారుల అత్యుత్సాహం

అధికార పార్టీ ఎమ్మెల్యే, ఆయన బంధువుల ఒత్తిడితో ఎల్.వి.ఎం రైస్ మిల్లును మూసివేయించడంలో అధికారులు అత్యుత్సాహం చూపించారు. సాధారణంగా ఏ వ్యాపార సంస్థనైనా సీజ్ చేయాల్సి వస్తే ముందుగా నోటీసు ఇచ్చి, మూడు నెలలు సమయం ఇవ్వాలి. నోటీసుకు యజమాని నుంచి వచ్చే సమాధానంతో పాటు మరికొన్ని నియమాలు పాటించాలి. ఈ నిబంధనలేమీ పాటించకుండానే విద్యుత్తు సరఫరా నిలిపివేసి, మిల్లును సీజ్ చేసేశారు. అందులో పనిచేసే కార్మికుల జీవనోపాధికి ప్రత్యామ్నాయం చూపించాల్సిన కనీస బాధ్యతను కూడా విస్మరించడం విమర్శలకు తావిస్తోంది.

ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంటల్ టెస్ట్ షెడ్యూల్ విడుదల

సాక్షి, అమరావతి: ప్రభుత్వంలోని వివిధ విభాగాల్లో ఉద్యోగులకు నిర్వహించే డిపార్ట్‌మెంటల్ టెస్ట్ షెడ్యూల్‌ను ఏపీపీఎస్సీ గురువారం విడుదల చేసింది. ఈనెల 28 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు జరిగే టెస్టుల వివరాలను https://psc.ap.gov.inలో అందుబాటులో ఉంచినట్టు సర్వీస్ కమిషన్ కార్యదర్శి ప్రదీప్ కుమార్ తెలిపారు.

- ఏపీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్, పబ్లిక్ హెల్త్ ల్యాబ్స్ విభాగంలో శాంపిల్ టేకర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించనున్నట్టు ఏపీపీఎస్సీ ప్రకటించింది. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 12న ఉదయం విజయవాడలోని ఏపీపీఎస్సీ కార్యాలయానికి రావాలని కార్యదర్శి విజ్ఞప్తి చేశారు. ఇతర వివరాలకు వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.
- ఆయుష్ విభాగంలో మెడికల్ ఆఫీసర్ల పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను ఈనెల 25న పరిశీలించనున్నారు. అభ్యర్థులు నిర్ణయించిన తేదీల్లో సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.
- హోమియో విభాగంలో మెడికల్ ఆఫీసర్లుగా ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను ఈనెల 23 నుంచి 25 తేదీ వరకు పరిశీలించనున్నారు.
- రాష్ట్ర అటవీశాఖలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్వో) పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల వివరాలను ఏపీపీఎస్సీ విడుదల చేసింది. వివరాలను సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్‌లో ఉంచినట్టు కార్యదర్శి పేర్కొన్నారు.

విద్యార్థినుల జీవితాలతో ఆటలా?

- నాసిరకం భోజనంపై ఆగ్రహించిన ఎస్వీయూ ఉమెన్స్ హాస్టల్ విద్యార్థినులు
- పరిపాలనా భవనం వద్ద నిరసన



నాసిరకం భోజనాన్ని, కూరలు చూపుతున్న ఎస్వీయూ ఉమెన్స్ హాస్టల్ పీజీ విద్యార్థినులు

తిరుపతి సిటీ (తిరుపతి జిల్లా): ఎస్వీ యూనివర్సిటీ హాస్టళ్లలో నాసిరకం భోజనం వడ్డిస్తున్నారని వర్సిటీ ఉమెన్స్ హాస్టల్ విద్యార్థినులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం తిరుపతి ఎస్వీయూ పరిపాలన భవనం వద్ద హాస్టల్ సమస్యలపై పీజీ ఉమెన్స్ హాస్టల్ విద్యార్థినులు పెద్ద ఎత్తున ర్యాలీగా వచ్చి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ హాస్టల్ సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని వాపోయారు. బుధవారం రాత్రి పాచిపోయి వాసన వస్తున్న చికెన్ విద్యార్థినులకు వడ్డించారని మండిపడ్డారు. నాసిరకం కూరగాయలతో ప్రతినిత్యం భోజనం పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు, వాష్‌రూమ్స్ వంటి మౌలిక సదుపాయాలు సరిగాలేకపోవడంతో విద్యార్థినులు సతమతమవుతున్నారన్నారు. ఒక్కోవిద్యార్థినీ నుంచి నెలకు రూ.3వేలకు పైగా మెస్ బిల్లు వసూలు చేస్తూ రోజూ పప్పునీళ్లే వడ్డిస్తున్నారని ఇన్‌చార్జి రిజిస్ట్రార్ చంద్రయ్యను నిలదీశారు. సమస్యను పరిష్కరిస్తామంటూ రిజిస్ట్రార్ విద్యార్థినులకు హామీ ఇచ్చారు.

ఇంకా మీరెందుకు రాజీనామా చేయలేదు

- తక్షణమే రాజీనామా చేయండి
- బీఆర్ఏయూ వీసీ, రిజిస్ట్రార్‌లకు టీఎన్ఎస్ఎఫ్ హెచ్చరిక
- వీసీ చాంబర్ ఎదుట ఆందోళన



వీసీ చాంబర్ ముందు బైఠాయించిన టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: 'రాష్ట్రంలో చాలామంది వీసీలు రాజీనామా చేశారు. ఇంకా మీరెందుకు చేయలేదు. తక్షణమే రాజీనామా చేయండి..' అని శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం(బీఆర్ఏయూ) వైస్ చాన్స్‌లర్ ఆచార్య కేఆర్ రజిని, రిజిస్ట్రార్ పి.సుజాతలను తెలుగునాడు స్టూడెంట్స్ ఫెడరేషన్(టీఎన్ఎస్ఎఫ్) నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వీసీ చాంబర్ ఎదుట గురువారం టీఎన్ఎస్ఎఫ్ నాయకులు బైఠాయించి ఆందోళన చేశారు. ముందుగా వీసీ వద్దకు వెళ్లి 'ఇంకా మీరెందుకు రాజీనామా చేయలేదు' అని ప్రశ్నించారు. 'అది మీకు అనవసరం..' అని వీసీ సమాధానం చెప్పారు. దీంతో వీసీ చాంబర్ ముందు టీఎన్ఎస్ఎఫ్ నాయకులు బైఠాయించి వీసీ, రిజిస్ట్రార్ తక్షణమే రాజీనామా చేయాలని నినాదాలు చేస్తూ గంటసేపు గొడవ చేశారు. వీసీ, రిజిస్ట్రార్, ఇతర అధికారులు, ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించారు. అనంతరం 'మీరు రాజీనామా ఎలా చెయ్యరో చూస్తాం..' అంటూ వీసీని హెచ్చరించి వెళ్లిపోయారు. మరోవైపు ఇప్పటికే విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కార్యాలయం నుంచి రాజీనామా చేయాలని వీసీకి పలుమార్లు హెచ్చరికలు వచ్చినట్లు తెలిసింది. ఇప్పుడు టీడీపీ అనుబంధ విద్యార్థి సంఘం టీఎన్ఎస్ఎఫ్ ఏకంగా వీసీ రాజీనామా చేయాలని హెచ్చరిస్తూ ఆందోళనకు దిగడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

వీసీని అవమానించడం అన్యాయం

దళిత వీసీని టీఎన్ఎస్ఎఫ్ నాయకులు అవమానించడం, బెదిరించడం అన్యాయమని యూనివర్సిటీ రిజిస్ట్రార్ సుజాత, రెక్టార్ అడ్డయ్య, ఓఎస్‌డీ కావ్య జ్యోత్స్న తదితరులు తీవ్రంగా ఖండించారు. వారు మీడియాతో మాట్లాడుతూ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ ఏర్పడిన 16 ఏళ్ల తర్వాత దళిత మహిళకు వీసీగా అవకాశం వస్తే అడ్డగోలుగా తొలగించే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తప్పుడు ఆరోపణలు చేసేవారిపై జాతీయ మహిళా కమిషన్‌కు, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు, మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. వైస్ చాన్సలర్ రజిని జనవరి 18న బాధ్యతలు చేపట్టారని, మూడేళ్లు కొనసాగుతారని స్పష్టంచేశారు. బలవంతపు రాజీనామాలు అన్యాయమని ఖండించారు. వీసీ చాంబర్ ఎదుట ఆందోళన చేసిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని చట్టపరంగా వర్సిటీ తరఫున పోరాటం చేస్తామని తెలిపారు. టీఎన్ఎస్ఎఫ్ నాయకులు యూనివర్సిటీలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకల నిర్వహణకు సైతం ఆటంకం కలిగించారన్నారు.

టీడీపీ నేతల బరితెగింపు

- పింఛన్లు ఇవ్వనీయకుండా అడ్డుకున్న వైనం
- అనంతపురం జిల్లా అప్పాజిపాళ్యంలో అవ్వాతాతల ఆవేదన
- ఏలూరు జిల్లా పెదవేగి, పాలగూడెంలోనూ టీడీపీ నేతల దాష్టీకాలు



పెదవేగిలో పింఛను సొమ్ము అందని బాధితులు

కుందుర్పి/దెందులూరు/సాక్షి, టాస్క్‌ఫోర్స్/కాశీబుగ్గ: టీడీపీ నాయకుల ఆగడాలకు అంతులేకుండా పోతోంది. వృద్ధులు, వితంతువులపైనా తమ దర్పం చూపుతున్నారు. మంజూరైన పింఛన్ కూడా పంపిణీ చేయనీయకుండా అడ్డుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే.. అనంతపురం జిల్లా కుందుర్పి మండలం అప్పాజిపాళ్యంలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులకు మంజూరైన వృద్ధాప్య, వితంతు పింఛన్లను పంపిణీ చేయకుండా ఆ గ్రామ టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. పింఛన్ పొందేందుకు తమకు అన్ని అర్హతలు ఉన్నాయని, ఐదేళ్లుగా పింఛన్ తీసుకుంటున్నామని ఇప్పుడు టీడీపీ నాయకులు అడ్డుచెప్పడం బాగోలేదని వృద్ధులు హనుమయ్య, అప్పాజప్ప, వితంతువు రాధమ్మ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వారంతా గురువారం జంబుగుంపల సచివాలయం ముందు నిరసన తెలిపారు. రెండు రోజుల క్రితం వేలిముద్రలు కూడా వేయించుకున్న సచివాలయ ఉద్యోగులు.. టీడీపీ నేతల ఒత్తిళ్లతో డబ్బులివ్వడం లేదన్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి ఫకృద్దీన్‌ను వివరణకోరగా, 'వృద్ధులతో వేలిముద్రలు వేయించాం... రెండు రోజుల్లో పింఛన్ డబ్బులు ఇస్తాం' అని సమాధానమిచ్చారు.

పింఛను సొమ్ము వచ్చినా ఇవ్వడం లేదు..

తమకు పింఛను సొమ్ము మంజూరైనప్పటికీ నగదు ఇవ్వడం లేదని ఏలూరు జిల్లా పెదవేగికి చెందిన పింఛనుదారులు తాత మాణిక్యాలరావు, కాగితాల రమేష్, తాత రమాదేవి గురువారం ఆవేదన వ్యక్తం చేశారు. పింఛను నగదు ఇప్పించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

మానసిక వికలాంగురాలనే దయ కూడా లేకుండా..

అధికార పార్టీ నేతల ఒత్తిడితో అధికారులు ఓ మానసిక వికలాంగురాలి పింఛన్‌ను నిలిపివేసిన ఘటన ఏలూరు జిల్లాలో జరిగింది. దీనికి కారణం ఆమె తండ్రి వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు కావడమేనని తెలిసింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. ఏలూరు రూరల్ మండలం పాలగూడెంలో బొమ్మవరపు గోఖునేషు కుమార్తె మార్తమ్మ గత కొన్నేళ్లుగా పింఛన్ అందుకుంటోంది. అయితే ఈ నెల ఆమెకు పింఛన్ అందలేదు.

బతికుండగానే చంపేశారు..



ఓ కిడ్నీ వ్యాధి బాధితుడు బతికుండగానే చనిపోయాడని నిర్ధారించుకుని పింఛన్ ఆపేసిన ఘటన శ్రీకాకుళం జిల్లా పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో చోటు చేసుకుంది. 5వ వార్డు ఉప్పరపేటలో ఉమ్మడిశెట్టి రామయ్య (73)కు పింఛనే జీవనాధారం. ఈ నెల అందరికీ రూ.7వేలు పింఛన్ ఇచ్చి ఆయనకు ఇవ్వలేదు. దీంతో సచివాలయ సిబ్బందిని సంప్రదించినా లాభం లేకపోయింది. మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన విచారణకు ఆదేశించారు. ఈ విచారణలో ఆయన మరణించినట్లు సచివాలయంలో రికార్డుల్లో ఉంది. అందుకే రెండు నెలలుగా పింఛన్ అందడం లేదని తెలిసింది. దీంతో రామయ్య నిశ్చేష్టులయ్యారు.

'నీట్'పై నోరు మెదపరేమి?

ఎన్‌డీఏ కూటమిపై ఐక్య విద్యార్థి సంఘాల మండిపాటు



విజయవాడ మొగల్రాజపురం పి.బి సిద్దార్థ కళాశాల గేటు వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాలు



విజయవాడలో విద్యార్థి సంఘాల నాయకులను అరెస్ట్ చేస్తున్న దృశ్యాలు

తిరుపతి సిటీ (తిరుపతి జిల్లా)/మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నీట్ పేపర్‌లీక్ వల్ల దేశవ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులు రోడ్డున పడ్డారని, అయినా కేంద్రం నోరు మెదపకపోవడం దారుణమని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశవ్యాప్త విద్యార్థి సంఘాల పిలుపు మేరకు గురువారం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు మూతపడ్డాయి. తిరుపతి ఎస్వీ వర్సిటీ ఏడీ బిల్డింగ్ వద్ద జిల్లా ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సంఘాల నేతలు మాట్లాడుతూ..లక్షల మంది విద్యార్థుల జీవితాలు ఆయోమయంలో ఉన్నా రాష్ట్రంలోని ఎన్‌డీఏ కూటమి నేతలు, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ స్పందించక పోవడం దారుణమన్నారు. ఎన్‌టీఏను రద్దు చేసి, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేసి యువతకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష రాసిన విద్యార్థులకు మోదీ సర్కార్ నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్‌టీఏ, కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మలను దగ్ధం చేసేందుకు ప్రయత్నించిన విద్యార్థి సంఘాల నేతలను పోలీసు అడ్డుకుని దిష్టిబొమ్మలను లాక్కొన్నారు. ధర్నాలో విద్యార్థి సంఘాల నేతలు రవి, అక్బర్, నవీన్, ప్రవీణ్, మల్లి కార్జున, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే, నీట్ లీకేజీ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేయాలని, పరీక్ష రద్దు చేయాలని కోరుతూ దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌లో భాగంగా విజయవాడ సిద్ధార్థ కళాశాల కూడలి వద్ద విద్యార్థి సంఘాల నాయకులు గురువారం ఆందోళన చేశారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేస్తున్న నాయకులు కళాశాల లోపలికి వెళ్లే ప్రయత్నం చేయడంతో పోలీసులు వారిని అడ్డుకుని అరెస్ట్ చేసి మాచవరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

డీఆర్ఎం ఆఫీసులో సీబీఐ దాడులు

- సీనియర్ డీఎఫ్ఎంతోపాటు మరో నలుగురు పట్టివేత
- సెల్‌ఫోన్ ట్రాప్‌తో అవినీతి బట్టబయలు



పోలీసుల అదుపులో నిందితులు

గుంతకల్లు: స్థానిక డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) కార్యాలయంపై సీబీఐ బృందం గురువారం దాడులు నిర్వహించింది. ఇంజినీరింగ్, అకౌంట్స్ విభాగానికి చెందిన నలుగురు ఉద్యోగులతోపాటు సీనియర్ డివిజనల్ ఫైనాన్స్ ఆఫీసర్ (డీఎఫ్ఎం)ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీరి నుంచి పెద్ద మొత్తంలో నగదు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. వివరాల్లోకి వెళ్తే.. గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలో గతిశక్తి విభాగంలో వివిధ పనులు చేసిన కాంట్రాక్టర్ రమేష్‌రెడ్డికి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో సీనియర్ డీఎఫ్ఎం ప్రదీప్ బాబుతోపాటు ఇంజినీర్, అకౌంట్స్ సెక్షన్లకు చెందిన బాలాజీ, రాజు, ప్రసాద్ చుట్టూ ఆయన కాళ్లరిగేలా తిరిగారు. అయినా వారు బిల్లులు చేసేవారు కాదు. అంతేకాక.. బిల్లు చేసిన ప్రతిసారీ భారీగా డబ్బు డిమాండ్ చేసేవారు. దీంతో విసిగిపోయిన కాంట్రాక్టర్ రమేష్‌రెడ్డి సీబీఐని ఆశ్రయించగా గురువారం సాయంత్రం సీబీఐ అధికారులు డీఆర్ఎం కార్యాలయంపై దాడులు చేశారు.

సెల్‌ఫోన్ ట్రాప్‌తో అవినీతి బట్టబయలు..

ఇక కాంట్రాక్టర్ రమేష్‌రెడ్డి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన సీబీఐ అధికారుల బృందం రెండ్రోజులుగా గుంతకల్లులోనే మకాం వేసి నిఘా ఉంచింది. సీనియర్ డీఎఫ్ఎం ప్రదీప్‌బాబు సెల్‌ఫోన్‌తోపాటు మిగిలిన వారి సెల్‌ఫోన్లపై కూడా నిఘా ఉంచినట్లు సమాచారం. వారి సంభాషణలు సైతం రికార్డు చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే కాంట్రాక్టర్ రమేష్‌రెడ్డికి ఫోన్‌చేసిన సీనియర్ డీఎఫ్ఎం, ఇతర ఉద్యోగులు లంచం రూపంలో అందజేయాల్సిన డబ్బును డీఎఫ్ఎం డ్రైవర్ బాషాకు ఇవ్వాలని సూచించారు. ఈ మేరకు పెద్దమొత్తంలో డబ్బును అందజేసే సమయంలో సీబీఐ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలిసింది.

డీఎఫ్ఎం ఆఫీసు, ఇంట్లో సోదాలు..

అనంతరం.. సీబీఐ అధికారులు సీనియర్ డీఎఫ్ఎం ప్రదీప్‌బాబు కార్యాలయంతో పాటు ఇంట్లోనూ విస్తృతంగా సోదాలు చేశారు. సా.5.00 గంటల నుంచి గురువారం అర్ధరాత్రి దాకా ఈ సోదాలు కొనసాగించారు. నిందితులను సీబీఐ కేంద్ర కార్యాలయానికి తరలిస్తున్నట్లు డివిజన్ కార్యాలయం వర్గాలు తెలిపాయి.

జగన్నాథ రథయాత్రకు 'రైల్వే' విస్తృత ఏర్పాట్లు

అమరావతి: ఒడిశాలోని పూరీ జగన్నాథస్వామి రథయాత్రకు వచ్చే భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈస్ట్‌కోస్ట్ రైల్వే గురువారం ప్రకటన విడుదల చేసింది. జగన్నాథుని రథయాత్ర ఈ నెల 7న ప్రారంభం కానున్న నేపథ్యంలో చత్తీస్‌ఘడ్, ఏపీ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి పూరీకి 315 ప్రత్యేక రైళ్లు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించింది. ఈ రైళ్ల ఆలస్యం కాకుండా గమ్యస్థానానికి చేరుకునే విధంగా ఆయా రైళ్లల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బేస్డ్ డైనమిక్ షెడ్యూలింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించింది. పలు రైల్వేస్టేషన్లలో ప్రత్యేక టికెట్ కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. పూరీ రైల్వేస్టేషన్‌లో 15,000 మందికి వెయిటింగ్ ఏరియాను, వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొంది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943